వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక
VEEKSHANAM, TELUGU MONTHLY
సంపుటి : 18 సంచిక : 11 హైదరాబాద్ 229 నవంబర్ 2020 పేజీలు : 68 రు. 25

- హాథ్రస్ దుర్మార్గం - అనంతర పరిణామాలు
- అందరు నిర్దోషులైతే, మసీదు కూల్చిందెవరు?
- ఎన్‌కౌంటర్ లేని తెలంగాణను చూడగలమా?
- న్యాయ వ్యవస్థ స్వతంత్రత - రాజ్యాంగ దృక్పథం
- జైల్లో మాకు ధైర్యం ఎక్కడి నుంచి వచ్చింది?
- అజర్‌బైజాన్ - ఆర్మేనియా సాయుధ పోరాటం
- రాజకీయార్థిక శాస్త్రవేత్తగా ఫ్రెడరిక్ ఎంగెల్స్

వీక్షణంను ఆదుకోండి

నాలుగు కాలాలు నిలబడేందుకు సహాయం అందించండి

వీక్షణం రాజకీయార్థిక సామాజిక మాసపత్రిక పద్దెనిమిది సంవత్సరాలుగా తెలుగు సమాజానికి చేస్తున్న సేవ మీకు తెలుసు. విద్యావంతులలో, బుద్ధిజీవులలో, సామాజిక కార్యకర్తలలో ఈ పత్రికకు ఉన్న పేరు ప్రఖ్యాతులు, విశ్వసనీయత, వారి మేధో, ఆలోచనా అవసరాలకు ఈ పత్రిక ఎంతగానో ఉపయోగపడడం మీరు చూస్తూనే ఉన్నారు. అయితే ఇంతటి ఆదరాభిమానాలు సంపాదించుకున్నప్పటికీ వీక్షణం ఆర్థిక పరిస్థితి ఎన్నడూ ఈ విశేష జనాదరణకు తగినట్టుగా లేదు. వీక్షణం పాఠకులకు, అభిమానులకు, ఉపయోగించుకునేవారికి వీక్షణంకు సహాయం చేసేంత ఆర్థిక స్తోమత లేదు. ఎందరో తమకు తోచిన, చేయగలిగిన సహాయం చేస్తున్నప్పటికీ, అది సరిపోవడం లేదు. వ్యవసాయాదాయం తప్ప మరే ఆదాయవనరూ లేని డెబ్బై సంవత్సరాలు దాటిన వృద్ధ దంపతులు, రోజుకూలీ చేసుకునే శ్రామికులు, ఎనబయవ పడిలో పెన్షన్ మీద మాత్రమే బతుకుతున్న రిటైర్డ్ ప్రభుత్వోద్యోగులు వంటి వారెందరో ఇబ్బందులు పడుతూ కూడా వీక్షణంకు విరాళం ఇవ్వడానికి చేస్తున్న ప్రయత్నాలు చూసి ఆ ఆదరాభిమానాలకు మా కళ్లు చెమరుస్తున్నాయి. అటువంటి వందలాది మంది చేస్తున్న చిన్న చిన్న సహాయాలే వీక్షణం ఎప్పటికప్పుడు ఆగిపోకుండా కాపాడుతున్నాయి. సాలీనా ఐదు లక్షల రూపాయల లోటుతో, ఎప్పటికప్పుడు అప్పు చేస్తూ, ఏడాదికొకసారి దాతల దగ్గరికి వెళ్లి ఆ అప్పు తీర్చే మార్గాలు వెతుకుతూ వీక్షణం నడుపుతూ వస్తున్నాం. ఇలా దినదిన గండంగా ఎన్నాళ్లు బండి లాగగలమో తెలియదు. చందాలు, విరాళాలతో పాటు సొంత ప్రచురణల అమ్మకాలు, ఇతర ప్రచురణల అమ్మకాలపై కమిషన్లతో బండి నడుస్తూ ఉండేది. గోరుచుట్టుపై రోకటిపోటు లాగ కొవిడ్ లాక్‌డౌన్ మొదలైనప్పటి నుంచీ చందాల పునరుద్ధరణ ఆగిపోయింది. కొత్త చందాలు రావడం తగ్గిపోయింది. పుస్తకాల అమ్మకాలు దాదాపుగా ఆగిపోయాయి. విరాళాల ధార ఎండాకాలపు వాగులాగ పల్చబడుతున్నది. అందువల్ల మరొకసారి అభిమానులకూ, పాఠకులకూ, దాతలకూ సవినయ విజ్ఞప్తి చేయక తప్పడం లేదు. ఇప్పుడున్న స్థితి యథాతథంగా కొనసాగితే వీక్షణంను ఇంక ఎక్కువ కాలం నడపడం సాధ్యం కాదు. పద్దెనిమిది సంవత్సరాలుగా దృఢంగా ప్రజల పక్షాన నిలిచిన అతి తక్కువ పత్రికలలో వీక్షణం ఒకటి. దేశంలోనూ, రెండు తెలుగు రాష్ట్రాలలోనూ పెరిగిపోతున్న ఆధిపత్య సంస్కృతిలో, ప్రశ్నించే గొంతులను, ప్రజా స్వరాలను మూసివేయడానికి జరుగుతున్న ప్రయత్నాలలో వీక్షణంను కాపాడుకోవలసిన బాధ్యత ప్రజలదే.

చందాలు, విరాళాలకు

VEEKSHANAM

అకౌంట్ నెంబర్ – **013911011002175, ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్**

ఐఎఫ్ఎస్‌సి నం **ANDB 0000139**

హృదయపూర్వక కృతజ్ఞతలు

అక్టోబర్ 2020 సంచికలో చేసిన పై విజ్ఞప్తికి చాల మంది మిత్రులు సాదరంగా స్పందించారు. తాము ఇవ్వగలిగిన విరాళాలు ఇవ్వడం మాత్రమే కాక, ఫేస్‌బుక్, వాట్సప్ వంటి మాధ్యమాలలో ఈ విజ్ఞప్తిని ఇతర మిత్రులకు పంపారు. డా. చెలికాని స్టాలిన్, రామచంద్రపురం (రు. 10,000), డా. సత్య నరేంద్ర కుమార్, కొత్తగూడెం (రు. 5,000), జె.వి. పద్మ, కొత్తగూడెం (రు. 3,000), డి. సుబ్రహ్మణ్యం, న్యూఢిల్లీ (రు. 5,000), స్వర్ణ కిలారు, హైదరాబాద్ (రు. 5,000) నాగజ్యోతి, హైదరాబాద్ (రు. 5,000), శ్రేయోభిలాషి, యుఎస్ (రు. 43,411), జ్యోతి గూడవల్లి, హైదరాబాద్ (రు. 30,000), ఎచ్. వీరస్వామి, హైదరాబాద్ (రు. 10,000), పద్మజ జాస్తి, యుఎస్ (రు. 40,000), నీరజ, హైదరాబాద్ (రు. 10,000), నారాయణ స్వామి, యుఎస్ (రు. 36,334), ఆర్. అనురాధ, హైదరాబాద్ (రు. 10,000), ఆది, హైదరాబాద్ (రు. 10,000), వర్ష, హైదరాబాద్ (రు. 5,000), జి.ఎస్. వాసు, హైదరాబాద్ (రు. 5,000) విరాళంగా ఇచ్చారు.

మీ వంటి మిత్రుల ఆదరాభిమానాల వల్లనే వీక్షణం కొనసాగుతున్నది. హృదయపూర్వక కృతజ్ఞతలు. – **వీక్షణం** కలెక్టివ్

229 ISSN 2231-6892

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

నవంబర్ 2020
సంపుటి : 18
సంచిక : 11

'వీక్షణం'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

'వీక్షణం' పేరిట రచనలు, ఎం.ఓలు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం VEEKSHANAM

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495

Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : **చరితా ఇంప్రెషన్స్**
ఆజామాబాద్, హైదరాబాద్. ఫోన్ : 040 - 27678411

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 25	రు. 25
సంవత్సరం	రు. 300	రు. 250
మూడు సంవత్సరాలు	రు. 900	రు. 650
ఐదు సంవత్సరాలు	రు. 1500	రు. 1100
పది సంవత్సరాలు	రు. 3000	రు. 2000

ఆన్‌లైన్ ఆంధ్రబ్యాంక్ ద్వారా డబ్బులు పంపేవారు బ్యాంక్ స్లిప్‌పై '**VEEKSHANAM**' అని రాసి తమ పేరు కూడా రాయాలి. వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175** ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 0000139** నెంబర్‌తో పాటు తమ పేరు కూడా రాసి వేయాలి.

ప్రతి నెల వీక్షణం పత్రికను క్రమం తప్పకుండా చదువుతుంటాను. అక్టోబర్ సంచికలో వచ్చిన వ్యాసాలు పాలకులు అవలంభిస్తున్న అసలు విషయాలను తెలిపేవిగా ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు కార్పొరేట్‌లకు లాభాలు చేకూర్చేవిగా ఉన్నాయి. ప్రభుత్వాలు ఏ కొత్త చట్టం తీసుకొచ్చిన అవి పేదవారికి, రైతులకు, అట్టడుగు వర్గాల ప్రజలకు ఉపయోగపడేవిగా ఉండాలి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త వ్యవసాయ చట్టాన్ని చూస్తుంటే ఏమాత్రం రైతుల ప్రయోజనాల కోసం కాదనేది అర్థమవుతున్నది. అలాగే భద్రయ్య గారు రాసిన 'భూ రికార్డుల నవీకరణ – రెవెన్యూ వ్యవస్థ రద్దు' వ్యాసం టిఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త రెవెన్యూ చట్టం వల్ల భూమిని నమ్ముకొని వ్యవసాయం చేసుకునే రైతులకు ఏమాత్రం ప్రయోజనం లేకుండా, భూములను అక్రమంగా కబ్జా చేసుకున్న కబ్జాదారులకు, బినామీలకు ఏ విధంగా లాభం చేకూర్చేదిగా ఉందో తన వ్యాసంలో వివరంగా చెప్పారు. ప్రభుత్వాలు తీసుకొచ్చే ఏ కొత్త చట్టాలు అయినా పేదలకు, రైతులకు, అనగారిన వర్గాల ప్రజలకు ప్రయోజనం కల్పించేవిగా ఉండాలి. కాని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న చట్టాలు తమ ప్రయోజనాల కోసమే తప్ప ప్రజల ప్రయోజనాల కోసం కాదనేది స్పష్టంగా అర్థమవుతున్నది. అలాగే ఇప్పటికీ కరోనా ప్రభావం అలాగే కొనసాగుతున్నది. కాని ప్రజలు కరోనా వైరస్ పట్ల ఎలాంటి జాగ్రత్తలు పాటించడం లేదు. ఇటువంటి సమయంలో కరోనా మహమ్మారి పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో, అసలు కరోనా ప్రభావం జనాల మీద ఉన్నదా, లేదా కరోనాను ఎలా అర్థం చేసుకోవాలనే విషయాలతో ప్రతినెల కరోనాపై వీక్షణంలో వ్యాసాలు ప్రచురిస్తే కరోనా గురించి అసలు వాస్తవాలను తెలుసుకోగలుగుతాం. పాలకులు అనుసరిస్తున్న తప్పుడు విధానాలను ఎప్పటికప్పుడు వాస్తవ విషయాలతో వ్యాసాల రూపంలో ప్రచురిస్తున్నందుకు వీక్షణం ఎడిటోరియల్ కలెక్టివ్ వారికి, సంపాదకులకు ధన్యవాదాలు.

– కృష్ణహరి
మహబూబ్‌నగర్

అక్టోబర్ వీక్షణం పత్రికలోని సంపాదకీయాలు, వ్యాసాలు ఆయా కాలంలో జరిగిన పరిణామాల గురించి ఎంతో చక్కగా ఉన్నాయి. అయితే కరోనా ప్రభావం ఎక్కువగా ఉన్న సమయంలో వీక్షణంలో కరోనాపై చాలా వివరమైన వ్యాసాలు వచ్చాయి. కానీ, ఇప్పటికి కరోనా ప్రభావం చాలా రాష్ట్రాలలో ఇంకా కొనసాగుతూనే ఉన్నది. అయితే ప్రభుత్వాలు కరోనా విషయంలో ఎంతో విఫలమయ్యాయి. వీక్షణంలో వచ్చే ప్రతి వ్యాసం ఎంతో అవగాహనతో, వాస్తవాలతో కూడి ఉంటున్నాయి. కరోనా విషయంలో మధ్యతరగతి, సామాన్య జనాలకు తెలియని విషయాలు చాలా ఉన్నాయనిపిస్తుంది. వీక్షణంలో ప్రతినెలా కరోనాపై ఒక్క వ్యాసమైన ప్రచురిస్తున్నారు. అటువంటి అవగాహనతో కూడిన వ్యాసాలు ఇంకా రావాలని కోరుకుంటున్నాను. ప్రతి నెలా వీక్షణంలో వచ్చే వ్యాసాలను చదువుతూ మెరుగవుతూ మాతోటి మిత్రులకు వీక్షణాన్ని పరిచయం చేసి వారిని కూడా చైతన్యపరుస్తున్నాము. ఇప్పుడున్న ఈ పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల గూర్చి వీక్షణంలో చాలా వివరమైన వ్యాసాలు ప్రతినెలా వస్తున్నాయి. ఎప్పటికప్పుడు సామాన్య జనం వైపు ఉండి మెరుగైన వ్యాసాలు ప్రచురిస్తున్నందుకు వీక్షణానికి ఎప్పుడు రుణపడి ఉంటాను.

– మాధవ్ కుమార్
జహీరాబాద్

వీక్షణం పత్రికలో ఎప్పటికప్పుడు జరుగుతున్న పరిణామాలపై ప్రజాభిప్రాయాన్ని వ్యక్తపరిచే వ్యాసాలు ఉంటున్నాయి. ఈ మధ్య కాలంలో కరోనాను అడ్డంపెట్టుకొని కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వ్యవసాయ, కార్మిక ఇతర చట్టాల అసలు స్వభావాన్ని తేటతెల్లం చేసేవిధంగా విశ్లేషణతో కూడి వ్యాసాలు అచ్చువేసి వాటి పట్ల పాఠకులకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ విద్య అసమ సమాజంలో అట్టడుగు ప్రజలను ఏ విధంగా దూరం చేస్తుందో తెలిపారు. అదే సందర్భంలో ప్రైవేట్ సంస్థల వ్యాపార ప్రయోజనాలకు ఎలా ఉపయోగపడుతుందో తెలిపారు. ప్రజాపక్షం వహించే మేధావులు, సంఘాలు ప్రజల మౌలిక సమస్యలను కేంద్రంగా చేసుకొని తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న అసెంబ్లీకి ప్రత్యామ్నాయంగా 'తెలంగాణ ప్రజా అసెంబ్లీ' నిర్వహించి కొత్త ప్రయోగాన్ని ముందుకు తేవడం చాలా మంచి ప్రయత్నం. ఇలాంటి ప్రయోగాలను జిలాల వారిగా ఆయా జిల్లాల సమస్యలపై జరుగుతే ఇంకా ప్రయోజనకరంగా ఉంటుందని నా అభిప్రాయం. రాజకీయ నాయకులు ఎంత అవినీతి, హత్యారాజకీయాల్లో కూరుకుపోయారో తెలిపారు.

– వెంకటేశ్వర్లు
కొత్తగూడెం

వీక్షణం అక్టోబర్ సంచికలో వ్యవసాయ రంగంలో కొత్త చట్టాల గురించి వచ్చిన నాలుగు వ్యాసాలు జాగ్రత్తగా చదివినప్పటికీ రైతాంగానికి నష్టం ఎట్లా జరుగుతుందో అర్థం కాలేదు. ఒక రైతుగా నేను నా సొంత అనుభవం నుంచే మాట్లాడుతున్నాను. ఎక్కడ ఎక్కువ ధర పలుకుతుందంటే అక్కడికి వెళ్లే అవకాశం ఉంటే రైతుకు మంచిదే కదా. వ్యాస రచయితలు దాన్ని ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? ప్రభుత్వం చెప్పే కనీస మద్దతు ధర కన్న ఎక్కువ ధర వస్తే రైతుకు మేలే కదా. నాలుగు వ్యాసాలలోనూ ఇటువంటి రైతులకు వచ్చే ప్రశ్నలకు జవాబు లేదు.

– యాదిరెడ్డి
మోత్కూర్

కోవిడ్ వల్ల పత్రికలలో సాధారణ వార్తలు రావడం లేదు గనుక అసహజ మరణాల సూచి సమగ్రంగా తయారు చేయడం సాధ్యం కావడం లేదు. కొద్దికాలంగా అసహజ మరణాల సూచి వేయలేకపోతున్నందుకు చింతిస్తున్నాం. సం.

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; వరంగల్ – ఓరగంటి ఎల్లయ్య

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ

వీక్షణం

విధ్వంస రాజకీయాల ఉన్మాద ఉధృతి

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విష విద్వేష విధ్వంస రాజకీయాల ఉరవడి విమర్శకులు ఊహించినదానికన్న ఎక్కువ వేగంగా సాగుతున్నది. సంఘ్ పరివార్ ఆధిపత్య ధోరణులు ఎంత ఉగ్రవాద స్థాయికి వెళ్లగలవో, తమతో ఏకీభవించనివారిని ఎంతగా హింసకూ బీభత్సానికీ గురి చేయగలవో ఇటీవలి పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయి. ప్రతి రోజూ సంఘ్ పరివార్ దూకుడు దేశాన్ని మరింత విధ్వంసం వైపు, మనుధర్మం వైపు, సామ్రాజ్యవాద దళారీతనం వైపు, భిన్న స్వరాలను అణచివేయడం వైపు దిగజారుస్తున్నది. ఈ హిందుత్వ బ్రాహ్మణీయ ఫాసిస్టు పాలకవర్గాలు దేశంలో ఇంతకాలమూ నామమాత్రంగానైనా ఉండిన రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం భావనలను నిర్మూలించదలచుకున్నట్టు స్పష్టంగా కనబడుతున్నది.

వ్యవసాయ రంగంలో నిజమైన సమస్యగా ఉన్న మధ్యవర్తులను, దళారీలను తొలగించడానికనే ఆమోదనీయమైన ఆదర్శాన్ని పైకి చూపెడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలు వాస్తవంగా భారత వ్యవసాయ రంగాన్ని అంతర్జాతీయ వ్యవసాయ మార్కెట్ అధిపతులకు, వారి దళారీలకు కట్టబెట్టే ప్రయత్నం. రైతాంగం తమ వ్యవసాయోత్పత్తులను ఎక్కడ ఎక్కువ లాభసాటిగా ఉంటే అక్కడ అమ్ముకోవచ్చుననే ఆకర్షణీయమైన ఎరను చూపుతూ, భారత వ్యవసాయ రంగం ఉన్న స్థితిలో అది సులభసాధ్యం కాదనే వాస్తవాన్ని దాచిపెడుతూ, వాస్తవంగా దేశపు సువిశాల మార్కెట్ ను కొద్దిమంది బేహారుల చేతుల్లోకి చేర్చడానికి జరుగుతున్న ప్రయత్నమిది. చిన్న, సన్నకారు, మధ్యతరగతి రైతాంగానికి వ్యవసాయం కనీస ఆదాయాన్ని కూడ ఇవ్వని స్థితి కల్పించి, భూముల నుంచి బేదఖలు చేయించి, విశాల భూక్షేత్రాలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడానికి జరుగుతున్న కుట్ర ఇది. వ్యవసాయోత్పత్తుల పంపిణీలో ప్రభుత్వం బాధ్యత వహించవలసిన నిత్యావసర వస్తువుల నిర్వచనాన్నే తొలగించి, ఆ నిత్యావసర వ్యవసాయోత్పత్తులను కూడ బడా కార్పొరేట్ వ్యాపారుల గుత్త వ్యాపారంగా మార్చడానికి జరుగుతున్న కుటిల ప్రయత్నం ఇది. వ్యవసాయ సంస్కరణల చట్టాల పేరుతో అటు వ్యవసాయదారుల, ఇటు వినియోగదారుల జీవితాలను ఛిద్రం చేసి, వారిని బడా కార్పొరేట్ వ్యాపారుల దాక్షిణ్యానికి వదలడానికి జరుగుతున్న ప్రయత్నం ఇది. అంబానీల వంటి వ్యాపారుల ఇష్టారాజ్యపు వ్యాపార వ్యూహాలకు దేశం మొత్తాన్నీ, దేశ మార్కెట్ నూ, దేశంలోని ప్రజానీకాన్నీ అప్పగిస్తున్న కుట్ర ఇది. అలా దేశ జనాభాలోని అత్యధిక సంఖ్యాకుల మీదికి ఒకవైపు ఎక్కు పెడుతూనే, మరొక వైపు చైతన్యశీలమైన, సంఘటితమైన, ఒకేచోట ఉన్నందువల్ల సులభంగా క్రియాశీలంగా మారగలిగిన కార్మిక రంగం మీద దాడి మొదలు పెట్టారు. దశాబ్దాల తరబడి జరిపిన పోరాటాలతో, త్యాగాలతో కార్మికవర్గం సాధించుకున్న కార్మిక అనుకూల చట్టాలనూ, నిబంధనలనూ, యాజమాన్య వర్గాల మీద ఆంక్షలనూ, పరిమితులనూ రద్దు చేయడానికి సంఘ్ పరివార్ ప్రభుత్వం ఉవ్విళ్లూరుతున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలలోని రెండు వందలకు పైగా చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు దుర్మార్గమైన, కార్మిక వ్యతిరేక, ప్రజా వ్యతిరేక చట్టాలను ప్రవేశ పెడుతున్నది. కార్మిక వర్గానికి కనీసమైన హక్కులు, సంక్షేమ నిబంధనలు లేకుండా చేసి, పెట్టుబడిదారుల లాభాపేక్షకు బలి పశువులుగా వారిని మారుస్తున్నది. భారత పారిశ్రామిక రంగాన్ని కార్మికుల శ్రమను మరింత పిండుకుని, మరిన్ని లాభాలు సంపాదించగల ఆకర్షణీయ ప్రాంతంగా మార్చి, బహుళ జాతి సంస్థలకు, వారి దళారీలకు, దేశదేశాల సంపన్నులకు దోపిడీ స్థలంగా, విహార స్థలంగా, క్రీడా స్థలంగా మార్చడమే ఈ "జాతీయ" "దేశభక్త" పాలకుల లక్ష్యంగా మారింది.

మరొకవైపు పనిలో పనిగా ముస్లింల మీద, దళిత, ఆదివాసి, మహిళా సమూహాల మీద, భిన్న స్వరాల మీద వంద సంవత్సరాలుగా తమకు అలవాటైన, తమ భావజాలానికి అనుగుణమైన దాడులు కొనసాగిస్తున్నారు. ఒక సమూహం మీద నిరంతర దాడి ద్వారా ఇతర సమూహాలను భయభీతావహంలో ముంచి తమ ఆధిపత్యం కొనసాగించడం అనేది హిందుత్వ వ్యూహంలో అంతర్భాగం. కశ్మీర్ మీద, కశ్మీరీ ప్రజల ఆకాంక్షల మీద దాడి, ముస్లింల మీద భౌతిక, భావజాల, ప్రతీకాత్మక దాడులు రోజురోజుకూ పెచ్చరిల్లిపోతున్నాయి. నాలుగు వందల సంవత్సరాల చారిత్రక కట్టడంలో 1949లో దొంగతనంగా చొరబడడం మాత్రమే కాక, ఆ తర్వాతి అనేక ప్రభుత్వాల, అధికారవర్గాల, న్యాయమూర్తుల ప్రచ్ఛన్న హిందుత్వ వల్ల ఆ స్థలం మీద అధికారం సంపాదించుకున్నారు. అలా దురాక్రమించిన స్థలంలో ఆలయ నిర్మాణానికి పూనుకోవడం ఒక ఎత్తు. బాబ్రీ మసీదును పరిరక్షిస్తామని, అప్పటి కేంద్ర ప్రభుత్వానికి, న్యాయస్థానాలకు హామీలు ఇచ్చి, చివరికి ప్రత్యక్షంగా, వేలాది మంది సాక్షిగా విధ్వంసం జరిపిన నాయకులను నిర్దోషులుగా విడిచిపెట్టే తీర్పు రాయించుకోవడం మరొక ఎత్తు. ఇది సంఘ్ పరివార్ దుర్మార్గాలలోకెల్లా దుర్మార్గం.

ఒక బహిరంగ నేరాన్ని నేరం కాదనో, నేరస్తులు నిర్దోషులనో చెప్పడం అంటే ఈ సమాజంలో న్యాయాన్యాయాల నిర్వచనాన్ని తలకిందులు చేయడమే. కొన్ని నేరాలకు శిక్ష ఉండదని నిస్సిగ్గుగా ప్రకటించడమే. ఈ నాణానికి మరొకవైపున అమాయకులను, నిర్దోషులను, ప్రజాసేవకులను, మానవతావాదులను తప్పుడు ఆరోపణలపై నిర్బంధించి ఏళ్ల తరబడి వేధించడాన్ని కూడ చూడాలి. ఎనభై మూడు సంవత్సరాల వృద్ధుడు, క్రైస్తవ మతబోధకుడు ఫాదర్ స్టాన్ స్వామి ని వేధించడం కేవలం ఆయన ఆదివాసుల హక్కులను పరిరక్షించడానికి నిలబడినందువల్ల, ఈ దేశపు ఖనిజవనరులను బహుళజాతిసంస్థలు కొల్లగొట్టగూడదని పోరాడినందు వల్ల మాత్రమే. కశ్మీరీ ప్రజల ఆకాంక్షలను కాలరాచే క్రమంలో ఏడాదిగా జరుగుతున్న దుర్మార్గాలకు తోడుగా ప్రస్తుతం కశ్మీర్ లో బైటివారు భూమి కొనుక్కోవచ్చుననే ఉత్తర్వులు ప్రకటిస్తున్నారు. స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న ప్రజలను ఉక్కుపాదంతో అణచివేసి, వారి భూమిని రియల్ ఎస్టేట్ గా మార్చి, దేశదేశాల సంపన్నులకు బంగారు పళ్లెంలో పెట్టి అందిస్తున్న కుట్ర ఇది.

ఈ దాడులన్నిటిలో, దాడుల ఉధృతిలో, ఈ సమాజ విధ్వంసంలో సంఘ్ పరివార్ స్పష్టంగానే ఉన్నది. ఇవాళ వారిని ప్రతిఘటించే స్పష్టత, ఐక్యత తెచ్చుకోవలసింది ఈ దేశాన్ని, దేశ ప్రజలను ప్రేమించేవారు, ఈ దేశ వనరులు ఈ దేశ శ్రామిక ప్రజలకు మాత్రమే దక్కాలని కోరుకునేవారు, హిందుత్వ, మనుధర్మ ఫాసిస్టు విష విద్వేష రాజకీయాలను ప్రతిఘటించ దలచినవారు. వీ

సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

పట్నం గోస గిట్లెందుకయింది?

పట్నంల బగ్గ వానలు గొట్టినయి. ఒక్క పట్నంలనె గాదు, పూర తెలంగాణల వానలు బాగనే పడ్డయి. కని పట్నంల మాత్రం ఇసొంటి వాన నూట పదేండ్లయిందట. మూసికి ఎక్కడలేని వరదలొచ్చె. బొచ్చెడన్ని చెరువులు కట్టలు దెగిపాయె. మాయమైపోయిన చెర్లు, కుంటలన్ని మల్ల కండ్లు దెరిచె. రోడ్లన్ని కాల్వలైపాయె. సాలు పొడుగున గొట్టె వానల పావుల మందమో అర్ద మందమో ఒక్కరోజుల గొట్టిందట. పాపం లెక్కలేనంత మంది గోడలు గూలి, ఇండ్లు గూలి, వరదల్ల గొట్టుకపోయి సచ్చిపోయిరి. కొంతమందివైతె పీనుగలు గుడ దొర్కకపాయె. మూసి ఒడ్డున బస్త సంచులతోటో, అట్ట ముక్కలతోటో అర్రలు జేసోని ఉన్నోల్ల గతి అన్నాలమైపాయె. పెద్ద పెద్ద బంగులలు గుడ మునిగిపోంగ గా గుడిసెలకొచ్చినాది అని ఎటకారాలు గుడ ఇనబడె. అవ్వల్ దర్జ, దునియాల ఇసొంటి షహర్ లేదంటె మామూలనుకుంటివా, రోడ్లు కాల్వలైన పట్నం ఇంకోటున్నదా, పడవలు అక్కరకొచ్చే పట్నం ఇంకోటున్నదా అని గుడ నవ్వులాటలినబడె. ఇంకొగాయినె ఇంకో అడుగేసి, పెండ్లి సమంధం అంత మంచె, బంగులలు, కార్లు ఉన్నయి గాని, పడువలు లేవని ఒప్పుకుంటలేం అని గుడ ఉల్లెక్కాల మాటలాడె. రోడ్లన్ని కాల్వలైనయంటె, ఒక జాగ నుంచి ఇంకో జాగకు పోవుటానికి పడవలు గావాల్నంటె, గిట్ల ఉల్లెక్కాల మాటలు మాట్లాడితె దొరలు నారాజ్ అయిపొయిరి. దొరలు నారాజయింది నివద్దెనో కాదో గని, దొరల సుట్టున్న తానె తందానలైతె మస్తు గరమయిరి. లాట్, పట్నం పరువు దీస్తరా అని పండ్లు గొరికిరి. గిది పట్నం పరువు తీసుడో తీయకపోవుడో సమజైత లేదు గని, పట్నం గిట్ల ఎందుకాయెనని ఇశారిస్తె బాగుంటది. ఆంద్రోల్లు జెయ్యంగనె గిట్లయింది అంటె ఇనుటానికి బాగనే ఉంటది గని వాండ్లు ఎల్లిపోయి ఆరేండ్లు కావచ్చె. ఇన్నేండ్ల నుంచి మన రాజ్జెమేనాయె. ఇదంత వాన తప్పె అని దాని మీద దోసుడు గుడ కుదరది. ఎక్వ తక్వ వాన గొట్టిందన్నది నివద్దె. గని, మన పట్నం కొండల మీద, ఎత్తొంపులల్ల ఉన్నది గద, నీల్లు పారుటానికి, గొలుసుకట్టు చెరువులు ఒగదానెనుక ఒగటి సోల్పుగ నిండుటానికి సౌలత్ ఉన్న జాగ గద. ఈడ గీ గాచారం ఎట్లొచ్చె. బుర్రున్నందుకు జర సోంచాయించాల్నా లేద. కాల్వలు కబ్జా పెడితివి, చెరువులు, కుంటలు కబ్జా పెడితివి. కొండలు గుట్టలు నున్నగ జేస్తివి. రోడ్లు అటు గోడ నుంచి ఇటు గోడ దాకా మట్టి కనబడకుంట సిమెంటు నింపితివి. ఇగ నీల్లు ఏడ బోవాలె? సర్కారు అన్నోడు, బుద్ధిమంతుడన్నోడు ఇట్ల కబ్జ బెట్టుడు తప్పు అని జెప్పాల్నా లేదా? కబ్జ బెట్టినోడు అన్నాయె, తమ్ముడాయె, బిడ్డాయె, బామ్మర్దాయె, ఏమి గాకపోతె వందెకరాలు కబ్జ బెట్టి పదెకురాలు నీకిచ్చినోడాయె, నీ పార్టీని సాదినోడాయె. ఏదో ఒకటి, కబ్జదారును అనుటానికి నీకు నోరు రాకపాయె. కబ్జాలకు మద్దతిచ్చె కానూన్లు గుడ జేస్తివి. కబ్జాదారు బాగనే ఉండె, వానికి సాతిచ్చిన సర్కారు బాగనే ఉండె. ఇగ పాపం నోరులేని నీల్లేం జేత్తయి? వాటి జాగల్లకు అవి ఒచ్చినయి. గంతే. నువ్వు ఆటి జాగల్లకు బొయి కబ్జ పెడితె, సూశి సూశి సూశి ఆకరికి వాటి ఇంట్ల అవి జొచ్చినయి. పట్నం గింత గోస ఎందుకు బెడ్తాందంటె గిది నీల్ల గోస. జనాల గోస. వీ

సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్

అడగవలసిన ప్రశ్నలే, కాని అడుగుతున్నదెవరు?


ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తన ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా వరుసగా తీర్పులు చెప్పడంలో, ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీకి అనుకూల నిర్ణయాలు ప్రకటించడంలో ఒక సుప్రీంకోర్టు న్యాయమూర్తి ప్రమేయం ఉందని ముఖ్యమంత్రి ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాయడం, వారం తిరగకుండానే ఆ లేఖను బహిరంగపరచడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో దుమారాన్ని లేపుతున్నాయి. ఆ లేఖ మీద స్పందించవలసిన సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బోబ్డే గడిచిన మూడు వారాలలో స్పందించలేదు. ఈలోగా సుప్రీంకోర్టు న్యాయవాదుల సంఘం, ఢిల్లీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆ సుప్రీం కోర్టు న్యాయమూర్తికి అనుకూలంగా ప్రకటనలు విడుదల చేయడం, ఆ లేఖ సుప్రీం కోర్టు ప్రతిష్ఠను భంగపరిచేదిగా ఉందనడం, ముఖ్యమంత్రి లేఖ వెనుక దురుద్దేశాలను వెతకడం వంటి పరిణామాలు సమస్యను మరింత జటిలం చేశాయి. చెలరేగిన వాదవివాదాలు మొత్తం సమస్యను న్యాయవ్యవస్థ తటస్థత సమస్యగా కాక, జగన్ వైపా, చంద్రబాబు వైపా అనే అనవసరమైన రచ్చగా మార్చాయి. లేఖలో లేవనెత్తిన విషయాల మీద దర్యాప్తు, విచారణ, చర్చ పక్కకు పోయి, ఒకరి సమర్థన, మరొకరి ఖండన అనే దగ్గరికి చేరింది. సుప్రీంకోర్టు న్యాయవాదుల సంఘం నిర్ణయాన్ని తప్పు బట్టిన ఆ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే అన్నట్టుగా, "ముఖ్యమంత్రి చేసిన ఆరోపణల నిజానిజాలు మనకు తెలియవు. సక్రమమైన విచారణ ద్వారా మాత్రమే సత్యం బైటపడుతుంది. ఆ సత్యాన్వేషణను అడ్డుకోవడం సరైనది కాదు". జగన్ మోహన్ రెడ్డి తన లేఖలో ఇరవై సంవత్సరాలుగా చంద్రబాబుకూ రమణకూ సంబంధాలున్నాయని, జస్టిస్ రమణ కూతుళ్ల భూమి లావాదేవీలలో చంద్రబాబు నాయుడుకు సంబంధం ఉన్నదని, అందువల్లనే జస్టిస్ రమణ ఇప్పుడు చంద్రబాబుకు, తెలుగు దేశంకు సహాయం చేయడానికి హైకోర్టును ప్రభావితం చేస్తున్నారని అన్నారు. వీటిలో చంద్రబాబుకూ రమణకూ సంబంధాల విషయం కొత్తది కాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో స్వయంగా హైకోర్టు న్యాయమూర్తులే వ్యాఖ్యానించిన విషయం అది. తెలుగుదేశంతో సాన్నిహిత్యం వల్లనే జస్టిస్ రమణ పదోన్నతి సాధ్యమయిందనే అపోహో, వాస్తవమో పదిహేనేళ్లుగా ఉన్నదే. అది అలా ఉంచి ఇతర ఆరోపణలను కూడ నిర్దిష్టంగా విచారించి వాస్తవం తేల్చాలి. అయితే, ఆ ప్రశ్నలు ప్రజల వైపు నుంచి న్యాయవ్యవస్థను అడగవలసినవే గాని, ఇవాళ అడుగుతున్న జగన్ కు ఆ అర్హత ఉందా అన్నది మరొక ప్రశ్న. తన మీద అక్రమాస్తుల, నేరారోపణల కేసులు ఉన్నప్పుడు కాబోయే ప్రధాన న్యాయమూర్తిని బెదిరించడానికే ఈ లేఖాస్త్రం అనే ఆరోపణలో కూడ వాస్తవం ఉండవచ్చు. ఏది ఏమైనా ఇటువంటి ప్రశ్నలు తప్పనిసరిగా ప్రజా క్షేత్రంలో, బహిరంగంగా చర్చకు రావలసిందే. వాటివల్ల న్యాయవ్యవస్థ ప్రతిష్ఠ దెబ్బ తింటుందనే అభిప్రాయం సరైనదేమీ కాదు, అసలా ప్రతిష్ఠ అంటూ ఉంటే, అది చేసిన పనుల వల్ల దెబ్బ తింటుంది గాని, ఆ పనుల గురించి ప్రశ్నించినందువల్ల కాదు. వీ

బెలారస్ పై ముప్పేట దాడి

- రాజేంద్రబాబు అర్విణ


'నియంతృత్వ ఉక్కు పాదాల కింద నలిగిపోతున్న ఒకేఒక్క యూరప్ బెలారస్' అని అప్పటి అధ్యక్షుడు జార్జ్‌బుష్ కాలంలో అమెరికా అధికార యంత్రాంగం బెలారస్‌పై అక్కసు వెళ్లగక్కింది. 1991 విచ్ఛిన్నమైన సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్‌లో భాగమై వెలుగొందిన బెలారస్ యూరప్‌లోని మిగతా దేశాల కంటే భిన్నంగా కాపిటలిస్ట్ ప్రపంచపు విష కౌగిలిలో ఇమిడి పోవడానికి ఇష్టపడకపోవడమే దానికి కారణం. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో బెలారస్ జనాభాలో దాదాపు పావు భాగం మృత్యువాతపడ్డారు. ఆర్థిక వనరులలో సగందాకా మట్టికొట్టుకు పోయి తీవ్రమైన విధ్వంసానికి గురైన ఈ దేశం సోవియట్ యూనియన్లో సభ్య దేశంగా మెల్ల మెల్లగా జవసత్వాలు పుంజుకుంది. 1991లో సార్వభౌమత్వం ప్రకటించుకొన్న బెలారస్ చాలావరకు అస్థిరత్వానికి గురైంది. అంతవరకు సోవియట్ ప్రభుత్వంలో ఒక అధికారిగా పనిచేస్తున్న అలెగ్జాండర్ లుకషెన్కో 1994లో దేశ అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డాడు. సోవియట్ పతనానికి కారణంగా చెప్పబడుతున్న మిఖాయిల్ గోర్బచెవ్‌ను బహిరంగంగానే వ్యతిరేకించి చిత్తశుద్ధి గలిగిన కమ్యూనిస్టులకు మద్దతుపలికిన నేపథ్యం లుకషెన్కోది.

ఆగస్టు 2020లో జరిగిన ఎన్నికల్లో లుకషెన్కో వరుసగా ఆరవసారి అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డాడు. లుకషెన్కో నాయకత్వంలో బెలారస్ కుదుటబడ్డది. దేశ స్థూల జాతీయోత్పత్తి పెరిగింది. చాలా వరకు పరిశ్రమలు ప్రభుత్వ రంగంలోనే ఉంటాయి. ప్రైవేట్ పరిశ్రమలలో తప్పనిసరిగా 21.1 శాతం ప్రభుత్వ వాటా ఉండాల్సిందే. దేశ ఆర్థిక రంగంలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉన్న లుకషెన్కో విధానాన్ని భరించలేని కాపిటలిస్ట్ ప్రపంచం బెలారస్‌లో అల్లకల్లోలం సృష్టించే ప్రయత్నం చేస్తున్నది. ఎన్నికల్లో జరిపిన అక్రమాల వల్లనే ఆరవసారి కూడా గెలుపొందాడని లుకషెన్కో ప్రభుత్వాన్ని అభాసుపాలు చేసే ప్రయత్నం చేస్తున్నది. 'నియంతృత్వమే నా పరిపాలనా స్వభావమని, అలా లేకపోతే నా దేశాన్ని, నా ప్రజలను కాపాడుకోలేనని' ప్రకటించిన లుకషెన్కో ప్రభుత్వంలో పౌరహక్కులు, కార్మిక హక్కులు పూర్తిగా అడుగంటిపోయాయన్న విమర్శ బలంగానే ఉంది. కరోనా సమయంలో లాక్‌డౌన్ ప్రకటించని కొన్ని దేశాలలో బెలారస్ ఒకటి. "వోడ్కాతాగి కరోనాను జయించండి" అని తన ప్రజలకు పిలుపునిచ్చి నవ్వులపాలయ్యాడు లుకషెన్కో. అయినా అక్కడి కరోనా మరణాలు 135, వైరస్ సోకినవారు 24000. లుకషెన్కోను బెలారస్ అధ్యక్షునిగా గుర్తించ నిరాకరిస్తున్నాయి అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలు. 2020 ఎన్నికలలో పోటీచేసి ఓడిపోయి, పోలాండ్లో అజ్ఞాత జీవితం గడుపుతున్న స్వేత్‌లానా శిఖాయా నౌకాయాను అధ్యక్షురాలిగా గుర్తింపునిచ్చాయి కాపిటలిస్ట్ దేశాలు. యూరప్ ప్రైవేటీకరణను నిరుత్సాహ పరుస్తున్న అలెగ్జాండర్ లుకషెన్కోను అస్థిరపరచాలని అమెరికాతో పాటు పాశ్చాత్య ప్రపంచం చేస్తున్న ప్రయత్నాలను అభిశంసించాలి. అలాగే, తమ దేశ భవిష్యత్తు నిర్ణయించుకునే అధికారం ఆ దేశ ప్రజలకే ఉండాలి అన్న ప్రజాస్వామిక సూత్రాన్ని పాటించకపోతే ప్రపంచ శాంతి గగన కుసుమమే అవుతుంది. వీ







❖ **సుషుప్తి నుంచి –** మామిడి హరికృష్ణ కవిత్వం – మామిడి హరికృష్ణ – స్వరాజ్యం పబ్లికేషన్స్ ప్రచురణ – 88 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు: మామిడి జయకృష్ణ, ఫ్లాట్ నెం. 804, రాయల్ పవిలియేన్ అపార్ట్‌మెంట్స్, బిగ్ బజార్ ఎదురుగా, ఆర్‌బిఐ క్వార్టర్స్ పక్కన, అమీర్‌పేట, హైదరాబాద్ – 500016




❖ **నిర్మల్ జిల్లా సాహిత్య చరిత్ర –** తుమ్మల దేవరావ్ – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణ – 120 పేజీలు, 1/8 డెమీ, రు. 50




❖ **అనిమేష –** ఉపద్రవగాథ కావ్యం – నందిని సిధారెడ్డి – మంజీర రచయితల సంఘం ప్రచురణ – 112 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: నందిని సిధారెడ్డి, ఇ.నెం. 8-04-036, వెంచర్–11, మల్లారెడ్డి నగర్, లోతుకుంట, అల్వాల్ – 505015, హైదరాబాద్, తెలంగాణ, సెల్ నెం: 9440381148



❖ **నిజామాబాద్ జిల్లా సాహిత్య చరిత్ర** – డా.వి. త్రివేణి – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణ – 144 పేజీలు, 1/8 డెమీ, రు. 50




❖ **జర్నలిస్టుగా అంబేద్కర్** – సంగిశెట్టి శ్రీనివాస్ – సిక్కోలు బుక్ ట్రస్ట్ ప్రచురణ – 64 పేజీలు, 1/8 డెమీ, రు. 60, ప్రతులకు: సిక్కోలు బుక్ ట్రస్ట్, ఎంఐజి–100, జిల్లా పరిషత్ ఎదురుగా, ఎపిఎచ్‌బి కాలనీ, శ్రీకాకుళం – 532001, ఫోన్ : 9989265444



❖ **రామాయణ విశేషములు –** సురవరం ప్రతాపరెడ్డి – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణ – 280 పేజీలు, 1/8 డెమీ, రు. 100




❖ **గంటేడ గౌరునాయుడు సాహిత్యం** – మొదటి సంపుటి – కథలు – స్నేహకళా సాహితి ప్రచురణ – 415 పేజీలు, 1/4 క్రౌన్, రు. 350, ప్రతులకు: గంటేడ కిరణ్, ఎస్.ఎన్.పి. కాలనీ, రామాలయం చివరి వీథి, పార్వతీపురం – 535501, విజయనగరం జిల్లా, ఫోన్: 9441415182, అన్ని ప్రముఖ పుస్తకాల షాపులలో




❖ **ద్విపద భాగవతం –** మడికి సింగన – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణ – 260 పేజీలు, 1/8 డెమీ, రు. 125

పై నాలుగు ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమి, కళాభవన్, రవీంద్రభారతి ప్రాంగణం, హైదరాబాద్ – 500004, ఫోన్ : 040–29703142



❖ **మట్టిరంగు బొమ్మలు** – కవిత్వం – సిరికి స్వామినాయుడు – స్నేహకళా సాహితి ప్రచురణ – 168 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: సిరికి స్వామినాయుడు, ఈస్ట్ రోడ్, 3వ లైన్, బంగారమ్మ కాలనీ, బెలగాం, పార్వతీపురం –535501, విజయనగరం జిల్లా, ఫోన్ : 9494010330, అన్ని ప్రముఖ పుస్తకాల షాపులలో



❖ **ఔరంగజేబ్** – చరిత్రకెక్కని చారిత్రక కోణాలు– అబుల్ ఫౌజాన్ (ముహమ్మద్ సర్వర్) – రిధ్ & జిధ్ బ్రదర్స్ ప్రచురణ – 622 పేజీలు, 1/8 డెమీ, రు. 400, ప్రతులకు: రిధ్ & జిధ్ బ్రదర్స్, ఇం.నెం. 7-2-1038, కశ్మీర్‌గడ్డ, కరీంనగర్ – 505 001. ఫోన్: 9100567136, 9985394757

మత వేదన వాస్తవ వేదనకు వ్యక్తీకరణే. అదే సమయంలో అది వాస్తవ వేదనపట్ల నిరసన కూడా. మతం అణచబడ్డ జీవి నిట్టూర్పు. హృదయంలేని ప్రపంచపు హృదయం. ఉత్సాహంలేని పరిస్థితుల ఉత్సాహం. అది ప్రజలకు మత్తుమందు.

ప్రజల భ్రమాజనిత ఆనందంగా ఉన్న మతాన్ని రద్దుచేయడమంటే ప్రజల వాస్తవమైన ఆనందాన్ని ఆకాంక్షించడమే. ప్రస్తుత స్థితిపట్ల భ్రమల్ని వదిలేయమని కోరడమంటే, భ్రమలు అవసరమయ్యే పరిస్థితుల్ని వదిలెయ్యమని కోరడమే. అందుకే మతం మీద విమర్శ ఏ కన్నీటి ప్రవాహాల వెలుగు మతమో, ఆ కన్నీటి ప్రవాహాల మీద విమర్శకు బీజరూపమే.

– కార్ల్ మార్క్స్

హాథ్రస్ ఏమి చెబుతున్నది?

పితృస్వామ్యం, పురుషాధిక్యత, కులం, బలమైన సామాజిక వివక్ష సాధనాలుగా పనిచేస్తున్నంత కాలం ఎన్ని చట్టాలు చేసినా ప్రయోజనం లేదనీ, వీటిని బద్దలుకొట్టడంలోనే దళితులకు పరిష్కారం ఉంటుందనీ అంటున్నారు బి. రామకృష్ణ

పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోని హాథ్రస్ జిల్లా బూల్‌గరి గ్రామ దళిత (వాల్మీకి) కుటుంబానికి చెందిన 19 ఏళ్ల అమ్మాయిని సామూహిక అత్యాచారం, చేసి నాలుక కోసి, మెడ ఎముకలు వెన్నెముక విరగొట్టిన సంఘటన దేశవ్యాప్తంగా ప్రజల దృష్టికి వచ్చింది. 2020 సెప్టెంబర్ 14న అమ్మతో పాటు గడ్డి కోయడానికి వెళ్లిన అమ్మాయిని ఉదయం 9 గంటల ప్రాంతంలో సజ్జ చేన్లలోకి లాక్కెళ్లి ఈ దుర్మార్గానికి పాల్పడ్డారు. వినికిడి జ్ఞానం తక్కువగా ఉన్న తల్లి వెనక్కి తిరిగి చూసేసరికి బిడ్డ కనిపించలేదు. ఏమైందని వెతికే క్రమంలో తెగిన నాలుకతో, ఉబ్బిన కళ్లతో, గొంతు నులిమిన రక్తపు మరకలతో, చెదిరిన బట్టలతో, రక్తస్రావంతో వణికిపోతున్న తన పేగు బంధాన్ని అసహాయ స్థితిలో చూసిన తల్లి పరిస్థితిని ఏమని ఊహించగలం.

బాధితురాలు, తల్లి, అన్న దగ్గరలోని చాంద్‌పా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సహాయం అర్థిస్తే వెళ్లగొట్టారు. పోలీసులకు విషయాన్ని వినే ఓపిక లేకుండా పోయింది. బాధితురాలని అక్కడ నుండి తీసుకెళ్లమని మాత్రం గదమాయించారు. బాధితురాలిని ఆసుపత్రిలోకి చేర్చే బాధ్యతను గాని, విధి నిర్వహణ గాని చేపట్టే చేతులు వారికి రాలేదు. స్థానిక ఆస్పత్రిలో రెండు గంటల వరకు ఉంచి తరువాత జవహర్‌లాల్ నెహ్రూ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ అలీఘడ్‌కి తీసుకెళ్లారు. హాస్పిటల్‌కి వెళ్లే క్రమంలో ఆ తర్వాత స్ట్రెచర్ పైన ఉన్న బాధితురాలు తనపై బలాత్కారం చేసిన వారి వివరాలను చెబుతున్న వీడియోలు వెలుగులోకి వచ్చాయి. తనపై అత్యాచారానికి పాల్పడిన వారు తమ ఇంటికి ఆవలి రోడ్డులో ఉండే వాళ్లేనని గుర్తుపట్టింది. వారంతా ఆ గ్రామంలోని అగ్రవర్ణ ఠాకూర్ కులం వాళ్లు. ఉత్తరప్రదేశ్‌లో ఠాకూర్‌ల ప్రాబల్యం మెండుగా ఉంటుంది. గతంలో జరిగిన ఎన్నో సంఘటనలు ఈ విషయాన్ని రుజువు చేస్తాయి. పూలన్‌దేవిపై జరిగిన ఘోరానికి పాల్పడిన వాళ్లు ఠాకూర్‌లేనన్నది మరిచిపోకూడదు.

బాధితురాలి గ్రామంలో దళిత కుటుంబాలు పది లోపే ఉంటాయి. గ్రామంలో దళితుల ఇళ్లు అగ్రవర్ణాల వారికి దూరంగా ఉంటాయి. పంటల కోత కోసం పనులకు పిలిచేటప్పుడు కూడా అగ్రకులాల వారు నేరుగా దళితుల దగ్గరికి రాకుండా ఎవరితోనో సమాచారం పంపిస్తారు. దళితుల ఇళ్లల్లోకి అగ్రకులాల వారు ఎవరూ కూడా అడుగుపెట్టరు. దళితులకు స్మశానం వేరుగా ఉండడం అనేది ఆ గ్రామంలోని కుల వివక్షకు నిదర్శనం. 20 ఏళ్ల క్రితం ఠాకూర్లు బాధితురాలి తాతను పశువులను మేపే విషయంలో హింసించిన చరిత్ర కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

బాధితురాలి ఆరోగ్య పరిస్థితి సీరియస్‌గా ఉండి మెడికో లీగల్ కేసుగా గుర్తించబడినప్పుడు వెంటనే బాధితురాలిపైన జరిగిన అఘాయిత్యం ఆనవాళ్లను గుర్తించి, రికార్డు చేసి, భద్రపరచవలసిన బాధ్యత ఉంటుంది. కానీ వైద్య సిబ్బంది ఆ పని చేయలేదు. బాధితురాలు నుండి ఘటన జరిగిన ఎనిమిది రోజుల తర్వాత అంటే సెప్టెంబర్ 22న మెజిస్ట్రేట్ సమక్షంలో స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. అప్పుడు కూడా ఆమె స్పష్టంగా తనపై జరిగిన సామూహిక అత్యాచారానికి పాల్పడిన నలుగురి వివరాలను చెప్పింది. ఆ తర్వాతనే ఫోరెన్సిక్ ల్యాబ్‌కు ఆమె శరీరం పైన ఉన్న ఆనవాళ్ల కోసం పరీక్షకు పంపించారు. ఆమె శరీరంపై వీర్యపు ఆనవాళ్లు లేవని, ఆమెపై రేప్ జరగలేదని ఆ రిపోర్ట్ చెప్పిందని అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మీడియాకు వివరించాడు.

ఎందుకు సంఘటన జరిగిన రోజే ఫోరెన్సిక్ ల్యాబ్‌కి ఆనవాళ్లను పంపించలేదు అనేదాన్ని చాలా కన్వీనియంట్‌గా మరుగున పడేస్తుంటారు. చాలా ఆలస్యంగా వారం రోజుల తర్వాత సేకరించడం ద్వారా ఆనవాళ్లు ఉంటాయా? మెడికల్ ట్రీట్‌మెంట్‌లో భాగంగా నైతేనేమి, మలమూత్ర విసర్జన కారణంగా నైతేనేమి, శరీరాన్ని తుడవడం మూలంగా నైతేనేమి ఈ ఆనవాళ్లు మిగిలి ఉంటాయా అనేదాన్ని పక్కదారి పట్టిస్తూ ఫోరెన్సిక్ రిపోర్ట్‌లో అత్యాచారం జరిగిందని తేలలేదని ఒక తప్పుడు ప్రచారాన్ని మొదలు పెట్టారని తెలుసుకోవడం కష్టమేమీ కాదు. రేప్ జరిగిందనడానికి తప్పనిసరిగా వీర్యపు ఆనవాళ్లు ఉండాలని కూడా ఏమి లేదు. బాధితురాలు చనిపోవడానికి ముందు చివరగా మెజిస్ట్రేట్ ముందు ఇచ్చిన స్టేట్‌మెంట్ అనేది ఆమె ఇచ్చిన మరణ వాంగ్మూలమే అవుతుంది. ఆ వాంగ్మూలంలో చాలా స్పష్టంగా ఎవరెవరు అఘాయిత్యానికి పాల్పడ్డారో ఆమె చెప్పి ఉన్నది. దీనిని పట్టించుకోకుండా ఆమెకు వ్యతిరేకంగా సాక్ష్యాధారాలను మాయం చేసే పనిలో భాగంగానే చాలా ఆలస్యంగా ఫోరెన్సిక్ ల్యాబ్‌కి పంపించడం జరిగిందని అనుకోవాల్సి ఉంటుంది.

పోలీసులు గాని, జిల్లా మెజిస్ట్రేట్ గాని బాధితురాలికి సరైన, మెరుగైన చికిత్స కోసం మొదట్లోనే ఢిల్లీలోని ఎయిమ్స్‌కి సకాలంలో పంపించకుండా చివరి దశలో వెంటిలేటర్ పైనే ఢిల్లీలోని సఫ్దర్జంగ్ ఆస్పత్రికి సెప్టెంబర్ 28న తరలించారు. ఆ మరుసటి రోజే 29న ఆమె చనిపోయింది. మంత్రులు, ఇతరత్రా బడా నాయకుల కోసం ఎయిమ్స్‌లో బెడ్స్ ఎప్పుడు ఖాళీగా ఉంచబడతాయి. కానీ తీవ్రమైన ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆమె కోసం ఉండవు. సెప్టెంబర్ 14న సంఘటన జరిగినప్పటి నుండి ఆమె చనిపోయే దాకా అంటే సెప్టెంబర్ 29 వరకు ఆమెకు మెరుగైన

వైద్య చికిత్స అందలేదని తెలుస్తోంది. సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రజల కోసం కనీస వసతులు కరువవుతుంటాయి. ఎక్కడికి పోయింది భారత్ వెలుగు వెలిగిపోతున్నది అని పాలకులు చెప్పిన అభివృద్ధి?

ఈ సంఘటన తెలిసిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం గానీ, బాధితురాలికి సరైన వైద్యం కోసం మంచి ఆసుపత్రికి తీసుకు వెళ్లకపోవడం గానీ, వెంటనే వైద్యపరమైన రుజువులను సేకరించక పోవడం గానీ, సకాలంలో మెజిస్ట్రేట్ చేత బాధితురాలి వాంగ్మూలాన్ని నమోదు చేయకపోవడం అన్నీ కూడా ఏ రాజకీయ, సామాజిక, ఆర్థిక అండదండలు లేని దళిత అమ్మాయి కాబట్టే కావాలనే ఈ నిర్లక్ష్యం జరిగిందనుకోవడం సరైనది కాకుండా పోదు. ఇక్కడ చూపించని శ్రద్ధ చొరవ భారీ పోలీసు బందోబస్తు మధ్య బాధితురాలి శవాన్ని ఢిల్లీలోని సఫ్దర్జంగ్ ఆస్పత్రి నుంచి రెండు వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆమె గ్రామానికి అర్ధరాత్రి తేవడంలో చూపిస్తారు. కుటుంబీకుల అభీష్టాలకు, సాంప్రదాయాలకు విరుద్ధంగా అర్ధరాత్రి రెండున్నర, మూడు గంటల ప్రాంతంలో పెట్రోల్ పోసి తగల బెట్టడంలో చూపిస్తారు. ఆ గ్రామంలోకి మరెవరినీ రానీయకుండా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయడంలో అతి చొరవను ప్రదర్శిస్తారు.

సనాతన సంస్కృతి అని గొప్పలు చెప్పే వారికి నాయకత్వం వహిస్తూ అధికారంలో ఉన్నవారు చేసే పని ఇదేనా అంటే ఇదేనని, వీరి పాలన ఇలాగే ఉంటుందని చెప్పడానికి సజీవ సాక్ష్యం హత్రాస్ సంఘటన. బిడ్డను కోల్పోయారు. దారుణం జరిగింది. తీవ్రమైన మనోవేదనతో షాక్‌లో ఉన్న కుటుంబానికి కనీసం చివరి సంస్కారమైనా వారనుకున్న రీతిలో జరుపుకోనీయకుండా చేసి బాధితురాలిని మరోసారి హత్య చేసారు, మరోసారి కుటుంబాన్ని దగా చేశారు.

శవానికి హక్కులుంటాయి. అంతిమ సంస్కారం గౌరవ ప్రదంగా ఆ కుటుంబ సంప్రదాయాల మేరకు వారు అంగీకార ఆమోదంతో జరగాల్సి ఉంటుంది. ఇది జీవించే హక్కును గురించి తెలిపే రాజ్యాంగంలోని ఆర్టికల్ 21లో అంతర్భాగం అనే విషయాన్ని అలహాబాద్ హైకోర్టు ఈ ఘటన సందర్భంగా స్పష్టం చేసింది. మీడియాలో రిపోర్ట్ అయినట్లుగా శవాన్ని కాల్చేయడం జరిగితే అది శిక్షార్హమైన నేరం అనే అభిప్రాయాన్ని న్యాయమూర్తులు వ్యక్తం చేశారు. అధికారం ప్రయోగించి నిజం మాట్లాడుకోవాలంటే అధికార దుర్వినియోగానికి పాల్పడాల్సిన అవసరం ఏం వచ్చింది? శవ పరీక్షలు మళ్లీ నిర్వహించాల్సి వస్తే సాక్ష్యాలు లేకుండా చేయడానికి చెత్తను కాల్చేసినట్లుగా పెట్రోల్ పోసి ఆదరాబాదరగా తగులబెట్టారు. ఇలా చేయమని ఆదేశాలు ఇచ్చిన జిల్లా మెజిస్ట్రేట్, ఆ పైన రాష్ట్ర ప్రభుత్వాధినేత ఏ వర్గాలకు కొమ్ము కాస్తున్నారో, ఏ ధర్మాన్ని నిలబెట్టాలనుకుంటున్నారో తెలుసుకోవచ్చు.

బాధిత కుటుంబానికి సంఘీభావం తెలపడానికి వస్తున్న వారిని ఎవరిని రానీయకుండా మొత్తం గ్రామాన్ని పోలీసులతో ఖైదు చేశారు. అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడడం, నిరసన తెలపడం అనేది కనీస ప్రజాస్వామిక స్పృహ విలువ. దానిని అడ్డుకోవడం, అణిచివేయడం అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 19కి వ్యతిరేకమైనది. ప్రజాస్వామిక రాజ్యాంగబద్ధమైన ఈ హక్కును కూడా సహించలేని పాశవికత్వాన్ని ఈ ఘటన తెలుపుతున్నది. గాయపడ్డవారు, దగాపడ్డవారు, దోపిడీ పీడనలకు గురవుతున్న అసహాయ స్థితిలో ఉన్న దళిత కుటుంబం దుఃఖాన్ని చూడడానికి, పంచుకోడానికి, పరామర్శించడానికి, వారికి సంఘీభావంగా కొద్ది సేపైనా వారితో ఉండడాన్ని సహించలేనితనం రాజ్యం వర్గ స్వభావాన్ని తెలుపుతున్నది. భారత రాజ్యాంగానికి ఈ పాలకులు ఇస్తున్న విలువ ఏమిటి అన్నది ముఖ్యమైన ప్రశ్న. అయినా ఈ పాలకుల భావజాల పునాది అనేది రాజ్యాంగాన్ని గౌరవిస్తే కదా. వారు కోరుకునేది మనుధర్మమే. నేడున్న మనువాద బ్రాహ్మణీయ ఫాసిజంలో ఇంతకంటే మరి ఏం జరుగుతుంది?

దేశవ్యాప్తంగా వస్తున్న నిరసనల నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం శాంతి భద్రతల సమస్య అని, అంతర్జాతీయ కుట్ర అనే సాకులతో అక్రమ అరెస్టులకు, జాతీయ భద్రతా చట్టం పేరుతో అక్రమ కేసులకు పాల్పడుతున్నది. దుర్మార్గాలను ప్రశ్నిస్తే దేశద్రోహులు అవుతారా? దేశభక్తులవుతారా? భీమా కోరేగావ్ కేసులో కూడా ఇలాంటి కేసులే పెట్టారు, ఎంతోమంది మేధావులను జైల్లో నిర్బంధించారు. మీడియాను, సామాజిక కార్యకర్తలను, ప్రజా సంఘాలను, రాజకీయ పార్టీలను ఎవరినీ హత్రాస్‌కు వెళ్లకుండా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఇదంతా ఎవరిని రక్షించడానికి, ఏ భావజాలాన్ని సామాజిక వ్యవస్థలను బలోపేతం చేయడానికి?

పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీనే అడ్డుకుని కిందపడేసిన పోలీసు అధికార యంత్రాంగానికి ఎలాంటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పలుకుబడి లేని అసహాయుల రోదనలు, ఆక్రందనలు, ఆవేదనలు బయటి సమాజానికి వినిపించకుండా చేయడం ఒక లెక్కా? కనీసం కొంత మీడియా, రాజకీయ పార్టీలు, చంద్రశేఖర్ ఆజాద్ వంటి దళిత ఉద్యమ శక్తుల వల్ల ఈ ఘటన వెలుగులోకి రాగలిగింది, దేశవ్యాప్త నిరసనలకు అవకాశం ఏర్పడింది. వారందరూ వస్తే శాంతిభద్రతల సమస్య ఎదురవుతుందని కుట్రపూరిత సాకును ముందుకు తెస్తున్నారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ ఘటనకు నిరసనగా రాష్ట్ర వ్యాప్త కార్యక్రమాన్ని చేపట్టవలసి ఉండింది. కరోనా సందర్భంలో ఎందుకూ పనికిరాని గిన్నెలు మోగించే కార్యక్రమాన్ని చేపడుతారు. ఇక్కడే పాలకుల అసలు రూపం బయటపడుతుంది.

ఘోర అత్యాచారానికి గురై చనిపోయిన అమ్మాయి పట్ల కనికరం లేదు కానీ, ఈ ఘటనను రాజకీయాల కోసం వాడుకోవద్దు అని చెప్పే ప్రయత్నంగా ఇతరులకు ప్రవేశం నిరసిస్తున్నట్లు అగ్రకుల వర్గాలు ప్రయత్నించాయి. సంఘటన పట్ల వస్తున్న సంఘీభావాన్ని సహించలేని అగ్రకుల శక్తులు బయటవారు రావద్దని, రాజకీయం చేయొద్దంటూ గ్రామ పొలిమేరల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. వీటికి ఎలాంటి ఆటంకాలు ఉండవు.

మీడియా ఇప్పుడు ఉంటుంది, కొన్ని రోజులు అయితే వెళ్లిపోతుంది. ఉండేది మేమే కాబట్టి మా మాట వినండి. మీ స్టేట్‌మెంట్‌ను మార్చుకోండి అని హత్రస్ జిల్లా మేజిస్ట్రేట్ బాధిత కుటుంబంపై ఒత్తిడి తెస్తున్న వీడియో వెలుగు చూసింది. 25 లక్షల నష్టపరిహారం వచ్చిందని, కరోనాతో చనిపోతే ఏం చేసేవారని బాధితులతో అన్న జిల్లా మెజిస్ట్రేట్ మాటలు దేన్ని ప్రతిబింబిస్తాయి? అత్యాచారం చేసి చంపేస్తే దాని ఖరీదు 25 లక్షలు అన్నమాట.

హాథ్రస్‌లో ఏం జరిగింది?

***ఉత్తరప్రదేశ్, హాథ్రస్‌లో ఆధిపత్య కులమైన ఠాకూర్ పురుషుల చేతిలో దళిత బాలికపై జరిగిన దారుణ మూక అత్యాచారం, హత్యపై* నిజ నిర్ధారణ నివేదిక**

మహారాష్ట్రలోని చందర్‌పూర్ జిల్లాలో ఖైర్లాంజీలో హత్య జరిగిన సరిగ్గా 14 సంవత్సరాలకు, అదే తేదీన, అంటే సెప్టెంబర్ 29న హాథ్రస్ సంఘటనలో మరొక దళిత బాలిక అత్యాచారం, హత్యలకు బలయ్యింది. కుల, లింగ వివక్షతల కారణంగా, అసమానత, అన్యాయాల కారణంగా భారత దేశ వ్యాప్తంగా ఈ ఘోరాలు జరుగుతూ ఉన్నాయి.

అయితే హత్రాస్ ఘటనలో 19 ఏళ్ల దళిత బాలిక, ఆమెను దస్య అందాం, మీద బుల్‌గడి గ్రామంలో జరిగినది కుల రాజకీయాలలో చిక్కుబడిపోయి, ఆమె కుటుంబం చెబుతున్న వాస్తవాలను తిరస్కరిస్తూ, వాళ్లు అబద్ధాలు చెబుతున్నారని, పరువు హత్యకు పాల్పడ్డారని బహిరంగంగా నిందిస్తున్నారు. ఇది నిర్ఘాంతపరడటమే కాకుండా గత కొద్ది సంవత్సరాలుగా ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న అణచివేత, హింసలను చూస్తున్న వ్యక్తులు, సంస్థలు కూడా ఊహించనది. ఈ నేపథ్యంలో ప్రజా ఉద్యమాల జాతీయ సంఘటన (ఎన్‌ఎపిఎం) ప్రతినిధులు, చాలాకాలంగా ఇందులో పనిచేస్తున్నవాళ్లం ఈ దారుణ ఘటనకు సంబంధించిన వాస్తవాలను తెలుసుకోటానికి, కేవలం న్యాయపరంగానే కాకుండా సామాజిక-ఆర్థిక-రాజకీయ పరంగా విశ్లేషించడానికి అక్కడికి వెళ్లాలని అనుకున్నాం. ఈ అమానవీయ ఘటనపై నిరసన తెలియచేయడానికి, ఫ్యూడల్-కులతత్వ వాతావరణం, రాజకీయాల మధ్య పోరాటం చేయాల్సిన దస్య కుటుంబానికి మా మద్దతు తెలియచేయడానికి కూడా మేం వెళ్లాం.

తొమ్మిది మంది సభ్యులున్న మా బృందం అక్టోబరు 9న మధ్యాహ్నం ఒంటి గంటకి బుల్‌గడి గ్రామం చేరుకుంది. బ్యారికేడ్లు, పోలీసులను దాటి వెళ్లడానికి బాధితురాలి కుటుంబాన్ని కలవడానికి అయిదుగురు కంటే ఎక్కువ మంది ఒక్కసారి వెళ్లకూడదని మమ్మల్ని ఆపివేశారు. అయిదుగురు, నలుగురుగా రెండు బృందాలు ఏర్పడి సబ్-డివిజినల్ మ్యాజిస్ట్రేట్‌కి దరఖాస్తులు రాసిన తరవాత మాకు అనుమతి లభించింది. అక్కడి నుంచి 1.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న దస్య ఇంటికి వెళ్లడానికి మొదటి బృందానికి పోలీసు వాహనం ఇచ్చారు, రెండవ బృందం నడుచుకుంటూ వెళ్లాల్సి వచ్చింది. మొదటి బృందం తిరిగి రావడానికి రెండవ బృందం వేచి ఉన్న సమయంలో కాషాయ తలపాగాలతో అఖిల భారతీయ క్షత్రియ మహాసభ కార్యకర్తలు అక్కడికి వాహనాల్లో వచ్చారు. 'బాధిత' ఠాకూర్ కుటుంబాన్ని కలవడానికి మాత్రమే తాము వచ్చామన్న పోస్టర్లు వాళ్ల వాహనాలకు అంటించి ఉన్నాయి. అందరం కలిసే వెళతామని వాళ్లు పోలీసులతో వాదనకు దిగారు. చాలాసేపటికి వాళ్లందరినీ కలిసే ఊరిలోకి వెళ్లడానికి అనుమతించారు. వాహనాలలో ఒకదాని మీద సమాజ్‌వాదీ పార్టీ నుంచి విడిపోయి, శివపాల్ యాదవ్ స్థాపించిన ప్రగతిసీల్ సమాజ్‌వాదీ పార్టీ జండా ఉంది.

మాలో కొంతమందిమి లోపల కూర్చుని ఘటనకి సంబంధించి, దానికి ముందు, తరవాత జరిగిన వాటి గురించి కూడా వివరంగా తెలుసుకున్నాం. బుల్‌గఢీ గ్రామంలో 600కి పైగా కుటుంబాలు ఉంటాయి. ఎన్నో తరాలుగా 15 దళిత కుటుంబాలు అల్ప సంఖ్యాకులుగా అక్కడ నివసిస్తున్నాయి. దశాబ్దాలుగా వాళ్లు అణచివేత వాతావరణంలో బతుకుతున్నారు, దౌర్జన్యాలను ఎదుర్కొంటూ ఉన్నారు. ఆధిపత్య కులమైన ఠాకుర్లు వాళ్లని వ్యవసాయ కూలీలుగా, ఇతర విధాలుగా ఉపయోగించు

యోగి ఆదిత్యనాథ్ ఉత్తరప్రదేశ్‌లో అధికారం చేపట్టిన తర్వాత ఎన్నో ఎక్స్‌ట్రా జ్యుడిషియల్ హత్యలకు సంబంధించిన సంఘటనలు వెలుగు చూశాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) ప్రకారం దేశంలోనే ఉత్తరప్రదేశ్‌లో దళితులపై నేరాలు అత్యధికంగా జరుగుతున్నాయి.

హాథ్రస్ సంఘటన జరిగి ఉండాల్సింది కాదు అన్న ఐక్యరాజ్య సమితి స్పందనను విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ వ్యాఖ్య అనవసరం, అవాంఛనీయం అని తప్పు పట్టింది. యోగికి వ్యతిరేకంగా కుల సమస్యను రెచ్చగొట్టడానికి జాతీయ, అంతర్జాతీయ కుట్ర జరుగుతున్నదని, ఇది దేశ భద్రతకు ముప్పు అని, దేశద్రోహమని జరిగిన ఘోరాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. అధికారం, పోలీసు యంత్రాంగం చేతిలో ఉన్నది కాబట్టి దొంగే దొంగా దొంగా అన్నట్లు వాళ్లు ఏమైనా చేయగలరు.

ఇలాంటి ఘటనే పలుకుబడిగల ఎంఎల్‌ఎ, ఎంపి, మంత్రి, రాజకీయ నాయకులు, అగ్రకుల శక్తుల ఇళ్లల్లో జరిగితే ఇలా పనికిరాని చెత్తను కాల్చివేసినట్లు దహనం చేసేవారా? సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా పలుకుబడి లేని అభాగ్యజీవులే కదా బలయ్యేది. పితృస్వామిక పురుషాధిక్య సమాజంలో మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు, లైంగిక హింసలు, హత్యలు జరుగుతూనే ఉన్నాయి. అయితే మహిళలందరి పట్ల ఒకే రీతి న్యాయం, స్పందనలు గానీ ఉండవు. దళితుల, ఆదివాసుల తదితర అట్టడుగు వర్గాల మహిళలపై జరిగే దుర్మార్గాలు తేలికగా చూడబడతాయి.

ఈ దేశంలో పితృస్వామ్యం పురుషాధిక్యత కులం బలమైన సామాజిక వివక్ష అణచివేత సాధనాలుగా పనిచేస్తున్నాయి. వీటిని బద్దలు కొట్టకుండా ఎన్ని చట్టాలు చేసినా, గాలి బుడగల నిరసనలు ఎన్ని చేసినా ఫలితం ఏమీ ఉండదు. అగ్రకుల దురహంకార అమానవీయతను, మనువాద ఫాసిజంను చూడాలనుకునే వారికి హత్రాస్ ఘటన ఒక సజీవ సాక్ష్యం.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

కుంటున్నారు. గత కొన్ని దశాబ్దాలుగా దళితులలో కొంత చైతన్యం చోటు చేసుకుంటోంది.

దస్య వాళ్ల కుటుంబాని (నాన్న)కి 1990లలో మాయావతి ప్రభుత్వం 2 ఎకరాల భూమి ఇచ్చింది. అయితే, ఇప్పటివరకు 1.4 ఎకరాలు మాత్రమే వాళ్ల స్వాధీనంలోకి వచ్చింది. మిగిలినది ఒక బ్రాహ్మణ కుటుంబం ఆక్రమణలో ఉందని అంటున్నారు. పాల అమ్మకం ద్వారా దస్య కుటుంబానికి కొంత ఆదాయం వస్తుంది.

పొరుగువాళ్లతో ఎంతో కాలంగా సత్సంబంధాలు లేవు. దాదాపు 20 సంవత్సరాల క్రితం దస్య వాళ్ల తాతయ్యపై పక్కింటి ఠాకుర్ కుటుంబం దాడి చేసింది. “వాళ్లు తమ గేదెలను మా పొలంలో మేపుతున్నారు. పంట పాడైపోతుందని, వాటిని బయటకి తోలమని మా తాతయ్య వాళ్లని కోరాడు. ఒక దళితుడు అలా అన్నందుకు కోపగించిన వాళ్లు కత్తిలాంటి వస్తువుతో మా తాతయ్య మీద దాడి చేశారు. తన మెడను కాపాడుకోడానికి చేతులు అడ్డం పెట్టగా అతడి వేళ్లు తెగిపోయాయి,”అని దస్య వాళ్ల అన్నయ్య చెప్పాడు.

దస్య తాతయ్య మీద జరిగిన దాడిలో రవి ఉన్నాడని, సందీప్‌కి “అతిగా మద్యం తాగే” అలవాటు ఉందని పోలీసు చీఫ్ వీర్ చెప్పాడు. దస్య తాతయ్య మీద చేసిన దాడి కేసులో రవి జైలుకి వెళ్లాడని వాళ్ల నాన్న చెప్పాడు.

అయితే, ఈ రెండు దశాబ్దాల కాలంలో దస్య, నిందితుల కుటుంబాల మధ్య ఎటువంటి ఘర్షణలు, కొట్లాటలు చోటు చేసుకోలేదు. సెప్టెంబర్ 14న జరిగిన దారుణ దాడిని ఆ కుటుంబం ఏమాత్రం ఊహించలేదు, దానికి ఏ కారణమూ లేదు.

ఘటన

2020 సెప్టెంబరు 14న ఎప్పటిలాగే పశువులకు గడ్డి కోసమని వాళ్ల అమ్మతో, అన్న సత్యేంద్ర కుమార్‌తో దస్య చేనుకి వెళ్లింది. ఆడవాళ్లని అక్కడే వదిలిపెట్టి ఒక మోపు గడ్డితో సత్యేంద్ర కుమార్ ఇంటికి తిరిగి వచ్చాడు. అక్కడికి 50 అడుగుల దూరంలోని నిందితుల కుటుంబానికి చెందిన సజ్జ చేలోకి లాక్కెళ్లారని దస్య ఆ తరవాత చెప్పింది. ఆమె కనపడడం లేదని గుర్తించిన తరవాత ఆమె తల్లి కంగారుగా అంతటా వెదికింది. వంటి మీద బట్టలు లేకుండా, గాయాలతో నెత్తురోడుతున్న కూతురుని చూసి ఆమె విభ్రాంతికి గురయ్యింది. తన చీరలో కొంత భాగంతో ఆమెను కప్పి, దగ్గరలోని ఒక పిల్లవాడితో సత్యేంద్రకి కబురు పంపించింది. అతడు వెంటనే అక్కడికి మోటరసైకిల్ మీద వచ్చాడు. దస్యని చాంద్‌పా పోలీసు స్టేషనుకి, తరవాత హాథ్రస్‌లోని బల్గా ఆసుపత్రికి తీసుకుని వెళ్లారు.

ఆధిపత్య కుల ఠాకుర్ కుటుంబానికి చెందిన నిందితులైన సందీప్, రవి, రామ్, లవ్‌కుష్‌లు దస్య కుటుంబానికి తెలుసు. వాళ్లు అదే బజారులో ఎదుటివైపు ఉంటారు. నిందితులకు తాగుడు అలవాటు ఉంది. ఆ నలుగురు దస్య మీద దాడికి, అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె గొంతు నొక్కటంతో వెన్ను పూస, నరాలు దెబ్బతిన్నాయి. దాంతో ఆమె శరీరాన్ని కదల్చలేక, పక్షవాతానికి గురైనట్టు అయ్యింది. ఆమె మాట్లాడలేక పోయింది, స్పృహ తప్పిపోయింది.

దస్యని బల్గా ఆసుపత్రికి తీసుకుని వచ్చినపుడు డాక్టర్లకు పోలీసులు ఏ విషయమూ చెప్పలేదని, పోలీసులు కూడా ఎటువంటి విచారణ చేపట్టలేదని దస్య కుటుంబ సభ్యులందరూ – తల్లి, తండ్రి, అన్న, వదిన, వదిన తమ్ముడు – చెప్పారు. తదుపరి విచారణ, చర్యలకు ఐపిసి సెక్షన్ 375 కింద ఇది ఎంతో అవసరమని తెలిసినప్పటికీ పోలీసులు అలా చెయ్యలేదు.

24 గంటలపాటు ఏమీ చెయ్యకుండా దస్యని ఆలిగఢ్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికి కూడా ఆమె స్పృహలో లేదు. కొరుకుడు పడిన నాలికతో ఆమె ఒక్క మాట కూడా మాట్లాడే స్థితిలో లేదు. ఆ కేసుని ఎక్కడినుంచి తరలించారో, ఎందుకు తరలించారో తెలియక విస్తుపోయామని ఆలిగర్ జెఎల్ఎన్ఎంసిహెచ్ ఆసుపత్రి డాక్టర్లు చెప్పారని దస్య బంధువులు చెప్పారు! డాక్టర్లు, ఇతర ఉద్యోగస్థులపై తీవ్ర ఒత్తిడి ఉందని దస్య కుటుంబానికి ముందు నుంచే తెలుస్తోంది! మౌలికంగా చెయ్యాల్సిన చికిత్స అయితే చేశారు. ఆ క్షణంలో దస్య ప్రాణాలు కాపాడుకోవాలన్న ఆందోళనలోనే కుటుంబ సభ్యులు ఉన్నారు.

ఒకటి, రెండు రోజులకు కొంత స్పృహలోకి వచ్చిన దస్య నలుగురి నిందితుల పేర్లు, జరిగిన దారుణ అత్యాచారం, దాడుల గురించి తల్లికి చెప్పింది. అది తెలిసిన తరవాత కుటుంబ పరువు గురించి ఆందోళన ఉన్నప్పటికీ వాళ్లు మౌనంగా ఉండలేకపోయారు. డాక్టర్లని, సిస్టర్లని, వార్డులో ఉన్న ఇతర రోగుల బంధువులని పిలిచి చెప్పడంతో విషయం బహిరంగమయ్యింది.

ఆ కేసుని మరో చోటుకి బదిలీ చేసి చేతులు దులిపేసుకోడానికి ఆలిగఢ్ ఆసుపత్రి ప్రయత్నిస్తోందని కుటుంబ సభ్యులకు అనిపిస్తున్న సమయంలో దస్య మరోసారి కొంత స్పృహలోకి వచ్చింది. ఎఐఐఎంఎస్‌కి తీసుకునివెళ్లాలని అక్కడి డాక్టర్లు సిఫారసు చేశారు. దానికి ఒప్పుకోవడం తప్ప కుటుంబ సభ్యులు చేయగలిగింది ఏమీ లేదు. వ్యవస్థీకృత శక్తులు ఏవీ వాళ్లకి సహకరించక పోవడంతో వాళ్లు ఏమీ చెయ్యలేకపోయారు.

కుటుంబానికి సహాయపడిన వాళ్లలో హథ్రాస్‌లోని స్థానిక అధికారులు, కలెక్టరు ఉన్నారు కానీ లక్నోలోని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎవరూ రాలేదు. ఆ నియోజకవర్గ పార్లమెంట్ సభ్యుడు దళితుడైనప్పటికీ బాధితురాలి తరఫున బలంగా నిలబడకుండా, స్పష్టతలేని ప్రకటన ఒకటి జారీ చేశాడు. భీం సేన నాయకుడు చంద్రశేఖర్ ఆజాద్ సెప్టెంబర్ 27 సాయంత్రం పోలీసులను తప్పించుకుని అలీగఢ్ ఆసుపత్రిలో దస్యని కలిశాడు.

వాల్మీకీ సమాజ్‌లో చురుకైన కార్యకర్త, దళిత హక్కుల ఉద్యమకారుడు అయిన ష్యోరాజ్ జీవన్ వాళ్లని కలిసి, ఓదార్చడమే కాకుండా మద్దతుగా కూడా నిలబడ్డాడు. ఇటువంటి సందర్భాలు, రాజకీయాల నేపథ్యంలో అనివార్యమైన సుదీర్ఘ న్యాయ పోరాటంలో సహాయం చేయడానికి ముందుకు వచ్చాడు. వాల్మీకి సముదాయంతో జాతీయ స్థాయిలో క్రియాశీలంగా ఉన్న అతడు ఈ ఘటన, దాని చరిత్ర విని రగిలిపోయాడు.

దస్యకి స్పృహ వచ్చేంతవరకు ఆమెను అక్కడి నుంచి కదిలించ కూడదని ఆలిగఢ్ డాక్టర్లు కొంతమంది అభిప్రాయపడ్డారు. ఆ పరిస్థితిలో ఆమెను అంత దూరం తీసుకుని వెళ్లడం మంచిది కాదనిపించి కుటుంబ సభ్యులు కూడా అందుకు ఒప్పుకోలేదు. దస్య తీవ్రబాధలో ఉంది, వెన్ను పూసకి అయిన తీవ్ర గాయం వల్ల ఆమె నడుము, మెడ కదిలించ లేని స్థితిలో ఉంది. దస్యని ఎఐఐఎంఎస్‌కి తరలించకుండా కుటుంబ సభ్యులు అడ్డుకున్నారన్న తప్పుడు ఆరోపణ బట్టబయలయ్యింది. ఈ ఆరోపణ ఎందుకు చేశారు? దస్యని పరీక్ష చేసిన డాక్టర్లు ఆమె చెప్పేంత వరకు

లైంగిక దాడి గురించి పరిశీలించకపోవడం, ఆమె కుటుంబ సభ్యులను అడగకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. కావాలనే ఈ విధంగా ఆలస్యం, కాలయాపన చేశారనిపిస్తుంది–ఆలస్యంగా చేసిన పరీక్షలు అత్యాచారాన్ని నిరూపించలేవు. అంటే రుజువులు లేకుండా చెయ్యటమే వాళ్ల ఉద్దేశం. మెడికో లీగల్ కేస్ నివేదికను కుటుంబానికి వెంటనే అంద చేయలేదు. అందులో యోనిలోకి అంగ ప్రవేశం జరిగిందని ఉంది. అదే విశ్వవిద్యాలయ ఫోరెన్సిక్ విభాగ నివేదికలో అలా జరగలేదని పేర్కొంది.

అయితే దస్య చెప్పినది చట్ట ప్రకారం మరణ వాంగ్మూలం కిందకే వస్తుంది. కాబట్టి నలుగురు నిందితులను పోలీసులు కస్టడీలోకి తీసుకోవాలి. అందుకోసం పోలీసులు ఎంతో వెదికారు. దగ్గరలోని ఊళ్లో నిందితులు తలదాచుకున్న విషయం ఎవరో పోలీసులకు చెప్పారు. గత 6 నెలలుగా దస్యని సందీప్, ఇతరులు వేధిస్తున్నారన్న విషయం ఆపాటికి బయటికి వచ్చింది. ఆమెను పొలం దగ్గర సందీప్ లాగాడు, అయితే ఆమె అతడి నుంచి తప్పించుకుంది. వాళ్లిద్దరి మధ్య ఏదో వ్యవహారం ఉందని, ఫోనులో మాట్లాడుకునేవారని, అందుకని ఆమె కుటుంబ సభ్యులే పరువు హత్యకు పాల్పడ్డారన్న ప్రచారాన్ని దస్య కుటుంబం నిర్ద్వందంగా ఖండించింది. మద్దతుదారులు, మీడియా వేసే ప్రశ్నలు మళ్లీ, మళ్లీ అడగటం దస్య తల్లినీ, వదిననీ ఎంతో బాధించింది.

దళిత అమ్మాయిలను ఎవరైనా చెడు దృష్టితో చూస్తే వాళ్ల గుడ్లు పీకేస్తానని బాధ, కోపంతో మీడియా ముందు ష్యోరాజ్ జీవన్ అన్నాడు. మతతత్వ, కులతత్వ ధోరణులతో ఇటువంటి హింసాపూరిత హెచ్చరికలు రాజకీయ నాయకులు చేస్తూనే ఉంటారు, కానీ వాళ్లనెవ్వరినీ తాకరు! కానీ, ష్యోరాజ్ జీవన్‌ని ఆ మాటలకు అరెస్టు చేశారు, అతడు ఇంకా జైలులోనే ఉన్నాడు. హింసా పూరితమైన అతడి ప్రకటనని దస్య కుటుంబ సభ్యులు ఎవరూ సమర్థించలేదు. తమకు మద్దతుగా నిలబడి, తమ వాల్మీకీ కులానికి చెందిన ఏకైక వ్యక్తిని అరెస్టు చేయడం వెనక కుట్ర ఉందని మాత్రం వాళ్లు భావిస్తున్నారు.

అదే సమయంలో ఇతర మద్దతుదారులను కూడా వివాదాలలోకి లాగారు. దస్య కుటుంబాన్ని ఓదార్చి, న్యాయం కోసం నిలబడి పోరాడటంలో సహాయ పడటానికి అంబేద్కర్‌వాది అయిన డా. జ్యోతి బన్సల్ వచ్చారు. ఆమె అనేక సామాజిక అంశాలలో క్రియాశీలంగా ఉన్నారు. ఆమె అంత దూరం వెళ్లడం జబల్‌పూర్‌లోని ప్రగతిశీలురకు ఆశ్చర్యం కలిగించలేదు. “మామయ్యతో ఆమె మాట్లాడినప్పుడు అతడు ఎంతో స్వాంతన పొందాడు. ఆమెతో మాట్లాడటం ద్వారా అతడు కొంతవరకు డిప్రెషన్ నుంచి బయటపడగలిగాడు. అందుకే ఆమెను మా వద్ద ఉండమని అడిగాం. అందుకు ఆమె ఒప్పుకుంది. మా బలవంతం మీద ఆమె రెండు రాత్రులు మాతో ఉంది. 24×7 గంటలపాటు పెద్ద పోలీసు బలగం బయట ఉండి, ఎంతో మంది సందర్శకులు వచ్చి ప్రశ్నలు అడుగుతున్నప్పటికీ ఆమె వాతావరణాన్ని మార్చ గలిగింది. వాస్తవాలు ఇలా ఉండగా ఆమెను నక్సల్ అని నిందిస్తున్నారు” బాధ, విచారాలతో విద్యావంతురాలయిన దస్య వదిన చెప్పింది.

బాధిత కుటుంబాన్ని కలవడానికి వెళుతున్న రాహుల్, ప్రియాంక గాంధీలను ఆపడం, తోసెయ్యడం మరొక అన్యాయమైన చర్య. ‘ప్రజాస్వామిక’ భారత దేశంలో వ్యతిరేకతను అణచివేసే, నిరసనను నేరంగా పరిగణించే పరంపరలోని మరొక చర్య ఇది. ఆ తరవాత కేరళ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ నుంచి వచ్చిన ముగ్గురు నాయకులను అరెస్టు చెయ్యడం ఖండించాల్సిన చర్య. మా సందర్శన సమయంలో పోలీసులు అంత దూకుడుగా వ్యవహరించకపోవటానికి దస్య కుటుంబాన్ని “చట్ట విరుద్ధంగా నిర్బంధించటం” గురించి ఉత్తరప్రదేశ్ ప్రధాన న్యాయస్థానంలోనూ, బయటా లేవదీసిన ప్రశ్నలు కారణం అయ్యుండొచ్చు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి సేవలో ఉన్న పోలీసు నుంచి కలెక్టరు వరకు అందరికీ ఎప్పటికప్పుడు ఆదేశాలు అందుతున్నాయని వాళ్లతో వ్యవహరించినప్పుడు, ఇతర మార్గాల ద్వారా అర్థమవుతోంది!

ఎఐఐఎంఎస్‌కి కాకుండా సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తీసుకుని వెళ్లటంతో మరొక ముఖ్యమైన దశ మొదలయ్యింది. ‘అదేమిటని మేం అడిగితే ఏఐఐఎంఎస్, సఫ్దర్‌జంగ్ రెండూ ఒకటేనని చెప్పారు. ఢిల్లీ గురించి, వైద్య సేవల గురించి అంతగా తెలియని మేం వాళ్లతో వాదించలేక పోయాం.’

దస్యకి లోపల చికిత్స జరుగుతోంది. ఆమె ఐసియులో ఉందని చెప్పారు తప్పించి ఆమెకు ఎలా ఉందో చెప్పేవాళ్లు, ఓదార్చేవాళ్లు ఎవ్వరూ లేరు. వాళ్లని ప్రశ్నలు అడిగి వేధిస్తున్నారు తప్పించి వాళ్ల ప్రశ్నలకు ఎటువంటి సమాధానాలు లేవు. ఆ సమయంలో పోలీసుల విచారణ గురించి వాళ్లకి ఏమీ తెలియదు.

హాథ్రస్ జిల్లా మేజిస్ట్రేట్ దస్య తండ్రిని పిలిపించి, ఘటన గురించి విచారించిన సంగతి మాకు వాళ్లు చెప్పారు. అతడి సమాధానాలు పట్టించుకోకుండా చికిత్స తోటీ, విచారణతోటీ కుటుంబం సంతృప్తిగా ఉందని అందరికీ తెలియచెయ్యాలని అతడికి చెప్పారు. నిజాన్ని అణగదొక్కి, కేసుని శాశ్వతంగా మూసెయ్యటానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఇది వెల్లడిచేస్తోంది. ఎంతో సాహసంతో పౌర సమాజం, కొన్ని మీడియా బృందాలు నిజాన్ని వెలికితీసి, ఈ దారుణ అంశాలను లేవనెత్తి, పక్కదోవ పట్టించే ప్రభుత్వ ప్రకటనలు, చర్యలను ప్రశ్నించడంతో పరిస్థితి కొంత మారింది.

సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో దస్య చనిపోయినప్పుడు బయట ఉన్న ఆమె కుటుంబ సభ్యులకు పోలీసులు కేవలం ఆ విషయం చెప్పి వాళ్లను తీవ్ర బాధ, దుఃఖాలకు లోనుచేశారు. శవ పరీక్షకి వాళ్ల అనుమతి తీసుకోవడం తప్పించి వాళ్లతో ఇంకేమీ పంచుకోలేదు. శవం భద్రంగా ఉందని తెలియచెయ్యటానికి వాళ్లని మార్చురీకి తీసుకుని వెళ్లి చూపించారు. ప్రభుత్వ అధీనంలోని శవాన్ని ఎక్కడ ఉంచినా భద్రత ఉండదన్నది ఎవరూ గ్రహించలేదు. వాళ్ల అభిప్రాయం, అనుమతి లేకుండా పోలీసులు శవాన్ని ఖననానికి తీసుకుని వెళ్లిపోయారని కొన్ని గంటల తరవాత తెలిసి వాళ్లు ఆశ్చర్యపోయారు.

ఆ తరవాత కుటుంబ సభ్యులను పోలీసులు ఒక వ్యాన్‌లో హాథ్రస్‌కి పంపించారు. అయితే, వాళ్లని శ్మశానానికి కొంత దూరంలోనే ఆపేశారు. బంధువులు ఎవరూ రాలేదని, ఇది మామూలు చావు కాదని, శవాన్ని తమకు అప్పగించమని ఆడవాళ్లు ఎంతగా ఏడ్చి, వాహనాలను కొట్టినా ఫలితం లేకపోయింది. ఆ ప్రాంతంలోకి ఎవరూ ప్రవేశించకుండా కట్టుదిట్టం చేసి, అంత్యక్రియలు చెయ్యనివ్వమన్న మానవీయమైన కోర్కెను కూడా తిరస్కరించారు.

చాలా ప్రదేశాలలో నిరసనలు, వ్యతిరేకతలు వ్యక్తం కావటంతో బాధితురాలి కుటుంబానికి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం 25 లక్షల రూపాయల నష్ట పరిహారాన్ని ప్రకటించింది. ఎస్‌సి, ఎస్‌టి (అత్యాచారాల నిరోధక)

ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్‌పై దాడి

భారత ప్రభుత్వం ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడం వెనక ప్రజాస్వామిక మౌలిక సూత్రమైన అసమ్మతిని, భిన్నాభిప్రాయాన్ని స్తంభింపజేసే కుట్ర ఉందని అంటున్నారు **సతీష్ బైరెడ్డి**

ఐదున్నర దశాబ్దాలుగా భారతదేశంలో హక్కుల రంగంలో ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ చేస్తున్న కృషిని విరమించింది. తన లక్ష్యాన్ని చేరుకున్నందుకో, తన పనిలో అలసి పోయినందుకో, హక్కులకు వచ్చిన ఆపద తొలగిపోయినందుకో కాదు! రాజ్యం సమాధానాలు చెప్పలేని ప్రశ్నలను సంధిస్తున్నందుకు పాలిస్తున్న వాళ్లకు అసహనాన్ని కలిగించేలా వాస్తవాలను బయట పెడుతున్నందుకు విదేశీ విరాళాల చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారని, మనీ ల్యాండరింగ్‌కు పాల్పడుతున్నారని ఆరోపణలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అమ్నెస్టీ ఇంటర్నేషనల్ బ్యాంకు ఖాతాలను స్థంభింపచేసింది. 51.72 కోట్ల రూపాయల లావా దేవీలకు సంబంధించిన సరైన వివరాలు లేనందుకే తామీ చర్యకు పాల్పడుతున్నట్లు వెల్లడించింది. దేశ హోం శాఖ మాత్రం మానవ హక్కుల సాకుతో దేశ చట్టాలను ఉల్లంఘించినా, అంతర్గత రాజకీయ వ్యవహారాలల్లో తలదూర్చినా సహించబోమని హెచ్చరించింది.

మానవ హక్కుల విషయంలో పాశ్చాత్య దేశాల కంటే భిన్నమైన 'దేశీయ' దృక్పథం తమకున్నట్లు కూడా హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించాడు. నిజమే ఎంత ఉదాత్త లక్ష్యమైనా దేశ చట్టాలను ఉల్లంఘించి వ్యవహరించకూడదనే అంశంతో పేచీ ఏమీలేదు! కానీ చట్టం పరిరక్షణ పేరుతో వారు రక్షించాలనుకుంటున్న, బయటి ప్రపంచానికి తెలియకూడదనుకుంటున్న అసలు లక్ష్యాలు వేరుగా ఉండడమే ఈ అణచివేతకు కారణం. నిజానికి గత కొంత కాలంగా దేశంలో భిన్న వర్గాల హక్కుల కోసం ఉద్యమిస్తున్న, ప్రజాస్వామికంగా ప్రశ్నిస్తున్న అనేక సంస్థలను, వ్యక్తులను లక్ష్యంగా చేసుకొని దేశ ద్రోహం చట్టాన్ని, ఉపా చట్టాన్ని (యుఎపిఎ) విచ్చలవిడిగా ప్రయోగిస్తూ ఎటువంటి విచారణ లేకుండా సంవత్సరాల తరబడి జైళ్లలో బంధిస్తున్నది. రేప్‌లకు, క్రూరమైన హత్యలకు గురైన వారిని పరామర్శించడం కూడా ఈ దేశంలో పెద్ద నేరమైపోయింది.

భిన్నమైన అభిప్రాయాన్ని, అసమ్మతిని తెలియజేసే ప్రజాస్వామిక హక్కును సహించలేని పాలక పక్షం ప్రశ్నించిన ప్రతి గొంతుపై అణచివేతనే ఆయుధంగా ప్రయోగిస్తున్నది. రాజ్యాంగం మౌలిక సూత్రాలకు కట్టుబడి, చట్టబద్ద పాలనను కొనసాగిస్తే ఎవరికీ ఏ అభ్యంతరం ఉండాల్సిన అవసరం లేదు. ప్రశ్నలో అసమంజసత్వం ఉండవచ్చు, ఆమోదనీయత లేకపోవచ్చు అంతమాత్రాన అసలు ప్రశ్నించడమే నేరమనే పద్ధతే ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. తన విధానాలను, చర్యలను ఎవరూ ప్రశ్నించని ఒక వాతావరణాన్ని ఏర్పర్చేందుకు బిజెపి బలంగా

చట్టం కింద కేసు నమోదు చేసిన తరవాతే ఈ నష్ట పరిహారం చెల్లించాల్సి ఉన్నప్పటికీ దస్య తండ్రికి 8–10 లక్షల రూపాయలు అందాయని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులతో నిజ నిర్ధారణ బృందం మాట్లాడినప్పుడు వాళ్లకు డబ్బు అవసరం లేదని, బ్యాంకు ఖాతాలు చూసుకోలేదని చెప్పారు. "న్యాయం దొరకనప్పుడు డబ్బులు వల్ల ప్రయోజనం లేదు" అని కుటుంబ సభ్యులు చెప్పారు.

కుటుంబ సభ్యులు లేకుండా అంతిమ సంస్కారాలు చేయటం హిందూ ఆచారాలకు వ్యతిరేకమని ఉమాభారతి వంటి భారతీయ జనతా పార్టీ నాయకులు కూడా ప్రభుత్వ – అధికారుల ఈ చర్యను విమర్శించారు. మొదట నలుగురు నిందితులు దస్య పై అత్యాచారం చేశారని, ఆ తరవాత వ్యవస్థ మొత్తం ఆమెను అత్యాచారం చేసిందని అరవింద్ కేజ్రీవాల్ వ్యాఖ్యానించాడు. ఈ ఘటన 'సిగ్గుపడవలసిన దారుణ'మని పేర్కొంటూ బిఎస్‌పి నాయకురాలు మాయావతి దీనిపై ఆదిత్యనాద్ ప్రభుత్వం దృష్టి పెట్టాలని పేర్కొంది.

ఉత్తరప్రదేశ్ పోలుసుల చర్యలు నిగూఢంగా, దుర్మార్గంగా, ఎవరూ ఊహించని విధంగా ఉండటంతో అవి ఎన్నో అనుమానాలకు దారితీశాయి, వాళ్లకి దురుద్దేశం ఉండి ఉంటుందని అనుకోసాగారు. అన్నివైపుల నుంచి ఖండనలు ఎదురుకావడంతో, ఎటువంటి హింస చోటుచేసుకోకుండా ఉండటానికి వెంటనే అంతిమ సంస్కారాలు చేసేశామని ప్రభుత్వం తన చర్యలను సమర్థించుకోవలసి వచ్చింది. అవాంఛి ఘటనల నుంచి బాధితులను కాపాడలేమని పోలీసులు చెప్పుకోలేరు కాబట్టి ఎవరూ దీనిని నమ్మలేదు. ఎటువంటి పశ్చాత్తాపం లేకుండా, నిలదీసే ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా కులతత్వ, మనువాద, అమానవీయ, మహిళా వ్యతిరేక దృక్పథంతో ఉన్నావ్, బలరాంపూర్, అజాంగఢ్‌లలో మాదిరిగా అమానవీయ, నేరపూరిత చర్యకు ప్రభుత్వం పాల్పడింది.

చట్టబద్ధ, రాజ్యాంగ, మానవ హక్కులను కాలరాస్తూ, ఆధిపత్య కులాల అణచివేతను కాపాడుతూ, ప్రోత్సహిస్తున్న ఉత్తర ప్రదేశ్‌లోని క్షుద్ర, హింసాపూరిత రాజకీయాలను ఇది బట్టబయలు చేసింది. ఈ కేసులో కోర్టు ముందు ఉన్న వివిధ పిటిషన్లను చేపట్టాలి.

నిజ నిర్ధారణ బృంద సభ్యులు : మేధా పాట్కర్ (ప్రజా ఉద్యమాల జాతీయ సంఘటన – ఎన్‌ఎపిఎం), మణిమాల (సామాజిక కార్యకర్త, రచయిత), సందీప్ పాండే (సోషలిస్ట్ పార్టీ (ఇండియా)), ఎహ్తెషామ్ హష్మి (అడ్వకేట్, భారత సర్వోన్నత న్యాయస్థానం), ఫైసల్ ఖాన్ (ఖుదాయి ఖిద్మత్‌గర్ – ఎన్‌ఎపిఎం), జో అథియాలి (ఢిల్లీ సాలిడారిటీ గ్రూప్), అమిత్ కుమార్ (ఢిల్లీ సాలిడారిటీ గ్రూప్), హన్స్‌రాజ్ (నర్మదా బచావో ఆందోళన్), ఆనంద్ అథియాలి (విద్యార్థి – ఎన్‌ఎపిఎం).

(అనువాదం – కె. సురేష్) వీ

ప్రయత్నిస్తున్నది. అందులో భాగంగానే స్పష్టమైన సైద్ధాంతిక దృక్పథంతో పనిచేసే సంస్థల పైన, ఒక ప్రత్యేక రంగంలో పనిచేసే అనేక ఎన్‌జిఒల పట్లనైనా అన్ని ప్రభుత్వాలు అటు ఇటుగా అదే వైఖరిని కొనసాగిస్తున్నాయి. మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం కూడంకుళం అణు విద్యుత్ ప్రాజెక్టును వ్యతిరేకించిన గ్రీన్ పీస్ అనే ప్రభుత్వేతర సంస్థను లక్ష్యంగా చేసుకొని దేశ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నదని ప్రచారం చేసింది. అనేక దేశాల్లో పనిచేసే అనేక సంస్థలు భారతదేశంలో కూడా ఉన్నాయి. వాటిని నియంత్రించే, క్రమపరిచే, వాటి ఆర్థిక వ్యవహారాల లావాదేవీలపై నిఘా వేసే అనేక చట్టాలూ, స్వతంత్ర వ్యవస్థలూ ఉన్నాయి. ప్రభుత్వాల కనుసన్నల్లో, ఆయా పార్టీల విధానాలను బలపరిచే కార్యక్రమాలు చేపట్టినంతకాలం ఏ యంత్రాంగం పట్టించుకోకపోగా అవి మరింత విస్తరించడానికి వెన్ను దన్నుగా నిలబడతాయి. నిజానికి ఇవాళ దేశంలో 31 లక్షలకు పైగా 'స్వచ్ఛంద' సేవా సంస్థలు పనిచేస్తున్నాయి. వీటిలో అనేకం అంతర్జాతీయంగా కూడా ఉన్నాయి. దేశీయ సంస్థల పైన అందునా తమకనుసన్నల్లో నడిచే వాటి పైన పెద్దగా దృష్టి నిలపడం ఉండదు. కంపాషన్ ఇంటర్నేషనల్ సంస్థతో పాటు అనేక మిషనరీ, చారిటీ సంస్థలను మత ప్రచారాన్ని నిర్వహిస్తున్నాయనో, మత మార్పిడిలు చేస్తున్నారనో వాటిపైన భౌతిక దాడులకు పాల్పడడమే కాకుండా వారి ఆర్థిక మూలాలను మొత్తంగా కొల్లగొట్టే తీవ్రమైన చర్యలు తీసుకుంటున్నది నేటి బిజెపి ప్రభుత్వం. సంఘ్‌పరివార్‌కు అనుబంధంగానే దేశవ్యాప్తంగా వందలాది సంస్థలు 'సేవ' చేస్తున్నాయి.

అయితే అమ్నెస్టీ ఇంటర్నేషనల్‌ను ఎందుకు లక్ష్యంగా చేసుకున్నది? చారిత్రక కారణాలతో పాటు అనేక తక్షణ కారణాలు కూడా ఉన్నాయి. 1961లో రాజకీయ ఖైదీల విడుదల కోసం, వారి విశ్వాసాల పరిరక్షణ కోసం మొదలైన అమ్నెస్టీ ఇంటర్నేషనల్ కాల క్రమంలో తన కార్యక్రమాలను అనేక రంగాలకు విస్తరించింది. వందకు పైగా దేశాలలో మరణ శిక్ష రద్దుపరచడం వెనుకాల ఈ సంస్థ కృషి చెప్పుకోదగినది. మానవ హక్కుల ప్రచారంలో భాగం మాత్రమే కాకుండా అనేక రకాల హింసాయుత పద్ధతుల్ని, రాజ్య యంత్రాంగం అనుసరించే క్రూరమైన విధానాలపై ప్రభుత్వాలను ప్రశ్నించడం, ప్రచారం చేయడం, మైనారిటీ హక్కులు, నల్లజాతి ఆత్మగౌరవ పోరాటాలు, స్త్రీల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం పోరాటం కాకపోయినా అలుపెరగని ప్రచారాన్ని చేపట్టింది. అనేక దేశాలలో అక్కడి రాజ్య యంత్రాంగాలు, నియంతృత్వ పాలకులు చేస్తున్న హక్కుల హననం గురించి అంతర్జాతీయ వేదికల పైన ఎలుగెత్తి చాటింది. కరువు కాటకాలు, ప్రకృతి బీభత్సాలు, యుద్ధ సమయాల్లో బాధితుల వైపు బాధ్యతగా నిలబడింది. 150 దేశాల్లో తన కార్య రంగాన్ని కొనసాగిస్తున్న ఈ సంస్థకు ప్రపంచ వ్యాప్తంగా డెబ్భై లక్షల మంది సభ్యులున్నారు. ఈ సంస్థ పాశ్చాత్య హక్కుల ధోరణిని ప్రదర్శిస్తున్నదని, పరోక్షంగా అక్కడి ప్రభుత్వాల కోసం ఆయా దేశాల అంతర్గత వ్యవహారాల్లో హక్కుల పేరుతో తలదూరుస్తున్నదని అనేక విమర్శలనూ ఎదుర్కొన్నది. కువైట్ పైన అమెరికా దాడి చేయడానికి ఈ సంస్థ ఇచ్చిన నివేదికే కారణమనే ఆరోపణ కూడా ఉన్నది. అనేక విమర్శలు, భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ హక్కుల రంగంలో చేసిన కృషికి గాను 1977లో నోబెల్ శాంతి బహుమతిని కూడా అందుకున్నది. ఇంతటి చారిత్రక పాత్రను పోషించిన సంస్థపై నేటి భారత పాలకులు కన్నెర్ర చేయడానికి కారణమేమిటి?

దేశంలో అనేక ప్రాంతాల్లో, అనేక రూపాల్లో కొనసాగుతున్న హక్కుల ఉల్లంఘనలను ఈ సంస్థ ఎత్తి చూపుతూ ఉన్నది. 2019 ఆగస్టులో జమ్మూ – కశ్మీర్ రాష్ట్రానికి ఉన్న 370 రాజ్యాంగ ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేయడం, రాష్ట్ర హోదాని తొలగించి కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చివేసి నిరవధిక లాక్‌డౌన్ ప్రకటించిన నేపథ్యంలో విచ్చలవిడిగా జరిగిన హక్కుల హననాన్ని ప్రపంచం దృష్టికి తీసుకురావడమే కాకుండా 2019 అక్టోబర్ 22న అమెరికా కాంగ్రెస్ సభ్యుల ముందు ఆ రాష్ట్ర పరిస్థితిని వివరించడం పాలకుల కన్నెర్రకు కారణమయ్యింది. ఆ మరు క్షణమే సిబిఐ చేత అనేక దాడులను కూడా చేయించింది. చాలా కాలం ముందు నుండే సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం మాటున జమ్మూ – కశ్మీర్‌లో జరిగిన, జరుగుతున్న అనేక క్రూరమైన, అమానవీయమైన ఆర్మీ చర్యలను ఎండగట్టింది. వివిధ ప్రాజెక్టుల పేరుతో జరిగిన ఆదివాసీల విస్థాపన పైన, బొగ్గుగని కార్మికులపై అమలువుతున్న దోపిడీ అణచివేతపై ఎలుగెత్తింది. పెద్దగా నిర్మాణంలో ఉండే సంస్థ కూడా కాదు అమ్నెస్టీ ఇంటర్నేషనల్. ఇండియాలో దీనికోసం పనిచేసిన వాళ్లు మొత్తం కలిపితే 150 మంది మాత్రమే. నివేదికలు తయారు చేయడం, ప్రశ్నించడం, ప్రచారం నిర్వహించడానికి మించి ఉద్యమ కార్యాచరణ అంటూ ఈ సంస్థకు ఏమీలేదు. నిజానికి ఈ సంస్థకు అందే మొత్తం నిధుల్లో 70 శాతం పైగా దేశీయంగా సమకూర్చుకున్నదే. 40 లక్షల మంది అనేక రూపాల్లో సహాయాన్ని అందిస్తే లక్ష మందికి పైగా ప్రత్యక్షంగా తమ ఆర్థిక సహాయాన్ని అందించారు. సంస్థ ఆర్థిక నేరాలకు పాల్పడిందనే ఆరోపణ ఒక సాకు మాత్రమే.

అసలు తక్షణమైన కారణం ఢిల్లీలో పౌరసత్వ చట్ట సవరణలను వ్యతిరేకిస్తూ జరిగిన ఉద్యమ నేపథ్యంలో తలెత్తిన ఘర్షణలు. మత ఘర్షణలుగా మారిపోయిన ఆ ఘటనల్లో 53 మందికి పైగా ప్రాణాలు పోగొట్టుకున్నారు. వారిలో మెజారిటీ ముస్లిం మైనారిటీలే. ఈ మారణకాండలో బిజెపి, సంఘ్‌పరివార్ సంస్థల ప్రత్యక్ష ప్రమేయం ఉన్నదనే అంశాన్నే కాకుండా ఢిల్లీ పోలీసుల పాత్ర కూడా చాలా కీలకంగా ఉన్నదనే విషయాన్ని అమ్నెస్టీ ఇంటర్నేషనల్ బట్టబయలు చేయడంతో ఇంకేమాత్రం సహించకూడదనే నిర్ణయానికి పాలకులొచ్చి ఖాతా జప్తు పేరుతో మొత్తంగా సంస్థ కార్యకలాపాలను మూసివేసేలా నిర్బంధ కాండను ప్రయోగించారు. ఈ సంస్థపై ఇలాంటి అణచివేతను భారత ప్రభుత్వం మాత్రమే కాదు 2016లో రష్యా, సిరియా, ఉక్రెయిన్ దేశాలు కూడా ప్రయోగించాయి. చైనా, పాకిస్తాన్‌లలో సంస్థ కార్యకలాపాలకు, కార్యాలయాలకు ఏమాత్రం అనుమతి లేదు. చట్టబద్ధంగా సంస్థకు అవసరమైన నిధుల సేకరణను హవాలా వ్యవహారంగా ముద్ర వేశారు.

అసలు హక్కుల సంఘాలను నడపడం, ప్రశ్నించడం, హక్కులకై ఉద్యమించడం ఈ దేశంలో నేరపూరితమైన వ్యవహారమైనట్లుగా పరివార్ ప్రభుత్వం పరిగణిస్తున్నట్లు అర్థమవుతున్నది. ప్రభుత్వం చేసిన పని ఖాతాల వ్యవహారంలా పైకి కనిపిస్తున్నదే కాని అది అసమ్మతిని, భిన్నాభిప్రాయాన్ని స్థంభింపజేసే దుర్మార్గపు కుట్ర. ప్రజాస్వామిక మౌలిక సూత్రాన్ని తుంచివేసే ఫాసిస్టు చర్య. బహుశా మానవ హక్కులు, పౌర హక్కులు అనకుండా ఏ గోరక్షణ పేరుతో సంస్థను పెట్టినా, ఆ ముసుగులో దాడులు చేసినా, మనషుల్ని చంపేసినా కేసులు పెట్టడం కాదు కదా స్వదేశీ, విదేశీ విరాళాల ప్రవాహాన్ని వారి ఖాతాలోకి దర్జాగా రానిస్తుంది. ఈ చర్య ద్వారా అదే చెప్పదలచుకున్నది.

(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు) వీ

వ్యవసాయ చట్టాలపై రైతుల ఆగ్రహం

***స్వేచ్ఛా మార్కెట్ పేరుతో తెచ్చిన వ్యవసాయ చట్టాలు అంబానీ, అదానీల ప్రయోజనం కోసమేనని, ఇందులో రైతైనా కార్మికుడైనా దోపిడీకి గురికావాల్సిందేనని అంటున్నారు* ఎ. నర్సింహారెడ్డి**

కరోనా సంక్షోభ సమయాన మోడీ ప్రభుత్వం సంక్షోభంలో ఉన్న వ్యవసాయరంగంపై తీసుకొచ్చిన నూతన చట్టాలు చిన్న, సన్నకారు రైతులకు శరాఘాతంగానూ, వినియోగదారులకు ధరాఘతంగానూ, ఆహార భద్రతకు విఘాతంగానూ ఉన్నాయనడంలో సందేహం లేదు. పార్లమెంటులో ఈ బిల్లులను ఆమోదించిన తీరు ప్రజాస్వామ్యాన్ని ప్రహసనంగా మార్చింది. దేశంపై బలవంతంగా రుద్దిన వ్యవసాయ సంస్కరణలు ఏకకాలంలో రైతులను కార్పొరేట్ల దయాదాక్షిణ్యానికి వదిలేస్తూ మరోవైపు రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడింది. రాజ్యాంగానికి, దాని మౌలిక సూత్రాలకు విఘాతం కలిగేవిధంగా శాసనాలను రూపొందించింది. ఫెడరల్ రాజ్యాంగాన్ని యూనిటరీ రాజ్యాంగంగా మార్చేస్తుంది. రాష్ట్రాల హక్కులను తుంగలో తొక్కి దొడ్డిదారిలో చట్టాలను చేసి అధికార దుర్వినియోగానికి పాల్పడింది. ప్రజల కదలికలను కరోనా కట్టడి చేస్తూ ఉండగా, మోడీ ప్రభుత్వం తన ప్రజావ్యతిరేక దుష్ట స్వభావాన్ని నిస్సిగ్గుగా బయట పెట్టుకుంటుంది.

నిజానికి మన వ్యవసాయ రంగంపై బహుళజాతి సంస్థల పెత్తనం 1960 దశకంలో ప్రవేశపెట్టిన సస్యవిప్లవంతో మొదలైంది. 1991 ప్రపంచీకరణ విధానాలతో రైతు మరింత పరాధీనుడయ్యాడు. ప్రపంచ వాణిజ్య సంస్థతో 1995లో వ్యవసాయ ఒప్పందాలు కుదుర్చుకోవడంతో వ్యవసాయం లాభసాటి గాకుండా పోయింది. తాజాగా తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలతో రైతును పెనం మీద నుండి పొయిలో పడేసినట్లయింది. వీటితో రైతును కూలీగా, బహుళ జాతి సంస్థలకు బానిసలుగా మార్చే ప్రమాదం ఉంది. ఇక ఇప్పుడు కనీస మద్దతు ధర, రెగ్యులేటెడ్ మార్కెట్, ధాన్యసేకరణ వంటి రక్షణలు రద్దవుతాయి. అందువల్ల ఈ చట్టాలు రైతుకు మరణ శాసనాలు.

వ్యవసాయం, మార్కెటింగ్ నిత్యావసర సరుకుల చట్ట సవరణకు సంబంధించి జూన్ 5న మూడు ఆర్డినెన్స్‌లు కేంద్ర ప్రభుత్వం జారీ చేసినప్పటి నుండి రైతు సంఘాలు వాటిని ఉపసంహరించుకోవాలని కోరుతూ తీవ్ర నిరసనలు తెలియజేస్తూనే ఉన్నాయి. వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు జరగడానికి ముందు పంజాబ్, హర్యానా, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో పెద్ద ఎత్తున రైతుల ఆందోళనలు సాగాయి. ఐనా మూడు ఆర్డినెన్స్‌ల స్థానే మూడు బిల్లులు పార్లమెంట్‌లో చర్చ లేకుండానే ఆమోదం పొందాయి. సెలక్ట్ కమిటీకి బిల్లులను పంపాలని సభ్యులు కోరినా స్పీకర్ తిరస్కరించాడు. ఈ చట్టాలు వ్యవసాయాన్ని కార్పొరేటీకరించడం, ప్రపంచ మార్కెట్‌తో మన వ్యవసాయ రంగాన్ని మిళితం చేయడానికి వీలు కల్పించడం, ధాన్య సేకరణ, రైతుల మార్కెట్, మద్దతు ధర యంత్రాంగానికి విఘాతం కల్గించడం వంటి చర్యలను ప్రోత్సహించడానికి ఉద్దేశించిన ఈ మూడు చట్టాలు చిన్న, సన్నకారు రైతులను కూలీలుగా మారుస్తాయి. అలాగే దేశానికి ఆహార భద్రత లేకుండా పోవడానికి దారి తీస్తుంది. నూతన వ్యవసాయ చట్టాలు రైతాంగాన్ని, వ్యవసాయాన్ని 1947 ముందున్న వలసకాలం నాటి స్థితికి తీసుకు పోతున్నాయి.

రాజ్యాంగ ఫెడరల్ స్వభావానికి తూట్లు

మన పాలనా వ్యవస్థను సమాఖ్య వ్యవస్థగా రాజ్యాంగం చెబుతోంది. కేంద్రానికి, రాష్ట్రాలకు వాటి వాటి పరిధుల్లోపల ప్రత్యేక అధికారాలను నిర్దేశించింది. రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్‌లో కేంద్రం, రాష్ట్రాల అధికారాలను పొందుపర్చారు. మొదటి జాబితాలో కేంద్ర అధికారాలు, రెండవ జాబితాలో రాష్ట్రాల అధికారాలు, మూడవ జాబితాలో కేంద్ర, రాష్ట్రాల ఉమ్మడి అధికారాలు స్పష్టంగా ఉన్నాయి. రాష్ట్రాల అధికారాలకు చెందిన రెండవ జాబితాలో 14వ అంశంగా 'వ్యవసాయం' ఉంది. ఇదే జాబితాలో 26వ అంశంగా రాష్ట్రంలో వర్తక, వాణిజ్యం, 27వ అంశంలో వస్తువుల ఉత్పత్తి, సరఫరా, పంపిణీ, 28వ అంశంలో మార్కెట్లు, ధరలను పేర్కొన్నారు. కేంద్రం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలు రాష్ట్రాల హక్కులను హరిస్తున్నాయి. సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం కావిస్తున్నాయి. రాష్ట్రాలతో కనీసం సంప్రదించకుండా ఏకపక్షంగా చట్టాలు చేసింది. ఇప్పటికే రాజ్యాంగ విరుద్ధంగా, రాష్ట్రాల హక్కులను హరించి కేంద్రం చేసిన చట్టాలపై ఎన్‌డిఎ యేతర రాష్ట్రాలు న్యాయ పోరాటానికి సిద్ధమయ్యాయి.

వ్యవసాయ సంబంధ అధికారాలన్నీ రాష్ట్రాల పరిధిలో ఉండగా, వాటిని మోడీ ప్రభుత్వం హైజాక్ చేసి, తనకు లేని అధికారాలను చేతుల్లోకి తీసుకొని పార్లమెంట్‌లో చట్టాలు చేయడం రాజ్యాంగ హననం, రాష్ట్రాల హక్కులపై దాడి. వినాశకర వ్యవసాయ చట్టాలను సమర్థించుకునేందుకు కేంద్రం వల్లిస్తున్న భాష్యాలు ఎంతమాత్రం పొసిగేవి కావు. కేంద్ర, రాష్ట్రాల అధికారాలు గల ఉమ్మడి జాబితాలోని 33వ అంశం ప్రాతిపదికన సదరు చట్టాలు చేయడానికి కేంద్రానికి అధికారాలు సంక్రమిస్తాయని వాదించడం దారుణం. ఉమ్మడి జాబితాలోని 33వ అంశం ట్రేడ్, కామర్స్‌కు ఉద్దేశించినది. దానిలో గోధుమలు, వరి, పప్పులు, చిరుధాన్యాలు, కూరగాయలు, పండ్లు, పౌల్ట్రీ, డెయిరీ అనే పదాలే లేవు. కేంద్రం నియంత్రణలోని పరిశ్రమలు ఉత్పత్తి చేసే వస్తువులకు సంబంధించి ప్రజా ప్రయోజనార్థం పార్లమెంట్‌లో చట్టాలు చేయొచ్చని, దిగుమతి చేసుకునే నూనెలు, నూనె పదార్థాలు, పశువుల దాణా, పత్తి విత్తనాలు, ముడి పత్తి, ముడి జూట్‌ల మార్కెటింగ్‌పై కేంద్రం జోక్యం చేసుకొని యాక్టులు చేయొచ్చని ఉమ్మడి జాబితాలోని 33వ అంశం చెబుతోంది. కాగా రైతు ఉత్పత్తులు అనే పదాలకు నిర్వచనాలను కేంద్రం మార్చేసింది.

ఈ నూతన వ్యవసాయ చట్టాలతో గుత్త పెట్టుబడిదారీ శక్తుల దోపిడీకి తెరలేపారు. రైతులను గుత్తాధిపతుల దయాదాక్షిణ్యాలకు వదిలేయబోమని, కనీస మద్దతు ధర(ఎంఎస్‌పి) విధానాన్ని కొనసాగిస్తామని చెప్పుతున్న మోడీ ప్రభుత్వం చట్టాల్లో ఈ విషయాన్ని చేర్చకుండా ఎందుకు తిరస్కరించింది. బిజెపి ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చింది మొదలు ఏకరూప భావజాల విస్తృతికి, స్వదేశీ విదేశీ కార్పొరేట్ల అపరిమిత దోపిడీకి మార్గాలు వేసే చర్యలు తీసుకుంటోంది. కార్పొరేట్లు మన వనరుల విశృంఖల దోపిడీకి, ఏకరూప సిద్ధాంతం అమలుకు ఫెడరల్ వ్యవస్థ అడ్డంకిగా ఉంది. అందుకే ప్రణాళిక సంఘం స్థానంలో 'నీతి అయోగ్', 'ఒకే దేశం ఒకే పన్ను విధానం', 'ఒకే దేశం ఒకే విద్యావిధానం' విద్యుత్తు సంస్కరణలు, ఇప్పుడు 'ఒకే దేశం ఒకే మార్కెట్' అంటున్నారు. అధికారాలన్నీ కేంద్రం వద్ద కేంద్రీకృతం చేసే చర్యలకు మోడీ ప్రభుత్వం బరితెగించింది. నూతన వ్యవసాయ చట్టాలు రైతుల ప్రయోజనాల కోసం చిత్తశుద్ధిని ప్రదర్శించిందా లేక ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుపోయినా కార్పొరేట్ రంగాన్ని సంతృప్తిపరిచి వారికి నూతన అవకాశాలు కల్పించాలన్న ప్రేమను ప్రదర్శించిందా, లేక తన వరుస వైఫల్యాల నుంచి చేతులు దులుపుకునే ప్రయత్నంలో భాగంగా ఈ చట్టాలు తెచ్చిందా? అన్నది పరిశీలించాల్సి ఉంది.

మన దేశ 135 కోట్ల జనాభాలో 60 శాతం మంది గ్రామాల్లో వ్యవసాయాన్ని నమ్ముకొని జీవిస్తున్నారు. గ్రామీణ జనాభాలో చిన్న రైతులు, సన్నకారు రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు 85 శాతం వరకు ఉంటారు. హిందు బిజినెస్ లైన్ నివేదిక ప్రకారం దేశంలో 15 కోట్ల కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నాయి. ఒక్క కుటుంబంలో 5 గురు సభ్యులు ఉన్నారనుకుంటే 75 కోట్ల ప్రజల జీవనాధారం వ్యవసాయంగా ఉందని తెలుస్తుంది. చిన్న రైతులు ఐదు ఎకరాలలోపు 13.77 కోట్లు (19 శాతం), సన్నకారు రైతులు రెండున్నర ఎకరాలలోపు 48.57 కోట్లు (67 శాతం) అంటే వ్యవసాయ కుటుంబాలలో 86 శాతం చిన్న-సన్నకారు రైతులే, వీరి వద్ద 43.6 శాతం సాగుభూమి ఉంది. మిగిలిన మధ్యతరగతి 10 ఎకరాల పైన, ధనిక రైతులు 25 ఎకరాల పైన భూమి గల వారి వద్ద 56.4 శాతం వ్యవసాయ సాగుభూమి ఉంది. 20 కోట్ల మంది భూమిలేని వ్యవసాయ కూలీలు ఉన్నారు. మొత్తం 83 కోట్ల మందికి వ్యవసాయం జీవనాధారం.

శాంతాకుమార్ కమిటీ సిఫార్సులు

2014 మేలో మోడీ అధికారంలోకి వచ్చాడు. ఆగస్టు మాసంలో శాంతాకుమార్, మాజీ ముఖ్యమంత్రి, హిమాచల్‌ప్రదేశ్ నేతృత్వంలో 6గురితో కూడిన 'హై పవర్' కమిటీని నియమించాడు. ఈ కమిటీ 'ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా' నిర్మాణం, పాలన, ఆర్థికపరమైన అంశాలలో తీసుకురావాల్సిన మార్పుల గురించి సూచనలు చేయాల్సిందిగా ప్రభుత్వం కోరింది. ఆ కమిటీ ప్రభుత్వానికి అందజేసిన నివేదికలో 1) ఆహార భద్రత ఇప్పుడున్న 67 శాతం నుంచి 40 శాతానికి కుదించాలి. 2) ఆహార ధాన్యాల సేకరణలో ప్రైవేట్ కంపెనీలను అనుమతించాలి. 3) ఆహార ధాన్యాల సేకరణ బాధ్యతను పంజాబ్, హర్యాణా, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిషా రాష్ట్ర ప్రభుత్వాలకు బదిలీ చేయాలి. 4) కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు మించి రాష్ట్ర ప్రభుత్వాలు పెంచకూడదు. 5) ప్రజలకు ఆహార ధాన్యాల సరఫరా బదులు నగదు అందజేయాలి. 6) గోధుమ, వరి పంటలో 6 శాతం మాత్రమే సేకరించాలి. 7) రైస్ మిల్లులు సేకరించిన లేవి ధాన్యాన్ని 25 శాతం నుంచి 75 శాతం వరకు రాష్ట్ర ప్రభుత్వాలకు అందిస్తుంది. ఈ విధానాన్ని రద్దు చేసి మిల్లర్స్ బహిరంగ మార్కెట్‌లో అమ్ముకోవడానికి అనుమతించాలి. తాజాగా తీసుకువచ్చిన వ్యవసాయ చట్టాలకు బీజాలు శాంతాకుమార్ కమిటీ ప్రతిపాదనలో ఉన్నాయని గమనించాలి.

ప్రమాదకరమైన నూతన వ్యవసాయ చట్టాలు

లక్షల కోట్ల సంపదలున్న కార్పొరేట్లు ఒక పక్క, లక్షల్లో అప్పులున్న కోట్లాది మంది రైతులు మరోపక్క ఉన్న సమాజం మనది. ఈ భయంకరమైన అసమానతల్ని సరిచేసే బదులు రైతులను దోచుకోడానికి, ఈ స్వేచ్ఛ వ్యాపారం అనే పదాన్ని వాడుతున్నారు. నిజమైన 'స్వేచ్ఛ అంటే... దోపిడీ నుంచి, వర్గ అణిచివేత నుంచి, వర్గ వైరుధ్యాల నుంచి విముక్తి' కావడంగా గుర్తించాలి. నిస్సందేహంగా ఇలాంటి స్వేచ్ఛ ఏ పెట్టుబడిదారుడికీ నచ్చదు. కాబట్టి, పెట్టుబడిదారుల దోపిడీ నిరాటంకంగా కొనసాగుతోన్న ఏ దేశంలోనైనా స్వేచ్ఛ అనే మాటలో, భావనలో వాస్తవం ఉండదు. స్వేచ్ఛ అనే ఒక ముసుగు తగిలించి దేశీయ మార్కెట్‌ను స్వదేశీ, విదేశీ కార్పొరేట్ల కబంధ హస్తాల్లోకి నెమ్మది నెమ్మదిగా నెట్టివేసే కుట్ర ఈ సంస్కరణల ద్వారా అమలు కాబోతున్నదని గుర్తించాలి. ఈ చట్టాలు చేయడం ద్వారా ప్రభుత్వం రైతులు, వ్యవసాయ కూలీల, కార్మికుల పక్షాన లేవనీ, పెట్టుబడిదారుల, పారిశ్రామిక వేత్తల ప్రయోజనాలకే కట్టుబడి ఉంటాయని మరోసారి స్పష్టం చేసింది.

వ్యవసాయ మార్కెట్ బిల్లు - 2020

కేంద్రం ఆమోదించిన మూడు బిల్లులలో మొదటిది, 'రైతుల ఉత్పత్తి-వ్యాపారం- వాణిజ్యం (ప్రమోషన్-సదుపాయం) బిల్లు-2020' ప్రకారం దళారీ వ్యవస్థకు, కమీషన్ల వ్యవస్థకు అడ్డుకట్ట వేస్తామని, రైతు తాను పండించిన పంటను రెగ్యులేటెడ్ వ్యవసాయ మార్కెట్‌లో కాక దేశంలో ఎక్కడైనా, తనకు ఇష్టమొచ్చిన ధరకు అమ్ముకోవచ్చంటూ ప్రధానమంత్రి మోడీ తియ్యటి మాటలను వినసొంపుగా వినిపించారు. నిజానికి ఈ చట్టం వ్యవసాయ మార్కెట్ కమిటీలను, మార్కెట్ యార్డులను దెబ్బ తీసేందుకు చేసిన చట్టం. చిన్న-సన్నకారు రైతులు ఎక్కడికైనా వెళ్లి తాము పండించిన పంటను అమ్ముకోవడం సాధ్యం కాదు. ఎవరైతే మార్కెట్ చేయగలుగుతారో వారే కొనుగోళ్లను, అమ్మకాలను నియంత్రిస్తారు. రైతులకు న్యాయమైన ధరలు లభించనందున పడుతున్న కష్టాలు మనం చూస్తున్నాం. పసుపు, మిర్చి, మక్కలు, పచ్చజొన్నలు, పొగాకు, మిర్చి, పత్తి, ధాన్యం తదితర పంటలు పండించిన రైతులు మార్కెట్ దళారీల మోసాలకు బలవుతూ, ఆత్మహత్యలకు పాల్పడుతున్న కాలంలో జరిగిన ప్రజాందోళనల ఫలితంగా వ్యవసాయ మార్కెట్ కమిటీల చట్టం (ఎపిఎంసి) వచ్చింది. దీనివల్ల ప్రాథమికంగా రైతాంగానికి కొంత మేలు కలిగింది.

కనీస ధరల నిర్ణాయక వ్యవస్థ, ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థ యథాతథంగా కొనసాగుతాయంటూ మోడీ బుకాయిస్తున్నారు. చట్టంలో చేర్చమంటే చేర్చలేదు. నూతన చట్టం ప్రకారం 'ఏ సెస్సులు, చార్జీలు ఉండవు, మార్కెట్ యార్డులలోనే అమ్మాలి, కొనాలన్న నిబంధనేది లేదు.

మండీల బయట ప్రైవేటు వారు కొనుగోలు చేయవచ్చ'ని చెప్పడం ద్వారా మార్కెట్ కమిటీలకు గ్రహణం పడుతోంది. అదే సమయంలో ఇక్కడ ఉన్న మరో మోసం ఏమంటే, ప్రైవేటు వ్యాపారులు ఎవరైనా కనీస మద్దతు ధర కంటే తక్కువకు రైతుల పంటలను కొనరాదన్న నిబంధన ఏదీ కొత్త చట్టంలో లేదు. ఒక క్రమంలో కనీస మద్దతు ధర అన్నదానిని కూడా బిజెపి ప్రభుత్వం రద్దుచేయబోతున్నదని అర్థమౌతోంది. ఈ రకంగా కనీస మద్దతు ధర ఊసే లేకుండా, ప్రైవేటు దళారీల తోడేళ్లమందకు రైతులను బలి చేయడమే ఈ చట్టం అంతసారం. దీంతో ప్రైవేట్ కంపెనీలు క్రమంగా వ్యవసాయ రంగాన్ని ఆక్రమిస్తే భవిష్యత్తులో ఎన్నో రకాల సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం లేకపోలేదు.

దేశంలో 80 శాతం పైగా చిన్న, సన్నకారు రైతులున్నారు. వారు దూర ప్రాంతాలకు పంటలను తీసుకెళ్లి అమ్ముకోలేరు. రవాణా చార్జీలను భరించలేరు. మద్దతు ధరలు ప్రకటించినా, ఆ ధరలకు వ్యాపారులు కొనటం లేదు. రాష్ట్రంలో మొక్కజొన్న, జొన్న పంటలను మద్దతు ధరకన్నా చాలా తక్కువగా కొంటున్నారు. బిహార్‌లో 2006లో ఏపిఎంసి చట్టాన్ని రద్దు చేశారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే వరి గోధుమ పంటను తక్కువకు అమ్ముకుంటున్న అనుభవం మన ముందుంది. స్వేచ్ఛా వాణిజ్యం ద్వారా బడా వ్యాపారులు పంటల ధరలను మరింతగా తగ్గించినా వారిపై ఎటువంటి చర్యలు ఉండవు. ఈ చట్టం ప్రస్తుతం ఉన్న వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లు అమ్మకాల వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేస్తుంది. నూతన వ్యవసాయ మార్కెటింగ్ విధానం అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్లకు ప్రయోజనం కలిగిస్తుంది.

ఈ చట్టం ద్వారా నామమాత్రపు కనీస మద్దతు ధరల వ్యవస్థ రద్దైపోతుందని, వ్యవసాయ మార్కెట్ల వ్యవస్థ ధ్వంసమవుతుందని, తద్వారా లోపభూయిష్టంగానైనా ఉన్న రక్షణ వ్యవస్థలు కనుమరుగైతే సంభవించే దుష్పరిణామాలను తలచుకొంటూ రైతాంగం మనోవేదనకు గురౌతున్నది. స్వేచ్ఛా విపణిలో మార్కెట్ శక్తుల దోపిడీ నుండి రైతాంగాన్ని రక్షించే వ్యవస్థలే లేని దుస్థితిలోకి నెట్టడానికి మాత్రమే ఈ చట్టాలు దోహదపడతాయన్న విమర్శలకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పకుండా దగాకోరు పద్ధతులను అనుసరిస్తున్నది. బడా వ్యాపారులు, కార్పొరేట్ సంస్థలు, రిటైల్ రంగంలో రాజ్యమేలుతున్న సూపర్ మార్కెట్ యజమాన్యాలు కనీస మద్దతు ధరలకు తక్కువ కాకుండా రైతుల నుండి వ్యవసాయోత్పత్తులను విధిగా కొనుగోలు చేయాలన్న నిబంధనను చట్టంలో పొందుపరచమంటే మాత్రం నిర్ద్వందంగా తిరస్కరించారు. దళారీ పెట్టుబడిదారీ వ్యవస్థలో మన రైతాంగానికి స్వేచ్ఛ ఒక భ్రమ. అసలు రైతుకు భరోసాయే ఉండదు. సమాజానికి ఆహారభద్రత కొరత ఏర్పడి ఆహారధాన్యాలు ప్రియమవుతాయి.

కాంట్రాక్టు ఫార్మింగ్ బిల్లు- 2020

రెండవ బిల్లు - 'రైతుల(సాధికారత, రక్షణ) ధరల భరోసా - వ్యవసాయ సేవల ఒప్పందం బిల్లు-2020' పరిశీలిస్తే, ఈ చట్టం ప్రకారం రైతులు తమ ఉత్పత్తుల విక్రయానికి ముందస్తుగా నాణ్యత ఆధారం గాకుండా కంపెనీలతో ఒప్పందాలను కుదుర్చుకొనే అవకాశం ఉంది. దీని ద్వారా ఏ పంటకు ఎంత ధర వస్తుందో ముందే రైతులకు తెలుస్తుందని, అప్పుడు రైతు ఏ పంట వేయాలో నిర్ణయించుకొని లాభపడవచ్చని చట్టంలో పేర్కొన్నారు. కాంట్రాక్టు సేద్యం దేశంలో ఇప్పటికే అక్కడక్కడా అమలు జరుగుతుంది. దీనిపై అనేక న్యాయపరమైన విమర్శలు వెల్లువలా వచ్చాయి. అయినా ఇదే రైతులకు అత్యుత్తమైందని ప్రభుత్వం చెప్పడం ఆశ్చర్యకరం. ఇప్పటికే భూస్వామ్య, వడ్డీవ్యాపార, దళారీ వర్గాలు, విదేశీ బహుళజాతి విత్తన, ఎరువులు, పురుగుమందు కంపెనీల వారంతా కలసి రైతుల కష్టార్జితాన్ని, ఒక్క మాటలో చెప్పాలంటే మొత్తం గ్రామీణ భారతాన్ని కొల్లగొడుతున్నారు. ఈ దోపిడీ దొంగలకు తోడు కాంట్రాక్టు వ్యవసాయం పేరుతో బడా దేశీయ, విదేశీ బహుళజాతి కంపెనీలు వస్తాయి. నిన్నటి దాకా వ్యవసాయ ఉత్పాదకాల అమ్మకం ద్వారా దోపిడీ చేసినవారు, ఇక నుండి మొత్తం వ్యవసాయ ఉత్పత్తి క్రమాన్నే శాసిస్తారు. రైతు కూలీలను, భూసారాన్ని, ప్రకృతిని మరింతగా దోపిడీ చేస్తారు, ధ్వంసం చేస్తారు. అనేక దేశాల అనుభవాలు దీనినే రుజువు చేస్తున్నాయి. ఇలాంటి వారి విచ్చలవిడి దోపిడీకి తలుపులు తెరవడమే ప్రస్తుత చట్ట లక్ష్యం.

గుత్తాధిపత్యం గల ప్రైవేటు వ్యక్తులు కాంట్రాక్టు వ్యవసాయం ద్వారా ఆహారధాన్యాల ఉత్పత్తిని తగ్గించి ఎగుమతి పంటలను పండిస్తారు. వలస పాలనలో ఆహార ధాన్యాలకు బదులుగా నల్లమందు, నీలిమందు పంటలను పండించి ఎగుమతి చేశారు. నీలిమందు వ్యాపారులు రైతులను ఎంత దారుణంగా దోపిడీ చేసింది దీనబంధు మిత్ర 19వ శతాబ్దం నాటకం 'నీల్‌దర్పణ్'లో బ్రహ్మాండంగా ప్రదర్శించారు. ప్రస్తుత చట్టంతో రైతులు కూడా ఆనాటి దీనస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకు పంటలు పండే భూములను, వాణిజ్య ఉత్పత్తుల భూములుగా ఎక్కువ మార్చలేదు. ధాన్యం ఉత్పత్తుల ఏర్పాటును ధ్వంసం చేస్తే దేశ ఆహారభద్రత ప్రమాదంలో పడుతుంది. భూవనరులు పరిమితమైనవి. అందువల్ల ఇవి సమాజం నియంత్రణలోనే ఉండాలి. ప్రైవేటు వ్యక్తుల ప్రయోజనాల కోసం మళ్లించకూడదు. సమాజ నియంత్రణను ధ్వంసం చేయాలని సామ్రాజ్యవాదం కోరుకుంటుంది. బిజెపి ప్రభుత్వం విధేయతతో అది కోరినట్లు ఏర్పాటు చేస్తోంది.

సాగు స్పాన్సర్ చేసిన కంపెనీలు తమ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ధర నిర్ణయిస్తాయి. తమ లాభాలను దృష్టిలో పెట్టుకొని కంపెనీలు కొన్ని తరహా పంటలే వేయాలని రైతులపై ఒత్తిడి చేస్తాయి. రైతులు, కంపెనీల మధ్య కుదిరే ఒప్పందాలు సమానంగా ఉండవు. కంపెనీలు ఆర్థికంగా బలం గలవి. ఇద్దరి మధ్య వివాదం వస్తే రైతులు అత్యంత అన్యాయానికి గురవుతారు. కార్పొరేట్ దిగ్గజాలు భారీ యంత్రాలతో వ్యవసాయ క్షేత్రాలలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం చేస్తారు. అలాంటి పారిశ్రామికవేత్తల ఆధీనంలోనికి భూములన్ని వచ్చే అవకాశాన్ని ఈ చట్టం కల్పించింది. కాంట్రాక్టు వ్యవసాయం రైతును భూమి నుండి వేరుచేస్తుంది. రైతు జీవితం దుర్భరమవుతుంది. రైతులేకాదు, భూమిపై ఆధారపడి జీవించే వ్యవసాయ కూలీలకు కూడ ఇది తీవ్రనష్టాన్ని కలుగచేస్తుంది. భూమిని నిజంగా దున్ని సాగు చేస్తున్న చిన్న రైతులు, కౌలు రైతులు భూమి నుండి గెంటి వేయబడతారు. మార్పు చేసిన చట్టంలో వ్యవసాయ కూలీల గురించి, వారి వేతనాల గురించి, హక్కుల గురించి చెప్పనే లేదు. ఈ చట్టం ద్వారా కార్పొరేట్ సంస్థల కబంధ హస్తాల్లో రైతులు బంధించబడతారు.

రైతులు కొన్న విత్తనాలు నాసిరకాలని తేలితే కంపెనీల నుంచి పరిహారమైనా ఇప్పించలేని దుస్థితి ప్రభుత్వాలది. కొన్ని రకాల విత్తనాలను రైతులకు ఇచ్చి సాగు చేయించి పంటను తామే కొనుగోలు చేస్తామంటూ

రైతులతో చేసుకునే ఒప్పందాలు సైతం ఈ బిల్లు పరిధిలోకి వస్తాయి. దీని ద్వారా పెద్దపెద్ద కంపెనీలైన రిలయన్స్(అంబానీ), ఆదానీ, వాల్‌మార్టు వంటి వారికి రైతుల నుండి భూమి సేకరించి, వేల ఎకరాల్లో అధునాతన కాంట్రాక్టు వ్యవసాయం చేసి, ప్రతిఫలంగా ప్రతీ ఏడాది రైతుకు లీజు(కౌలు) చెల్లిస్తారు. గతంలో జాఫ్రా, టేకు చెట్లు, అలోవీరా, దూలగొండి, పామారోజా, సఫేద్‌ముస్లి సహా పలు రకాల ఔషధ, సుగంధ మొక్కలను సాగు చేస్తే లక్షల్లో లాభాలొస్తాయని రైతుల్ని నమ్మించి విత్తనాలు అమ్మేసుకుని మొహం చాటేసిన కంపనీలను ఏమీ చేయలేకపోవడం తెలిసిందే.

రైతుకు స్వేచ్ఛ, విముక్తి వంటి తియ్యని మాటలతో మోడీ ప్రభుత్వం వ్యాపారులను భుజానికి ఎత్తుకుంటోంది. కానీ ఇది పరోక్షంగా ఒప్పంద సేద్యాన్ని చట్టబద్ధం చేయడానికే దారితీస్తుందని దేశవ్యాప్తంగా రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి. దేశంలో ఒప్పంద వ్యవసాయం విస్తరిస్తే సేద్యం కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లి బడుగు రైతులు కూలీలుగా మారాల్సి వస్తుందన్న భయాలను అవి వ్యక్తీకరిస్తున్నాయి. వ్యాపారులు, కంపెనీలతో రైతులు కుదుర్చుకునే ఒప్పందాలకు వ్యవసాయశాఖ బాధ్యత లేకపోవడం బిల్లులో పెద్ద లోపం. గుజరాత్‌లో ఆలుగడ్డ రైతులపై పెప్సీ సంస్థ పెట్టిన కేసులు ప్రస్తావనార్హం. అలాగే పంజాబ్‌లో బంగాళదుంప విత్తనాన్ని తమ అనుమతి లేకుండా విత్తినందుకు కోట్లాది రూపాయల అపరాధ సుంకం చెల్లించమని చిన్న రైతులకు వ్యతిరేకంగా మోన్‌శాంటో బొంబాయిలో కోర్టుకి వెళ్లింది. ఇక నుండి ఇవే, ప్రతిచోటా ప్రతి ఊర్లో జరుగుతాయి. రైతులు దొంగలుగా చిత్రించబడతారు.

నిత్యావసరాల సరుకుల (సవరణ) బిల్లు-2020

అధికార బదిలీ జరిగిన తర్వాత ప్రజలకు నిత్యావసరాలు అందకుండా చేసే నల్ల వ్యాపారులకు వ్యతిరేకంగా సాగిన ప్రజా ఆందోళనల ఫలితంగా 1955లో చేసింది నిత్యావసరాల చట్టం. ఇప్పుడు ఈ చట్టాన్ని సవరించి ఆరు రకాల వ్యవసాయ ఉత్పత్తులను దాని నుంచి తొలగించింది. నిత్యావసర సరుకుల చట్టానికి చేస్తున్న సవరణ వల్ల పప్పుధాన్యాలు, తృణ ధాన్యాలు, నూనెగింజలు, ఉల్లిపాయలు, బంగాళా దుంపలు వంటివి నిత్యావసర సరకుల జాబితా నుంచి తొలగించబడ్డాయి. పైగా వీటి నిల్వల పట్ల పరిమితులు ఎత్తివేశారు. పంట నిల్వల మీద, అమ్మకం మీద ఎటువంటి ఆంక్షలు విధించరాదని ప్రభుత్వం సంకల్పించింది. నిత్యావసర సరుకుల నిల్వపై ఉన్న నియంత్రణలను తొలగిస్తే ప్రైవేటు వ్యాపార వర్గాలు అక్రమ నిల్వలు చేసి, కృత్రిమ కొరత సృష్టించి, ధరలను పెంచి, వినియోగదారులను దోపిడీ చేయడాన్ని ఎలా కట్టడి చేస్తారంటే పట్టించుకోవడం లేదు. అంటే నల్లబజారుకు చట్టబద్ధత కల్పిస్తున్నారు. విదేశాల నుండి వ్యవసాయోత్పత్తులను ఇబ్బడిముబ్బడిగా దిగుమతి చేసి స్వదేశీ ఉత్పత్తులకు మార్కెట్లో గిరాకీ లేకుండా చేసే ప్రమాదాన్ని ఎలా నియంత్రిస్తారో చెప్పరు. స్వేచ్ఛా విపణిలో మార్కెట్ శక్తుల దోపిడీ నుండి రైతాంగాన్ని రక్షించే వ్యవస్థలే లేని దుస్థితిలోకి నెట్టడానికి మాత్రమే ఈ చట్టం దోహదపడుతుందన్న విమర్శలకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నది.

ఇప్పటిదాక ప్రజా పంపిణీ వ్యవస్థ, భారత ఆహార సంస్థ(ఎఫ్‌సిఐ) వంటివి ఆహార ధాన్యాల కొనుగోలు, నిర్వహణ, సరఫరా చేయడం వంటి చర్యల ద్వారా ప్రజలకు ఆహార భద్రతను ఎంతో కొంత కల్పించాయి. నూతన చట్టం ద్వారా ఇవన్నీ రద్దు అవుతాయి. అసాధారణ పరిస్థితుల్లో, అంటే యుద్ధం వంటి ప్రత్యేక పరిస్థితులు, అసాధారణంగా ధరలు పెరగడం వంటి సందర్భాల్లో తప్ప చిరు ధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు, పండ్లు, కూరగాయలు సహా పలు నిత్యావసర వస్తువుల నిల్వ, సరఫరాపై ఎలాంటి నియంత్రణలూ ఉండబోవన్నది నిత్యావసర సరుకుల చట్టసవరణ ప్రధానోద్దేశం. అయితే వీటిని భారీయెత్తున నిల్వ చేయడం ద్వారా రైతుల కంటే వ్యవసాయ వ్యాపార సంస్థలు మాత్రమే లాభపడతాయి. కాయకష్టాన్ని కల్లాల్లోనే అమ్మేసుకుంటున్న బడుగు రైతుల నిస్సహాయతను ఆహారశుద్ధి కంపెనీలు, వ్యాపారులు ఉపయోగించుకుని రైతుల నుంచి ఉత్పత్తుల్ని కొనేసి పెద్దయెత్తున నిల్వ చేసుకునే సావకాశం ఈ బిల్లు వల్ల కలుగుతుంది. ఫలితంగా ధర తక్కువ ఉన్నప్పుడు రైతుల నుంచి కొనేసి ఈ బిల్లు ద్వారా లభించిన స్వేచ్ఛతో అపరిమితంగా నిల్వలు ఉంచి, ధరలు పెరిగిన కాలంలో వ్యాపారులు వినియోగదారులకు అమ్ముకుని లాభపడతారు.

'భవిష్య వాణిజ్యం' పేరుతో ఆహార ధాన్యాల, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్‌ను స్వాధీనం చేసుకోవడానికి, బహుళజాతి గద్దలు రైతాంగాన్ని పీక్కు తినడానికి కొత్త చట్టం దారి చూపిస్తున్నది. ఎఫ్‌సిఐకి మంగళం పాడాలని కాంగ్రెస్ కాలం నుండే ప్రయత్నాలు మొదలైనాయి. రెండోసారి అధికారంలోకి వచ్చాక బిజెపి ప్రభుత్వం ఈ ప్రజా వ్యతిరేక చట్టాన్ని చేసింది. ఇక వ్యాపారుల అక్రమ వ్యాపారులకు అడ్డు, అదుపు ఉండదు. ఇది నేరుగా పేదల పొట్టలు కొట్టే చట్టం. నెమ్మదిగా రేషన్ దుకాణాలను ఎత్తివేసి, ప్రజలలో వ్యతిరేకత రాకుండా పేదల ఖాతాలలో కొంతకాలం డబ్బులు వేసి, చివరకు ఏదీ లేకుండా మొత్తం ఎత్తివేయడానికి జరుగుతున్న పెద్ద కుట్ర దీనివెనుక ఉంది. ఇదే జరిగితే పేదలు ఆకలి కోరల్లో చిక్కుకుంటారు. దేశంలో 1961లో 73.4 కిలోల సగటు లభ్యత ఉంటే 2019లో 69.1 కిలోలకు తగ్గిందని కేంద్ర వ్యవసాయ శాఖ నివేదిక వెల్లడించింది. 1956లో పప్పు ధాన్యాల సగటు లభ్యత 25.7 కిలోలు ఉండగా, 2019 నాటికి 17.5 కిలోలు పడిపోయింది. కాంట్రాక్టు వ్యవసాయం అమలులోకి వస్తే ఆహార ధాన్యాల సగటు వినియోగం మరింత తగ్గే ప్రమాదం ఉంది. ఈ చట్టాన్ని కేవలం వాణిజ్య, వ్యాపార వర్గాల ప్రయోజనాలను నెరవేర్చడానికే చేశారు.

వ్యవసాయ బిల్లులపై భగ్గుమన్న రైతాంగం

పార్లమెంట్‌లో అడ్డగోలుగా ఆమోదింప జేసుకున్న వివాదాస్పద వ్యవసాయ బిల్లులపై భారత రైతాంగం కన్నెర్ర చేసింది. వివిధ రైతు సంఘాలతో ఏర్పడిన కిసాన్ సంఘర్ష్ సమితి ఇచ్చిన పిలుపు మేరకు సెప్టెంబర్ 25న భారత్ బంద్‌కు అపూర్వమైన స్పందన లభించింది. ఈ బంద్‌కు రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, లౌకిక, ప్రజాతంత్ర వాదులు పలువురు సంఘీభావం తెలిపారు. దేశవ్యాప్తంగా రైతులు ఎక్కడికక్కడ వీధుల్లోకి వచ్చి మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. వ్యవసాయ బిల్లుల ప్రతులను తగులబెట్టారు. రైతుల ఆందోళనకు సంఘీభావంగా కొన్నిచోట్ల వ్యాపారులు స్వచ్ఛంధంగా దుకాణాలను మూసివేశారు. పంజాబ్, హర్యాణ రాష్ట్రాల్లో మూడు రోజులు సెప్టెంబర్ 24 నుంచి 26 వరకు రైళ్లు, బస్సులు నిలిచిపోయాయి. బిజెపి ప్రజా ప్రతినిధులను గ్రామాల్లో సామాజికంగా బహిష్కరించారు. రైతు వ్యతిరేక బిల్లులను పార్లమెంట్‌లో అప్రజాస్వామ్యంగా

ఆమోదించడాన్ని నిరసిస్తూ ఆలిండియా కిసాన్ సంఘర్ష్ కో ఆర్డినేషన్ కమిటీ (ఎఐకెఎస్‌సిసి) నేతృత్వంలో సుమారు 250 సంఘాలు బంద్‌లో భాగంగా ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద సెప్టెంబర్ 25న ధర్నా చేపట్టాయి.

అన్ని రాష్ట్రాల్లో కార్మికులు, విద్యార్థులు, యువకులు, వ్యవసాయ కార్మికులు, మహిళలు, దళితులు, ఆదివాసులు సంఘీభావం తెలుపుతూ పాల్గొన్నారు. పంజాబ్, హర్యానాల్లో పూర్తిస్థాయి బంద్ జరిగింది. పంజాబ్ ముకత్సర్ జిల్లాలో ట్రాక్టర్ మార్చ్‌లో ఎస్ఎడి అధ్యక్షుడు సుఖ్బీర్ సింగ్ బాదల్ పాల్గొని, స్వయంగా ట్రాక్టర్ నడిపారు. ఆయన పక్కన వ్యవసాయ బిల్లులను వ్యతిరేకిస్తూ ఇటీవల కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన ఆయన సతీమణి హరిసిమ్రత్ కౌర్ కూర్చున్నారు. రాజస్థాన్, కర్ణాటకల్లో చాలా ప్రాంతాల్లో బంద్ జరిగింది. రాజస్థాన్‌లో చాలా జిల్లాల్లో బంద్ వాతావరణం నెలకొంది. పశ్చిమ బెంగాల్‌లో జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులను దిగ్బంధించారు. కేరళలో 250 కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద ధర్నాలు జరిగాయి. ఎఐకెఎస్ ఉపాధ్యక్షులు ఎస్. రామచంద్రన్ పిళ్లై పాల్గొన్నారు. త్రిపురలో ఆందోళన తీవ్ర స్థాయిలో జరిగింది. బిహార్, జార్ఖండ్‌లలో రైతులు, కార్మికులు అన్ని జిల్లాల్లో రోడ్డు, రైల్వే మార్గాలు దిగ్బంధించారు. ఒడిశా, అస్సాం, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, జమ్మూ కశ్మీర్, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, తెలంగాణ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో చాలా ప్రాంతాల్లో రైతులు, కార్మికులు నరేంద్ర మోడీ దిష్టి బొమ్మలను, బిల్లు ప్రతులను దగ్ధం చేశారు. మహారాష్ట్రలో అన్ని ప్రాంతాల్లో ఆందోళన జరిగింది. ముంబాయి ఢిల్లీ రహదారిని వేలాది మంది రైతులు దిగ్బంధించారు. తమిళనాడులో వందలాది ప్రాంతాల్లో అన్ని రైతు సంఘాలు సంయుక్తంగా ఆందోళన నిర్వహించాయి.

జాతీయ బందు తర్వాత రైతాంగం అగ్రహజ్వాలలు ఢిల్లీకి పాకాయి. షహీద్ భగత్‌సింగ్ 113వ జయంతిని పురస్కరించుకొని సెప్టెంబర్ 28న ఢిల్లీలోని ఇండియాగేట్ వద్ద యువ రైతులు రైతు వ్యతిరేక బిల్లులను నిరసిస్తూ ఓ ట్రాక్టర్‌ను తగులబెట్టారు. పంజాబ్‌లో భగత్‌సింగ్ పూర్వీకుల గ్రామమైన ఖాట్కర్ కలాన్‌లో ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ సెప్టెంబర్ 28న నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. అమృత్ సర్–ఢిల్లీ రైల్వే ట్రాక్‌పైనా, రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో రైతుల ఆందోళనలు మరింత ఉధృతమయ్యాయి. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఆందోళన చేస్తున్న రైతులను, ప్రతిపక్ష నేతలను పోలీసులు అరెస్టు చేశారు. గోవా, ఒడిశా రాష్ట్రాల్లోనూ నిరసనలు కొనసాగాయి. తమిళనాడులోని చెన్నై, కొయంబత్తూర్, మదురై, తిరుచినాపల్లి, తిరునెల్వేలి తదితర ప్రాంతాల్లో రైతుల పోరాటానికి మద్దతుగా డిఎంకె, కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ ఆందోళనల్లో పాల్గొన్నాయి. త్రిసూర్ కాంగ్రెస్ ఎంపి టిఎన్ ప్రతాపన్ సుప్రీంకోర్టులో ఈ రైతు వ్యతిరేక చట్టాలను సవాల్ చేశారు.

కర్ణాటకలో ఆలిండియా కిసాన్ మహాసభ (ఎఐకెఎస్)తో పాటు 108 రైతు సంఘాల పిలుపు మేరకు నిర్వహించిన బంద్‌కు అన్ని వర్గాల నుంచి మంచి స్పందన లభించింది. ఈ బంద్‌కు వామపక్షాలు, కాంగ్రెస్, జెడిఎస్ మద్దతు తెలిపాయి. ఈ ఆందోళనల్లో కార్మికులు, కన్నడ అనుకూల ఆందోళనకారులు, దళిత సంఘాలతో పాటు ఇతర ప్రజా సంఘాల నేతలు కూడా పాల్గొన్నారు. హర్యానాలో రైతులకు మద్దతుగా కార్మికులు రోడ్డెక్కారు. పంజాబ్, హర్యానాలో అంబానీ, ఆదాని వాణిజ్య సంస్థలను మూసి వేయించారు. బిజెపి నాయకుల ఇళ్ల ముందు నిరసనలు ధర్నాలు చేశారు. గాంధీ జయంతి అక్టోబర్ 2 నుంచి రైతు వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ ఆల్ ఇండియా కిసాన్ కోఆర్డినేషన్ కమిటీ(ఎఐకెఎస్‌సిసి) ధర్నాలు చేయాలని, నవంబర్ 26, 27 తేదీల్లో చలో పార్లమెంట్ కార్యక్రమం చేపడుతామని తీర్మాణించింది. అదే సమయంలో కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండు చేశారు. ఈ బిల్లులు అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తామని రైతు స్వాభిమాన్ అధ్యక్షుడు యోగేంద్ర యాదవ్ తెలిపారు. మరోవైపు వ్యవసాయ చట్టాల రాజ్యాంగ బద్ధతను సవాలు చేస్తూ రైతు సంఘాలు, రాజకీయ పార్టీలు సుప్రీంకోర్టులో వాజ్యాలు వేశాయి.

ఎఐకెఎస్‌సిసి కార్యాచరణ తీర్మానాలు

1) అక్టోబర్ 2న మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించడంతో పాటు... అన్ని రాష్ట్రాల్లో బిల్లుని పార్లమెంట్‌లో వ్యతిరేకించని పార్టీలను గ్రామ స్థాయిలో సమావేశం పెట్టి సాంఘికంగా బహిష్కరించాలని ప్రతిజ్ఞ చేయడం. 2) అక్టోబర్ 14న కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) అధికార దివాస్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున క్షేత్రస్థాయిలో నిర్వహించడం. ఆ ఆందోళనా కార్యక్రమంలో మోడీ ప్రభుత్వం ఎంఎస్‌పిపై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని సామాన్య రైతులకి వివరించి నిరసన తెలపడం. 3) నవంబర్ 26–27 తేదీలలో రైతులందరితో దేశ రాజధాని ఢిల్లీలో పెద్ద ఎత్తున చలో పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించడం. కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లులను వెనక్కి తీసుకునే వరకు 'వి షెల్ ఫైట్... వి షెల్ విన్' (మేము పోరాడుతాం... మేము గెలుస్తాం) అన్న నినాదంతో ముందుకు వెళ్లడం.

ముగింపు

ఈ బిల్లులు తీసుకురావడం వెనుక మోడీ సర్కారు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నదని స్పష్టమవుతున్నది. ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న కార్పొరేట్ రంగానికి నూతన అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా కేంద్రం ముందుకు సాగుతున్నదని తేటతెల్లమవుతున్నది. నియంత్రణలేని కార్పొరేట్ స్వేచ్ఛా మార్కెట్‌లో రైతైనా, కార్మికుడైనా దోపిడీకి గురి కావాల్సిందే. సింహాలు యథేచ్ఛగా సంచరించే మహారణ్యంలో... మేకల్లా బలి కావాల్సిందే. ఇంకా రక్షణ ఎక్కడుంటుంది? మేకలను రక్షించాలంటే... సింహాలకైనా కంచె వెయ్యాలి, మేకలకైనా కంచె వెయ్యాలి. ఇప్పుడు ఉన్న కంచెలను కూడా తొలగించి, నీకు స్వేచ్ఛ ప్రసాదించాననడం సింహం (కార్పొరేట్) నోటికి (రైతును) ఫలహారంగా అందించడమే. బలవంతులూ, బలహీనులూ ఉన్న సమాజంలో ఒక సమన్యాయం అమలు కావాలంటే... బలవంతులకు కొన్ని ఆంక్షలు, బలహీనులకు కొన్ని రక్షణలు ఉండి తీరాలి. అప్పుడే కొంతైనా న్యాయం జరుగుతుంది. దోపిడీ నుంచి, అణచివేత నుంచి, ఆటవిక న్యాయం నుంచి విముక్తి కలిగినప్పుడే నిజమైన స్వేచ్ఛ పరిఢవిల్లుతుంది. అందుకు చిన్న, సన్నకారు రైతులు, రైతు కూలీలు, శ్రామికులు సంఘటితపడి ఈ బిల్లులను తిప్పికొట్టకుంటే రైతు బతుకు, భవిత అంధకారంలోకి నెట్టబడుతుంది. మోడీ దుస్సాహసానికి తెరదించే వరకు పోరాటం జరుగాల్సిన సందర్భం ఇది.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, రాజనీతిశాస్త్ర విద్యార్థి) వీ

అందరు నిర్దోషులైతే, మసీదు కూల్చిందెవరు?

***బాబ్రీ మసీదు కూల్చివేత కేసులో నిందితులందరూ నిర్దోషులేననే సిబిఐ ప్రత్యేక కోర్టు తీర్పు నేపథ్యంలో మరి కూల్చిందెవరనే ప్రశ్న ముందుకు వచ్చిందంటున్నారు* సంతోష్**

ఇరవై ఎనిమిదేళ్ల కిందట, 1992 డిసెంబర్ 6న ఉత్తరప్రదేశ్‌లోని ఫైజాబాద్ జిల్లా అయోధ్యలో జరిగిన బాబ్రీమసీదు కూల్చివేతకు సంబంధించిన కేసులో నిందితులుగా ఉన్న 32 మందిని నిర్దోషులని లక్నోలోని సిబిఐ ప్రత్యేక కోర్టు సెప్టెంబర్ 30న తీర్పునిచ్చింది. సిబిఐ 351 మంది సాక్షులను, అనేక ఆధారాలనూ కోర్టు ముందుంచింది. అయినాగాని ఏ ఒక్కరినీ ఆ విధ్వంసానికి బాధ్యులను చేయకుండా ప్రధాన కుట్రదారులందరూ నిర్దోషులని సిబిఐ లక్నో కోర్టు తీర్పునివ్వడం దారుణం. భారతీయ జనతా పార్టీకి చెందిన వయోధిక దిగ్గంతులు లాల్‌కృష్ణ అద్వానీ, మురళీమనోహర్ జోషి, కళ్యాణ్‌సింగ్, ఉమాభారతి, విశ్వహిందూ పరిషత్ అగ్రనేతలు అశోక్ సింఘాల్, గిరిరాజ్ కిశోర్, సాధ్వీ రితంభర మొదలైన 32 మంది నిందితులను నిర్దోషులుగా న్యాయస్థానం తీర్పు చెప్పింది. బాబ్రీమసీదు విధ్వంసానికి ముందస్తు కుట్ర ఏదీ జరగలేదని, అప్పటికప్పుడు ఎవరో ఆవేశపూరితంగా ఉన్న జనం నుంచి జరిగిన సంఘటన అని, నిందితులుగా ఉన్నవారు కూల్చివేతను నిరోధించడానికి ప్రయత్నించారని న్యాయస్థానం భావించడం మరీ ఆశ్చర్యకరం. ఈ తీర్పుతో లక్నో సిబిఐ ప్రత్యేక కోర్టు న్యాయాన్ని అపహాస్యం చేసింది. యావత్ ప్రపంచాన్ని నివ్వెరపోయేల చేసింది.

మసీదు కూల్చివేతలో సిబిఐ సమర్పించిన సాక్ష్యాధారాలు నిందితులను శిక్షించడానికి సరిపోవని కోర్టు తేల్చింది. ఆశ్చర్యకరమేమంటే ఈ ఉదంతంలో కుట్ర దాగుందని అప్పట్లో పివి నరసింహారావు ప్రభుత్వం నియమించిన న్యాయవిచారణ కమీషన్‌కు నేతృత్వం వహించిన జస్టిస్ మన్మోహన్‌సింగ్ లిబర్హాన్ 2009లో అభిప్రాయపడ్డారు. అసలు ఈ కేసు న్యాయస్థానాల్లో నడిచిన తీరు గమనిస్తే ఎవరైనా ఆశ్చర్యపోతారు. రామజన్మ భూమి–బాబ్రీ మసీదు వివాదం గత ఏడాది నవంబర్‌లో అయిదుగురు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన ఏకగ్రీవ తీర్పుతో ముగిసింది. వివాదాస్పదమైన 2.77 ఎకరాల స్థలాన్ని ధర్మాసనం రామమందిర నిర్మాణానికే అప్పగించింది. మసీదు నిర్మాణం కోసం 5 ఎకరాల భూమి చూడాలని, దాన్ని సున్నీ వక్ఫ్ బోర్డుకు కేటాయించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. అయితే ఆ సివిల్ తగాదాలతో పాటు బాబ్రీ మసీదు కూల్చివేత ఉదంతంపై రెండు వేర్వేరు కేసులు నమోదయ్యాయి. అందులో ఒకటి 'గుర్తు తెలియని' కరసేవకులపై పెట్టిన కేసు కాగా, రెండోది ఈ కుట్ర కేసు, జాతీయ సమగ్రతకు భంగం కలిగించారని, వదంతులు సృష్టించి శాంతిభద్రతలకు భంగం కలిగించారని, అందుకోసం కుట్రకు పాల్పడ్డారని ఈ కేసులోని అభియోగం.

ఇందులో మొదటి కేసు లక్నో సెషన్స్ కోర్టులో, రెండోది రాయ్‌బరేలీ కోర్టులో పాతికేళ్లపాటు కొనసాగాయి. మధ్యలో 2001లో కుట్ర కేసు అభియోగాలు చెల్లబోవని రాయ్‌బరేలీ కోర్టు తీర్పునిచ్చింది. దీన్ని 2010లో అలహాబాద్ హైకోర్టు కూడా ధ్రువీకరించింది. ఒక చోట ఒక కట్టడం ఉన్నది. దాని మీద వివాదం మొదలయింది. వివాద క్రమంలోనే దాన్ని కూల్చి వేశారు. కూల్చివేత మీద నేర విచారణ, భూమి ఎవరదనే సివిల్ విచారణ–వేర్వేరుగా ప్రయాణించాయి. కానీ సుప్రీంకోర్టు 2017లో ఈ తీర్పులను అంగీకరించలేదు. అసలు ఒకే స్వభావం ఉన్న రెండు వేర్వేరు కేసులను ఇలా రెండు చోట్ల విచారించడంలో అర్థమేముందని సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించి, వాటిని విలీనం చేసి విచారించాలని చెప్పడంతో కుట్ర కేసు విచారణ మళ్లీ ప్రాణం పోసుకుంది. ఈ కేసును సిబిఐ ప్రత్యేక కోర్టులో రోజువారీ ప్రాతిపదికన విచారణ సాగించి రెండేళ్లలో తీర్పునివ్వాలని అప్పట్లో సుప్రీంకోర్టు ఆదేశించింది. కానీ ప్రాసిక్యూషన్ సాక్ష్యాధారాలుగా సమర్పించిన డాక్యుమెంట్లు దాదాపు 800 కాగా, వందల సంఖ్యలో ఆడియో, వీడియోలు, వేర్వేరు ఫైళ్లు ఉన్నాయి. 351 మంది సాక్షులున్నారు. వివిధ పక్షాల న్యాయవాదుల వాదనలు సరేసరి. కనుక ఇంత విస్తృతమైన, సంక్లిష్టమైన కేసు గనుకే సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించిన గడువులోగా తీర్పునివ్వడం సాధ్యపడలేదని దీన్ని విచారించిన న్యాయమూర్తి ఎస్‌కే యాదవ్ చెప్పడం గమనార్హం.

బాబ్రీ మసీదు కూల్చివేత కేసులో మీడియా ప్రతినిధిగా దగ్గరుండి చూసిన రాధికా రామశేషన్ ఇచ్చిన సాక్ష్యాధారాలు నిందితుల ప్రమేయాన్ని రుజువు చేస్తాయని ఆనాటి ఐపిఎస్ అధికారిణి అంజూ గుప్తా భావించారు. ఆ రోజు మసీదు వద్దకు వచ్చిన కరసేవకుల చేతుల్లో దాన్ని కూల్చడానికి కావలసిన ఉపకరణాలున్నాయని, ముందస్తు ప్రణాళిక లేనప్పుడు అదెలా సాధ్యమని రాధికా రామశేషన్ ప్రశ్నించారు. వారు ఆ పని కావిస్తుండగా ఉమాభారతి వారిని ఉత్సాహపరచడం కళ్లారా చూశానని, ఆమె మాటలు ఇప్పటికీ తన చెవుల్లో మార్మోగుతున్నాయని చెప్పారు. కూల్చివేత పనులు సాగుతుండగా, అది పూర్తయ్యేవరకూ కదలొద్దని నాయకులు వారిని ఆదేశించారన్నది ఐపిఎస్ అధికారి అంజూగుప్తా మాట. సిబిఐ ఈ కేసులో సాక్ష్యాలు, ఆధారాలు సేకరించడంలో ఎంతవరకూ కృతకృత్యమైందో, అది సమర్పించిన సాక్ష్యాధారాలేమిటో ప్రత్యేక కోర్టు వెలువరించిన 2,300 పేజీల తీర్పు చూస్తే కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా కూడ లేదు. అలాగే లిబర్హాన్ కమీషన్ సేకరించిన సాక్ష్యాధారాలను ప్రత్యేక కోర్టు పరిశీలించ లేదనిపిస్తుంది.

జస్టిస్ లిబర్‌హాన్ కమీషన్ నివేదిక పేర్కొన్న నిర్ధారణలకు, దేశ సర్వోన్నత న్యాయస్థానం గత ఏడాది ఇచ్చిన తీర్పులో స్పష్టంగా చెప్పిన అంశాలకు కూడా సిబిఐ కోర్టు తీర్పు వ్యతిరేకంగా ఉంది. ఆర్ఎస్ఎస్,

విహెచ్‌పి, బిజెపి సహా వివిధ సంఘపరివార్ సంస్థలకు, నాయకులకు పదుల కోట్ల రూపాయలు బ్యాంకు అకౌంట్ల ద్వారానే బదిలీ అయ్యాయని జస్టిస్ లిబర్‌హాన్ కమీషన్ స్పష్టంగా పేర్కొంది. ఇంత సొమ్ము బదిలీ కావడం, దశలవారీగా ప్రజలను రెచ్చగొట్టి సమీకరించడం ముందస్తు ప్రణాళిక, పథకం ప్రకారమే ఈ విధ్వంసానికి పాల్పడ్డారనడానికి నిదర్శనమని కూడా చెప్పింది. ఈ మొత్తం దుర్ఘటనకు కుట్ర పన్నిన తీరును లిబర్హాన్ కమీషన్ 100 మంది సాక్ష్యులను విచారించి ఇచ్చిన నివేదికలో స్పష్టంగా పేర్కొంది. బాబ్రీ మసీదు కూల్చివేత చట్టాన్ని తీవ్రంగా ఉల్లంఘించడమేనని గత ఏడాది నవంబర్ 8న అయోధ్య తీర్పులో సుప్రీంకోర్టు కూడ స్పష్టం చేసింది.

బాబ్రీ మసీదు కట్టడంపై వందేళ్ల నుంచి వివాదం నడుస్తోంది. అయితే ఆ ప్రాంగణంలోకి ప్రైవేటు వ్యక్తులు చొరబడి, ఆ కట్టడాన్ని ధ్వంసం చేయడాన్ని ఏ చట్టమూ అంగీకరించదు. కనుక ఆ రోజున అక్కడ విధ్వంసానికి దిగినవారు చట్టం దృష్టిలో దోషులే. ఈ కేసు విచారణ జరపాల్సిందేనని 2017లో చెప్పిన సుప్రీంకోర్టు ధర్మాసనం దృష్టిలో అయితే ఇలా కూల్చివేతకు పాల్పడటం 'ఒక అసాధారణమైన చట్ట ఉల్లంఘన'. ఇప్పుడు వెలువడిన తీర్పు గమనిస్తే సిబిఐ పకడ్బందీ సాక్ష్యాధారాలను సమర్పించలేకపోయిందన్న అభిప్రాయం లేదా న్యాయమూర్తి సాక్ష్యాలను పరిగణలోకి తీసుకోదలుచుకోలేదన్న సందేహం ఎవరికైనా కలుగుతుంది. బాబ్రీ వివాదం మొదలయ్యాక దేశంలో ఏర్పడ్డ వైషమ్య భావాలు ఆ కట్టడం కూల్చివేతతో పరాకాష్టకు చేరాయి. దేశ వ్యాప్తంగా జరిగిన మత కల్లోలాల్లో 2,000 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. పతాక శీర్షికల కెక్కిన ఈ మాదిరి కేసుల్లో సైతం సిబిఐ సరైన సాక్ష్యాధారాలు సమర్పించలేకపోవడం, కేసు విచారణకు ఇరవై ఎనిమిది సంవత్సరాలు పట్టడం, వందల మంది పాల్గొన్న విధ్వంస ఉదంతంలో చివరకు ఒక్కరినైనా శిక్షించలేకపోవడం సాధారణ పౌరులకు ఆశ్చర్యం కలిగించకమానదు.

అయోధ్యలో జరిగిన ఘటనలు యాధృచ్ఛికం అని చిత్రించడంతో సిబిఐ కోర్టు హిందూ ఫాసిస్టు పాలకులకు తన నిబద్ధతను, విధేయతను చూపింది. కరసేవకులు చేసిన 'ఉద్వేగపూరిత' నినాదాలను గౌరవనీయ కోర్టు గమనంలోకి తీసుకోలేదు. 'హమ్ ఐసె బానాయేంగె హిందూ రాష్ట్ర' (హిందూ దేశాన్ని మేము ఇలాగే నిర్మిస్తాం) అనేది ఆ నినాదాల్లో ఒకటి, జన్మభూమి ఆందోళన హిందూ రాజ్యం సాధించుకునేందుకు ఆరంభ చర్య అని ఇప్పుడు నిర్దోషులుగా ప్రకటించబడిన వారితో సహా సంఘ్ పరివార్ శక్తులు బాబ్రీ మసీదు కూల్చివేతకు ముందు, తర్వాత చెబుతూ వస్తూనే ఉన్నారు. సిబిఐ ప్రత్యేక నాయ్యస్థానానికి మాత్రం 351 మంది సాక్ష్యులను విచారించిన తర్వాత కూడా కోట్ల రూపాయల ఖర్చు, పెద్దఎత్తున ఆయుధ సామాగ్రిని సమకూర్చుకోవటం, పాలనా యంత్రాంగానికి అవరోధాలు కల్పించటం, రెండు రోజుల తర్వాత కూడా హెలికాప్టర్ ద్వారా తప్ప జిల్లా కలెక్టర్ అయోధ్య చేరుకోలేని రీతిలో అయోధ్యను సంఘపరివారం దిగ్బంధనం చేయటం ఏదీ పథకం ప్రకారం, కుట్ర పూరితంగా జరిగిన చర్యగా కనిపించక పోవడం శోచనీయం. భారతదేశంలో న్యాయ వ్యవస్థ నేడు కొన్ని పర్యాయాలు చరిత్ర, సత్యం పట్ల కళ్లు మూసుకుంటున్నది. సిబిఐ ప్రత్యేక కోర్టు తీర్పు అందుకు నిదర్శనం.

మొత్తం ఉదంతంలో నేరపూరిత కుట్ర ఉందన్న ఆరోపణను తిరస్కరించటానికి కోర్టు ప్రత్యేకించి ఆసక్తి చూపింది. అయితే బాబ్రీ మసీదు కూల్చివేత చరిత్రను దేశం మరిచిపోజాలదు. అది దాదాపు మూడు దశాబ్దాల చరిత్ర. మతోద్రేకాలతో నిండిన భావాలు అందులో వహించిన పాత్రను నిరాకరించటం సాధ్యం కాదు. ఒక మహా పన్నాగంలో భాగంగానే కరసేవ, 'సంకేతాత్మక శిలాన్యాస్'కు పథక రచన జరిగింది. మహా మేధావి ముందస్తు ప్రణాళిక ప్రకారమే వేల సంఖ్యలో సంఘ్ పరివార్ కార్యకర్తలు ఆ ప్రదేశానికి చేరారు. వారిని 'అరాజకులు'(దుండగులు)గా పిలవటానికి కోర్టు ఇప్పుడు ఆతృత చూపింది. 32 మంది నిందితులు అమాయకులని తీర్పునిచ్చింది. ఇదంతా శంకరాచార్యుని 'గజం మిథ్య– పలాయనం మిథ్య' వలే 'అయత్నకృత సమీకరణ, అయత్నకృత కూల్చివేత'గా సిబిఐ కోర్టు పేర్కొనడం గమనార్హం. నిజానికి బాబ్రీ మసీదు కూల్చివేత రోజున వందల సంఖ్యలో విలేకరులు అయోధ్యలో ఉన్నారు. బిజెపి అగ్రగామి నాయకులంతా అయోధ్యలో తిష్ట వేశారు. మసీదు మూడు గుమ్మటాల్లో ఒక్కో గుమ్మటం కూలిపోతుంటే సమీపంలో ఏర్పాటు చేసిన వేదిక మీద కూర్చుని బైనాక్యులర్స్ పెట్టుకుని మరీ అద్వానీ, మురళీ మనోహర్ జోషి, అశోక్ సింఘాల్, ఉమాభారతి వంటి నేతలు పరిశీలించారు. పర్యవేక్షించారు వీటన్నింటిని విలేకరులందరూ పూర్తి నిడివి కథనాలు ప్రచురించారు.

అయోధ్యలో 450 ఏళ్ల క్రితం నుండి ఉన్న బాబ్రీ మసీదు 1992 డిసెంబర్ 6న నేలమట్టమైంది. 1992 డిసెంబర్ 6 నాడు అక్కడ ప్రత్యక్షంగా ఉన్న నాయకులు కూల్చివేతను ప్రోత్సహించారన్న కథనాలు ఎన్నో ఉన్నాయి. వాటికి సాక్ష్యాలు లేవని న్యాయస్థానం పేర్కొనడం విడ్డూరంగా ఉంది. ఎవరూ కుట్ర చేయకుండా, ఎవరూ రెచ్చగొట్టకుండా బాబ్రీ మసీదు తనంతట తానే కూలిపోయిందా? కూల్చివేత వాస్తవమే కానీ, కూల్చిన నేరస్థులు న్యాయస్థానానికి కనిపించకపోవడమే విచిత్రం. దీంతో మనుధర్మానికి న్యాయవ్యవస్థ మద్ధతు పలుకుతుందా అనే ప్రశ్నలు సామాన్యుల్లో వెల్లువెత్తుతున్నాయి. నిజానికి, విధ్వంసానికి కారణాలను కేవలం ప్రత్యక్షంగా, భౌతికంగా వ్యక్తులలో మాత్రమే వెదకడం సరి అయినది కాదు. ఒక క్రమంలో జరిగిన సంఘనటకు బాధ్యతను నిర్ధారించేటప్పుడు వివిధ దశలలో పోగుపడిన ఆవేశాలను, సంఘ్‌పరివార్ నాయకులిచ్చిన నినాదాలను, వారి ఉద్యమ లక్ష్యాలను పరిగణనలోకి తీసుకోవాలి.అది ఎలా రాజ్యాంగ విలువలకు విరుద్ధమైందో నిర్ధారించాలి. కానీ, అలా జరగకపోవడం శోచనీయం.

బాబ్రీ మసీదు కూల్చివేత జరిగిన స్థలాన్ని కూల్చివేసిన వారికే ఇస్తూ సివిల్ వివాదంలో సుప్రీమ్ కోర్టు తీర్పు వచ్చింది. భారత సుప్రీంకోర్టు గత సంవత్సరం నవంబర్‌లో ఇచ్చిన అయోధ్య తీర్పులో ఇలా చెప్పింది. "మసీదు కూల్చివేత, ఇస్లామిక్ కట్టడాన్ని నామరూపాలు లేకుండా చేయటం చట్టపాలనను భయజనకంగా ఉల్లంఘించింది". హిందువుల క్లెయిములకు అనుకూలంగా అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చినప్పటికీ, కూల్చివేతను చట్టవిరుద్ధ చర్యగా పేర్కొన్నది. ఇప్పుడు సిబిఐ కోర్టు ఆ చట్టవిరుద్ధ చర్యను అమాయకమైన అయత్నకృత చర్యగా మార్చి వేసింది. గుర్తు తెలియని సంఘ వ్యతిరేక శక్తులు క్షణికావేశంలో ఒడిగట్టిన చర్యగా సిబిఐ కోర్టు తనకుతానే నిర్ధారించుకుంది. ఈ అభివర్ణనలన్నీ భారత న్యాయవ్యవస్థ నేటి దయనీయ స్థితిని దానికవిగా తెలియజేస్తున్నాయి. యావత్ పరిపాలనా వ్యవస్థ భిన్నమైన మార్గం పట్టినప్పుడు న్యాయవ్యవస్థ ఒక్కటే యుక్తాయుక్త వివేచనతో ఉండజాలదు.

కార్యనిర్వాహకులు చేబట్టిన దేశ నిర్మాణ ప్రస్తుత పథం చట్టసభలో, న్యాయవ్యవస్థలపై ఒకే రీతిన తన ప్రభావం చూపుతున్నది.

1989లో పాలంపూర్‌లో జరిగిన బిజెపి జాతీయ కార్యవర్గ సమావేశాల్లో బాబ్రీమసీదు కుట్రకు వ్యూహరచన జరిగింది. బాబ్రీ మసీదును కూల్చేసి దాని స్థానంలో రామాలయ నిర్మాణం చేయాలన్నది బిజెపి లక్ష్యంగా ప్రకటించింది. అయోధ్యలో బాబ్రి మసీదు స్థలాన్ని సంఘ్ పరివార్ రామ జన్మభూమిగా ప్రకటించింది. మసీదున్న చోటే మందిర్ కట్టాలని తీర్మాణించింది. మసీదును కూల్చే మందిర్ కట్టాలి. అందువల్ల మందిర్ నిర్మాతలే మసీదు కూల్చివేత కుట్రదారులు. మసీదు కూల్చివేత రోజున అయోధ్యకు దేశం నలుమూలాల నుంచి రెండు లక్షల మంది కరసేవకులు (విశ్వహిందూ పరిషత్, శివసేన తదితర సంస్థల కార్యకర్తలు) తరలిరావడానికి కారకులెవరు? అక్కడున్న అద్వానీ, మురళీమనోహర్ జోషి, ఉమా భారతి, అశోక్ సింఘాల్ తదితరుల ఉద్వేగభరిత ఉపన్యాసాలతో ఆవేశపూరితులైన కరసేవకులు 'దేశ మిశ్రమ సంస్కృతికి నిదర్శనం'గా నిలిచిన ఆ చారిత్రక కట్టడాన్ని సమూలంగా ధ్వంసం చేశారనడం వాస్తవం కాదా!

కూల్చివేసిన చోట మరో కట్టడం నిర్మించడానికి జరిగిన కార్యక్రమంలో సాక్షాత్తూ దేశప్రధానే పాల్గొన్నారు. ఇంతా జరిగిన తరువాత, కూల్చివేత ఎందుకోసం జరిగిందో ఆ ప్రయోజనం నెరవేరడానికి మార్గం సుగమం అయినప్పుడు, కూల్చివేత తప్పని చెప్పినా ఉపయోగం ఏమిటి? రామాలయ నిర్మాణం ఆరంభం ఒక్కటే ప్రయోజనం కాదు, నిజానికి అది ఒక అనుబంధ ప్రయోజనం. అసలు ప్రయోజనం, పెద్ద ఎత్తున జనసమీకరణ, తద్వారా రాజకీయ ప్రయోజనం పొందగలిగారన్నది జగమెరిగిన సత్యం. బాబ్రీ మసీదు కూల్చివేత, అనంతర నిరసనలు, మత హింసాకాండ, పోలీసు కాల్పులతో ఎంతో ప్రాణనష్టం జరిగింది. విభజన వాతావరణం స్థిరపడింది. ప్రజలలో విభజన ఓట్లను ప్రభావితం చేస్తూ వచ్చింది. డిసెంబర్ 6 పర్యవసానాలు నేటి కేంద్ర అధికారపీఠం రూపంలో చూస్తున్నాము. చట్టం, న్యాయం, రాజ్యాంగం అంటే గౌరవంలేని ఫాసిస్టు శక్తులకు అధికారం అప్పగిస్తే ఏం జరుగుతుందో ఇప్పటికైనా దేశ ప్రజలకు అర్థమై ఉండాలి.

రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా రథయాత్రలు, కరసేవలు నడిపించిన అద్వానీ జైశ్రీరాం అంటూ తీర్పు తన విశ్వాసాన్ని బలోపేతం చేసిందన్నారు. బాబ్రీ మసీదు విధ్వంసం కుట్ర కేసులో తీర్పు వెలువడిన వెంటనే 'ఎట్టకేలకు న్యాయం గెలిచింది' అని రక్షణమంత్రి రాజ్ నాథ్‌సింగ్ వ్యాఖ్యానించారు. న్యాయమంటే సంపన్నులకు, అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా తీర్పులు చెప్పడం కాదు. రీతాంబరి, సాక్షి మహరాజ్, వినయ్ కతియార్ వంటి వారు దురుసు వ్యాఖ్యలే చేశారు. ఆర్ఎస్ఎస్, హిందూ మహాసభ, బజరంగ్ దళ్ వంటి సంస్థలన్నీ తీర్పును ఘనంగా స్వాగతించారు. 1992 డిశంబర్ 6న బాబ్రీ మసీదు కూల్చివేతకు గర్వపడుతున్నామని ఈ నాయకులంతా ప్రకటించిన వార్తలు, వీడియోలు ఉన్నాయి. రాముడి కోసం ఎంత శిక్షయినా భరిస్తామని బీరాలు పలికిన నేతలు ఇప్పుడు తృప్తిగా ఉన్నారు. మొత్తంగా మసీదు కూల్చివేత అనేది దేశ బహుళత్వం, మతసామరస్యతలకు గొడ్డలిపెట్టులాంటి పరిణామం. దేశంలో మత, మితవాద రాజకీయ శక్తుల విజృంభణకు దారితీసిన పరిణామం. మత రాజకీయాలకు తెరతీసిన పరిణామంగా స్పష్టం అవుతుంది.

ఈ తీర్పును తప్పు పడుతూ ప్రధాన ఆంగ్ల పత్రికలు హిందూ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, టెలిగ్రాఫ్, హిందూస్థాన్ టైమ్స్, టైమ్స్ ఆఫ్ ఇండియా తదితర పత్రికలు నిందితులందరినీ వదిలివేయడం పట్ల అసమ్మతి వెలిబుచ్చుతూ సంపాదకీయాలు రాశాయి. ఉద్దేశపూర్వకమైన ఉపేక్షతో కేసు ఓడిపోయినా సిబిఐ ఇప్పటికైనా కండ్లు తెరిచి బలమైన వాదనలతో ఉన్నత న్యాయస్థానాలలో పోరాటం కొనసాగించాలని సూచించాయి. ఈ తీర్పుపై తదుపరి అప్పీలుకు వెళ్లే విషయం చెప్పలేనని సిబిఐ న్యాయవాది లలిత్‌కుమార్ చెప్పడం యాధృచ్ఛికం ఏమికాదు. అధునిక మనువులు అధికార పీఠాల మీద ఆసీనులైన పర్యావసానమిది. భారతదేశ కీర్తి ప్రతిష్టలు అంతర్జాతీయంగా మసకబార్చిన బాబ్రీ మసీదు కూల్చివేత దుర్ఘటన గురించి సిబిఐ న్యాయస్థానం ఇచ్చిన తీర్పు కనీస న్యాయసూత్రాలు, ప్రాథమిక న్యాయవిలువలను ఉల్లంఘించటంతో న్యాయవ్యవస్థ సంపూర్ణంగా పాలకవర్గం, పాలక పార్టీ చేతిలో బందీ అయిన తీరుకు ఉదహరణగా నిలుస్తుంది.

మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుండీ దేశంలో మతతత్వ విచ్ఛిన్నకర ధోరణులను పెంచి పోషించారు. రాజ్యాంగ వ్యవస్థలన్నిటిలోకి సంఘ్‌పరివార్ శక్తులు చొరబడ్డాయి. బిజెపి పూర్తి మెజార్టీతో రెండోసారి అధికారం చేపట్టిన అనంతరం మోడీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ ఆగడాలు విశృంఖలంగా చెలరేగుతోన్నాయి. ప్రశ్నించిన వారి గొంతు నులిమేయడం, ప్రతిపక్షాన్ని అణచివేసేందుకు తప్పుడు కేసులతో సహా అన్ని విధాలా నిరంకుశ చర్యలకు పాల్పడుతోంది. ప్రజా మేధావులపై, ప్రజా కళాకారులపై, రచయితలపై, రాజ్యాంగ రచయితలపై, హక్కుల సంఘ కార్యకర్తలపై, ఉద్యమకారులపై, మీడియాపై అక్రమ కేసులు బనాయించి అక్రమంగా నిర్బంధిస్తుంది. వీరిపై దేశ ద్రోహం, ఉపా చట్టం మోపుతుంది. 'ఒకే దేశం- ఒకే మతం- ఒకే భాష...' వంటి సాంస్కృతిక నినాదాలతో 'భిన్నత్వంలో ఏకత్వం' గల భారత్‌లో బహుళత్వాన్ని లేకుండా చేయాలని చూస్తున్నారు. దేశ సమైక్యత, సమగ్రతలకు, మత సామరస్యానికి చేటు తెస్తున్నారు. ఈ తప్పుడు ధోరణిని, మైనారిటీల పట్ల వ్యక్తమవుతున్న అసహనాన్ని తాజా తీర్పు మరింత బలపరిచినట్లయింది. ఏది ఏమైనా ప్రజాస్వామ్య విలువలకు, లౌకిక భారతదేశంలో మైనార్టీల హక్కులకు, వారి మనోభావాలకు ఈ తీర్పు వ్యతిరేకంగా ఉంది.

గతంలో భారత ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపిన వాస్తవపత్రంలో మసీదు కూల్చివేత జాతీయ అవమానమని పేర్కొంది. సంఘ్ ప్రభుత్వం ఈ జాతీయ సిగ్గును భారతీయ సాంస్కృతిక గౌరవంగా పేర్కొంటుంది. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన ప్రభుత్వాలు అందుకు భిన్నంగా ప్రవర్తిస్తే సరిదిద్దాల్సిన న్యాయ వ్యవస్థలు తమ విధిని విస్మరించాయి. వ్యవస్థలను కాషాయ పాలకులు తమ గుప్పెట్లో బంధించారనే వాస్తవం వెల్లడవుతున్నది. నిజమే, ఈ ప్రశ్నల పరంపర మహా ఉద్యమంగా రూపుదాల్చాల్సిన అవసరం ఉంది. న్యాయం పక్షాన నిలబడే గొంతుకలు సంఘటితం కావాల్సి ఉంది. చట్టాలను, న్యాయవ్యవస్థను, రాజ్యాంగాన్ని పరిహసించే కాషాయ కుట్రల్ని ప్రతిఘటించే శక్తులు ఏకం కావాల్సి ఉంది. ఈ తీర్పు ఆ అవసరాన్ని మరింత ముందుకు తెచ్చింది. ఈ దుర్మార్గం ఇంకానా ఇక సాగదు అని ఎలుగెత్తి చాటే లౌకిక, ప్రజాస్వామిక వాదులు ఒక్కటవ్వాల్సిన, గళమెత్తాల్సిన చారిత్రక సందర్భం ఇది. న్యాయం, చట్టం, రాజ్యాంగ సదాశయం సారంలో, సారాంశంలో నిలిచి వెలగాలంటే పౌర సమాజం చైతన్యం పదునెక్కాల్సిన సమయం ఇది.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

బీహార్ ఎన్నికల్లో నితీశ్ గట్టెక్కేనా?

***బీహార్ ఎన్నికల్లో కుల, ధన, అంగ బలాలు తీవ్ర ప్రభావం చూపుతాయనీ, ఈ దఫా ఎన్నికల్లో కూటములు కూడా పెరిగిపోవడంతో నితీశ్ కుమార్‌కు ఈ ఎన్నికల్లో పోటీ కత్తిమీద సామేననీ అంటున్నారు* నర్సింలు**

దేశంలో కరోనా వైరస్ తీవ్రత కొనసాగుతుండగానే 243 స్థానాలున్న బీహార్ అసెంబ్లీ గడువు నవంబర్ 28తో ముగియనుండడంతో బీహార్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం సెప్టెంబర్ 24న ప్రకటించింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలు 3 దశల్లో అక్టోబర్ 28న, నవంబర్ 3న, 7న జరుగుతాయి. ఎన్నికల ఫలితాలు నవంబర్ 10న వెలువడుతాయి. గత అయిదేళ్లుగా అధికారంలో ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వ పనితీరుపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. గతంతో పోలిస్తే ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ ప్రజాధరణ తగ్గింది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇటీవల పార్లమెంటులో ఆమోదించిన కార్మిక చట్టాల సవరణ పట్ల కార్మికులు గుర్రుగా ఉన్నారు. నూతన వ్యవసాయ చట్టాలపై రైతాంగం ఆందోళన చేస్తున్నది. బీహర్‌లో ఈ చట్టాలు ఎన్నికల అంశంగా మారాయి.

కొవిడ్ సంక్షోభం ప్రభుత్వ వైఫల్యం ఈ ఎన్నికలపై ప్రభావం చూపించే అవకాశం ఉంది. కరోనా కారణంగా విధించిన లాక్‌డౌన్ వల్ల ఉపాధి కోల్పోయినవారు దాదాపు 30 లక్షల ఉంటారు. వేర్వేరు రాష్ట్రాలకు వలసపోయి, ఎన్నో కష్టాలుపడి వెనక్కొచ్చిన లక్షలాదిమంది తమను ప్రభుత్వం సరిగా ఆదుకోలేదని విమర్శిస్తున్నారు. వందల కిలోమీటర్లు నడిచి, సంపాదించినది ఖర్చు పెట్టేసి స్వగ్రామాలకు వచ్చారు. మార్గమధ్యంలోనే కొందరు చనిపోయారు. వీరికి ఉచిత ఆహార ధాన్యాలు అందలేదు, ఉపాధి హామీ పనులు దొరుకలేదు. ఈ పరిణామాలు అధికార ఎన్‌డిఎ కూటమి వల్ల వ్యతిరేకతను చూపుతుంది. ఈ నేపథ్యంలో విజయం అధికార కూటమికి విజయం నల్లేరు మీద నడకేమి కాదు.

కరోనాను అరికట్టడానికి అవసరమైన చర్యలు తీసుకోవడంలో, వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడంలో నితీశ్‌కుమార్ ప్రభుత్వం విఫలమైంది. ఉపాధి లేమి ఆ రాష్ట్రాన్ని మొదటి నుంచి పీడిస్తోంది. కరోనా వచ్చి ఆ సమస్య తీవ్రతను మరింత పెంచింది. లాక్‌డౌన్‌లో రాజస్థాన్‌లోని కోటలో చిక్కుకున్న బీహార్ విద్యార్థుల్ని వెనక్కి తీసుకురావడానికి నితీష్ ఏ మాత్రం ఆసక్తి చూపలేదు. పారిశ్రామికీరణ పెద్దగా లేనందువల్ల నిరుద్యోగిత ఆ రాష్ట్రంలో మొదటి నుంచీ ఎక్కువే. గనులున్న ప్రాంతాలు జార్ఖండ్‌కు పోయాక ఉపాధి అవకాశాలు మరీ తగ్గాయి. బీహార్‌లో నిరుద్యోగిత 10.2 శాతమని గణాంకాలు చెబుతున్నాయి. కనుకనే ఆ రాష్ట్రం నుంచి వలసలు అధికం. అలా వలసపోయినవారు 30 లక్షల మంది వివిధ రాష్ట్రాల్లో ఇబ్బందులు పడుతుంటే నితీశ్ ప్రభుత్వం నిర్లిప్తంగా ఉందని ఆ కుటుంబాల వారు ఆగ్రహంతో ఉన్నారు. ఈసారి వచ్చిన వరదలు కూడా నితీశ్ ప్రతిష్ఠను దెబ్బతీశాయి.

బీహార్ ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బిజెపి, జెడి(యు), ఆర్‌జెడిలకు తోడు పదుల సంఖ్యలో చిన్న పార్టీలు ఎన్నికల్లో పోటీ పడుతున్నాయి. గత రెండు దశాబ్దాల ఎన్నిక సరళిని గమనిస్తే ప్రధాన పార్టీలైన బిజెపి, ఆర్‌జెడి, జెడి(యు), కాంగ్రెసులు కలిసి 70 నుంచి 75 శాతం ఓట్లు పొందాయి. చిన్న పార్టీలకు 25 నుంచి 30 శాతం ఓట్లు పొందాయి. ఇవి కూటములుగా ఏర్పడి పోటీ పడుతున్నాయి. 1) జాతీయ ప్రజాస్వామ్య కూటమి(ఎన్‌డిఎ). దీనిలో ప్రధానంగా బిజెపి, జెడి(యు), వికాస్‌శీల్ ఇన్సాన్, హిందుస్థానీ అవామ్ మోర్చ పార్టీలు ఉన్నాయి. ఈ కూటమి నితీశ్‌కుమార్‌ను ముఖ్యమంత్రిగా ప్రకటించింది. 2) మహాగట్బంధన్ (గ్రాండ్ అలయెన్స్). దీనిలో రాష్ట్రీయ జనతాదళ్, జాతీయ కాంగ్రెస్, సిపిఐ(ఎం.ఎల్), సిపిఐ, సిపిఐ(ఎం)లు భాగస్వామ్యంగా ఉన్నాయి. ఈ కూటమి తేజస్వీయాదవ్‌ను ముఖ్యమంత్రిగా ప్రకటించింది. 3) రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ (ఆర్‌ఎల్‌ఎస్‌పి) నాయకుడు ఉపేంద్ర కుష్వాహ్ మహా కూటమి నుంచి బయటకు వచ్చి బిఎస్‌పి, జన్‌వాది సోషలిస్ట్ పార్టీలతో మూడో కూటమిని ఏర్పాటు చేశాడు. గ్రాండ్ డెమోక్రటిక్ సెక్యులర్ ఫ్రంట్(జిడిఎస్ఎఫ్). దీనిలో యునైటెడ్ డెమోక్రటి సెక్యులర్ అలయెన్స్(యుడిఎస్ఎ), జనతా దళ్ డెమోక్రటిక్ (జెడిడి), సుహెల్దేవ్ భారతీయ సమాజ్ పార్టీ (ఎస్‌బిఎస్‌పి) లు భాగస్వామ్యంగా ఉన్నాయి. ఈ కూటమి ఉపేంద్ర కుష్వాహను ముఖ్యమంత్రిగా ప్రకటించింది. ఎంఐఎం పార్టీ, దేవేంద్ర ప్రసాద్ యాదవ్‌కు చెందిన సమాజ్ వాది జనతాదళ్ డెమోక్రటిక్ పార్టీతో కలిసి మరో కూటమిగా ఏర్పడి పోటీ చేస్తున్నారు. ఇంకా ప్రోగ్రెసివ్ డెమోక్రాటిక్ అలయన్స్ తరపున పప్పుయాదవ్, లోక్ జనశక్తి పార్టీ తరపున చిరగాని పాశ్వాన్, జెజియూ మాజీ ఎమ్మెల్సీ వినోద్ చౌదరి కుమార్తె పుష్పం ప్రియ చౌదరి కొత్త పార్టీ పెట్టి తనను సిఎం అభ్యర్థిగా ప్రకటించుకుంది.

నాలుగు ప్రధాన కూటములే కాగ పలు చిన్న కూటములు ఎన్నికల బరిలో ఉన్నాయి. ఆర్‌జెడి కూటమి ఓట్లను చీల్చే లక్ష్యంతో రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ నాయకుడు ఉపేంద్ర కుష్వాహను ముందుపెట్టి అతని నాయకత్వంలో బిఎస్‌పి, జన్‌వాది సోషలిస్ట్ పార్టీ ఒక కూటమిగా ఏర్పడడంలో బిజెపి హస్తం ఉంది. బీహార్‌లో ఎన్‌డిఎ నుంచి తాము బయటకు వస్తున్నట్లు ఎల్‌జెపి చీఫ్ చిరాగ్ పాశ్వాన్ ప్రకటించడంతో బీహార్ రాజకీయాలు కీలక మలుపు తిరిగాయి. అయితే తాము కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి, రాష్ట్రంలోని పార్టీ నాయకత్వానికి విధేయులుగా కొనసాగుతామని చిరాగ్ పాశ్వాన్ ప్రకటించడం ఆసక్తికరంగా మారింది. తాము బిజెపి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తూ జెడియు అభ్యర్థుల ఓటమే లక్ష్యంగా పని చేస్తామని నితీశ్ టార్గెట్‌గా ఎల్‌జెపి విమర్శలు చేస్తోంది. ఎన్నికల్లో జెడియు అభ్యర్థులను ఓడించి అసెంబ్లీలో అతి పెద్ద పార్టీగా అవతరించి సిఎం పీఠాన్ని అధిష్టించాలనే

కమలనాథుల వ్యూహంగా ఇది కనపడుతోంది. పాశ్వాన్ జెడియు వ్యతిరేక నిర్ణయం వెనుక బిజెపి పెద్దల హస్తం ఉన్నట్లు భావిస్తున్నారు.

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిచి ముఖ్యమంత్రి పదవి చేపట్టాలన్న ఆకాంక్షతో స్వంత కూటమిలోని జెడి(యు) ప్రాబల్యం తగ్గించడానికి బిజెపి పావులు కదుపుతుంది. చిన్న పార్టీలతో పొత్తుల కోసం బిజెపి ఆరాటపడుతుంది. మహాకూటమిని చీల్చిడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. ఇదంతా బీహార్ ముఖ్యమంత్రి పీఠం కోసం ఎప్పటి నుంచో కాచుకు కూర్చున్న బిజెపి నాయకులు జెడియును దెబ్బ తీయడానికి ఎల్‌జెపిని శిఖండిగా ముందు పెట్టి ఆడుతున్న నాటకంగా చూడాలి. అందువల్లనే నితీశ్ ఏలుబడిలో బీహార్ ప్రభావం అడుగంటిందని, దాన్ని పునరుద్ధరించడమే ధ్యేయమని దివంగత కేంద్ర మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్ తనయుడు లోక జనశక్తి పార్టీ(ఎల్‌జెపి) నేత చిరాగ్ పాశ్వాన్ చెబుతున్నాడు. బిజెపి పోటీలో ఉన్న స్థానాల జోలికి వెళ్లకుండా కేవలం జెడి(యు) పోటీ చేసే స్థానాల్లో మాత్రమే తన అభ్యర్థులను నిలపాలని ఎల్‌జెపి సంకల్పించడం గమనార్హం. 243 స్థానాలు గల అసెంబ్లీ సీట్లలో 143 స్థానాల్లో పోటీ చేస్తామని ఎల్‌జెపి ప్రకటించింది. బీహార్‌లో 120 వరకు నమోదిత పార్టీలు ఉన్నాయి. స్వతంత్రంగా నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సిపి), శివసేన, జార్ఖండ్ ముక్తి మోర్చ, ఎల్‌జెపిలు ఎన్నికల్లో తమ అభ్యర్థులను నిలుపుతున్నాయి. మొత్తంగా వివిధ కూటములు, చిన్న పార్టీలతో బీహార్ ఎన్నికలు గందరగోళంగా మారాయి. ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాదన్నది స్పష్టమైనందున, ఎన్నికల ఫలితాలు విడుదలయ్యాకనే నిజమైన బీహార్ ఎన్నికలు ప్రారంభమవుతాయనిపిస్తున్నది.

కూటములు పైకి చూడడానికి బాగానే ఉంటాయి కానీ, వాటి లోపల కుట్రలూ కుతంత్రాలూ దాగి ఉంటాయి. ముఖ్యమంత్రి పదవి చేపట్టిన నితీష్ కుమార్ 2015 ఎన్నికలు జరిగిన సంవత్సరకాలంలోనే మహాకూటమికి వెన్నుపోటు పొడిచి తిరిగి బిజెపి బండి ఎక్కడం ఆయన వ్యక్తిత్వానికి పెద్ద మచ్చ తెచ్చింది. బీహార్‌లోని రెండు ముఖ్య దళిత రాజకీయ శక్తులు ఎల్‌జెపి, మాంఝి నాయకత్వంలోని హెచ్‌ఎఎమ్ (ఎస్) రెండూ బిజెపి వైపునే నిలబడడం గమనార్హం. రాష్ట్ర జనాభాలో 17 శాతం మంది దళితులే. ముస్లిములు, యాదవులు- ఈ రెండు ప్రధాన సామాజిక వర్గాలు ఇప్పటికీ, రాష్ట్రీయ జనతాదళ్ వెనుకే ఉన్నాయి. ఈసారి ఎన్నికల్లో ఒకవేళ ఆర్జేడీ గెలిస్తే మళ్లీ కిడ్నాపుల రాజ్యం, హింసారాజ్యం వస్తుందని ఎంతగా భయపెట్టినా, అది కలిసి వస్తుందో రాదో తెలియదు. ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కుతూ ఏకపక్ష ఎజెండాతో ముందుకువెళుతున్న నరేంద్ర మోడీని ఓటర్లు మళ్లీ దిగ్భ్రాంతి పరుస్తారేమో వేచిచూడవలసిందే!

ఎన్‌డిఎ కూటమిలోంచి లోక్ జనశక్తి పార్టీ (ఎల్‌జెపి) బయటకు వెళ్లిపోవడంతో నాటకీయ పరిణామాలు ఏర్పడుతున్నాయి. ఓ వైపు బిజెపితో ఎల్‌జెపి అంటకాగుతూనే మా పోరాటం ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలోని జెడియుతోనే అని ప్రకటించి జెడియు పోటీ చేసే సీట్లలో తమ పార్టీ అభ్యర్థులు కూడా పోటీ చేస్తారంటూ పేర్కొంది. ఎన్నికల అనంతరం బీహార్‌లో బిజెపి ఎల్‌జెపి ప్రభుత్వం ఏర్పడుతుందని దాని నాయకుడు చిరాగ్ పాశ్వాన్ చెబుతున్నారు. ఎన్‌డిఎ కూటమి నుంచి ఎల్‌జెపి వైదొలుగుతున్న క్రమంలో దాన్ని నివారించడానికి బిజెపి కృషి చేసిన దాఖలాలు ఏమాత్రం లేవు. లోక్ జనశక్తి పార్టీ అధినాయకుడు దివంగత రామ్ విలాస్ పాశ్వాన్ స్వయంగా కేంద్ర మంత్రిగా ఉన్నప్పటికీ బీహార్‌లో కూటమి నుంచి అతని పార్టీ వైదొలగడం వెనుక బిజెపి తెర వెనుక రాజకీయాలను చెప్పకనే చెబుతున్నది. జెడియు పోటీ చేసే స్థానాల్లో అవకాశం లభించని బిజెపి నాయకులు లోక్ జనశక్తి పార్టీలో చేరి జెడి(యు) పోటీ చేస్తున్న స్థానాల్లో పోటీ చేయడానికి వరుస కడుతున్నారు. వీరికి బిజెపి ఆశీస్సులున్నాయి.

కుల రాజకీయాలు రాజ్యమేలే బీహార్‌లో మొదటి విడత ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ వివిధ పార్టీలు, కూటముల మధ్య ఆశ్చర్యకరమైన పరిస్థితులు, చిత్ర విచిత్రమైన పొత్తులు చోటు చేసుకుంటున్నాయి. ఓ కూటమిలోంచి మరో కూటమిలోకి పార్టీలు సునాయాసంగా గోడ దుముకుతున్నాయి. ఇప్పటికే ఆర్‌జెడి 15 మందిని, బిజెపి 9 మంది రెబెల్స్‌ను పార్టీ నుండి సస్పెండ్ చేసింది. అధికార ఎన్‌డిఎ కూటమిలోని జెడియు 122 స్థానాల్లో బిజెపి 121 సీట్లలో పోటీ చేస్తున్నాయి. జెడి(యు) తన వాటాలోని ఏడు సీట్లను ఆర్‌జెడి కూటమి నుంచి బయటకు వచ్చిన దళితనేత జీతన్ రామ్ మాంఝి నాయకత్వంలోని హిందూస్థాన్ అవామ్ మోర్చాకు ఇస్తున్నది. బిజెపి తన స్థానాల్లో ఆరింటిని విపక్ష కూటమి నుంచే బయటకు వచ్చిన వికాశ్ శీల్ ఇన్సాన్ పార్టీకి కేటాయించింది. దీంతో జెడియు, బిజెపిలు నికరంగా చెరో 115 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. ఆర్‌జెడి, కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్) పార్టీలు అధికారిక ఎన్‌డిఎని గద్దె దించే లక్ష్యంతో గ్రాండ్ అలయన్స్‌గా ఏర్పడి ఉమ్మడిగా పోటీ చేస్తున్నాయి. ఆర్‌జెడి 144 స్థానాలకు, కాంగ్రెస్ 70 సీట్లకు, సిపిఎం4, సిపిఐ 6, సిపిఐ(ఎంఎల్) 19 స్థానాలకు ఉమ్మడిగా పోటీ చేస్తున్నాయి.

లోక్ జనశక్తి పార్టీ అగ్రనేత రామ్ విలాస్ పాశ్వాన్ ఎన్నికల ముందు మరణించడం, లాలూ ప్రసాద్ యాదవ్ జైలులో ఉండడం ఎల్‌జెపి, ఆర్‌జెడి ప్రచారం పేలవంగానే ఉంటుందని చెప్పవచ్చు. ప్రస్తుత అసెంబ్లీలో 2 స్థానాలు మాత్రమే కలిగి ఉండి, 6 శాతం వరకు ఓటు బ్యాంకు (దుషాదులు) కలిగి ఉన్న ఎల్‌జపి ఎన్నికలను ప్రభావం చేస్తుందా అన్న సందేహం రావడం సహజం. అయితే తన ఓటు బ్యాంకుతో జెడి(యు) గెలుపు అవకాశాలను దెబ్బతీయగల సామర్థ్యం మాత్రం ఉందని చెప్పవచ్చు. మరోవైపు జనాభాలో 17 శాతంగా ఉన్న ముస్లిం ఓటర్లను మహాకూటమి తనవైపు మలుచుకుంటుందా అన్నది ఇప్పుడే చెప్పలేం. కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాగత నిర్మాణం బలంగా లేదు. ఓటర్లను ప్రభావితం చేసే స్థానిక నాయకత్వం లేదు. నితీశ్‌కుమార్ ఎన్నికల అనంతరం శివసేన, కాంగ్రెస్, ఆర్‌జెడిలతో జతకట్టిన ఆచార్యపడాల్సింది లేదు.

కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వ విధానాల పట్ల ప్రజా వ్యతిరేకత తీవ్రంగా ఉన్న నేపథ్యంలో సమర్థవంతమైన ప్రతిపక్షం లేనందున, మరోవైపు ప్రతిపక్ష పార్టీలలో ఐక్యత లేనందున బీహార్ ఎన్నికల ఫలితాలను సరిగా ఊహించలేం. గ్రాండ్ అలయెన్స్ ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను నమ్ముకుని ముందుకు వెళ్తుంది. బిజెపి- జెడి(యు) ఎన్నికల పొత్తు వల్ల జెడి(యు)కు లాభం కన్నా నష్టమే ఎక్కువ జరిగే అవకాశం కనిపిస్తుంది. ఫలితాలు వెలువడిన అనంతరం ఎన్‌డిఎ ఒకవేళ విజయం సాధించినా నితీశ్ కుమార్‌కు ముఖ్యమంత్రి పదవి లభించడం అనుమానమే. ప్రస్తుతం నితీశ్‌కుమార్‌ని ఎన్‌డిఎ కూటమి సిఎం అభ్యర్థి అని బిజెపి చెబుతున్నా ఎన్నికల ఫలితాల అనంతరం బిజెపికి, జెడియుకు వచ్చిన స్థానాలే ముఖ్యమంత్రి అభ్యర్థిని నిర్ణయిస్తాయి. బిజెపి కన్నా తక్కువ స్థానాలువస్తే నితీశ్‌కుమార్ ముఖ్యమంత్రి కావడం దాదాపు అసాధ్యం. లోక్ జనశక్తి పార్టీ చీల్చే ఓట్లను బట్టి నితీశ్ కుమార్ భవితవ్యం ఆధారపడి ఉంది. వీ

(రచయిత ఉపాధ్యాయులు)

మనస్సాక్షి గల మనుషుల అరెస్టు

భీమా కోరేగాం కేసులో నిందితుల పేరు మీద రాజ్యం అరెస్టు చేసిన ప్రజా మేధావుల స్వభావాలను సొంత అనుభవం నుంచి వివరిస్తున్నారు **శివ్ విశ్వనాథన్**

మా నాన్న ప్రతిభావంతుడైన లోహశాస్త్రవేత్తగా టాటాల కంపెనీలో పనిచేస్తుండేవాడు. అప్పుడు మేం జంషెడ్ పూర్ లో ఉంటుండేవాళ్లం. రోజూ వాహ్యాళికి చాల దూరం నడుస్తుండేవాళ్లం. ఒకరోజు సాయంత్రం మేమలా నడుస్తుండగా, టాటా 'కొండల' నుంచి కరిగిన, మెరుస్తున్న చిట్టెం ధారగా చిమ్మడాన్ని చూశాను. టాటాల వల్లనే సూర్యాస్తమయం అవుతున్నదనిపించింది. ఆ తర్వాత కొద్ది నిమిషాలకే దాల్మా కొండలు వెలుగులీనుతూ మండడం కనిపించింది. ఆ మంటలు అక్కడి ఆదివాసులు తమ పోడు వ్యవసాయం కోసం అడవిని తగులబెడుతున్న మంటలు. ఆ రెండు దృశ్యాలూ అద్భుతంగానే అనిపించాయి. మా నాన్నయితే వాటివైపు మైమరచినట్టు చూశాడు. ఆ తర్వాత, దాదాపు ఏదో రహస్యం చెపుతున్నట్టుగా, "ఆ రెండు దృశ్యాలూ ఉండవలసినవే. న్యాయం అంటే ఆ రెంటి మధ్య సమతుల్యతే" అన్నాడు. మా నాన్న దృష్టిలో ఆదివాసి సమాజపు కొనసాగింపులోనే టాటాల సాధికారత ఉంది. అది మరొక భిన్నమైన ప్రపంచపు దృష్టి.

జెసూయిట్ ఫాదర్ స్టాన్ స్వామి గురించి విన్నప్పుడు, నాకు ఆ భిన్నమైన ప్రపంచపు దృష్టే గుర్తుకొచ్చింది. ఆదివాసులు, ఆదివాసుల జీవన విధానం కొనసాగడం ఎందువల్ల అవసరమో అర్థం చేసుకున్న దృష్టి అది. జెసూయిట్లు మతాంతరీకరణ జరుపుతారని మామూలుగా జనం అనుకుంటారు. కాని కొందరు జెసూయిట్లు మత పరివర్తనకు వ్యతిరేకంగా పోరాడారని వారు గుర్తించరు. స్టాన్ స్వామి వంటి జెసూయిట్లు అభివృద్ధి అనే ఛాందసానికి పరివర్తన చెందవద్దని బోధించారు. అంచులలో ఉన్న ప్రజలను ఈ అభివృద్ధి అనే మతం ధ్వంసం చేస్తుందని చెప్పారు. ఎనభై మూడు సంవత్సరాల స్టాన్ స్వామి ఆదివాసి ప్రపంచం, దాని కలలూ ఆశలూ ఉనికిలో ఉండాలనే ఆశకు ప్రాతినిధ్యం వహించారు. మరో ప్రపంచానికి ప్రాతినిధ్యం వహించారు. కుట్ర చేశాడనే ఆరోపణతో ప్రభుత్వం ఆయనను అరెస్టు చేసినప్పుడు, అర్థం చేసుకోవలసినదేమంటే ఆదివాసుల జీవన విధానమైన ఆశనూ న్యాయాన్నీ అరెస్టు చేశారని. హేమంత్ సోరేన్ లాంటి ఆదివాసి ముఖ్యమంత్రి పాలనలో స్టాన్ స్వామి అరెస్టు కావడం విచారకరం. వాస్తవానికి హాస్యాస్పదం. కేంద్రం ఆదేశాలకు తలఒగ్గిన ముఖ్యమంత్రి మొదట మౌనంగా ఉండిపోయాడు.

మనస్సాక్షి గల మనుషులను అరెస్టు చేయడంలో ఈ పాలనా వ్యవస్థ విషాదం, దాని చౌకబారుతనం వెల్లడి అవుతున్నాయి. ఇక్కడ వారి భావజాలాన్ని వ్యతిరేకించడం కూడ కాదు, వారి మనస్సాక్షినీ, వారి దయార్ద్రహృదయాన్నీ వ్యతిరేకిస్తున్నారు. నేను రాసిన ఒక వ్యాసం చదివి కోబడ్ గాంధీ నాకు కృతజ్ఞతలు చెపుతూ ఉత్తరం రాసినప్పుడు నాకు వారి మనస్సాక్షీ, దయార్ద్ర హృదయమూ ఎంతటివో అర్థమైంది. ఆ ఉత్తరం ఎంతో ఔన్నత్యంతో కూడి ఉంది. జైలు పరిస్థితుల గురించి ఉన్నది ఉన్నట్టుగా తెలియజేసింది. ఆయన ఆ ఉత్తరంలో బాధపడినదల్లా ఆదివాసి ప్రాంతాలలో కార్యకర్తగా పనిచేస్తూ మరణించిన తన సహచరి గురించి మాత్రమే.

ఆ ఉత్తరం చదువుతున్న క్షణాన నాకనిపించినదేమంటే, ఈ నక్సల్ అనే మాట అసలు న్యాయం కోసం పోరాడే మనుషులకు ఉపయోగించదగినదేనా అని. వాళ్లు విధ్వంసం కోసం కాక సాహసిక ఆయుధాలతో ఒక భిన్నమైన స్వప్నం కోసం పోరాడుతూ, తమ మనస్సాక్షి ప్రకారం అసమ్మతి ప్రకటిస్తున్నవారని నాకనిపించింది. ఇటువంటి ఆదర్శవాదం పట్ల పాలనావ్యవస్థ చూపుతున్న కసి నాకు ఆశ్చర్యం కలిగించింది. మన సమాజంలో ఉత్తములైన మనుషులు, కోబడ్ నుంచి స్టాన్ దాకా, జైళ్లలో మగ్గిపోతుంటే పౌరధర్మం అంటే ఏమిటి, సమాజం అంటే ఏమిటి అని అడగక తప్పదు. ఈ జాబితా చూస్తుంటే నేరస్తుల చిట్టా అనిపించడం లేదు, గౌరవ పురస్కారాల జాబితా అనిపిస్తున్నది. వీళ్లు కానూ సన్యాల్ లాగ, జంగల్ సంతాల్ లాగ మొరటు తర్కమేమీ మాట్లాడడం లేదు. వీళ్లు న్యాయం గురించి, వేదన గురించి మాటాడుతున్నారు. విప్లవాన్ని దైవసమానం చేయడం లేదు. ఏమాత్రం అసమ్మతి ప్రకటించకుండా జైలులో నిశ్శబ్దంగా గడుపుతున్నారు. కోబడ్ గాంధీ ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ లో నాకు ప్రొఫెసర్ అయి ఉండేవాడు. ఇప్పుడు మహాశ్వేతాదేవి వంటి రచయిత ఉంటే బాగుండునినిపిస్తున్నది నాకు. ప్రస్తుత పాలనా వ్యవస్థ వంటి వాటి బుకాయింపులను, కపటత్వాన్ని ఎత్తి చూపే అద్భుతమైన దృష్టి ఉండేదామెకు.

ఈ పాలనా వ్యవస్థ అధికారం పెరిగినకొద్దీ ఇటువంటి మనుషుల పట్ల దాని స్టాలినిజం బైటపడుతుంటుంది. కోబడ్, మహాశ్వేత ఆ నియంతృత్వ పోకడలకు సాక్షులు. ఒకరోజు ఆయన మాట్లాడుతుండగా వింటుంటే, ఆ ప్రముఖ అసమ్మతివాది ఎంత వివేకవంతుడో నాకు తెలిసివచ్చింది. మోడీ కాలంలో జాతీయవాదిగా ఉండే ఒకే ఒక్క అవకాశం దేశ ద్రోహిగా ఉండడమేనని ఆయన అన్నాడు. ఒక ఆదివాసి తెగ జీవితానికి రక్షగా నిలవడం, ఒక కళను ఒక ఆలోచనావిధానంగా పరిరక్షించడం, దయతో ఉండడమే పౌరసత్వపు సారాంశమని నిర్వచించడం ఇవాళ దేశద్రోహంగా మారిపోయాయి. ఇటువంటి సందర్భంలో దయ అనే మాట వచ్చినప్పుడల్లా కొందరు మదర్ తెరెసాను ఉదహరించి, ఆమె మతాంతరీకరణకు పురికొల్పిందని ఆరోపిస్తారు. ఆ

కారణం మీద ఆమెను వేధించడానికి ఒక అధికారి ప్రయత్నించినప్పుడు జ్యోతి బసు దాన్ని అడ్డుకోవడం నాకు గుర్తుంది. వేదనతో, న్యాయంతో ఆమె లాగ మమేకమయ్యే వాళ్లెవరూ లేరని జ్యోతి బసు అన్నాడు. అలా ఒక మార్క్సిస్టూ, ఒక మిషనరీ ఇద్దరూ కూడ దయగా ఉండడంలో మార్క్స్ నూ, క్రైస్తవాన్నీ మించిన విశాల దృష్టి ఉన్నదని అర్థం చేసుకున్నారు. దయ చూపడమంటే ప్రేమించడం, కరుణ చూపడం.

ఆ అర్థంలో సుధా భరద్వాజ్ కూడ దయాళువు. తాను ఏ ప్రజల కోసం పోరాడిందో ఆ ప్రజల పట్ల దయతో ఉండింది. అలా దయ చూపినందుకు ఆమెను రాజ్యం శిక్షించదలచుకోవడం విచిత్రం. కాని ఇక్కడ అర్థం చేసుకోవలసిన విషయమేమంటే కనికరం లేని ప్రభుత్వం మాత్రమే పౌరసత్వ సవరణ చట్టాన్ని తయారు చేయగలదు. కొవిడ్ %--% 19 ని ఒక మహా మృత్యు క్రీడగా భావించగలదు. ఏ నిజమైన ప్రజాస్వామిక దేశంలోనైనా మనం స్టాన్ గురించీ, సుధ గురించీ, కోబడ్ గురించీ కథలు చెప్పుకుంటుండేవాళ్లం. కాని ఇక్కడ అందుకు బదులుగా మనం వాళ్లను వేధిస్తున్నాం. పైపైకి ఎగబాకాలనీ, కాలు నిలవకుండా పైకి పోవాలనీ ఆకాంక్షించే తరానికి దయగా ఉండడమే నేరం అని చెపుతున్నాం. ఇటువంటి తలకిందుల వాస్తవాన్ని కాఫ్కా లాంటి రచయిత కూడ సృష్టించగలిగి ఉండేవాడు కాదు.

గత కొన్ని దశాబ్దాల పాలనా వ్యవస్థలన్నీ కూడ తాము ద్వేషించే నక్సల్ అనే ఒక దిష్టిబొమ్మ ప్రతీకను తయారు చేసిపెట్టాయి. భారతదేశంలో ఆ ప్రతీక కవి వరవరరావు. వరవరరావు తన కవిత్వాన్నీ, రాజకీయాలనూ తెలిగ్గా కొనసాగిస్తారు. ఆయనను తొలిసారి చూసిన సందర్భం నాకింకా గుర్తుంది. అది 1984 గ్యాస్ విషాదం తర్వాత భోపాల్ లో జరిగింది. ఆయన అక్కడ న్యాయం గురించి మాట్లాడారు. ఆయన చుట్టూ నిలబడిన ఆదివాసి సమూహం ఒక విచిత్రమైన అదివాసి దేవత బొమ్మ పట్టుకుని ఉన్నారు. ఆ బొమ్మ స్టాలిన్ దని నేను ఆలస్యంగా గుర్తించాను. వరవరరావు చిరునవ్వు నవ్వారు. బహుశా ఆ ఆదివాసులు స్టాలిన్ లోని దుష్టత్వాన్ని మనకన్న మెరుగ్గా అర్థం చేసుకుని దాన్ని లొంగదీశారేమో అని సూచించిందా నవ్వు. న్యాయం కోసం ఎక్కడ ప్రదర్శన జరిగినా వరవరరావు అక్కడ ఉన్నారు. తన కవిత్వం ద్వారా ఒక దయాభరితమైన మౌఖిక భాషను సృష్టించాలని ఆయన శ్రద్ధ తీసుకున్నారు. నా మౌఖికత్వమే నా నైతికత్వం అనీ, నా నిరసనే నా పౌరసత్వ ప్రకటన అనీ ఆయన చెపుతున్నట్టుండేది. ఆ ప్రకటనకు గొప్ప సమ్మోహక వాగ్ధార ఉండేది. ఒక సహజత్వం ఉండేది. ఇవాళ వరవరరావు అనారోగ్యంతో ఉన్నారు. ఆయన ఎక్కువగా దయ చూపుతున్నారు గనుకనే అరెస్టు చేశానని చెప్పుకోవడానికి రాజ్యం గర్వపడుతున్నది. మానవీయత అనే పదం, న్యాయం అనే పదం ఇటువంటి మనుషుల విషయంలో వర్తించేటట్టు కనబడడం లేదు. వీళ్లందరూ తమ పోరాటాలకు ఒక నాగరికతా స్పృహను జోడించారు. కనికరాన్నీ, న్యాయాన్నీ నేరంగా చూసే సమాజం ఎంత చిత్రమైన సమాజం!

అయితే ఇవాళ్టి రాజకీయాలు కేవలం సద్గుణాల ఖండనలు మాత్రమే కాదు, అంతకన్న ఎక్కువ. అధికసంఖ్యాక ప్రజాస్వామ్యం అనేది అసమ్మతిని ద్వేషిస్తుంది. ఎందుకంటే అసమ్మతి భిన్నత్వపు కవిత్వాన్నీ, రాజకీయాలనూ ఉత్సవంగా జరుపుతుంది. ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన హనీ బాబును అరెస్టు చేయడం దానికి ఉదాహరణ. అసమ్మతివాదులు, అసమ్మతి ఊహలు నిజానికి తమ సంస్థలకు ఎక్కువ నిబద్ధంగా ఉంటారు. సంస్థా నిర్మాణాలను శాంతి భద్రతల సమస్యలకు అతీతంగా చూస్తారు. ఒకరు వ్యాఖ్యానించినట్టుగా బహుశా సామాజిక సేవ అనేది కూడ త్వరలో అనుమానిత అంశాల జాబితాలో చేరుతుందేమో. సామాజిక సేవ చేసేవారిని కూడ జైళ్లకు తరలిస్తారేమో. కాని అసమ్మతిని జ్ఞానానికీ, ప్రజాస్వామ్యానికీ సంబంధించిన విశాల నేపథ్యంలో అర్థం చేసుకోవలసి ఉంది. అది ఎప్పటికీ కొనసాగే భిన్నత్వం. ఆధిపత్య పాలనా వ్యవస్థలకు విశ్వవిద్యాలయం అన్నా, దాని బహుళత్వం అన్న ఏమీ తెలియదు. ఒక సంస్థా నిర్మాణంగా విశ్వవిద్యాలయం అనేదే ప్రతి ఒక్క నిరంకుశ, చౌకబారు పాలనా వ్యవస్థలు ఎక్కుపెట్టే మొట్టమొదటి ప్రధాన లక్ష్యంగా ఉంటుంది.

నిజానికి, ఈ మొత్తం వ్యవహారాలలో ఎవరైనా అర్థం చేసుకోవలసినవి బహుళత్వానికీ, చర్చా సంప్రదాయానికీ సంబంధించిన విషయాలు. వాళ్లు మాట్లాడే ప్రతి ఒక్కదానితోనూ ఏకీభవించనవసరం లేదు. కాని మన సమాజం బహుళత్వంతో, స్వేచ్ఛతో ఉండాలంటే అందులో భాగమైన ధిక్కార చలన నియమాలను అర్థం చేసుకోవలసి ఉంటుంది. విషాదకరమైన విషయమేమంటే భావజాలం అనేది నిరసననూ, మేధావిత్వాన్నీ పూర్తిగా ధ్వంసం చేసేసింది. ఆంతరిక, బాహిర భద్రతా అంశాలు కలిసిపోయిన స్థితి ఈ భద్రతా వ్యవస్థకు మొదటి లక్ష్యంగా అసమ్మతినే గురి చూస్తున్నది.

ఈ దాడిలో రెండు రకాలైన అసమ్మతులు దెబ్బతింటున్నాయి. అవి పర్యావరణానికి సంబంధించిన అసమ్మతులు, మానవహక్కులకు సంబంధించిన అసమ్మతులు. ఈ రెండు అసమ్మతులు కూడ మన ఆదివాసి జీవన, ఆలోచనా విధానాలతో సమ్మిళితమైనవి. ఆదివాసుల దుస్థితి, అటవీ చట్టాల సరళీకరణ వంటి అంశాలన్నిటినీ 'అర్బన్ నక్సల్' అనే సాకు కింద తోసివేస్తున్నారు. నక్సల్ అనే ఆ మాటే ఆదివాసి జీవన విధానాన్ని బెదిరించేలా ఉన్నది. అందువల్ల ఇవాళ ఆ మాటను వినిర్మించి అర్థం చేసుకోవలసి ఉన్నది. మార్క్సిజంలోనే రోజా లగ్జెంబర్గ్ నుంచి టియోడర్ షానిన్ దాకా ఉన్న విభిన్న, బహుళ శైలులను అర్థం చేసుకోవలసి ఉన్నది. ఇక్కడే మన మేధావిత్వం గురించి పునరాలోచన చేయవలసి ఉన్నది.

స్టాన్ స్వామి, తదితరుల అరెస్టు ఈ సమస్యలన్నిటినీ లేవనెత్తుతున్నది. ఈ అసమ్మతిదారులు, మేధావులు వాస్తవంగా ప్రజాస్వామ్యపు భిన్న వాదనలకు చిహ్నాలనీ, ఆ వాదనలను నిలవనివ్వాలనీ పౌరులూ విద్యావేత్తలూ గుర్తించవలసిన సమయం ఆసన్నమైంది. నైతికత లేని రాజకీయాలు చిట్టచివరికి బోలు సరుకుగా మిగులుతాయి.

(సుప్రసిద్ధ విద్యావేత్త, రచయిత శివ్ విశ్వనాథన్ రాసిన ఈ వ్యాసం కోల్ కత్తా నుంచి వెలువడే ది టెలిగ్రాఫ్ దినపత్రికలో 23 అక్టోబర్ 2020న అచ్చయిన వ్యాసానికి అనువాదం)

(ఈ వ్యాసంలో రచయిత స్టాలిన్, స్టాలినిజం, కానూ సన్యాల్, జంగల్ సంతాల్ వంటి మాటలను అనవసరంగానూ, అర్థరహితంగానూ నిందాపూరితంగా వాడారని, కొన్ని వాదనలు అసమగ్రంగా, దురభిప్రాయాలతో ఉన్నాయని అనుకున్నప్పటికీ, భిన్నాభిప్రాయాలతోనైనా అరెస్టులను ఖండించడం అవసరమనే దృష్టితో ఈ అనువాదం ఇస్తున్నాం – సం.) వీ

జైల్లో మాకు ధైర్యం ఎక్కడి నుంచి వచ్చింది?

ఒక అక్రమ కేసులో ఇరవై ఐదు రోజులు జైలు నిర్బంధంలో ఉన్న మహిళ* కళ్యాణి, *ట్రాన్స్ జెండర్ వ్యక్తి* తన్మయ్ *జైళ్లలో ఉన్న మిత్రులందరికీ రాసిన బహిరంగ లేఖ

అధికారానికి ఎదురు నిలిచి సత్యం పలికిన నేరానికి చెరసాలల్లో మగ్గుతున్న ప్రియమైన మిత్రులారా,

మా పేర్లు కళ్యాణి, తన్మయ్. బీహార్ ఈశాన్య కొసన అరారియా అనే చిన్న జిల్లాకు చెందినవాళ్లం. బీహార్‌లో భూమిలేని నిరుపేదల మధ్య పనిచేసే జన జాగరణ శక్తి సంఘటన్ కార్యకర్తలం.

మనం ఎన్నడూ కలిసి ఉండకపోవచ్చు. కాని మీరు అరెస్టయినప్పటి నుంచీ ప్రతి రోజూ మేం మీ పేర్లు వింటున్నాం. మీ ఫొటోలు చూస్తున్నాం. ఇప్పుడు మాకు మీరు అతి సన్నిహిత పరిచయస్తుల్లా అనిపిస్తున్నారు.

న్యాయస్థానం కార్యకలాపాలను అడ్డుకున్నామనే ఆరోపణపై, మా ఇద్దరినీ, ఒక 22 సంవత్సరాల అత్యాచార బాధితురాలితో సహా, 2020 జూలైలో అరెస్టు చేశారు. ఆరోజు ఆ బాధితురాలికి సహాయం చేయడం కోసం మేం న్యాయస్థానానికి వెళ్లాం. ఆమె ఆ రోజు తనకు జరిగిన దుర్మార్గం గురించి న్యాయస్థానంలో అధికారిక ప్రకటన చేయవలసి ఉండింది. ఆమె ఒక నిరక్షరాస్యురాలైన ముస్లిం శ్రామిక మహిళ. ఇళ్లలో పని మనిషిగా ఉండేది.

ఆమె ఆ ప్రకటన చేసిన తర్వాత, దాని మీద సంతకం చేసే సమయంలో తనకు సహాయంగా వచ్చిన స్నేహితులను తనతోపాటు ఆ గదిలో ఉండనివ్వాలని కోరింది. ఆమె అలా కోరడం న్యాయమూర్తికి కోపం తెప్పించింది. తర్వాత జరిగిన ఆశ్చర్యకరమైన మలుపుల్లో ఆయన మా ముగ్గురినీ అరెస్టు చేయించాడు.

అవును, అత్యాచార బాధితురాలిని అరెస్టు చేశారు.

ఎంతటి తలకిందుల న్యాయం అది. న్యాయాన్ని పొందడానికి ప్రయత్నించినందుకు, ఆ సమయంలో తనకు ధైర్యంగా మిత్రులను పక్కన ఉండనిమ్మని కోరినందుకు ఒక అత్యాచార బాధితురాలిని అరెస్టు చేశారు. అప్పుడు మా సొంత జిల్లా నుంచి 200 కిమీ దూరంలో ఉన్న ఒక మహిళా క్వారంటైన్ జైలుకు మా ముగ్గురినీ తరలించారు. మాలో ఇద్దరం మహిళలం. ఒకరు ట్రాన్స్ జెండర్. ఆ అత్యాచార బాధితురాలికి వారం రోజుల తర్వాత బెయిల్ దొరికి విడుదల కాగా, మాకు బెయిల్ దొరికి విడుదల కావడానికి ఇరవై ఐదు రోజులు పట్టింది.

చిట్టచివరికి ఆగస్ట్ 5న మేం స్వేచ్ఛను రుచి చూడగలిగాం గాని అది చాల చేదుగా ఉండింది. అదే రోజున రామమందిర శంకుస్థాపన జరిగింది. అదే రోజున అధికరణం 370 రద్దు చేసి కశ్మీర్ ను అతి భయంకరమైన దిగ్బంధానికి గురిచేసి సంవత్సరం గడిచింది.

కనుక విడుదలయ్యామని పెద్దగా సంతోషపడడానికేమీ లేదు. అంతేకాదు, అప్పటికీ మా స్నేహితులెందరో ఇంకా చెరసాలల్లో మగ్గిపోతూనే ఉన్నారు.

'ధూళి లాగ ఎప్పటికప్పుడు లేవాలి మనం'

మేం మీకు ఇదంతా ఎందుకు చెపుతున్నామంటే, మేం చెరసాలలో గడిపిన ఆ ఇరవై ఐదు రోజులూ, మీరు మా మనసులో నిత్యం ఉన్నారని మీకు తెలియజేయడానికి.

'క్యోం డరాతే హో జిందోం కి దీవార్ సే ... ఐసే దస్తూర్ కో, సుబహ్ – ఎ – బేనూర్ కో హం నహీ జాన్తే, హం నహీ మాన్తే'అని మేం మా కటకటాలు పట్టుకుని గున్గునాయించుకుంటున్నప్పుడు బహుశా మీరు కూడ మీ ఒంటరి సెల్‌లో అట్లాగే పాడుకుంటూ ఉన్నారనిపించింది. మీ చిరునవ్వులు, మీ నినాదాలు, మీ పోరాటాలు మాకు ఎంతో ధైర్యాన్నిచ్చాయి. ఇప్పటికీ మాకవి ధైర్యాన్నిస్తూనే ఉన్నాయి.

జైలు జీవితంలో ప్రతి కొత్త అవరోధం ఎదురైనప్పుడల్లా, అంటే మరుగుదొడ్లు పొంగి పొరలినప్పుడో, జైలు ఫోను పగిలిపోయినప్పుడో, తోటి ఖైదీలు నిరాశలో మునిగినప్పుడో, జైలు జవాన్లు అధికార అహంకారాన్ని చూపినప్పుడో, మీకు కూడ ఇటువంటి అవరోధాలే వచ్చి ఉంటాయా అనీ, దేశమంతటా జైలు జీవితం ఇదేవిధంగా ఉంటుందా అనీ మేం ఆలోచిస్తుండేవాళ్లం.

గద్దెల మీద కూచున్నవాళ్లు భిన్న స్వరాలను అణచివేయడానికీ, దేశంలో న్యాయం కోసం పోరాడుతున్న అద్భుతమైన మనుషులనూ, సుతిమెత్తని మనసులనూ జైళ్లలో బంధించడానికీ ఎంత పద్ధతి ప్రకారం పని చేస్తున్నారో చూసి ఆగ్రహం రగిలిపోతుండేది.

కాని వారికి తెలియనిదేమంటే సరిగ్గా ధూళి లాగ, కాళ్లకింద అణచబడిన దుమ్ము లాగ, మనం లేచి నిలుస్తాం. లేచి నిలబడుతూనే ఉంటాం.

'వాళ్లు మిమ్మల్ని ఎప్పటికీ ధ్వంసం చేయలేరు'

మీరెట్లా ఉన్నారని మిమ్మల్ని అడగబోవడం లేదు. బహుశా అది జవాబు చెప్పడం అసాధ్యమైన ప్రశ్న. పైగా, ఇవాళ ప్రపంచం ఉన్న స్థితిలో ఆ పీడనామయ గోడల లోపల ఉన్న వారికైనా, బైట ఉన్న వారికైనా "బాగా" ఉండడం అత్యంత కష్టతరమైన విషయం.

కాని మీరు మానసిక స్థైర్యంతో ఉండడానికి, ప్రతిదానిలో సౌందర్యం చూడడానికి, ప్రతిదానిలో సంతోషం కనిపెట్టడానికి, ఉనికిలో ఉండడానికిఏయే చిన్న చిన్న పనులు చేస్తున్నారో తెలుసుకోవాలని మాకు కోరికగా ఉంది. బహుశా ఆ చిన్న పనుల ద్వారానే మీరు రోజురోజుకూ ఎదుగుతుంటారు కూడ.

ఇది రాస్తుంటే మాకు నాజిమ్ హిక్మత్ రాసిన కవితా పాదాలు గుర్తుకొస్తున్నాయి :

"ఇట్లా చెప్పడం బాగుంటుంది: పట్టుబడడం అనేది పెద్ద విషయమేమీ కాదు. లొంగిపోకుండా ఉండడమే అసలు విషయం."

మిత్రులారా, సాథీ, వాళ్లు మిమ్మల్ని కటకటాల వెనక్కి నెట్టారు కావచ్చు, కాని వాళ్లు మిమ్మల్ని ఎప్పటికీ చెదరగొట్టలేరు.

'ఒకరికొకరం ఉండడం ఎంత అదృష్టం'

మమ్మల్ని నిర్బంధంలో ఉంచినది చాల స్వల్పకాలమే అని మాకు తెలుసు. మీలో కొందరు నెలలూ, సంవత్సరాలూ జైలులో గడుపుతున్నారు. అది ఎలా ఉంటుందో మా ఊహకు అందడం లేదు.

కాని మాకు కచ్చితంగా తెలిసినదేమంటే మా ముగ్గురినీ ఆ కాలమంతా కలిపే ఉంచడం మా అదృష్టమనే చెప్పాలి.

మీకు మీ పాత మిత్రులతో కలిసి నవ్వడానికి, ప్రేమించడానికి, నేర్చుకోవడానికి, వినడానికి, అర్థం చేసుకోవడానికి, అన్వేషించడానికి, విస్తరించడానికి, ఏడ్వడానికి, గుండెపగలడానికి, తలపోతల్లో మునిగిపోవడానికి, చదవడానికి, అరవడానికి, పలవరించడానికి, పాడడానికి, చిందువేయడానికి తగినంత సమయం దొరుకుతున్నదనీ, కొత్తవారితో అర్థవంతమైన స్నేహాలు కలుపుకోగలుగుతున్నారనీ అనుకుంటున్నాం.

జైలులో ఉండడంలో అన్నిటికన్న గొప్ప నమ్రతనూ, వినయాన్నీ ఇచ్చే అంశం తోటి ఖైదీలను కలవడం, వారి మాటలు వినడం, వారి పోరాటాల గురించి తెలుసుకోవడం.

ఊహించినట్టుగానే జైలులో మేం కలిసిన మహిళల్లో అత్యధికులు అణగారిన వర్గాల నుంచి వచ్చిన వారు. దళితులు, ముస్లింలు, శ్రామిక మహిళలు. బహుశా ఆ కారణం వల్లనే జైలు అంటే తమతమ పద్ధతులలో బ్రాహ్మణీయ పితృస్వామ్యాన్ని ప్రతిఘటించిన అద్భుతమైన మహిళా యోధుల సంగమ స్థలంగా చెప్పవచ్చు. ఆ పోరాటాల వల్లనే జైలుకు చేరినవారెందరో.

ఏది ఏమైనా, జైళ్లనేవి చారిత్రకంగానే పీడితులను అణచి ఉంచడానికీ, శిక్షించడానికీ ఉపయోగించబడినవి కదా. పౌరుల మీద రాజ్యపు నియంత్రణను బలోపేతం చేయడానికి ఏర్పాటైనవి కదా.

జైళ్లలో మానసిక ఆరోగ్యం దారుణాతిదారుణంగా ఉన్నది. తమ బిడ్డల కోసం, ఒక శుభ్రమైన రవిక కోసం, తమ ప్రియమైన కుటుంబ సభ్యులతో మూడు నిమిషాల ఫోన్ సంభాషణ కోసం, ఒక చారెడు బట్టల సబ్బు కోసం, గౌరవం కోసం, న్యాయం కోసం శోకాలు పెట్టే మహిళలు అక్కడ కనబడతారు.

ఈ అపారమైన దుఃఖంతో పాటే మేమక్కడ ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నాం. ఇతరుల పట్ల దయతో ఉండడంలోకొత్త వ్యాకరణాలు నేర్చుకున్నాం. భయానకమైన స్థాయిలో లొంగిపోయే బలహీనతలు, అనంతమైన కరుణ, ఔదార్యం, సంఘీభావం కూడ మేమక్కడ చూశాం. అంతే కాదు, ప్రతిభావంతమైన సృజనాత్మకత కూడిన తిట్లు, తమ ప్రియుల స్పర్శ కోసం స్త్రీల తపన వెతుక్కునే ఆశ్చర్యకరమైన కోరికలు కూడ మేమక్కడ చూశాం.

'ప్రతిఘటన వంటి మానసిక ప్రశాంతత లేదు'

ఒకసారి, మా చుట్టూ ఎడతెగని ఏడుపు వినిపిస్తుండగా, అది భరించలేక మేం చాల సహజంగా 'తూ జిందా హై...'అని పాట ఎత్తుకున్నాం.

కాసేపు కొన్ని సిగ్గరి నవ్వులూ, అనుమానంతో మూతి విరుపులూ గడిచి, చుట్టూ ఉన్నవాళ్లు మెల్లగా చప్పట్లు కొట్టడం మొదలుపెట్టారు. త్వరలోనే పాటకు గొంతు కలిపారు.

మనసుకు ప్రశాంతత చేకూర్చే వాటిలో సంగీతాన్ని మించినది లేదు, కదూ?

ఇక ఆ తర్వాత, లాకప్ అయిన తర్వాత ప్రతి రాత్రీ, ఆ దాల్ సింగ్ సరాయి జైలులోని మా వార్డు ఒక సంగీతశాల అయిపోయింది. ప్రతి ఒక్కరూ 'తూ జిందా హై'పాటకో, 'తోడ్ తోడ్ కే బంధనోం కో' పాటకో, హిల్లేలే ఝుగ్ ఝోర్ దునియా' పాటకో తాళం వేస్తుండేవారు.

ఈ సంగీతం జైలు జవాన్లను కూడ తేలిక పరచింది. కొంత మంది మహిళలమూ, ఒక ట్రాన్స్ జెండర్ వ్యక్తీ కలిసి స్వేచ్ఛ గురించీ, పీడక శక్తులను ధ్వంసం చేయడం గురించీ, కులాన్నీ, పితృస్వామ్యాన్నీ నిర్మూలించడంగురించీ పాటలు పాడుతుండేవాళ్లం. కొన్నిసార్లు ఊరికే 'మున్నీ బద్ నాం హుయీ' లాంటి పాటలు పాడుతుంటే మా సహఖైదీలు నాట్యం కూడ చేసేవాళ్లు.

ఆ క్షణాల్లో, మేం అలా ఏదీ పట్టనట్టుగా పాటలు పాడుతున్నప్పుడు, నాట్యం చేస్తున్నపుడు, నవ్వు తెరల్లో మైకం కమ్మినప్పుడు, కొద్ది సేపటికోసమైనా మా మనసులు వాస్తవంగా స్వేచ్ఛగా ఉన్నట్టే అనిపించేది.

ఇనుప కటకటాలు లేనట్టు, మమ్మల్ని బంధించి ఉంచిన సామాజిక రాజకీయ సంకెళ్లు తెగిపోయినట్టు, మా స్వేచ్ఛనూ, గౌరవాన్నీ, సమగ్రతనూ కొల్లగొట్టడానికి రాజ్యం చేస్తున్న ప్రయత్నాలను మేం ధిక్కరిస్తున్నట్టు అనిపించేది.

ఈ రాత్రివేళ నాట్యపు ఉత్సవాలలో, ఎంత క్షణికంగానైనా మేం స్వేచ్ఛను అనుభవించినట్టు అనిపించడం విచిత్రంగా ఉంది గదూ?

జుట్టు వెంటుకలు గాలిలో తేలియాడుతుండగా, పల్లూ జారిపోతుండగా, గుండీలు తెగిపోతుండగా, సంగీతం గంతులు వేయిస్తుండగా, ప్రపంచమంటే లెక్కేమిటన్నట్టు ఉండేది. అత్యంత కఠినమైన రాజ్య నిఘా ఉన్నప్పటికీ ఇక్కడ ఒక స్వేచ్ఛాస్థలంలో కొందరు మహిళలూ ఒక ట్రాన్స్ జండర్ వ్యక్తీ, ధిక్కారపూరితంగా మా సొంత చిన్న ప్రచండ స్త్రీవాద విశ్వాన్ని నిర్మిస్తున్నట్టుండేది.

ఈ ప్రచండ, స్త్రీవాద విశ్వం ఇప్పటికి క్షణికమైనదే కావచ్చు. కాని ఒకానొకరోజున, మన సామూహిక పోరాటాల ద్వారా తప్పకుండా మనం దాన్ని బైటి ప్రపంచంలోకి తీసుకొస్తాం. అన్ని పీడిత సమూహాలకూ అన్ని రకాల సంకెళ్ల నుంచీ స్వేచ్ఛను సాధిస్తాం.

అప్పటివరకూ, జాగ్రత్తగా ఉండండి. మీకు మీరు జాగ్రత్త తీసుకోండి. తోటివారి పట్ల జాగ్రత్త వహించండి. మీరు మీకు తెలిసినదానికన్న ఎన్నోరెట్లు ఎక్కువగా ప్రేమించబడుతున్నారనీ, ప్రాణంగా చూడబడుతున్నారనీ గుర్తించండి. మేమందరమూ మీకోసం పోరాడుతున్నాం. మీ విడుదల కోసం పోరాడుతున్నాం. మీరు ఏ విశ్వాసాల కోసం నిలబడ్డారో ఆ విశ్వాసాల కోసం పోరాడుతున్నాం.

పోరాటం కొనసాగుతూనే ఉంటుంది.

మనం పోరాడతాం! మనం విజయం సాధిస్తాం!

(ఈ లేఖ పూర్తి పాఠంతో పాటు, జైలులో ఉండగా తన్మయ్ వేసిన నాలుగు బొమ్మలతో, ప్రత్యేకంగా ఈ లేఖ ఆధారంగా తయారు చేసిన మూడు నిమిషాల లఘు చిత్రంతో కలిపి ది క్వింట్ వార్తా వెబ్ సైట్ 25 అక్టోబర్ 2020న ప్రచురించింది.) వీ

స్టాన్ స్వామి రాజ్యానికి శత్రువు ఎందుకయ్యాడు?

భీమా కోరేగాం కేసులో కుట్రదారుగా తాజాగా అరెస్టయిన ఫాదర్ స్టాన్ స్వామి ఆదివాసుల హక్కుల కోసం చేసిన కృషే ఆయనను రాజ్యానికి శత్రువును చేసిందంటున్నారు **హర్ష్ మందర్**

ఒక రాజ్యపు నిజమైన స్వభావం బహుశా అది ఎవరిని శత్రువులుగా ఎంచుకుంటున్నదనేదానిలోనే ఎక్కువగా బైటపడుతుంది. ఇటీవల రాజ్యపు సమస్త శక్తీ తన జీవితమంతా భారత ప్రజానీకంలోకెల్లా అత్యంత పీడనకు గురవుతున్న ఆదివాసుల మధ్య, కార్పొరేట్లకూ రాజ్యశక్తికీ వ్యతిరేకంగా పనిచేసిన 83 సంవత్సరాల జెసూయిట్ మతబోధకుడి మీద కేంద్రీకృతమైంది. ప్రభుత్వం తనకు ఎవరంటే ఎక్కువ కోపమో, ఎవరంటే ఎక్కువ భయమో చెప్పుకోవడానికి ఎటువంటి అనుమానమూ వదలడం లేదు. అలాగే తాను ఎవరి కోసం ఉన్నానని చెప్పుకోవడానికి కూడ.

ఫాదర్ స్టాన్ స్వామిని దేశద్రోహం, తీవ్రవాదం, మావోయిస్టు కావడం, మావోయిస్టు హింసాత్మక చర్యలలో చురుగ్గా పాల్గొనడం, మావోయిస్టుల నుంచి నిధులు స్వీకరించడం, విస్తారమైన భీమా – కోరేగాం కుట్రలో భాగస్తుడు కావడం వంటి తీవ్రమైన నేరాలకు మొదట పుణె పోలీసులు విచారించారు. ఆ తర్వాత దేశంలోకెల్లా ప్రధానమైన తీవ్రవాద వ్యతిరేక బలగం నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ విచారించింది.

పోలీసులు తనను తీసుకుపోవడానికి రెండు రోజుల ముందే తన అరెస్టును ఊహిస్తూ ఆయన ఒక ప్రకటన రికార్డు చేశారు. తన పట్ల జరుగుతున్న విషయాలు తనకొక్కడికే పరిమితమైనవి కావని ఆయన అన్నారు. సుప్రసిద్ధ మేధావులు, న్యాయవాదులు, రచయితలు, కవులు, కార్యకర్తలు, విద్యార్థి నాయకులు ఎందరో అరెస్టు చేయబడ్డారు. అందరి అరెస్టులకూ కారణం ఒక్కటే. ప్రభుత్వ విధానాల పట్ల వారు బహిరంగంగా తమ అసమ్మతి తెలుపుతుండడమే. "నన్ను దీనిలో భాగం చేసినందుకు సంతోషిస్తున్నాను. ఎందుకంటే, నేనెప్పుడూ మౌన సాక్షిలా ఉండదలచుకోలేదు" అని ఆయన ప్రకటించారు.

ఈ వృద్ధ మతబోధకుడి సుదృఢమైన, ఉక్కు వంటి శక్తి గల విశ్వాసాలనూ, ఎదురులేని సాహసాన్నీ, పేదల పట్ల ఆయనకున్న అపారమైన ప్రేమనూ చూసి ఆయనతో పరిచయం ఉన్న వారందరూ ఎప్పుడూ ఆశ్చర్యపోతుంటారు. ఆయనను ప్రభావితం చేసినవారిలో ఒకరైన బ్రెజిల్ కు చెందిన కాథలిక్ ఆర్చిబిషప్ హెల్డర్ కమారా, "వాళ్లు పేదరికంలో ఎందుకున్నారని ప్రశ్నిస్తే, నన్ను కమ్యూనిస్టు అంటారు" అన్నారు.

కార్వాన్ ఎ మొహబ్బత్ అనే ప్రచార యాత్రలో, ఒక సంఘీభావ బృందంలో భాగంగా నేనాయనను రెండేళ్ల కింద కలిశాను. అది 2018 ఆగస్టులో పుణె పోలీసులు మొదటిసారి ఆయన మీద దాడి చేసి కుట్రకేసు కోసం దర్యాప్తు చేసిన తర్వాత. మేమాయనను రాంచీ దగ్గర బగైచా లో కలిశాం. బగైచా అంటే ఆదివాసి యువతకు శిక్షణ కోసం, పరిశోధన కోసం ఫాదర్ స్టాన్ స్వామి స్థాపించిన కేంద్రం.

అప్పుడాయన మాతో తన పని గురించీ, తన పోరాటాల గురించీ మాట్లాడారు. జార్ఖండ్ అత్యంత పేద ప్రజలతో కూడిన అతి సంపన్న రాష్ట్రమని ఆయన మాకు చెప్పారు. ఆ రాష్ట్రంలో బొగ్గు నుంచి బంగారం దాకా లేనిది లేదు. జార్ఖండ్ ను దోపిడీ చేస్తున్నవాళ్లు అంతకంతకూ ధనికులైపోతున్నారు. కాని స్థానిక ఆదివాసులు మరింత మరింత పేదరికంలోకి జారిపోతున్నారు. ఆ బడా కార్పొరేషన్లు ఎంతెంత రాక్షసమైన లాభాలు సంపాదించాయో ఫాదర్ స్టాన్ స్వామి చాల జాగ్రత్తగా నమోదు చేశారు. అలాగే, ఆ భూమి మీద, అడవి మీద ఆధారపడిన ప్రజలు ఎంతెంత మూల్యం చెల్లించవలసి వచ్చిందో కూడ అంతే జాగ్రత్తగా లెక్కగట్టారు. "మీకు ఏ మాత్రమైనా సున్నితత్వం, స్పందన, అంతరాత్మ అనేవి ఉంటే అలా పీడనకు గురవుతున్న, ప్రతిఘటిస్తున్న ప్రజల పక్షం వహించడం కన్న మరొక దారి లేదు" అన్నారాయన.

గొడ్డా ప్రాంతంలో అదానీ నిర్మిస్తున్న విద్యుత్ కర్మాగారం కోసం కారు చౌక ధరకు భూమి ఎలా కట్టబెట్టారో, అప్పటికి అక్కడ ఉన్న పంట పొలాలను బుల్డోజర్లు ఎలా నేలమట్టం చేశాయో ఆయన చెప్పారు. జార్ఖండ్ లోని గొడ్డా లో 1600 మెగావాట్ల విద్యుత్ కర్మాగారాన్ని స్థాపించడానికి అదానీ పవర్ కంపెనీ బంగ్లాదేశ్ ప్రభుత్వంతో 2016లో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ విద్యుత్ కర్మాగారానికి అవసరమైన బొగ్గు ఆస్ట్రేలియాలోని అదానీ గనుల నుంచి దిగుమతి అవుతుంది. ఈ కంపెనీ కోసం పర్యావరణ అనుమతులను ఎంత హడావిడిగా ఇచ్చారో, రైతులకు దక్కవలసిన నష్టపరిహారం ఎట్లా దక్కలేదో, అడవులను ఎట్లా విధ్వంసం చేశారో ఆయన చెప్పారు.

ఈ శక్తిమంతమైన ప్రత్యర్థులకు వ్యతిరేకంగానే స్టాన్ స్వామీ, ఆయన నిర్ద్వంద్వమైన సంఘీభావం ప్రకటిస్తున్న ఆదివాసి యువతా పోరాడుతున్నారు. మరి ఆయన ఈ ప్రభుత్వానికి ప్రమాదకరమైన శత్రువుగా కనిపించడంలో ఆశ్చర్యం ఏముంది? ఆయన మాకు చెప్పిన మాటల్లోనే చెప్పాలంటే, "మీరు గనుక ఈ తరహా అభివృద్ధిని ప్రశ్నిస్తే, మీరు అభివృద్ధి వ్యతిరేకులైపోతారు. అంటే అది ప్రభుత్వ వ్యతిరేకతతో సమానం. ఇంకా ముందుకు వెళ్లి అది దేశ ద్రోహంతో సమానమవుతుంది. ఇది చాల సులభమైన సమీకరణం. అందువల్లనే, నేను మావోయిస్టుల పద్ధతులకు పూర్తిగా వ్యతిరేకినైనప్పటికీ, వారితో నాకు ఎటువంటి సంబంధమూ లేనప్పటికీ ఈ ప్రభుత్వం నన్ను మావోయిస్టునని అభివర్ణిస్తోంది."

అయితే ఇది స్టాన్ స్వామి ఒక్కరి కథ మాత్రమే కాదు. జార్ఖండ్ లో చాల పెద్ద సంఖ్యలో ఆదివాసి, దళిత యువకులను మావోయిస్టులనే ఆరోపణతో సంవత్సరాలుగా జైళ్లలో నిర్బంధించి ఉంచారని స్టాన్ స్వామి పరిశోధించి నిర్ధారించారు. అలా నిర్బంధితులైనవారి సంఖ్య మూడు వేల మందికి పైగా ఉంది. వారందరూ తమను చట్ట వ్యతిరేకంగా,

జిఎస్‌టి గుత్తపెత్తనం - సమాఖ్య స్ఫూర్తికి గొడ్డలిపెట్టు

***బహుళజాతి సంస్థల స్వేచ్ఛా వ్యాపార ప్రయోజనం కోసం తెచ్చిన జి.ఎస్.టి. రాష్ట్రాలకు పరిహారం చెల్లింపులో కేంద్రం వైఖరి సమాఖ్య స్ఫూర్తిని నీరుగార్చి రాష్ట్రాలను అప్పుల్లోకి నెట్టేలా ఉందని అంటున్నారు* డా.ఎ .పున్నయ్య**

ప్రభుత్వాల సుస్థిర ఆర్థిక మనుగడ అనేది ప్రజలపై విధించిన పన్నుల ద్వారా వచ్చే ఆదాయంతోనే ముడిపడి ఉంటుంది. ప్రజలకు మౌలిక వసతుల కల్పన మొదలుకొని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, జాతీయ విపత్తు లాంటి అత్యవసర పరిస్థితులను అధిగమించడానికి ధాన్యం నిల్వలవరకు ప్రభుత్వాలు ఈ ఆదాయాన్ని ఖర్చు పెడుతాయి. దేశ రక్షణతో పాటు ముందు తరాలకు ఉపయోగపడే శాస్త్ర, సాంకేతిక, పరిశోధన రంగాల అభివృద్ధికొరకు, ప్రభుత్వాలు పన్ను విధించడం అనేది సర్వసాధారణం. భారతదేశంలోని సమాఖ్య వ్యవస్థ, రాజ్యాంగం కల్పించిన హక్కులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నోరకాల పన్నులు విడివిడిగా వసూలు చేస్తున్నాయి. ఇటీవల స్వేచ్ఛ వ్యాపారంలో భాగంగా బహుళజాతి కంపెనీలు, కార్పొరేట్ శక్తులు జాతీయ స్థాయిలో సులభంగా తమ ఉత్పత్తులను మార్కెట్ చేసుకోవడానికి రాష్ట్రాల నుండి అభ్యంతరాలు లేకుండా కేంద్రంపై ఒత్తిడిచేసి జిఎస్‌టి చట్టం తీసుకొచ్చారు. ఇది బడా వ్యాపారులకు అనుకూలమైంది. ఇది రాష్ట్రాల స్వయం ప్రతిపత్తికి పూర్తిగా విరుద్ధమైంది. అందువల్ల మెజారిటీ రాష్ట్రాలు అభ్యంతరాలు చెప్పినప్పటికీ మార్కెట్ శక్తుల ప్రయోజనం కొరకు కేంద్ర ప్రభుత్వం ఒకేదేశం – ఒకేపన్ను నినాదంతో 101వ రాజ్యాంగ సవరణ ద్వారా 2016 సెప్టెంబర్ 8న వస్తు, సేవల పన్నులను నిర్ణయించడానికి జిఎస్‌టి కౌన్సిల్ అనే యంత్రాంగాన్ని చట్టబద్ధంగా ఏర్పాటు చేసింది. కేంద్రం ఈ జిఎస్‌టి చట్టాన్ని సజావుగా ఆమోదింప జేసుకోవడానికి రాష్ట్రాలకు పలు హామీల వాగ్దానాలు చేసింది. జిఎస్‌టి అమలు వల్ల రాష్ట్రాల ఆదాయాలకు నష్టం వాటిల్లదని, ఒకవేళ లోటు ఏర్పడినట్లయితే కేంద్ర సంచిత నిధి (కన్సాలిడేటెడ్ ఫండ్) నుంచి రాష్ట్రాల ఆర్థిక లోటును భర్తీచేస్తామని జిఎస్‌టి కౌన్సిల్ సమావేశాలలో నాటి కేంద్ర ఆర్థిక మంత్రి పదేపదే చెప్పారు. ఇది పన్నుల సంస్కరణలో అద్భుతమైన ఆవిష్కరణ అని, ఇది పరివర్తన దిశగా తీసుకున్న గొప్ప చర్య అని, ఇది పూర్తిగా అంతర్జాల ఆధారిత వ్యవస్థ ద్వారా నడుస్తుంది కావున పారదర్శకత వైపు వేసిన ముందడుగని ప్రభుత్వం అభివర్ణించింది. ఈ చర్యతో దేశం

దుర్మార్గంగా తమ భూముల నుంచి, అడవుల నుంచి వెళ్లగొట్టడానికి వ్యతిరేకంగా పోరాడారు. శాంతియుత పద్ధతులలోనే పోరాడారు. ఎన్నో చట్టబద్ధమైన పద్ధతులలోనే, రాజ్యాంగ నిబంధనలనూ, చట్టాలనూ, సమతా కేసులో సుప్రీం కోర్టు తీర్పునూ చూపుతూ పోరాడారు. భూమికి యజమాని ఎవరో, ఆ భూమిలోని ఖనిజాలకూ వారే యజమాని అవుతారని ఆ చట్టాలన్నీ చెప్పాయి. కాని ప్రభుత్వం ఆ చట్టాలన్నిటినీ ఉల్లంఘించింది.

సుధా భరద్వాజ్ తో కలిసి ఆయన పర్సెక్యూటెడ్ ప్రిజనర్స్ సాలిడారిటీ కమిటీ (వివక్షకు గురైన ఖైదీల సంఘీభావ సమితి) అనే సంస్థను ప్రారంభించి వారి విడుదల కోరుతూ జార్ఖండ్ హైకోర్టులో వ్యాజ్యం వేశారు. ఇప్పుడు వారిద్దరినీ అరెస్టు చేసి జైలులో పెట్టారు. వారు త్వరలో విడుదలవుతారనే నమ్మకం లేదు. ఈ చుక్కలను కలిపితే ఏ చిత్రం తయారవుతుందో మీరే చూడండి.

ఆహ్లాదకరమైన హరిత క్షేత్రంగా ఉండే స్టాన్ స్వామి కార్యాలయం మీద మొదటి దాడిలో నలబై మంది పోలీసులు పాల్గొన్నారు. ఆయన గది చాల చిన్నది. అందులో ఆడంబరమైన సామాన్లేమీ లేవు. కాని వాళ్లు ఆ గదిలో మూడు గంటలు సోదా జరిపారు, ఆయన లాప్‌టాప్‌ను, ఫోన్‌ను, సంగీతం కాసెట్లను, కాగితాలను జప్తు చేశారు. ఆయన ప్రధానమంత్రి నరేంద్రమోడీని హత్య చేయదలచిన కుట్రలో భాగస్వామి అని మర్నాడు స్థానిక వార్తాపత్రికలలో వచ్చింది. తర్వాత రెండో దాడి ఎన్ ఐ ఎ సిబ్బంది జరిపారు. ఈసారి ఆయనను పదిహేను గంటలపాటు ప్రశ్నించారు. ఆయనను అరెస్టు చేసిన తర్వాత విమానంలో ముంబాయికి తీసుకువెళ్లారు. అప్పటికే కిక్కిరిసి ఉన్న జైలుకు పంపారు. ఆ వయసులో, ఆ అనారోగ్యంతో ఆయన కొవిడ్-19 బారిన పడడానికి అవకాశం ఉందని కూడ ఆలోచించలేదు. ఎనబై మూడేళ్ల వయసులో కాలమూ, నిరాడంబర జీవనమూ ఆయన శరీరాన్ని ఎంతగా దుర్బలం చేశాయో కనబడుతున్నది. ఇప్పటికే పార్కిన్సన్ వ్యాధి ప్రారంభమయింది. ఆయన చాయ్ తాగడానికి కప్పు పట్టుకుంటే చెయ్యి వణికిపోతున్నది. కాని ఆయన వెన్నెముక మాత్రం, భౌతికంగానూ ఆలంకారికంగానూ నిటారుగా, వంగిపోకుండా నిలబడి ఉన్నది.

తన అరెస్టుకు ముందు రికార్డ్ చేసిన వీడియోలో ఆయన ప్రశాంతంగా ఒక మాట అన్నారు. "నేను మూల్యం చెల్లించడానికి సిద్ధంగా ఉన్నాను. అది ఎంతైనా, ఏదైనా సరే" అని. మరొక దేశంలో, మరొక కాలంలో అయితే, ఆయన లాంటి వ్యక్తి జాతీయ వీరుడిగా కీర్తి పొందేవాడు. యువకులు అనుసరించవలసిన ఆదర్శ నమూనాగా పేరు ప్రఖ్యాతులు పొందేవాడు. ఇవాళ ఆయన ఏ గణతంత్ర రాజ్యాన్ని పరిరక్షించడానికి పోరాడుతున్నాడో, ఆ గణతంత్ర రాజ్యం కన్న ఎక్కువ వయసు ఆయనది. ఆయనకు తన దేశాన్ని, తన మతాన్ని ప్రేమించడమంటే ఆ దేశంలోని నిరుపేద ప్రజలను ప్రేమించడమే.

(మాజీ ఐఎఎస్ అధికారి, మానవ హక్కుల కార్యకర్త, రచయిత హర్ష్‌మందర్ రాసిన ఈ వ్యాసం ఇండియన్ ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో 23 అక్టోబర్ 2020 న వెలువడింది.) వీ

పన్నుల సంబంధిత అవినీతి నుండి విముక్తి దిశగా నడవడం మొదలు పెడుతుందని, ఈ చట్టంతో రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని ఇది భారతీయ ప్రజాస్వామ్యానికే విజయమని ప్రశంసించారు.

ఈ చర్యల ఫలితాలతో వచ్చిన ఆర్థిక ప్రయోజనంతో దేశంలో మౌలిక వసతులు కల్పించి దేశాన్ని పట్టిపీడిస్తున్న, నిరక్షరాస్యత, పేదరికం, నిరుద్యోగాన్ని తగ్గించడం కొరకు కృషిచేయాలని నిర్ణయించారు. కానీ ఆ వైపు ఆలోచన కాని, కనీస అడుగులు కాని వేయకపోగా ఆ రంగాలను మొత్తంగా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడం ఆందోళనకరం.

కేంద్ర ప్రభుత్వ అప్రజాస్వామిక నిర్ణయాలు

ప్రపంచ వాణిజ్య సంస్థ, ప్రపంచ బ్యాంక్, ధనిక దేశాల సూచనల మేరకు కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో మెజారిటీ ఉన్నదనే సాకుతో తీసుకున్న అనాలోచిత, అప్రజాస్వామిక, నిరంకుశ ఏకపక్ష నిర్ణయాలు సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీయడంతో పాటుగా దేశాన్ని ఆర్థికంగా అధోగతిపాలు చేస్తున్నాయి. పెద్ద నోట్ల రద్దు నిర్ణయం మొదలుకొని, జిఎస్‌టి చట్టం, రాష్ట్ర జాబితాలో ఉన్న వ్యవసాయం, విద్యుత్‌కు సంబంధించిన బిల్లుల రూపకల్పనలో కూడా కేంద్రం ప్రజాస్వామ్య పద్ధతులు కనీసంగా పాటించలేదు. వీటి అమలులో పూర్తిగా నియంతృత్వ, ఏకపక్ష వైఖరి తీసుకుంది. దీని ఫలితంగా స్థూలంగా దేశ ఆర్థిక వ్యవస్థ ప్రమాదంలో పడింది. తాజా గణాంకాల ప్రకారం మునుపెన్నడూ లేని విధంగా భారత ఆర్థిక వ్యవస్థ పరిమాణం 24 శాతం దెబ్బతిన్నది. బడ్జెట్ అంచనాల ప్రకారం, ప్రభుత్వ రెవెన్యూ ఆదాయంలో దాదాపు 25-35 శాతం తగ్గుదల కనపడుతున్నది. ప్రభుత్వ వైద్యం, విద్య, పారిశుద్ధ్యం, న్యాయ వ్యవస్థ, శాంతి భద్రతలు మొదలైన వాటిలో రాష్ట్రాలు ఖర్చుచేయలేని పరిస్థితి నెలకొంది. తక్షణం దీనిని కేంద్రమే పూడ్చాలి. లేదంటే ఈ వ్యవస్థలన్నీ క్రమంగా కనుమరుగవుతాయి. కాగా కేంద్రీకృత విధానాల ద్వారా జిఎస్‌టి పరిహారం చెల్లింపులో కేంద్రం అనుసరిస్తున్న వైఖరి సమాఖ్య స్ఫూర్తిని నీరుగార్చేదిగా ఉంది. జిఎస్‌టి బిల్లును ఆమోదింపజేసుకొనే క్రమంలో రాష్ట్రాలకు ఇచ్చిన హామీ, అందుకు అనుగుణంగా చట్టంలో చేర్చిన అంశాలకు పూర్తి విరుద్ధంగా వ్యవహరించడం కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయానికి, నియంతృత్వానికి పరాకాష్ట. జిఎస్‌టి రాబడులు తగ్గాయి కాబట్టి రాష్ట్రాలకు జిఎస్‌టి బకాయిలు ఎగ్గొట్టడం సమాఖ్య స్ఫూర్తికే భంగకరం.

రాష్ట్రాలకు, కేంద్రానికి మధ్య వివాదాలు

కేంద్రం జిఎస్‌టి బిల్లును ఆమోదింపజేసుకొనే క్రమంలో రాష్ట్రాలు మాత్రం తమ అవసరాల మేరకు అమ్మకపు పన్నును విధించే స్వతంత్ర అధికారాలను వదులుకోవడానికి సమ్మతించలేదు. జిఎస్‌టిని అవి తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ వ్యతిరేకతను అధిగమించడం కోసం రాష్ట్రాలకు కేంద్రం ఒక చట్టబద్ధమైన వాగ్దానం చేసింది. వస్తుసేవల పన్ను అమలు ప్రారంభమయిన నాటి నుంచి ఐదు సంవత్సరాల పాటు అనగా 2022 జూన్ దాకా రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థల మీద భారం పడకుండా ఆ పన్ను వసూళ్లలో లోటు ఏర్పడితే ఆమేరకు పరిహారం ఇవ్వడానికి కేంద్రం హామీపడింది. దీనికి 2015-16లో పన్ను వసూళ్ల ఆధారంగా జిఎస్‌టి వసూళ్లు ఏటా 14 శాతం మేరకు పెరుగుతాయనే అంచనాతో రాష్ట్రాలకు చెల్లించవలసిన నష్ట పరిహారాన్ని గణించారు. రాబడిలో వ్యత్యాసముంటే ప్రతి రెండు నెలలకోసారి లెక్కించి రాష్ట్రాలకు పరిహారాన్ని చెల్లిస్తామని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలతో ఒప్పందం చేసుకుంది. అందుకోసం కేంద్రం విలాస వస్తులైన విలాస వస్తువులు, పాన్‌మసాలా, పొగాకు ఉత్పత్తులు, మొదలైన వాటిపై సుంకాన్ని (సెస్) వసూలుచేసి ఆ మొత్తం నుంచి పరిహారం చెల్లించాలని నిర్ణయం తీసుకున్నది. మొదటగా వసూలైన సెస్ మొత్తం రాష్ట్రాలకు చెల్లించవలసిన పరిహార విత్తంకంటే ఎక్కువగా జమ అయినందున మొదటి రెండేళ్లు ఏపేచీ లేకుండా సవ్యంగా రాష్ట్రాలకు చెల్లించింది. ఆ రెండేళ్లలో పరిహార విత్తానికి మించి రు. 47 వేల కోట్లు అదనంగా సెస్ వసూలైతే కేంద్రం తమ ఖాతాలో జమచేసుకుంది.

అనంతరం క్రమంగా రాష్ట్రాలకు పరిహారం చెల్లించడంలో జాప్యం చేస్తూ 2019 ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన మొత్తం రు. 17,789 కోట్లను 2019 జూలైలో విడుదల చేసింది. అలాగే 2019 జూన్, జూలై నెలలకు సంబంధించిన రు. 27,955 కోట్ల పరిహారాన్ని 2019 ఆగస్టులో విడుదల చేసింది. 2019 డిసెంబర్ మధ్యలో విడుదల చేసిన రు. 35,298 కోట్ల పరిహారం 2019 ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించినవి. దీన్నిబట్టే జిఎస్‌టి పరిహారం చెల్లింపుల ప్రక్రియను క్రమక్రమంగా ఉద్దేశపూర్వక జాప్యానికి పాల్పడుతూ రాష్ట్రాలను ఆర్థిక సంకటంలోకి నెట్టివేస్తూ వచ్చింది. అందివచ్చిన ప్రకృతి వైపరీత్యం కోవిడ్-19 దృష్టిలో పెట్టుకొని 2020 ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుండి కరోనా కారణంగా పారిశ్రామిక వ్యాపార రంగాలు కుదేలైన నేపథ్యంలో జిఎస్‌టి వసూళ్లు అంచనాలు అందుకోలేక పోయాయని, సాకుగా చూపి మొత్తం 3 లక్షల కోట్ల రూపాయలు వసూలు కావల్సి ఉండగా కేవలం 65,000 కోట్లు మాత్రమే వచ్చాయని, కనుక రాష్ట్రాలకు జిఎస్‌టి బకాయిలను చెల్లించలేమని కేంద్రం తెగేసి చెప్పడంతో ఈ వివాదం మరింత ముదిరింది.

జిఎస్‌టి వసూళ్లు మందగించడానికి కరోనా కారణం అని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న వాదనలో నిజం అంతంత మాత్రమే. నిజానికి కరోనా ప్రభావం ఎక్కువగా రాష్ట్రాలపై పడింది. కరోనా దెబ్బకు కేంద్రానికి లభించే ఆదాయంలో దాదాపు 40 శాతం మేర క్షీణత నమోదు కాగా, రాష్ట్రాలకు లభించే ఆదాయంలో 60 శాతం నుంచి 70 శాతం తగ్గుదల కనిపిస్తున్నది. ఈ క్రమంలో రాష్ట్రాలను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్రానిదే.

సమాఖ్య విధానాన్ని అవహేళన చేస్తున్న కేంద్రం

రాష్ట్రాలకు జిఎస్‌టి (వస్తు,సేవల పన్ను) పరిహార విత్తం బకాయిల చెల్లింపు విషయంలో కేంద్రం ప్రదర్శిస్తున్న ఏకపక్ష, మొండి వైఖరి రాజ్యాంగ బద్ధమైన సహకార సమాఖ్య విధానాన్ని అవహేళన చేస్తున్నది. సుదీర్ఘ కరోనా లాక్‌డౌన్ కారణంగా ఆదాయాలు దారుణంగా పడిపోయిన నేపథ్యంలో రాష్ట్రాలను ఉదారంగా ఆదుకోడానికి బదులు వాటిని మరింతగా అప్పుల ఊబిలోకి నెట్టివేసే పంథాను కేంద్రం ఎంచుకోడం ఆందోళనకరం. 2017లో రాష్ట్రాలు పన్ను వసూళ్లపై తమకున్న స్వేచ్ఛను

త్యాగం చేసి కేంద్రీకృత జిఎస్‌టి వ్యవస్థ ఆవిష్కరణకు సహకరించినప్పుడు వాటి ఆదాయ లోటును పరిహార విత్తం చెల్లింపు ద్వారా ఐదేళ్లపాటు భర్తీ చేయడానికి కేంద్రం అంగీకరించింది. కానీ గత ఆరు మాసాలకు చెందిన 3 ద్వైమాసిక పరిహారాలు ఇంకా చెల్లించవలసి ఉంది. అలా రాష్ట్రాలకు బకాయిపడిన రు. 97,000 కోట్లు, కరోనా కారణంగా జిఎస్‌టి రాబడిలో ఏర్పడిన లోటు కలిసి రు. 2 లక్షల 35 వేల కోట్ల భారీ మొత్తాన్ని రాష్ట్రాలకు చెల్లించవలసి ఉండగా ఇటీవల జరిగిన 42వ జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో కేంద్రం రాష్ట్రాలకు గతంలో ఇచ్చిన మాట మార్చి రెండు ఆప్షన్లను సూచించింది. మొదటి ఆప్షన్ ప్రకారం రిజర్వు బ్యాంకు సహకారంతో కేంద్రం రు. 97 వేల కోట్ల నిధిని ఏర్పాటు చేస్తుంది. దాని నుంచి రాష్ట్రాలు తమకు రావలసిన పరిహారాన్ని ప్రత్యేక వడ్డీరేటుపై అప్పుగా తీసుకోవాలి. రెండో ఆప్షన్ ప్రకారం మొత్తం రు. 2 లక్షల 35 వేల కోట్లను రాష్ట్రాలు బయటి మార్కెట్ నుంచి అప్పుగా తెచ్చుకోవాలని సూచించింది. ఇప్పటికే అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాలకు కేంద్ర విధానం అశనిపాతంగా మారింది.

ఆప్షన్స్ రెండింటికి ఎన్‌డిఎ యేతర రాష్ట్రాలు వ్యతిరేకం

ఇటీవల జరిగిన 42 జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో తీర్మాన రూపంలో తెరమీదకు తీసుకొచ్చిన రెండు ఆప్షన్లను ఎన్‌డిఎ యేతర పార్టీల పాలనలోని రాష్ట్రాలు మూకుమ్మడిగా తిరస్కరించాయి. జిఎస్‌టి పరిహారం విషయంలో ఆప్షన్‌కాదని ఆదుకునే బాధ్యత కేంద్ర ప్రభుత్వమే తీసుకుని చట్టం ప్రకారం రాష్ట్రాలకు పరిహారం చెల్లించాలని కోరాయి. ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, ఛత్తీగఢ్, పశ్చిమ బెంగాల్, కేరళ, పంజాబ్ రాష్ట్రాలు, పార్లమెంట్‌లో చేసిన జి.ఎస్.టి. చట్టం ప్రకారం 14 శాతం గ్రోత్‌రేట్ మీద పరిహారం ఇవ్వాలని దాన్ని పది శాతానికి ఎలా తగ్గిస్తారని ప్రశ్నిస్తూ కేంద్ర ఆర్థికశాఖ మంత్రికి లేఖ కూడా రాశాయి. కేంద్రం జి.ఎస్.టి. పరిహారం ఎగ్గొట్టాలని చూస్తే పార్లమెంట్‌లో నిలదీస్తామన్నాయి. ఆప్షన్-1, ఆప్షన్ -2 కాదు. చట్టానికి లోబడి పూర్తి పరిహారం చెల్లించాల్సిందేనని డిమాండ్ చేస్తున్నాయి. ఈ అధికారం పార్లమెంట్‌కు తప్ప ఎవరికి లేదన్నాయి. కేంద్ర ప్రభుత్వం చట్ట ప్రకారం రాష్ట్రాలకు రావాల్సిన జి.ఎస్.టి. పరిహారం బకాయిలను కేంద్రమే తన నిధుల నుంచి గాని, అవసరమైతే తక్కువ వడ్డీలో రుణాలు తెచ్చిగాని ఇవ్వాలే కానీ ఈ సంక్షోభాన్ని అడ్డుపెట్టుకొని బాధ్యత నుంచి తప్పుకోరాదని రాష్ట్రాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇటీవల పరిహార బకాయిల చెల్లింపులపై అడ్వకేట్ జనరల్‌ను సంప్రదిస్తే మొత్తం నష్టపరిహారం రాష్ట్రాలకు చెల్లించాలని కూడా సూచించడం జరిగింది. నిజానికి ప్రపంచంలో ఎక్కడి నుంచైనా కేంద్రం సునాయాసంగా రుణ సేకరణ చేయగలదు దీనితో పాటుగా ఆర్‌బిఐ నుంచి ఎఫ్‌ఆర్‌బిఎం ప్రకారం ఐదు శాతం అప్పులు తీసుకునే అవకాశం ఉన్నది. అదీ వీలుకాకపోతే ఈ ఆర్థిక అత్యవసర పరిస్థితిలో అదనపు నోట్లు ముద్రించి క్వాంటిటేటివ్ ఈసింగ్, హెలిక్యాప్టర్ మనీ ద్వారా రాష్ట్రాలను ఆదుకునే స్వేచ్ఛ కూడా కేంద్రానికుంది. కేంద్రానికి సెస్‌తోపాటు, అనేక రూపాలలో నిధులు అందుతున్నందున చట్టానికి అనుగుణంగా రాష్ట్రాలకు ఇవ్వాల్సిన సెస్ ఇవ్వకుండా, అప్పులు తీసుకొమ్మనడాన్ని రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గిన టైంలో కేంద్రం పెట్రోల్, డిజిల్ ధరలు పెంచింది దీనివల్ల లక్షల కోట్ల రూపాయలు ఖజానాకు చేరినాయి. సర్‌చార్జీలు, సెస్ రూపంలో కేంద్రానికి 16 శాతం ఆదాయం వస్తుంది. రాష్ట్రాలకు ఆదాయ పరిమితులతో పాటుగా అప్పులు ఎఫ్‌ఆర్‌బిఎం ప్రకారం 3 శాతానికే పరిమితం చేశారు. కేంద్రం అనుమతితోనే రాష్ట్రాలు ఏదైనా చేయాల్సి ఉంది. రాష్ట్రాలకు ఇప్పుడున్న ఆర్థిక అత్యవసర పరిస్థితుల్లో రావాల్సిన బకాయిలను చెల్లించకపోతే సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న రాష్ట్రాలన్నీ ఏకైక జిఎస్‌టి చెల్లింపు అజెండాతో ఏకమై పార్లమెంట్‌లో గట్టిగా నిలదీయక మానవు, డిమాండ్ల సాధనకు కేంద్రంతో ఘర్షించక తప్పని పరిస్థితి ఏర్పడవచ్చు.

జిఎస్‌టి పరిహారాన్ని మరో మూడేళ్లు పొడిగించాలని డిమాండ్

బిహార్ మినహాయిస్తే చాలా రాష్ట్రాలు జిఎస్‌టి వసూళ్లలో 14 శాతం వృద్ధి సాధించలేక పోతున్నాయి. జిఎస్‌టి బిల్లును ఆమోదింపజేసుకొనే క్రమంలో రాష్ట్రాలకు ఇచ్చిన హామీ, అనుగుణంగా లోటు భర్తీ చేయవలసిన అవసరం కేంద్రంపై మరింత పెరుగుతోంది. ఈ కారణంగానే జిఎస్‌టి పరిహారాన్ని మరో మూడేళ్లపాటు పెంచాలని రాష్ట్రాలు 15వ ఆర్థిక సంఘాన్ని కోరుతున్నాయి. అంటే 2024-25 దాకా పొడిగించ వలసివస్తుంది. లాంఛన ప్రాయంగా పొడిగింపుపై నిర్ణయం తీసుకోవలసింది జిఎస్‌టి మండలి అయినా వాస్తవంగా నిర్ణయం తీసుకోవలసింది కేంద్ర ప్రభుత్వమే. కేంద్రంలో, 20 రాష్ట్రాల్లో తమ ప్రభుత్వాలే ఉన్నాయన్న ధీమాతో కౌన్సిల్‌లో ఓటింగ్ వరకూ వెళ్లినా ప్రభుత్వానికి 75 శాతం ఓట్లు ఉన్నాయన్న భరోసాతో ఈ ప్రతిష్టంభనకు ముగింపు పలకకుండా నిరంకుశంగా వ్యవహరించడం విచారకరం. నిజానికి, జిఎస్‌టి బిల్లు ముసాయిదాలోనే రాష్ట్రాల అభ్యంతరాలకు చోటులేకుండా పోయింది. బిల్లులోని సెక్షన్ 12(9) ప్రకారం జిఎస్‌టి కౌన్సిల్‌లో ఏ నిర్ణయమైనా జరగాలంటే, ఆ కౌన్సిల్ సమావేశంలో పాల్గొనే వారిలో 75 శాతం మంది ఆమోదం పొందాలి. అయితే, జిఎస్‌టి కౌన్సిల్‌లో సభ్యులుగా ఉన్న రాష్ట్రాలకు 67 శాతం ఓట్లు మాత్రమే కల్పించారు. కేంద్ర ప్రభుత్వం తరపున పాల్గొనే ఇరువురు మంత్రులకు 33 శాతం ఓట్లు నిర్ధారించారు. అటువంటప్పుడు జిఎస్‌టి కౌన్సిల్‌లో తీసుకొనే నిర్ణయాలు రాష్ట్రాలకు అనుకూలంగా ఉండే అవకాశమేలేదు. కానీ నైతికంగా, హేతుబద్ధంగా కేంద్రం జిఎస్‌టి పూర్తి పరిహారం రాష్ట్రాలకు చెల్లించాల్సిందేనని ఆర్థిక నిపుణులు సహితం అభిప్రాయ పడుతున్నారు.

బిజెపి యేతర రాష్ట్రాలపై శీత కన్ను

తమపార్టీ అధికారంలో లేని రాష్ట్రాలలో రాజకీయ అస్థిరత సృష్టించడానికి కేంద్ర ప్రభుత్వం ఐ జిఎస్‌టి (సమీకృత వస్తు సేవల పన్ను) బకాయిల పంపిణీలో పక్షపాతంగా వ్యవహరించింది. 2017-18 ఏడాదికి సంబంధించి విడుదల చేసిన రు. 1,76,688 కోట్ల నిధుల్లో అత్యధికం బిజెపి పాలిత రాష్ట్రాలకు వెళ్లాయి. ప్రతిపక్షాల పాలనలో ఉన్న రాష్ట్రాలకు నిధుల పంపిణీలో అన్యాయం జరిగినట్టు కేంద్ర ఆర్థికశాఖ గణాంకాలు చెబుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం అనుసరించిన

ఈ విధానం వల్ల కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోవడం ప్రభుత్వ ద్వంద్వ నీతికి నిదర్శనం. ద్వంద్వ నీతిని ప్రశ్నించిన ప్రతిపక్షాలను, బకాయిల పంపిణీపై స్పష్టమైన సూత్రీకరణ లేదని కేంద్రం బుకాయిస్తుంది. కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రాల పట్ల సమదృష్టి లేకపోవడంతో కొన్ని రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. అందులో కేరళ రు. 900 కోట్లు, తెలంగాణ రు. 2,638 కోట్లు, ఆంధ్రప్రదేశ్ రు. 4,800 కోట్లు, తమిళనాడు రు.4,231 కోట్లు, ఢిల్లీ రు. 3000 కోట్లు, పశ్చిమ బెంగాల్ రు.560 కోట్లున్నాయి. ప్రతిపక్షాల పాలనలో ఉన్న ఇటువంటి రాష్ట్రాలు కేంద్రంపై తీవ్ర అభ్యంతరాన్ని తెలుపుతున్నాయి.

పన్ను చెల్లించే వారి సంఖ్య పెరిగింది కానీ పన్ను రాబడి తగ్గింది

కేంద్ర ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ ఎంత అధ్వాన్నంగా ఉన్నదంటే జిఎస్‌టి వసూళ్లలోనూ మొండి బకాయిలు కొండలా పెరుగుతున్నాయి. జిఎస్‌టి రేట్లు, శ్లాబుల మార్పుపై జిఎస్‌టి కౌన్సిల్ మొదట్లోనే సహేతుకమైన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని, శ్లాబులలో మార్పులుచేసి ఉంటే పారిశ్రామిక వర్గాలకు వెసులుబాటు లభించేది. జిఎస్‌టిని ఎవ్వరూ ఎగ్గొట్టేవారు కాదు. కేంద్రం ఏకపక్షంగా ప్రకటించిన లాక్‌డౌన్ కారణంగా అనేక పరిశ్రమలు, వ్యాపారాలు మూతబడి జిఎస్‌టి కట్టలేక చేతులెత్తేశాయి. జిఎస్‌టి అమల్లోకి వచ్చిన అనంతరం కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదిక ప్రకారం 2018 ఏప్రిల్‌లో 87 శాతం మంది పన్నుల రిటర్నులు దాఖలుచేస్తే 2018 డిసెంబర్‌లో అది 79 శాతానికి పడిపోయింది. ఇది పన్ను చెల్లింపులు సక్రమంగా జరగడం లేదనడానికి నిదర్శనం. అంతర్రాష్ట్ర వస్తువులు, సేవలు, దిగుమతుల మీద విధించే సమీకృత వస్తుసేవల పన్ను 2017-18లో రు. 1,76,688 కోట్లు ఉంటే అది 2018-19లో రు. 28,947 కోట్లకు తగ్గిపోయింది. పెట్రోలియం, పొగాకు మీద కేంద్రానికి అందే ఎక్సైజ్ సుంకాన్ని మినహాయిస్తే జిఎస్‌టి ద్వారా ప్రభుత్వ ఆదాయం 2016-17తో పోలిస్తే 2017-18లో 10 శాతం తగ్గి పోవడం గమనార్హం. జిఎస్‌టి విధానంలో ఉన్న ప్రధానమైన అంశం ఇన్‌వాయిస్ మ్యాచింగ్ వ్యవస్థ దీనిలోని లోపాల వలన 2017 లో 65 లక్షల మంది పన్ను చెల్లించేవారు ఉంటే వారి సంఖ్య 1. 20 కోట్లకు పెరిగింది. పన్ను చెల్లించేవారి సంఖ్య పెరుగుతోందన్నమాట వాస్తవమే కాని ఇలా పన్ను చెల్లించే వారిలో కేవలం 5 శాతం మందే 95 శాతం పన్ను చెల్లిస్తున్నారు. మిగిలిన 95 శాతం మంది చట్టానికి దొరకకుండా మినహాయింపు పొందుతున్నారు. సాంకేతికమైన అంశాలు అనేకంగా పరిష్కరించినప్పటికీ టాక్స్ టర్నోవర్‌లు దాఖలు చేసేవారి సంఖ్య మాత్రం పెరగడం కష్టమే. ఎందుకంటే 90 శాతం ఉపాధి కల్పిస్తున్న, జాతీయ ఉత్పత్తిలో అయిదింట రెండు వంతులు ఆదాయం సమకూరుస్తున్న అవ్యవస్థీకృత రంగం జిఎస్‌టి పరిధిలోకి రాకపోవడమే ప్రధాన కారణం.

జిఎస్‌టి పరిహారాన్ని కేంద్రం దారి మళ్లించింది : కాగ్

జిఎస్‌టి పరిహారం చెల్లింపుల్లో కేంద్రం రాష్ట్రాలకు అన్యాయంచేసి జిఎస్‌టి మొదలైన తర్వాత తొలి రెండు సంవత్సరాల్లో వసూలైన పరిహార సుంకం మొత్తం నుంచి రు. 47,272 కోట్లు జిఎస్‌టి చట్టానికి విరుద్ధంగా కేంద్రం సొంత అవసరాలకు మళ్లించుకున్నదని కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక నిగ్గుతేల్చింది. ఈ మొత్తాన్ని జిఎస్‌టి సెస్ కింద వసూలు చేసిందని, నిబంధనల ప్రకారం ఇది రాష్ట్రాలకు చెందాలని, నాన్ - ప్రాఫిటెబుల్_నిధి కింద జమచేయాల్సిన ఈ మొత్తాన్ని వేరే పథకాలకు మళ్లించారని కాగ్ వివరించింది. కేంద్రం లాభాలొస్తే మాకు, నష్టాలొస్తే మీకు అనే చందంగా వ్యవహరించి జిఎస్‌టి చట్టాన్ని సహితం ఉల్లంఘించినట్లు స్పష్టమవుతుంది. దీనితో కేంద్రం నిజాయితీ లేమితనం బట్టబయలైయింది.

అందుచేత రాష్ట్రాలను అప్పుల ఊబిలోకి దించే జిత్తులమారి పరిష్కారాలకు స్వస్తిచెప్పి కేంద్రమే తనకు సులభ సాధ్యమైన పలు మార్గాల ద్వారా విత్తాన్ని సమీకరించి రాష్ట్రాలకు చెల్లించవలసిన పరిహారాన్ని తక్షణమే విడుదలచేయాలి. ఇందులో మరింత జాప్యం జరిగేకొద్దీ జిఎస్‌టి వ్యవస్థకు అంగీకరించి తాము మోసపోయామనే అభిప్రాయం రాష్ట్రాల్లో బలపడుతుంది. ఇటు పన్నుల వసూలు స్వేచ్ఛను కోల్పోయి అటు కేంద్రం గుత్త పెత్తనాన్ని భరించవలసిన దుస్థితిలో పడిపోయామని భావించే స్థితి వస్తుంది.

ఎట్టకేలకు మెట్టుదిగిన కేంద్రం

క్రమంగా ఆర్థిక వ్యవస్థ మందగించడంతో పాటు కరోనా ప్రభావంతో ఈ ఏడాది జిఎస్‌టి వసూళ్లు తగ్గాయి. దీన్ని సాకుగా చూపించి రాష్ట్రాలకు కేంద్రం బకాయిలు కూడా చెల్లించలేదు. జిఎస్‌టి కోసం స్థానిక పన్నులు వ్యాట్ లాంటి ఇతరత్రా వసూళ్లను వదులుకున్న రాష్ట్రాలకు ఇది పెను భారంగా మారింది. రాష్ట్రాలు వస్తు సేవల పన్ను (జిఎస్‌టి)లకు సంబంధించి న్యాయంగా రావాల్సిన బకాయిలపై నాలుగు నెలలుగా కేంద్రంపై ప్రజాస్వామ్య పద్ధతిలో తీవ్రమైన ఒత్తిడి పెంచాయి. అవసరమనుకుంటే పార్లమెంట్‌లో నిలదీయాలని మెజారిటీ రాష్ట్రాలు సంఘటితమైనాయి. కేంద్రంపై తీవ్రస్థాయిలో వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో కేంద్రం రకరకాల కారణాలతో తప్పించుకునే ప్రయత్నం చేసినప్పటికీ రాష్ట్రాల న్యాయమైన, హేతుబద్ధమైన, శాస్త్రీయమైన వాదనలకు దిక్కుతోచని స్థితిలో ఎట్టకేలకు మెట్టుదిగొచ్చింది. రాష్ట్రాల పోరాట రూపాలు తీవ్రంగా మారుతాయని గమనించి తన వైఖరి మార్చుకొని రాష్ట్రాల తరుపున ఇప్పుడు కేంద్రమే రుణాలు తీసుకుని రాష్ట్రాలకు తిరిగి చెల్లించే బాధ్యత తీసుకుంది. రు.1.1 లక్షల కోట్లను రుణంగా తీసుకొని ఆ మొత్తాన్ని తిరిగి అప్పుల రూపంలో రాష్ట్రాలకు చెల్లించాలని నిర్ణయించింది.

ఇలా యూటర్న్ తీసుకున్న కారణాలను వివరిస్తూ కేంద్ర ఆర్థిక శాఖమంత్రి రాష్ట్రాలకు లేఖ రాయడం రాష్ట్రాలు, సంఘటితంగా, సమైక్యంగా సాధించిన గొప్ప విజయంగా అర్థంచేసుకోవచ్చునని ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడుచున్నారు. కేంద్రం చట్ట సమయంలో స్వయంగా ఇచ్చిన హామీలపై రాష్ట్రాలు సుదీర్ఘంగా పోరాటం చేయడం నిజానికి విచారకరమే. ఇంతజరిగాక విధిలేక మెజారిటీ రాష్ట్రాల సూచనల మేరకు రుణాలను కేంద్రమే తీసుకుని సహేతుక వడ్డీరేట్లకు రాష్ట్రాలకు అప్పుగా ఇవ్వాలని నిర్ణయించింది.

రాష్ట్ర ప్రభుత్వాల తక్షణ డిమాండ్

రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వ తాజా చర్యలను స్వాగతిస్తూ, 2022 లోగా ఎంత పరిహార బకాయి చెల్లించి 2023 నాటికీ ఎంత పరిహారాన్ని వాయిదావేస్తుందో స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ నిర్ణయం వెనుక అనేక అనుమానాలు ఉన్నాయని, కేంద్రం నేరుగా రాష్ట్రాలతో చర్చించి ఏకాభిప్రాయానికి రావాలని పలు రాష్ట్రాల మంత్రులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఏడాదికి చెల్లించాల్సిన రు. 2.3 లక్షల కోట్ల బకాయిలు పూర్తిగా ఏకమొత్తంగా చెల్లించాలని ఆర్థిక వ్యవస్థ మందగమనంలో ఉన్నందున కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం వలన ద్రవ్యలోటు ప్రభావితం కాదని ఆర్థికవేత్తలు సహితం సూచిస్తున్నారు. లేదంటే కేంద్రం నిర్ణయించిన రు. 1.1 లక్షల కోట్లకు బదులుగా గత వాయిదాల ప్రకారం రాష్ట్రాలకు చెల్లించాల్సిన రు. 1. 7 లక్షల కోట్లు అప్పు తీసుకొని చెల్లించాలని రాష్ట్రాలు డిమాండ్ చేస్తున్నాయి. లేని పక్షంలో జీఎస్‌టి పరిహారానికి సంబంధించి కేంద్రం వివక్షత, చట్ట విరుద్ధమైన చర్యలకు వ్యతిరేకంగా అసమ్మతి రాష్ట్రాలు సుప్రీంకోర్టు తలుపులు తట్టి న్యాయ పోరాటం కొనసాగించే అవకాశం ఉంది.

రాష్ట్రాలపై రెట్టింపైన రుణభారం

గత ఐదేండ్లలో రాష్ట్ర ప్రభుత్వాల రుణభారం సుమారు రు.50 లక్షల కోట్లు ఉంటుందని అంచనా కాగా వేగంగా పెరుగుతున్న అప్పులపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీవ్ర ఆందోళనను వ్యక్తం చేసింది. మరొకవైపు కేంద్ర ఆర్థిక మంత్రి కోవిడ్ మహమ్మారిని 'యాక్ట్ ఆఫ్‌గాడ్' అంటూ నిస్సహాయంగా కరోనా కారణంగా కలిగే నష్టానికి తమ బాధ్యత ఉండదని చేతులు ఎత్తేయడం రాష్ట్రాలకు పుండు మీద కారం చల్లినట్టుగా ఉన్నది. ఈ విషమ పరిస్థితుల్లో కేంద్రం సమాఖ్య స్ఫూర్తితో పనిచేసి రాష్ట్రాలకు అన్ని విధాలా వెన్నుదన్నుగా నిలవాలి. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ప్రస్తుత కాలంలో ఆర్థిక వ్యవస్థనుగాడిలో పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం విదేశీ ఖాతాల్లో నిల్వచేసిన బిలియన్ల రూపాయలను తిరిగి తీసుకొస్తామన్న వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలి. బలమైన రాష్ట్రాలు ఉంటేనే బలమైన కేంద్రం సాధ్యమని రాజ్యాంగ నిర్మాతలు కన్న కలల నిజం చేయాలంటే కేంద్రం ప్రస్తుత వైఖరి విడనాడి మరింత స్ఫూర్తివంతంగా వ్యవహరించాలి.

జిఎస్‌టి విషయంలో తెలంగాణ రాష్ట్రానిది రెండు నాల్కల ధోరణి

దేశ విస్తృత ప్రయోజనాల నిమిత్తం లాభనష్టాలతో సంబంధం లేకుండా జిఎస్‌టి చట్టానికి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కేంద్రానికి మద్దతు తెలిపిన మొదటి మూడు రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్రం ఒకటి. జూలై, 2017 నుంచి అమల్లోకి వచ్చిన జీఎస్‌టిని రాష్ట్రంలో అమలుచేసే విషయంలో తెలంగాణ రాష్ట్రం అద్భుత ప్రగతి సాధించిందని, మొదటి పక్షం రోజుల్లోనే 90 శాతం మంది వ్యాట్ ఖాతాదారులను జీఎస్‌టి పరిధిలోకి తీసుకురాగలిగిందని, తెలంగాణ వ్యాప్తంగా వ్యాట్ పరిధిలో ఉన్న 2.16 లక్షల మంది ట్రేడర్లలో 1.92 లక్షల మంది ట్రేడర్లు ఈ నెల 15 వరకు జీఎస్‌టిలో అనుసంధానమై నెంబర్లు పొందారని, ట్రేడర్లందరినీ అధికారులు వ్యక్తిగతంగా కలిసి జీఎస్‌టి పరిధిలోకి తెచ్చారని, 15 రోజుల్లో ఇంతటి పురోగతి సాధించిన అతికొన్ని రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచిందని, జీఎస్‌టి పై చాలా రాష్ట్రాల్లో ఇంకా గందరగోళం, ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో, జీఎస్‌టిలో చేరడానికి వ్యాపారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్న పరిస్థితుల్లో తెలంగాణ రాష్ట్రం ఈ ప్రగతి సాధించడం గొప్ప విషయమని ఒకవైపు కేంద్రప్రభుత్వ అధికారులు కితాబునివ్వగా మరొకవైపుగా జీఎస్‌టి అమలు విషయంలో అపోహలు తొలగించి, ఇందులో ఉన్న సానుకూల అంశాలను ప్రజలకు, వ్యాపారులకు విడమరిచి చెప్పాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు స్వయంగా అధికార యంత్రాంగానికి సూచనలిచ్చి జీఎస్‌టిపై అవగాహన కల్పించి, వ్యాట్ ఖాతాదారులను గరిష్ట సంఖ్యలో జీఎస్‌టిలో రిజిస్టర్ చేయించడంలో విశేష కృషిచేసిన అధికారులను అభినందించారు. ఇప్పుడు మాటమార్చి జీఎస్‌టిలో చేరడం వల్ల తెలంగాణ నష్టపోతుందని, 2016–2017లో తెలంగాణ రాష్ట్రం 22 శాతం గ్రోత్ రేటుతో ముందుకు పోయింది.

నిజానికి తెలంగాణ జీఎస్‌టిలో చేరకపోతే రు.25 వేలకోట్లు అదనంగా వచ్చేవని జీఎస్‌టిలో చేరి సెస్ రూపంలో కేంద్రానికి రు. 18 వేల 32 కోట్ల రూపాయలు చెల్లిస్తే, కేవలం రు. 3200 కోట్లు మాత్రమే రాష్ట్రానికి వచ్చాయని నేడు మాట్లాడుతూ ఇప్పుడు కేంద్ర వైఖరిపై దుమ్మెత్తిపోస్తూ సమాఖ్య వ్యవస్థకు భంగం వాటిల్లిందని గగ్గోలు పెడుతూ భారత సమాఖ్య వ్యవస్థలో రాష్ట్రాలకు, కేంద్రానికి సమాన హక్కులు ఉండాలని బజారుకు ఎక్కడాన్ని చూసి ముఖ్యమంత్రి రెండునాల్కల ధోరణికి అవకాశవాద విధానాలకు ఆర్థిక నిపుణులు సహితం ఆశ్చర్యపోతున్నారు.

ముగింపు

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ జీఎస్‌టి విధానం ప్రధానంగా రాష్ట్రాల స్వతంత్ర ప్రతిపత్తిని హరించివేసింది. గతంలో రాష్ట్రాలకు తమ అవసరాలకు అనుగుణంగా స్వేచ్ఛగా అమ్మకపు పన్ను రేటును మార్చుకునే అధికారముండేది. ఇప్పుడు రాష్ట్రాలకు తమ మౌలిక వనరుల కల్పనకు అవసరమయ్యే నిధులను సమకూర్చుకునే వెసులుబాటు జీఎస్‌టి వల్ల లేకుండా పోయింది. ఈ ఆర్థిక విపత్తు దాదాపు అన్ని రాష్ట్రాలకు అత్యంత దుర్భరంగా పరిణమించింది. పరిస్థితి ఇప్పుడే ఇలా ఉంటే, పరిహారం చెల్లించేందుకు కేంద్రం హామీ ఇచ్చిన ఐదు సంవత్సరాల గడువు అనంతరం మరెంత తీవ్ర సమస్యల నెదుర్కోవలసి వస్తుందోనని రాష్ట్రాలు తీవ్రంగా కలవరపడుతున్నాయి. రాబోయే ఆదాయ లోటును ఎలా భర్తీచేసుకోవాలనేది రాష్ట్రాలకు అగమ్యగోచరంగా ఉంది. కొన్ని రాష్ట్రాలకు సుమారుగా 40 శాతం మేరకు ఆదాయం తగ్గిపోయే ప్రమాదముంది అంతభారీ ఆదాయ లోటుతో తమ సిబ్బందికి జీత భత్యాలు కూడా చెల్లించలేని దుర్భర పరిస్థితి ఏర్పడే అవకాశముంది. నిజానికి జీఎస్‌టి చట్టం భారత రాజ్యాంగ లక్ష్యాలకు భిన్నమైనదే కాకుండ సమాఖ్య స్ఫూర్తికి కూడా విరుద్ధమైనది. కావున గత విధానాలను పునరుద్ధరిస్తూ ఈ చట్టాన్ని రద్దుచేయాలని రాష్ట్ర ప్రభుత్వాలు డిమాండ్ చేయడంలో ఔచిత్యం ఎంతయినా ఉంది.

(రచయిత అసిస్టెంట్–ప్రొఫెసర్, తెలంగాణవిశ్వవిద్యాలయం) ఈ

ఎన్‌కౌంటర్లు లేని తెలంగాణను చూడగలమా?

ఎన్‌కౌంటర్‌లే ఉండవని చెప్పిన టిఆర్ఎస్ పార్టీ వాటిని అమలుపరుస్తూ శాంతి కోసం మేధావులు చేసిన కృషిని రద్దు చేస్తుందని, ముందు ముందైనా ఈ నేలలో నెత్తురువారని రోజును కలగనగలమా అంటున్నారు ఎన్. నారాయణ రావు

తెలంగాణలో మళ్లీ ఎన్‌కౌంటర్‌లు మొదలయ్యాయి. గత రెండు నెలల కాలంలోనే ఐదు ఎన్‌కౌంటర్లలో 12 మంది మావోయిస్టులు చనిపోయారని పోలీసు అధికారులు ప్రకటిస్తున్నారు. సెప్టెంబర్ 2015 శృతి, సాగర్ ఎన్‌కౌంటర్ తర్వాత ఎన్‌కౌంటర్లు ఉండవని రాష్ట్ర ప్రభుత్వం తరపున అప్పటి నిజామాబాద్ ఎం.పి. కల్వకుంట్ల కవిత తెలంగాణ ప్రజలకు వాగ్దానం చేసింది. కాని దిశ ఘటనలో ముద్దాయిలు న్యాయస్థానాల తీర్పువరకు ఎదురు చూడకుండానే ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. ప్రత్యూష హంతకులకు బలమైన ప్రభుత్వ రక్షణ ఉంటున్నది. ఆ నేరస్తులకు శిక్షపడదు. దిశ ముద్దాయిలు పేదవాళ్లు కాబట్టి శిక్షలు పోలీసు వ్యవస్థే నిర్ధారిస్తుంది. ఇదే స్థితి గత రెండు నెలలుగా కొనసాగుతున్న ఎన్‌కౌంటర్‌లలో చూడవచ్చు.

ఎన్‌కౌంటర్ అంటే ఎదురుకాల్పులు అనే విషయాన్ని భారత సమాజం మరిచిపోయి దశాబ్దాలు దాటింది. ఎన్‌కౌంటర్ అంటే ప్రభుత్వ హత్యలు, అందుకే ప్రజలు తట్టుకోలేని ఘటన ఎదురైనప్పుడు ప్రజలే డిమాండ్ చేస్తున్నారు. ఎన్‌కౌంటర్ చేయమని, అంటే చంపెయ్యమని, అంటే హత్యలే ఎన్‌కౌంటర్ రూపంలో జరగాలని ప్రజలు కోరుకున్నారు. అదే అమలు జరిగింది కూడా. కానీ ఈ స్థితి ఎటు వైపు వెళుతుంది. న్యాయవ్యవస్థ ప్రజాస్వామ్యంలో లేకుండా పోతుంది. పాలకవర్గం, పోలీసులు కలిస్తే ఆటవిక రాజ్యంగా కొనసాగుతుంది. ఇదే వద్దనుకునే 2004లో సీనియర్ జర్నలిస్ట్ పొత్తూరి వెంకటేశ్వరరావు, ఎస్.ఆర్. శంకరన్‌లతో కలిసి పీస్ ఇనిషియేటివ్ సంస్థ నెలకొల్పి ఒక ఏడాది కాలం ఉద్యమ పార్టీలతో, ప్రభుత్వంతో చర్చలు జరిపి ఒక శాంతి వాతావరణాన్ని తీసుకొచ్చారు. చర్చల 6 నెలల కాలానికి ఒక ప్రాధాన్యత ఉంది. ఇదే ప్రాధాన్యత 2009 ఎన్‌కౌంటర్‌లపై అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 5 గురు జడ్జీలతో ఇచ్చిన ఫుల్ బెంచ్ తీర్పు వెలువడ్డాక 6 నెలల పాటు ఉండంది చరిత్రలో ఎన్‌కౌంటర్ జరగని కాలంగా మనం చూశాం. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించాక మళ్లీ ఎన్‌కౌంటర్‌లు కొనసాగి నేటికి జరుగుతున్నాయి. ఇదే ఎన్‌కౌంటర్‌లపై, రాజ్యహింసపై ఛత్తీస్‌గఢ్‌లో ప్రజాభిప్రాయం సేకరిస్తే 92 శాతం చర్చల ద్వారా ఈ సమస్యలు పరిష్కరిస్తే బాగుంటుందనే అభిప్రాయం ప్రజల నుంచి వచ్చింది. 80, 90లలో పరిస్థితి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇలాగే ఉండేది, రాత్రి ఇంట్లో పడుకున్నవాడు, ఉదయాన్నే అడవిలో, తుప్పల్లో శవమై కన్పించేవాడు. ఈ స్థితే మేధావుల సమిష్టి కృషి చర్చల ప్రయత్నం. దానికి ఎస్.ఆర్. శంకరన్ కృషిని వెలకట్టలేం.

2020 సెప్టెంబర్ 3న గుండాల మండలం దేవళ్లగూడెంలో శంకర్ అనే మావోయిస్టు మృతి చెందాడని, సెప్టెంబర్ 7న చర్ల మండలం పూసుకుప్ప వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు చనిపోయారని పోలీసులు ప్రకటించారు. వారి పేర్లను మావోయిస్టు పార్టీ ఒకరిని శ్రీనుగా, మరొకరిని ఐతుగా, వారి పత్రిక ప్రకటనలలో ప్రకటించారు. వారు నిత్యావసరాల కోసం సివిల్ దుస్తుల్లో వెళుతున్నా వారిని పట్టుకుని చిత్రహింసలకు గురిచేసి పూసగుప్ప – వద్దిపేట గ్రామాల మధ్య పెట్టుకొని కాల్చిచంపారని ప్రకటించింది. సెప్టెంబర్ 19న ఆదిలాబాద్ కదంబ అడవుల్లో చుక్కాలు, బాజారావులు ఎన్‌కౌంటర్‌లో చనిపోయారని పోలీసు అధికారులు ప్రకటించారు. భద్రాద్రి కొత్తగూడెం చర్ల మండలంలోని చెన్నెపురంలో సెప్టెంబర్ 23న జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు జోగయ్య, రాజీ, లలితలు మరణించారని పోలీసులు ప్రకటించారు. చనిపోయిన వాళ్లందరూ మావోయిస్టులేనని, అందరిని సివిల్ దుస్తుల్లో ఉన్నప్పుడు పట్టుకొని చిత్రహింసలు పెట్టి 'ఎన్‌కౌంటర్' పేరుతో హత్య చేశారని మావోయిస్టులు ప్రకటించారు. నిరాయుధులుగా ఉన్నప్పుడు పట్టుకుని అరెస్టు చేసి జైళ్లలో పెట్టాలి కాని ఇలాంటి హత్యకాండలు ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు.

అక్టోబర్ 18న ములుగు జిల్లా మంగపేట మండలం నరసింహపూర్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో సుధీర్, లక్మాలు మరణించినట్లుగా పోలీసులు ప్రకటించారు. నరసింహసాగర్ కొప్పుగుట్ట సమీప అటవీ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు తారసపడగా ఎదురుకాల్పులు చోటుచేసుకున్నట్లుగా కాల్పుల్లో సుధీర్, లక్మాలు మరణించినట్లుగా పేర్కొన్నారు. అక్టోబర్ 18 మధ్యాహ్నం ఘటన జరిగినట్లుగా పేర్కొన్నారు. జరిగిన ఈ ఐదు ఎన్‌కౌంటర్‌లు భూటకమేనని మావోయిస్టు పార్టీ ఆరోపిస్తున్నది. నిర్ధారణ చేయకుండా ప్రభుత్వం అడ్డుపడుతున్నది.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 18 వేల మంది గ్రేహౌండ్స్ పారా మిలటరీ బలగాలతో చుట్టుముట్టి, గ్రామాలను, అడవులను జల్లెడ పడుతున్నట్లుగా వారి వారి ప్రకటనల ద్వారా తెలియవస్తున్నది. ఆదిలాబాద్ జిల్లాలో వేలాది మంది, ఇంద్రవెల్లి, సట్రార్ చెన్నూర్, బోద్, సింగాపూర్, పిప్పిల్‌దరి, వాంకిడి, ఆదిలాబాద్, తలమడుగు, తాంసి ప్రాంతాల్లో పెద్ద ఎత్తున కూంబింగ్ నిర్వహిస్తున్నట్లుగా వారి ప్రకటనల్లో తెలియజేస్తున్నారు. ఇదే స్థాయిలో భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కూడా వేలాది పారామిలటరీ బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నట్లుగా వార్తా మాద్యమాలు ప్రకటిస్తున్నాయి. ఈ స్థితి మళ్లీ పచ్చని అడవుల్లో నెత్తురు పారుతున్నట్లుగా కొనసాగుతున్నది.

ఎన్‌కౌంటర్‌లపై హక్కుల సంఘాల నిజనిర్ధారణలకు కూడా

న్యాయవ్యవస్థ స్వతంత్రత - రాజ్యాంగ దృక్పథం

***భారత రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను సజీవంగా ఉంచాలంటే న్యాయవ్యవస్థకు స్వతంత్రత ముఖ్యమనీ, అది కోల్పోతే భవిష్యత్తులో రాజ్యాంగ భాగాలను రద్దు చేసే నియంతృత్వం రాజ్యమేలుతుందనీ అంటున్నారు* చిమ్మె. జాన్ బర్నబాస్**

సుప్రీంకోర్టు న్యాయమూర్తి నూతలపాటి వెంకటరమణపై ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఎ. బాబ్డేకు ఫిర్యాదు చేశారు. అందులోని ఆరోపణలు ఎలాగున్నా ఆయనను భారత ప్రధాన న్యాయమూర్తిగా కాకూడదనే లక్ష్యంతో చేసినట్లు తెలుస్తున్నది. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కొంతమంది హైకోర్టు న్యాయమూర్తులు (ఆంధ్రప్రదేశ్) తనకు వ్యతిరేకంగా తీర్పునిస్తున్నారంటూ, వారిపై జస్టిస్ ఎన్.వి. రమణ ఒత్తిడి కారణంగానే ఈ విధంగా జరుగుతున్నదంటూ కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. జస్టిస్ ఎన్.వి. రమణ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు చాలా దగ్గర వాడనీ, కాబట్టే ఈ విధంగా జరుగుతూ ఉన్నదంటూ కూడా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భావిస్తూ ఉన్నారు. ఇదంతా ఒకవైపు కాగా అసలు నాయ్యమూర్తులు రాష్ట్రపతి చేత నియమించబడక ముందు వారి గత చరిత్ర, వారు న్యాయ కోవిదులా కాదా? వారికి చట్టాల పైన, భారత రాజ్యాంగం పైన ఎంతవరకు అవగాహన ఉన్నదనే పరిశీలన క్షుణ్ణంగా జరుగుతుంది. అంతేకాకుండా దాదాపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు, సలహా, సంప్రదింపుల తర్వాతనే న్యాయమూర్తిగా భారత రాష్ట్రపతి చేత నియమించబడతారు. నిజంగా మాట్లాడుకోవాలంటే ప్రతి న్యాయమూర్తీ ఏదో ఒక రాజకీయ పార్టీ అధికారంలో ఉండగానే వారి మద్దతుతోనే కేంద్ర ప్రభుత్వానికి రికమెండ్ చేయబడతారు. ఇది సర్వసాధారణ విషయం. అయితే ఇక్కడ కొత్త విషయం ఏమంటే నలుగురు న్యాయమూర్తులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎన్.వి. రమణ చేత ప్రభావితులై తీర్పులు ఇస్తున్నారనేది! వీరంతా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారనేది రాష్ట్ర ప్రభుత్వ వాదన. ఈ వాదననే సరైనదని అనుకుంటే ఈ న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పులు భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో కూడా నెగ్గుతున్నాయి.

ప్రభుత్వాలు కట్టడి చేస్తున్నాయి. ఎ.ఒ.బి.లో జరిగిన ఎన్‌కౌంటర్‌లపై నిజనిర్ధారణను, నియంత్రించడానికి బాధిత ఆదివాసులను తీసుకువచ్చి అడ్డం పెట్టి నిజనిర్ధారణలు జరగనివ్వలేదు. 'మీనా' అనే మావోయిస్టు ఎన్‌కౌంటర్‌పై నిజనిర్ధారణ పై చాలా శ్రమించాల్సి వచ్చింది. గడ్చిరోలిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లపై కూడా నిజనిర్ధారణ చేయనీయకుండా రాజ్య నిర్బంధం అడ్డుపడింది. 2020 సెప్టెంబర్ 23న చర్లలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై నిజనిర్ధారణకు బయలుదేరిన 'మానవహక్కుల వేదిక' బృందాన్ని అక్టోబర్ 4న ఒక రోజు పాటు నిర్బంధించి, బైండోవర్ చేసి వదిలివేయడం జరిగింది. ఇంకొకసారి నిజనిర్ధారణకు వస్తే ఎన్‌కౌంటర్‌లో చంపేస్తాం అని బెదిరించడం కూడా జరిగింది.

తెలంగాణలో ప్రజాస్వామిక నిరసనకు, హక్కుల సంఘాల కార్యాచరణకు అవకాశం లేకుండా రాజ్యనిర్బంధం తీవ్రస్థాయిలో కొనసాగుతున్నది. ఎన్‌కౌంటర్ హత్యకాండలు, ముందు నక్సలైట్లు ఆయుధం పట్టారని మొదలై ఐ.ఎస్.ఐ. ముస్లీం ఆందోళనకారులను, దొంగల్ని చంపారు, చివరికి దిశ లాంటి ఘటనల్లో ముద్దాయిలను కూడా ఎన్‌కౌంటర్ పేరుతో జీవించే హక్కును కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ఇదే స్థితి కొనసాగితే ప్రతిపక్షపార్టీ వాళ్లు కూడా ఎప్పుడో ఒకసారి ఎన్‌కౌంటర్‌లకు బలికావాల్సి వస్తుంది. భీమాకోరెగాం కేసులో ఫాదర్ స్టాన్ స్వామి అరెస్ట్ తర్వాత జార్ఖండ్ ముఖ్యమంత్రి రేపు నన్ను కూడా అరెస్ట్ చేయొచ్చు అన్నట్లుగా, చివరికి ఎవరినైనా ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేసే స్థితి ఏర్పడుతుంది. ఛత్తీస్‌గఢ్ ప్రజలు కోరుకున్నట్లు గానే రెండు తెలుగు రాష్ట్రాల్లో కూడా ప్రజాభిప్రాయ సేకరణను కొనసాగించి, ఎస్.ఆర్. శంకరన్‌తో నిలిపివేసిన శాంతి చర్చల ప్రక్రియను కొనసాగించి ఎన్‌కౌంటర్‌లు లేని శాంతియుత సమాజం కోసం కలలు కందాం.

కలలు కనడం ఎందుకని భావించాలంటే 73 నుండి పౌరహక్కుల సంఘం ప్రధానంగా ఎన్‌కౌంటర్‌లు లేని సమాజం ఆకాంక్షగా కార్యచరణ కొనసాగుతున్నది. 45 ఏండ్ల ప్రయాణంలో న్యాయవ్యవస్థ ద్వారా పోరాటం ఓ మేరకు ఫలితం సాధించినా, ఎన్‌కౌంటర్‌లు పియుసిఎల్‌విఎస్ మహారాష్ట్ర ప్రభుత్వం కేసులోని తీర్పునే ఖాయం చేయడం ద్వారా ఎన్‌కౌంటర్ కేసుల్లో స్పష్టమైన ఖచ్చితమైన తీర్పుకు ప్రజలు దూరమయ్యారు. ఇంకా ఎన్‌కౌంటర్‌లపై నిజనిర్ధారణ చేసి న్యాయవ్యవస్థ ద్వారా కేవలం రీపోస్ట్‌మార్టం వరకే పొందగలగు తున్నాం. కాని ఎన్‌కౌంటర్‌లలో పాల్గొన్న పోలీసులపై 302 హత్యా నేరం నామోదు కావడం లేదు. ప్రజాస్వామిక వ్యవస్థలో అటువంటి నిబద్ధత, క్రమశిక్షణ న్యాయవ్యవస్థలో చోటుచేసుకున్నప్పుడే, నెత్తురు కారని అడవిని చూడగలం. ప్రజాస్వామ్య వ్యవస్థ పట్ల ప్రజలందరూ విశ్వాసంతో ఉండగలరు. కనీసంగానైనా జీవించగలరు. బుద్ధిజీవుల మేధస్సు బలంగా మారిన రోజులో వ్యవస్థలో గుణాత్మకమైన మార్పులు మనం చూడగలం.

(రచయిత ప్రధాన కార్యదర్శి, పౌరహక్కుల సంఘం) వీ

సుప్రీంకోర్టు వీటిని సమర్థిస్తున్నది కూడా. న్యాయమూర్తులు రాజ్యాంగ పరమైన అంశాలు మాత్రమే చూస్తారు తప్ప మిగతా విషయాలు పెద్దగా పట్టించుకోరు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు రాజ్యాంగ పరంగా సమర్థనీయమా? కాదా? ఆ ప్రభుత్వ ఉత్తర్వులు అమలులోకి వస్తే ప్రజలు ఏమాత్రం స్వీకరిస్తారు? ప్రజలు ఎంతమేరకు నష్టపోతారనే విషయాలు ఆలోచించి తీర్పులివ్వడం జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం తన విధి విధానాలు మార్చుకోకుండా, కోర్టులపై వైరం పెంచుకోవడం సరికాదు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేత సుప్రీంకోర్టుకు ఫిర్యాదు చేయబడిన న్యాయమూర్తులు 1) జస్టిస్ జి. లలిత, 2) జస్టిస్ డి. రమేశ్, 3) జస్టిస్ సత్యనారాయణ మూర్తి, 4) జస్టిస్ డి.వి.ఎస్.ఎస్. సోమయాజులు, 5) జస్టిస్ ఎ.వి. శేషసాయి. వీరిలో కొందరు జిల్లా జడ్జీలుగా పనిచేసి హైకోర్టుకు ప్రమోషన్ పొందినవారు. మరికొందరు హైకోర్టు బార్ అసోసియేషన్ నుంచి తీసుకున్నవారు. వీరు కొన్ని నెలలు; కొన్ని కొన్ని అంశాల వారీగా బెంచ్‌లలో కేసులు తీసుకుంటారు, వాదనలు వింటారు, తీర్పులిస్తూ ఉంటారు. ప్రతీ కేసులోనూ ఏదో ఒక రకమైన వివాదం ఉంటుంది, ఒకరి వైపే న్యాయం ఉంటుంది. కోర్టుకు వచ్చిన ప్రతీ ఒక్కరికీ న్యాయం జరుగుతుందనీ చెప్పలేం. కేవలం తమ దగ్గర ఉన్న రాతమూలకమైన డాక్యుమెంట్ల ఆధారంగా తీర్పులిచ్చే సందర్భాలు కూడా ఉన్నాయి. కాబట్టి జడ్జీలకు ప్రతీ విషయమూ ఆపాదించలేం. అయితే ఇక్కడ గమనించవలసిన విషయం ఏమంటే చాలా మంది న్యాయమూర్తులు న్యాయవాద, న్యాయమూర్తుల కుటుంబాలకు చెందిన వారు హైకోర్టుకు ఎలివేట్ అవుతూ ఉంటారు. అప్పుడు తమకు అవకాశం కానివారు, ఆశించినవారు సహజంగా ఏదో ఒకరకమైన ఫిర్యాదులను వచ్చిన వారిపై పంపుతూ ఉంటారు. ఇది ఇటీవల కాలంలో సహజ సిద్ధంగా మారిపోయింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చేసిన ఫిర్యాదుకు సంబంధించి, 2014-19 తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ (ఏజి) గా పనిచేసిన దమ్మాలపాటి శ్రీనివాస్‌తో కలిసి ప్రస్తుత సుప్రీంకోర్టు న్యాయమూర్తి కుటుంబ సభ్యులు రాజధాని ప్రాంతంలో భూములు కొన్నారని ఆరోపించింది. దీనిని బలపరుస్తూ అమరావతి భూ కుంభకోణంగా ప్రభుత్వం పేర్కొంటున్న వ్యవహారంలో కేబినెట్ సబ్ కమిటీ విచారణను, సిట్ దర్యాప్తును నిలిపివేస్తూ ఇటీవల హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.వి. సోమయాజులు ఇచ్చిన ఉత్తర్వులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పి) దాఖలు చేసింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కోర్టు ఈ కుంభకోణంలో మాజీ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ కుటుంబ సభ్యులపై జరుగుతున్న దర్యాప్తుపై స్టే విధించారు. అంతేకాకుండా ఈ కేసుకు సంబంధించిన వార్తలు ప్రసార మాధ్యమాలలో రాకుండా గ్యాగ్ ఉత్తర్వులిచ్చారు. దీనిని కూడా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది. అసలు రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాలన్నింటినీ దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులపై, వీరంతా ప్రస్తుత సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ చేత ప్రభావితులై రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పులిస్తున్నారని భావిస్తూ భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) కి ఫిర్యాదు చేయడం సమంజసమేనా? అన్నది రాజ్యాంగపరమైన మీమాంస. దీనిని రాజ్యాంగ పరిధిలోనే పరిష్కరించుకోవాలి కానీ, ఫిర్యాదును బహిరంగంగా పత్రికలకు విడుదల చేయవచ్చా? లేదా పత్రికా ముఖంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి అజయ్ పిల్లాయ్ ద్వారా మీడియా సమావేశం పెట్టి న్యాయమూర్తులను, న్యాయ వ్యవస్థను బెదిరించే ప్రయత్నం చేశారు.

ఇది ప్రస్తుతం మొత్తం దేశవ్యాప్తంగా ప్రజలలోనూ, న్యాయవాద వర్గాలలోనూ సంచలనాత్మకంగా మారింది, చర్చనీయాంశం అయింది. ఈ చర్చ న్యాయ వ్యవస్థ పైనా, న్యాయస్థానాల పైనా ప్రజలలో అనుమానాలకూ, అవహేళనకూ దారితీసింది. ఇది మొత్తం రాజ్యాంగ వ్యవస్థల పైన నమ్మకం పోయే పరిస్థితికి దారితీసింది. న్యాయమూర్తులపై ప్రజలలో గౌరవం పోతుంది. కోర్టులకు పోతే న్యాయం జరుగదనే గ్యారంటీ ఏమీలేదు అనే భావన ఏర్పడుతుంది. భారత న్యాయ వ్యవస్థ మనుగడే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది.

దాదాపు 11 కేసులలో ఆరోపించబడిన నేరస్థుడిగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, కాబోయే 2-3 నెలల కాలంలో కేసుల విచారణ ప్రారంభమయ్యే పరిస్థితి ఉండడంతో, కింది స్థాయి జడ్జీలు మొదలుకొని, హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల పైనే ఫిర్యాదు చేయడం, తాను ఎదుర్కోబోతున్న నేర విచారణను ప్రభావితం చేస్తుందనేది ఇక్కడ ప్రాథమికంగా ఆలోచించవలసినది. అంతేకాకుండా సుప్రీంకోర్టు న్యాయమూర్తి పైననే ఫిర్యాదు చేసినవాడు మా పైన కూడా చేయవచ్చనే భయంతో తన కేసులను విచారిస్తున్న న్యాయమూర్తులు అనుకూలాలని జగన్‌మోహన్‌రెడ్డి భావిస్తూ ఉండవచ్చు. ఇది ఎంతమాత్రం సరికాదు. పైగా న్యాయమూర్తులు మరింత కఠినంగా వ్యవహరించే ప్రభావం ఉంది. అంతేకాకుండా న్యాయమూర్తులు ఏదో ఒక విధమైన ప్రలోభాలకు అందరూ లొంగుతారనుకోవడం జగన్‌మోహన్‌రెడ్డి మూర్ఖత్వం అవుతుంది తప్ప మరొకటి కాదు. అసలు న్యాయవ్యవస్థను లొంగదీసుకోవాలని ప్రయత్నించడమే పెద్ద తప్పు. ఇది 'కోర్టు ధిక్కరణ' కిందకు వస్తుందా లేదా? సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి తేల్చుతారు. దీనిపై త్వరలోనే ఏదో ఒక నిర్ణయం తీసుకుంటారని ఆశిద్దాం. జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ఫిర్యాదు 'న్యాయ వ్యవస్థ స్వతంత్రత'ను దెబ్బతీసే విధంగా ఉందనడంలో ఏమాత్రం సందేహం లేదు.

ఒక ముఖ్యమంత్రికి ఏమైనా ఇబ్బందులు ఉంటే సుప్రీంకోర్టు న్యాయ మూర్తులపై ప్రధాన న్యాయమూర్తికీ, ప్రధాన న్యాయమూర్తిపై రాష్ట్రపతికీ ఫిర్యాదు చేయవచ్చు. కానీ, ఇక్కడ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన వారిని బెదిరించాలనే దృష్టితో ఫిర్యాదు చేశాడు తప్ప ఆధారాలు ఏమీ లేదు. ఆయన చూపించిన ఆధారాలు సర్వసాధారణ మైనవే, అందరికీ బహిరంగంగా అందుబాటులో ఉండేవే. ఈ సందర్భంగా జస్టిస్ ఎచ్.ఆర్. ఖన్నా (సుప్రీంకోర్టు న్యాయమూర్తి) వ్యాఖ్యలు – 'గౌరవ న్యాయమూర్తుల పదవిలో కూర్చున్నవారు ఒంగిపోయి, ప్రభుత్వంలోని రాజకీయ నాయకులకు సేవకులుగా వ్యవహరిస్తే దెబ్బతినేది రాజ్యాంగ ఆధిపత్యమే. అప్పుడు అన్ని వ్యవస్థలూ చెలరేగి రాజ్యాంగ అరాచకం, న్యాయపరమైన గందరగోళానికీ దారితీసే పరిస్థితికి కారణభూతమవు తుంది' అన్న మాటలు గుర్తుకు వస్తున్నాయి. ఈ పరిస్థితి రాకుండా

న్యాయవ్యవస్థ తనను తాను రక్షించుకుంటూ ప్రజలను రక్షించే బాధ్యతను నేరవేర్చుతుంది. అంతేకాకుండా భారత న్యాయవ్యవస్థ చాలా బలమైనది, భారత రాజ్యాంగం విశిష్టమైనది. రాజ్యాంగ నిర్దేశాల ప్రకారమే ప్రతి వ్యవస్థా పనిచేస్తుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీచేసిన 'చట్టబద్ధత' లేని కార్య నిర్వాహక ఉత్తర్వులను రాష్ట్ర హైకోర్టు చట్ట ప్రకారం కొట్టివేయడంతోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి న్యాయమూర్తులకు వ్యతిరేకంగా ధిక్కార పూర్వకమైన ఆరోపణలు చేస్తున్నారు. హైకోర్టు న్యాయమూర్తులు రాగద్వేషాలకు అతీతంగా, న్యాయసూత్రాలకు అనుగుణంగా పనిచేస్తూ న్యాయ వ్యవస్థ స్వతంత్రతను కాపాడుతున్నారు. అయితే ప్రతి తీర్పు మనకు అనుకూలంగా రావాలని కోరుకోవడం కూడా రాష్ట్ర ప్రభుత్వ తప్పు. ఆ తీర్పులపై ఎలాగూ సుప్రీంకోర్టులో అప్పీలు వేసుకోవచ్చును. కానీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఏకంగా హైకోర్టు న్యాయమూర్తులనే ఏదో ఒక విధంగా లొంగదీసుకోవాలనే ప్రయత్నంలో భాగంగానే భారత ప్రధాన న్యాయమూర్తికి ఫిర్యాదు చేసినట్లు అర్థమవుతున్నది.

అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రేపటి రోజున తన ప్రభుత్వానికి అవకాశం వస్తే తనకనుకూలమైన న్యాయవాదులను న్యాయమూర్తులుగా పంపే ఆలోచనలో ఉన్నట్లు అర్థమవుతున్నది. ఈయన దృష్టిలో హైకోర్టు న్యాయమూర్తులంటే రాష్ట్ర ప్రభుత్వం చెప్పు చేతల్లో ఉండే విధంగా ఉండాలని భావిస్తున్నట్లుంది. అంతేకాకుండా అధికారంలో ఉన్న పార్టీ చెప్పు చేతల్లో ఉన్నవారు, లేదా రాష్ట్ర ప్రభుత్వం చెప్పినట్లు వినేవారుగా ఉండాలని భావిస్తున్నారు తప్ప భారత రాజ్యాంగం మౌలిక లక్షణాలకు లేదా ప్రవేశికకు అనుగుణంగా రాజ్యాంగ హక్కులను కాపాడే వారుగా ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భావిస్తున్నారు. ఇది శోచనీయం, రాజ్యాంగ విరుద్ధం, అప్రజాస్వామికం. ఏ కేసులోనైనా ఒక్కరి వైపే కోర్టు న్యాయం చెబుతుంది. లేదా ఇరువురూ కలిసి సమంగా పరిష్కరించుకోండని సలహా ఇస్తుంది. కాబట్టి తమకు అనుకూలంగా తీర్పు ఇవ్వని న్యాయమూర్తులపై వ్యక్తిగతంగా ఫిర్యాదు చేస్తూపోతే న్యాయమూర్తుల స్థానాల్లో ఎవ్వరూ మిగలరు.

చివరకు సామాన్యునికి న్యాయం పొందడం దుర్లభం అవుతుంది, న్యాయం పొందే పరిస్థితి లేకుండా పోతుంది, అరాచకానికి దారితీస్తుంది. ఈ ప్రభుత్వ చర్యలు ప్రజలను అరాచకం వైపు నడిపించే దిశగా ఉన్నవి తప్ప, సమన్యాయం వైపు, సమదృష్టి, సమతుల్యత పాటించడం లేదు.

వాస్తవంగా చెప్పాలంటే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తాను ముఖ్యమంత్రి కాకముందే సిబిఐ నమోదు చేసిన 11 అవినీతి కేసులతో పాటు మొత్తం 31 క్రిమినల్ కేసుల్లో ప్రాసిక్యూషన్ ఎదుర్కొంటున్నారు. మనీ లాండరింగ్ చట్టం కింద, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) 7 కేసులను నమోదు చేసింది. ఇటీవల సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎన్.వి. రమణ, దేశంలోని అందరు ప్రజా ప్రతినిధులపై నమోదైన వివిధ రకాలైన కేసులను రోజువారీ విచారణ జరిపి, కేసులను త్వరగా ముగించాలనీ, వాటికి సరియైన సిబ్బంది, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉన్నవా లేవా అనే విషయం వారం రోజులలోపు సుప్రీంకోర్టుకు సమర్పించాలనీ రాష్ట్రాల హైకోర్టుల నన్నింటినీ ఆదేశించారు.

ఈ ఆదేశాలు అమలవుతున్న నేపథ్యంలోనే జగన్‌మోహన్‌రెడ్డి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తుల పైనా, సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎన్.వి. రమణ పైనా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులపై పరిపాలనా పైన విచారణ జరిపించ వచ్చునేమో గానీ ఆరోపణలు మాత్రం జస్టిస్ ఎన్.వి. రమణను భారత ప్రధాన న్యాయమూర్తిగా కాకుండా మాత్రం నిరోధించేటివి మాత్రం కావు. కేవలం ఆస్తులకు సంబంధించిన విషయం కాబట్టి అవి ఏ రూపకంగా వారికి సమకూరాయో నిరూపించడం కష్టసాధ్యం. అంతేకాకుండా వాటిని ఇన్‌కమ్ టాక్స్ డిపార్ట్‌మెంట్ చూసుకుంటుంది.

ఇక్కడ మనం చూడవలసింది భారత ప్రధాన న్యాయమూర్తిగా కాబోతున్న జస్టిస్ ఎన్.వి. రమణ లేదా వేరొక వ్యక్తి అయి ఉండవచ్చు కానీ, 'భారత న్యాయ వ్యవస్థ స్వతంత్రత' ఏంటన్నది? అది భవిష్యత్తులో ఏమైపోతుందన్నది అనేది ముఖ్యం. భారత సుప్రీంకోర్టుకు ఉన్న విలువ, ఘనత, హోదా, ప్రజలకిస్తున్న రాజ్యాంగ భరోసా, దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని న్యాయ స్థానాలపై పరిపాలనా అధికారంను కించపరిచే విధంగా, తక్కువ చేసే విధంగా, బలహీనపరిచే కుట్రగా భావించవచ్చు.

శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ సరిగా పనిచేయకపోతే వాటిని సరియైన మార్గంలో రాజ్యాంగ పరంగా పెట్టే అధికారం న్యాయవ్యవస్థకు రాజ్యాంగం ప్రసాదించింది. దానిని కాకుండా ప్రస్తుతం రాజకీయ వ్యవస్థ శాసించే పరిస్థితి రాకూడదు. ఎటువంటి ఒత్తిళ్లు వచ్చినా, ఆటుపోట్లు ఎదురైనా న్యాయమూర్తులు ధైర్యంగా నిలబడాలి. సమర్థత, నిజాయితీ, నిర్భీతితోనే న్యాయమూర్తులు వ్యవహరించినప్పుడే న్యాయ వ్యవస్థ స్వతంత్రత, సమగ్రత కాపాడబడుతుంది. ఫిర్యాదుదారుడైన జగన్‌మోహన్ రెడ్డి మౌలికంగా న్యాయవ్యవస్థ స్వతంత్రతనే దెబ్బతీసే ప్రయత్నం చేశాడు కాబట్టి భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దానిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటారు. అదే విధంగా ఫిర్యాదులోని అంశాలు కూడా ముఖ్యమైనవిగా భావిస్తే వాటిపై విచారణ జరిపిస్తారు. కానీ ఇక్కడ ఒక నిందితుడు ఎన్నో కేసులలో ఉంటూ తానెదుర్కోబోతున్న విచారణను ప్రభావితం చేసే విధంగా ప్రవర్తించాడు కాబట్టి ఏ చర్యలు సుప్రీంకోర్టు తీసుకుంటుందో వేచి చూడాలి.

భారత రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను సజీవంగా ఉంచాలంటే న్యాయ వ్యవస్థ స్వతంత్రత అతి ముఖ్యం. కోర్టులు స్వతంత్రత కోల్పోతే, ప్రాథమిక హక్కులను ప్రసాదించే రాజ్యాంగ భాగాలను భవిష్యత్తులో రద్దుచేసే ప్రమాదం ఉంది. అది నియంతృత్వానికి దారితీస్తుంది.

(రచయిత న్యాయవాది, ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

రచయితలకు సూచన : *తక్షణ, సమకాలీన అంశాలపై రచనలు చేసి ఆ సంచికలోనే రావాలనుకొనే రచయితలు 20వ తేదీ లోగా పంపగలిగితేనే మరుసటి నెల సంచిక కోసం పరిశీలించడం సాధ్యమవుతుంది. ఆ తరువాత వచ్చిన రచన, అంశం ఎంత ముఖ్యమైనదైనా పరిశీలించడం, ముద్రణకు సిద్ధం చేయడం అసాధ్యమవుతుంది. రచయితలు గుర్తించగలరు. మరొక పత్రికకు పంపిన, మరొక పత్రిక పరిశీలనలో ఉన్న, మరొక పత్రిక ప్రచురణకు ఆమోదించిన రచనను వీక్షణంకు పంపగూడదు. – సం.*

నూతన రెవెన్యూ చట్టంతో భూ రికార్డులు కనుమరుగు

భూ రికార్డుల ప్రక్షాళన, కంప్యూటరీకరణ అంటూ ప్రభుత్వం నూతన రెవెన్యూ చట్టాన్ని అమల్లోకి తెచ్చిందనీ, అయితే ఈ చట్టం భూ కబ్జాదారులకు అనుకూలంగా మారే అవకాశం ఉందనీ అంటున్నారు **ఎల్. భద్రయ్య**

శతాబ్దాల రెవెన్యూ వ్యవస్థకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్వస్తి పలికింది. భూవివాదాల పరిష్కారానికి, రైతులకు సత్వర న్యాయానికి, అవినీతిరహిత పాలనకు ఇది ఒక ముందడుగుగా, కొత్త రెవెన్యూ చట్టం పేరుతో భూరికార్డుల ప్రక్షాళనను చారిత్రక నిర్ణయమంటూ ఆర్భాటంగా ప్రకటించింది. ఇంతకు ముందెన్నడూ లేనట్లు ఇది నూతన సృష్టి అన్నట్లు గొప్పలకు పోయిన ప్రభుత్వం స్వయం ప్రసాదిత సబ్సిడి ట్రాక్టర్ల ర్యాలితో రైతుల పేర ర్యాలీలు తీయించి నియోజక వర్గాల్లో ఎం.ఎల్.ఏ.లకు, మంత్రులకు స్వాగతాలు పలికించింది. అధికారబలం అనే కలంతో అపరిష్కృత సమస్యలెన్నో ఇంకా మూలుగుతున్నా పరిష్కరించలేని ప్రభుత్వం కొత్త చట్టం పేరుతో రైతులకు కల్పించబడిన చట్టాన్ని రద్దుచేసింది. రద్దు చేయడం వెనక ఉన్న అసలు ఉద్దేశం ఏమిటి? నూతన చట్టం ఫ్యూడల్ అవశేషాలకు చుట్టంగా ఎలా మారనుందో, మరిన్ని సమస్యలకు ఎలా మూలం కానుందో తెలుసుకుందాం.

ఎప్పటిదీ రెవెన్యూ వ్యవస్థ?

1540లో రెవెన్యూ వ్యవస్థకు ఆద్యుడైన షేర్షాసూరి నుండి బ్రిటిష్ పాలకుల నాటికి ఈ దేశంలో రెవెన్యూ వ్యవస్థ శాస్త్రీయ పద్ధతికి రూపాంతరం చెందింది. స్వతంత్ర్య రాచరిక వ్యవస్థ కలిగిన హైద్రాబాద్ రాజ్యంలో కూడా అప్పటి హైద్రాబాద్ ప్రధాని సాలార్‌జంగ్ ఆధ్వర్యంలో 1864లో హైద్రాబాద్‌లో బోర్డ్ ఆఫ్ రెవెన్యూ అవిష్కృతమైంది. స్వాతంత్ర్యానంతరం హైద్రాబాద్ సంస్థానం భారత దేశంలో విలీనం తర్వాత 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెవెన్యూ బోర్డే కొనసాగింది. ఆ తర్వాత వచ్చిన ప్రజా ప్రభుత్వాలు రైతులకు భూములపై హక్కులు కల్పించాలని 13 సెక్షన్లు, 33 నిబంధనలతో కూడిన "భూమి హక్కులు, పట్టాదారు పాసుపుస్తకాల చట్టం 1971 రూల్స్ 1989ను రూపొందించి అమలు చేయడంతో భూమిపై ఖబ్జా, పట్టా కలిగిన రైతులకు రూల్ 26 అనుసరించి పట్టాదారు పాస్ పుస్తకం, టైటిల్ డీడ్ జారీ చేయడం ప్రారంభమైంది. 1971 రెవెన్యూ చట్టం ప్రకారం భూముల పట్టా మార్పిడి, పట్టాదారు, అనుభవదారు, పట్టాదారు పాస్ పుస్తకాల జారీ, అప్పీలు తదితర వివరాలతో కూడి ఉండి ఆయా విషయాలలో జరుగుతున్న వివాదాల పరిష్కారానికి వివిధ స్థాయిల్లో విచారణ జరుగుతూ, క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు జరుగుతున్న మార్పిడీలపై రెవెన్యూ రికార్డులను అప్‌డేట్ చేస్తూ నిర్వహించడం జరుగుతుండేది.

ఈ క్రమంలో జరుగుతున్న జాప్యానికి, అవకతవకలకు అవినీతికి రెవెన్యూ వ్యవస్థలోని ఒకరిద్దరి వ్యక్తులను లేదా అధికారులను బూచిగా చూపి వ్యవస్థనే రద్దుపరిచే దిశగా, ప్రభుత్వం ఆలోచించి చివరకు గ్రామ రెవెన్యూ అధికారులను తొలగించి రెవెన్యూ రికార్డులన్నింటిని స్వాధీనపర్చుకుంది. శాఖలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించలేక పక్కదోవ పట్టించి మరింత కనుమరుగు చేసి, ప్రజలకు కొత్త చరిత్ర లిఖిస్తున్నట్లు తన లక్ష్యాన్ని ప్రకటించుకోవడమే విడ్డూరంగా కనిపిస్తుంది.

ప్రభుత్వ ప్రకటిత లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వం భూపరిపాలన సమగ్రమైన సక్రమ వ్యవస్థీకరణతో పాటు, సమాచార సాంకేతికతను ఉపయోగించి ఎలక్ట్రానికల్ రికార్డుల నిర్వహణతో భూరికార్డులు ఆధునికీకరించడం, తద్వారా వివాదరహిత, అవినీతి రహిత, సత్వర న్యాయం అందించవచ్చునని, భూమికి సంబంధించిన మొత్తం డేటాను ఒకే ఒక 'ధరణి' పోర్టల్‌లో కంప్యూటరీకరణ చేసి భూ రెవెన్యూ చట్టానికి సంస్కరణల సవరణల పేరుతో నూతన తెలంగాణ భూమి హక్కులు, పట్టాదారు పాసుపుస్తకాల చట్టం 2020ని తీసుకొస్తున్నట్లు చెప్పుకుంది. దీనికోసం గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థను రద్దు చేసింది.

నూతన చట్టంలోని కొన్ని ముఖ్యమైన సెక్షన్ల గురించి తెలుసుకుందాం.

సెక్షన్ - 2 ధరణి: అనగా హక్కుల రికార్డు ప్రయోజనం కోసం కల్పించిన, నిర్వహిస్తున్న డిజిటల్ ప్లాట్‌ఫారమ్ అని అర్థం.

భూమి: అనగా ఉద్యానవనంతో సహా వ్యవసాయ ప్రయోజనాల కోసం ఉపయోగించిన లేదా ఉపయోగించదగిన భూమి అని అర్థం. అయితే ప్రత్యేకంగా వ్యవసాయేతర ప్రయోజనాల కోసం మాత్రమే ఉపయోగించు భూమి ఇందులో చేరి ఉండదు.

హక్కుల రికార్డు (ఆర్ఓఆర్): అనగా ఈ చట్టంలోని ధరణి ప్రయోజనం కోసం లేదా నిబంధనల కింద ఎలక్ట్రానికల్‌గా తయారు చేసి నిర్వహిస్తున్న రికార్డులు అని అర్థం.

యజమాని : అనగా అన్యాక్రాంతం చేయగలిగిన భూమిపై స్వాధీనం శాశ్వతమైన, వారసత్వ హక్కులను కలిగిన వ్యక్తి అని అర్థం. ఇందులో భూమిలేని పేదవ్యక్తిగా అతనికి జారీచేసిన పట్టాను కలిగిన వ్యక్తి చేరియుండును.

పట్టాదారు: ఒక భూమికి సంబంధించి పట్టాదారులో హక్కుల రికార్డు, ఇతర ప్రభుత్వ భూమి చిట్టాలలో పట్టాదారునిగా పేరు నమోదు చేయడిన వ్యక్తి చేరియుండును.

పట్టాదారు పాసు పుస్తక హక్కు పత్రం: అనగా ఈ చట్టపు నిబంధనల కింద జారీచేయబడిన పట్టాదారు పాస్ పుస్తక హక్కు పత్రం అని అర్థం.

సెక్షన్ 3: రాష్ట్రంలోని ప్రతి గ్రామం అన్ని భూముల హక్కుల రికార్డులను తయారు చేసి వాటిని కేంద్రీకృత భండాగారం (స్టోరేజ్)లో డిజిటల్‌గా నిర్వహించవలెను. హక్కుల రికార్డులో భూముల పట్టాదారులైన వ్యక్తులందరి పేర్లు, ప్రతి పట్టాదారుని సర్వే నెంబర్లు, విస్తీర్ణములు వివరాలను కలిగి ఉండును. తెలంగాణ భూమిపై హక్కుల రికార్డు, పట్టాదారు పాసు పుస్తకాల చట్టం 1971 నిబంధనల కింద తయారు చేసి, ఇప్పుడు నిర్వహిస్తున్న హక్కుల రికార్డును ఎలక్ట్రానిక్ రూపంలో తయారు చేసి, నిర్వహిస్తున్నట్లుగా భావించవలెను.

సెక్షన్ 5: అమ్మకం, దానం, తాకట్టు లేదా మార్పిడి ద్వారా రిజిస్టరైన దస్తావేజు కింద భూమిని బదిలీ చేయుటకు ఏ వ్యక్తి అయినా ఆ వ్యక్తి సౌలభ్యాన్ని బట్టి దస్తావేజు సమర్పించుటకై అందుబాటులో ఉన్న తేది, సమయాన్ని కేటాంయించుటకై ఈ ప్రయోజన నిమిత్తం వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రార్‌కు దరఖాస్తు చేసుకోవాలి. రిజిస్ట్రార్ తేది సమయాన్ని కేటాయించి వ్యక్తికి తెలియపర్చవలెను, నమూనాలో అట్టి వివరాలను రిజిస్టర్‌లో నమోదుచేయాలి. పైన పేర్కొన్న వ్యక్తి వారికి కేటాయించిన తేది సమయాన ప్రమాణ పత్రం, పట్టాదారు పాస్ పుస్తకం కమ్ హక్కు పత్రంతో పాటు బదిలీ దస్తావేజును రిజిస్ట్రార్ సమక్షంలో సమర్పించాలి. పట్టాదారు, దస్తావేజులోని ఆస్తి వివరాలు హక్కుల రికార్డులలోని నమోదులకు అనుగుణంగా ఉన్న ప్రతి సందర్భంలోను, వరుసగా రిజిస్ట్రేషన్ చట్టం, భారత స్టాంపు చట్టం ప్రకారం స్టాంపు డ్యూటి, భూమి యాజమాన్య హక్కుల మార్పిడి (మ్యుటేషన్) చార్జీల చెల్లింపుపై రిజిస్ట్రార్ వెంటనే దస్తావేజు కిందికి వచ్చు, భూమిని బదిలీ కర్త అకౌంట్ నుండి తగు విధంగా తొలగిస్తూ అమ్మకం, దానం, మార్పిడి సందర్భంలో బదిలీ పొందిన వ్యక్తి అకౌంట్‌లో దానిని చేరుస్తూ దస్తావేజు నుండి రిజిస్టర్ చేయాలి. తక్షణమే హక్కుల రికార్డులో సంబందిత నమోదులకు పర్యవసానంగా సవరణను నిర్వహించవలెను. తాకట్టు విషయంలో విధించిన చార్జీని ధరణిలో రికార్డు చేయాలి. బదిలీ పొందిన వ్యక్తి పట్టాదారు పాస్‌పుస్తకం కమ్ హక్కు పత్రంను కలిగి ఉండనప్పుడు రిజిస్ట్రార్ ఒక కొత్త పట్టాదారు పాస్ పుస్తకం కమ్ హక్కు పత్రంను జారిచేయవలెను లేదా ప్రస్తుతమున్న పట్టాదారు పాస్‌పుస్తకం కమ్ హక్కు పత్రంను తాజా పరచవలెను, తక్షణమే దస్తావేజు కింద బదిలీ చేసిన, బదిలీ పొందిన వ్యక్తుల హక్కుల రికార్డులో మార్పులు చేయాలి.

సెక్షన్ 6: భూమి విభజనకై వారసులు ఏకాభిప్రాయానికి వచ్చిన తర్వాత హక్కుల రికార్డులో మార్పును కోరు ఎవరైనా వ్యక్తి లేదా వ్యక్తులు తహశీల్దార్ సమక్షంలో హజరగుటకు వ్యక్తుల సౌలభ్యంనుబట్టి అందుబాటులో ఉండు తేది, సమయాన్ని కేటాయించడానికి వ్యక్తుల వాటాలను నిర్ధిష్టపరుస్తూ ఉమ్మడి ఒప్పందంను జత పరుస్తూ ఈ ప్రయోజన నిమిత్తం వెబ్‌సైట్ ద్వారా తహశీల్దార్‌కు దరఖాస్తు చేయవలెను. తహశీల్దార్ తేది సమయంను కేటాయించి వ్యక్తులకు తెలియజేయవలెను. సదరు వారసులు మరణించిన వ్యక్తి పేరుతో లేక సందర్భానుసారంగా ఆ కుటుంబ సభ్యుని పేరుతో ప్రస్తుతమున్న పట్టాదారు పాస్‌పుస్తకంలో వారికి కేటాయించిన తేది, సమయమున తహశీల్దార్ కార్యాలయంలో హజరుకావలెను. వారసులందరి ఉమ్మడి సమ్మతి ఆధారంగా తహశీల్దార్ యాజమాన్య మార్పిడి (మ్యుటేషన్) చార్జీలను చెల్లించిన తర్వాత తక్షణమే తదనుసారంగా హక్కుల రికార్డులో మార్పులు చేయవలెను. ఎవరైనా వారసులు పట్టాదారు పాస్‌పుస్తకం కలిగి ఉండనప్పుడు తహశీల్దారు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకంను జారీచేయవలెను లేదా ప్రస్తుతమున్న పట్టాదారు పాస్ పుస్తకంను తక్షణమే తాజా పరచవలెను. తహశీల్దారు హక్కుల రికార్డులో చేసిన మార్పుల ప్రతులను వారందరికి అందజేయవలెను.

సెక్షన్ 7: న్యాయస్థానం డిక్రీ ద్వారా హక్కును పొందిన, హక్కుల రికార్డులో నమోదు మార్పును కోరిన ఎవరైనా వ్యక్తి, తహశీల్దారు సమక్షంలో హాజరు కావడానికి లభ్యమగు తేదీని, సమయాన్ని కేటాయించడం కోసం వెబ్‌సైట్ ద్వారా తహశీల్దారుకు దరఖాస్తు చేయవలెను. తహశీల్దారు తేదీని, సమయాన్ని కేటాయించి వ్యక్తులకు తెలియజేయును, అట్టి వివరాలను నమూనా రిజిష్టర్‌లో నమోదు చేయవలెను. డిక్రీలోని పట్టాదారు, ఆస్తి వివరాలు, హక్కుల రికార్డులోని నమోదులలో పొందియున్న ప్రతి సందర్భంలో న్యాయస్థానంచే డిక్రీ జారీచేయడానికి ముందు వసూలు చేయబడినచో, రిజిస్ట్రేషన్ చట్టం, భారత స్టాంపుల చట్టం ప్రకారం యాజమాన్యత్వ మార్పిడి (మ్యుటేషన్) చార్జీలను చెల్లించిన మీదట తహశీల్దారు తక్షణమే తీర్పు రుణగ్రస్తుని ఖాతా నుండి డిక్రీ కిందకు వచ్చు భూమిని తొలగిస్తూ, డిక్రీ పొందిన వారి ఖాతాలో చేరుస్తూ హక్కుల రికార్డులో సంబంధిత మార్పులను నమోదు చేయవలెను. వ్యక్తి పట్టాదారు పాస్ పుస్తకం కలిగి ఉండని సందర్భంలో కొత్త పట్టాదారు పాస్ పుస్తకం జారీ చేయవలెను లేదా ప్రస్తుతమున్న పట్టాదారు పాస్‌పుస్తకంను తాజాపరచవలెను, హక్కుల రికార్డులో మార్పులు చేసిన ప్రతులను తహశీల్దార్ ఆ వ్యక్తికి అందజేయవలెను.

సెక్షన్ 8: మోసపూరితంగా ప్రభుత్వ భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేసినచో జిల్లా కలెక్టర్ అట్టి పుస్తకాలను రద్దు చేయవలెను, సంబంధిత తహశీల్దారును భర్తరఫ్ చేయుటకు చర్య తీసుకొనవలెను. న్యాయపరంగా భూమిని తిరిగి తీసుకొవడంతో పాటుగా క్రిమినల్ చర్యలు ప్రారంభించవలెను.

సెక్షన్ 9: ఏదైనా భూమికి సంబంధించి హక్కుల రికార్డులో చేసిన లేదా సవరించిన లేదా తొలగించిన నమోదును చేసిన ప్రభుత్వం లేదా ఎవరైనా ప్రభుత్వ అధికారిపై ఎటువంటి దావాను వేయరాదు.

సెక్షన్ 12: ఏదైనా పరపతి సంస్థ పట్టాదారు పాస్‌పుస్తకం, పహాణీ ప్రతికై పట్టుబట్టకుండా ఎలక్ట్రానికల్‌గా నిర్వహించబడుతున్న హక్కుల రికార్డు ప్రాతిపదికన రుణాల మంజూరు చేయాలి. ప్రస్తుతమున్న మార్గదర్శక సూచనల ప్రకారంగా పంట రుణాల విషయంలో ఏజెన్సీ పాస్‌బుక్ హక్కు పత్రమును ఉంచుకొనరాదు. పరపతి సంస్థ అతనికి పంపిణీ చేసిన ప్రతి రుణము, అట్టి ప్రతి రుణ చెల్లింపును హక్కుల రికార్డులో నమోదు చేయవలెను.

సెక్షన్ 14: హక్కుల రికార్డును అక్రమంగా దిద్దు లేదా కపటంగా ఉత్తర్వు చేయు పబ్లిక్ సేవకుడెవరైనా వర్తించు ఏదైనా శాసనముల కింద క్రిమినల్ చర్యలతో పాటు సర్వీసు నుండి తొలగింపు లేదా భర్తరఫ్ చేయ శిక్షకు గురవుతారు.

సెక్షన్ 15: ఈ చట్టం ప్రారంభమైన తేది నుండి తెలంగాణ భూమి హక్కులు, పట్టాదారు పాస్ పుస్తకాల చట్టం 1971 రద్దు అమలు ఇందు మూలంగా జరుగును.

సెక్షన్ 16: తెలంగాణ భూమి హక్కులు, పట్టాదారు పాస్ పుస్తకాల చట్టం 1971 రద్దు వలన అపరిష్కృత అప్పీళ్ల, పునఃపరిశీలన కేసులన్నీ ప్రత్యేక ట్రిబ్యునల్‌కు బదిలీచేయబడును. ట్రిబ్యునల్‌చే అప్పీలు లేదా పునః పరిశీలించబడిన మీదట ట్రిబ్యునల్ ఉత్తర్వు అంతిమమైనదే ఉండును, ఈ చట్టం నింబంధనల కింద దానిని అములుచేయవలెను.

సెక్షన్ 17: ప్రభుత్వం ఈ చట్టం అన్ని లేదా ఏవైనా ప్రయోజనాలను నెరవేర్చుటకు నియమాలను చేయవచ్చును.

సెక్షన్ 18: ఈ చట్టం ఏమైనా నిబంధనలను అమలు పర్చుటలో ఏదైనా చిక్కులు ఏర్పడినచో, ప్రభుత్వం ఈ చట్టపు నిబంధనలకు అనువుగా లేనట్టి, ఆ చిక్కులను తొలగించు నిమిత్తం అవసరమైన నిబంధనలను చేయవచ్చును.

నూతన రెవిన్యూ చట్టం 2020 – ఒక పరిశీలన

భూమిపై హక్కుల నిర్ధారణకై లిఖిత పూర్వకమైన సాక్షాదారాలతో పాటు ఒక్కోసారి క్షేత్ర పరిశీలన చేయవలసి ఉంటుంది. ధరణి పోర్టల్ ఒక్కటే పూర్తి పరిష్కారం కాదు. క్షేత్ర పరిశీలన చేయడానికి క్షేత్ర స్థాయి సిబ్బంది అవసరం. నూతన చట్టం ప్రకారం భూ రికార్డులన్నింటికి ధరణి పోర్టల్ ఒక్కటే కేంద్రబిందువు. గతంలో మాదిరిగా ప్రతి సంవత్సరం రాయవల్సిన మాన్యువల్ పహాణి లేదు, సాగుచేస్తున్న వ్యక్తి పేరు అనుభవదారు కాలంలో అనుభవదారుగా పేరు నమోదు లేదు. సమస్య ఏమిటంటే తెలంగాణ రాష్ట్రంలో ఇంకనూ చాలా మంది రైతులు భూములను సాదా కాగితాలపై పెద్ద రైతుల నుండి కొనుగోలు చేసి ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకొని రెగ్యూలరైజేషన్ కోసం (ఫారం ×) దరఖాస్తులను సమర్పించినారు.

ప్రస్తుతం భూముల రేట్లకు రెక్కలు రావడంతో పట్టాదార్లు (అమ్మకందార్లు) ఇంకనూ ఏదో మెలికపెట్టి సంతకాలు చేయకపోవడంతో అమ్మకం దార్లే పట్టాదార్లుగా, కొనుగోలుదార్లు అనుభవదార్లుగా రికార్డులో మిగిలిపోయినారు. చట్టంలో అమ్మకందార్లు సంతకం చేయకున్నా నోటిస్ జారీచేసి విక్రయ దస్తావేజు, ప్రదేశంపై ఖబ్జా ఆధారంగా చుట్టు పక్క రైతుల స్టేట్‌మెంట్స్‌తో పట్టా మార్పిడి చేయవచ్చునని ఉన్నప్పటికి, అమ్మకందార్లు సమాజంలో పలుకుబడి కలిగిన వ్యక్తులవడంతో అధికారులు డిస్పోజ్ చేయలేని కేసులు ఇంకా ఉన్నాయి. ఒకవేళ మాన్యువల్ పహాణి ఉన్నట్లైతే అనుభవదారు కాలంలో కనీసం అతని పేరు అనుభవదారుగా నమోదై రికార్డు పరంగా హక్కులు కలిగి ఉండేవారు.

అలా 12 సంవత్సరాలకు పైగా వరుసగా ఖబ్జాదారునిగా పేరు నమోదై ఉంటే అతనికి అట్టి భూమిపై ప్రతికూల ఆధీనం (అడ్వర్స్ పొజిషన్) హక్కులు వచ్చి ఉండేవి, సివిల్ కోర్టులో డిక్లరేషన్ ఆఫ్ టైటిల్ దావాతో కోర్టు ద్వారా డిక్రీ పొందేవారు.

కొన్ని కేసులలో కొనుగోలుదార్లు ప్రదేశంపై ఖబ్జా కలిగి ఉన్నా విక్రయదారు దస్తావేజు రాసి ఇవ్వరు, అమ్మకందార్లు వారికి అందుబాటులో ఉండరు. ఇటువంటి కొనుగోలుదార్లు కూడా కనీసం ఖబ్జాదారుగా నైనా రికార్డులో పేరు నమోదుకు దూరమైనారు. ఒక్కోసారి ఇటువంటి నామినల్ పట్టాదార్లే కొనుగోలు దార్లకు భూమి అమ్మకం చేయలేదని అధికారులను తప్పదోవ పట్టించి పట్టాదారు పాస్ పుస్తకాలు కూడా పొందే అవకాశమున్నది. ధరణి పోర్టల్ నూతన చట్టంలో కొనుగోలుదార్లు రికార్డులలో ఖబ్జా హక్కులను కోల్పోయినారు.

గతంలో వారసత్వ పట్టామార్పిడి (పౌతి)కి ఎలాంటి స్టాంపు డ్యూటి వసూలు లేదు. మరణించినవారి పేర్లు రికార్డులలో పట్టాదార్లుగా కొనసాగరాదని స్వయంగా (సుమోటో)గా అట్టి భూములు వారి వారసుల పేరున సమభాగాలుగా మార్పిడి జరిగేవి. ఒకవేళ వారసులు భూమి సారాన్ని బట్టి ఉమ్మడి అంగీకారంతో ఎక్కువ, తక్కువలు పంపకాలు చేసుకున్నట్లయితే ఆ ప్రకారంగా ఉత్తర్వులు జారీ చేసేవారు. కొత్త చట్టం ప్రకారం ఏ ఒక్కరు అభ్యంతరం తెల్పినా వారసత్వ మార్పిడి(పౌతి) చేయడానికి లేదు. అందరూ ఉమ్మడిగా అంగీకరిస్తేనే మార్పిడి చేయాలి. నూతన చట్టంలో మ్యుటేషన్స్‌కు నోటీసులు జారీచేయడం లేదు. వెబ్‌సైట్‌లో దరఖాస్తు సమర్పించిన పిదప ఉత్తర్వులు జనరేట్ కాబడి రికార్డులలో వెంటనే పట్టామార్పిడి జరుగును. గతంలో ప్రతి మ్యుటేషన్ అమలుకు ముందు అభ్యంతరాలు స్వీకరించుటకై ఫారం 8లో వారం రోజులు గడువుతో రూల్ 19 కింద నోటీసు జారీ కాబడేది. ఒక వేళ ఏమైనా అభ్యంతరాలుంటే తగిన సాక్ష్యధారాలతో ఆక్షేపణలు సమర్పించేవారు. నోటీసు జారీ ద్వారా పొరపాట్లు జరుగకుండా సవరించుకునే అవకాశం ఉండేది. నోటీసు లేకుండా నేరుగా అమలు చేయట సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం కూడా.

గతంలో రికార్డింగ్ ఆథారిటి అగు తహశీల్దారు జారీచేసిన ఉత్తర్వులను అప్పీలు కింద భూమి హక్కులు, పట్టాదారు పాస్ పుస్తకాలు చట్టం సెక్షన్ 5 (5) కింద రెవెన్యూ డివిజనల్ అధికారికి సెక్షన్ 9 కింద రివిజన్‌కు జిల్లా కలెక్టర్‌కు అధికారాలుండేవి. ఆ చట్టం రద్దుతో నూతన చట్టం ప్రకారం పెండింగ్ కేసులు ట్రిబ్యునల్ లోనూ, కొత్త కేసులు సివిల్ కోర్టులో పరిష్కరించుకోవలసి ఉంటుంది. సివిల్ కోర్టుల్లో పరిష్కారం అంత తేలికగా అయ్యేదికాదు, వ్యయ ప్రయాసలతో కూడినది. భూమికి పీడిత ప్రజానీకానికి మధ్య అవినాభావ సంబంధముంది. నాటి నుండి నేటి వరకు అనేక ప్రజా ఉద్యమాలు భూమి కేంద్రంగా జరిగాయి, జరుగుతున్నాయి. ఆ ఉద్యమాల ఫలితంగానే పాలకులు కంటి తుడుపు చర్యగా అనేక భూ చట్టాలు తీసుకొచ్చారు. అవి ఏ మేరకు ప్రజలకు ఉపయోగపడ్డాయి, ఉపయోగపడుతున్నాయన్నది వేరే అంశం.

అందులో కౌల్దారి, వ్యవసాయ భూముల చట్టం 1950, 1/70 చట్టం, (గిరిజనుల భూములను గిరిజనేతరులు కొనుగోలు చేయరాదు) వ్యవసాయ భూములపై గరిష్ట పరిమితి (భూ సంస్కరణలు) చట్టం 1973, అటవీ భూముల హక్కుల చట్టం 2006, ప్రభుత్వ భూములు పేదలకు పంపిణీ విషయమై జరిగిన పలు సవరణలు, నాటి పాలకులు సృష్టించిన వినోబాబావే భూదానోద్యమం, ఇవే పాలకులు ప్రవేశపెట్టిన సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటిడిఎ) తదితర సంక్షేమ పథకాలతో పాటు మరెన్నో పథకాలు కూడా ఇందులో భాగమే.

నూతన రెవెన్యూ చట్టం ద్వారా భూ రికార్డులలో ఒక్క పట్టా మార్పిడి (మ్యుటేషన్) విషయమై సత్వర సేవలు అందుతాయని రైతులకు కొంత ఊరట అనిపించినప్పటికీ, మాన్యువల్ భూ రికార్డులు కనుమరుగవడం అత్యంత విచారకరం, రైతులకు దీర్ఘకాలిక నష్టదాయకం.

(రచయిత అడ్వకేట్, రిటైర్డ్ తహాశీల్దార్) వీ

స్త్రీలు - న్యాయ వ్యవస్థ - 2

***పితృస్వామిక సమాజంగా ఉన్న భారత సమాజంలో స్త్రీల పట్ల న్యాయవ్యవస్థ వైఖరి కూడా ఆధిపత్య సంస్కృతికి అనుగుణంగానే ఉందని అంటున్నారు* హేమ వెంకట్రావు**

(గత సంచిక తరువాయి)

సాధించుకోవలసిన హక్కులు

1. అంతర్జాతీయ లేబర్ కన్వెన్షన్ 189 ప్రకారం భారతదేశం రాటిఫై చేయాలి. ఇళ్లల్లో పనిచేసే వారికి సమగ్రమైన చట్టం తేవాలి.
2. అసంఘటితరంగ సంక్షేమ బోర్డులను జిల్లా స్థాయిల్లో ఏర్పాటు చేయాలి.
3. గృహ కార్మికులకు చట్టాల తయారీలో భాగస్వామ్యం కల్పించాలి.
4. కనీస వేతనాలు చట్టంపై ప్రభుత్వమే ప్రచార, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.
5. కనీస వేతనాలు చట్టం అమలు చేయాలి.
6. బాలికలను పనిలో పెట్టుకోవడం, హింసకు గురిచేయడం, వెట్టిచాకిరీ కేటగిరీలోకి వస్తారు. వీరిపై లైంగిక వేధింపులు, దొంగతనం అంటగట్టడం, తక్కువగా చూడడం నేటి సమాజంలో జరుగుతుంది. తెలుగు రాష్ట్రాలలో ఇంతవరకు ఎటువంటి ప్రత్యేక చట్టాలు లేవు.

గల్ఫ్ కార్మికుల హక్కులు

ప్రవాస భారతీయ మంత్రిత్వశాఖ వారు ఇటీవల పార్లమెంట్‌లో ప్రకటించిన వివరాల ప్రకారం, ప్రపంచంలోని 184కు పైగా దేశాలలో సుమారు 3 కోట్ల మంది భారతీయులు నివసిస్తున్నారు. 6 అరబ్ గల్ఫ్ దేశాలలో సుమారు 60 లక్షల మంది భారతీయులు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు గల్ఫ్‌లో సుమారు 20 లక్షల మంది ఉన్నారు.

బతుకుదెరువు అవసరాలు చాలా మందిని కన్న ఊరు, తల్లిదండ్రుల నుంచి దూరం చేస్తాయి. విద్యావంతులకు ఈ సమస్య అంతగా ఉండదు. వారు ఏ హైదరాబాదో లేదా బెంగుళూరో వెళ్లి పని చేసుకొంటారు. అయితే నిరక్షరాస్యులైన వారికి అటువంటి అవకాశం ఉండదు. ఒక పరిమిత స్థాయిలో వేతనంపై రాజీపడాల్సి ఉంటుంది. అలా కాని పక్షంలో రాష్ట్రం కాదు ఏకంగా దేశం హద్దులు దాటవలసి ఉంటుంది. ఈ రకంగా దేశం హద్దులు దాటి వచ్చే నిరక్షరాస్య యువత సహజంగా అమెరికా వెళ్లజాలదు. కాయకష్టమే ప్రతిభగా ఉన్న వీరికి దేశాలు సముచిత గమ్యంగా ఉన్నాయి.

ప్రపంచవ్యాప్తంగా గ్లోబలైజేషన్, కార్మిక అవసరాల ఫలితంగా కార్మిక మార్కెట్లో అంతర్జాతీయ వలసలకు అవకాశాలు ఏర్పడ్డాయి. పెర్షియన్స్ గల్ఫ్‌లో 1973 చమురురంగ విజృంభణ ప్రాంతంలో చమురు ఎగుమతి దేశాల్లో శ్రామికుల లోటు ఈ కొత్త కార్మిక మార్కెట్‌కు ప్రేరణగా, అభివృద్ధి ప్రణాళికగా ఆకర్షించింది. భారతదేశం, శ్రీలంక, పాకిస్థాన్, బంగ్లాదేశ్, దక్షిణ, తూర్పు ఆసియా దేశాల నుండి నైపుణ్యం లేని కార్మికులు గల్ఫ్ వలసకు ఆకర్షితమయ్యారు. స్వదేశంలో ప్రగ్గుతున్న పేదరికం నుండి విముక్తి పొందుటకు, నిరుద్యోగం ముద్రను చెరిపేయుటకు, పనికి తగ్గ వేతనాలు పొందాలనుకున్న వారి కలలు కలలుగానే మిగిలి జీవితాన్నే భారం చేసుకుంటున్న వలస కార్మికుల గోస చెప్పలేనిది.

ఈ గల్ఫ్ వలసలు కొన్ని లక్షల తెలుగు కుటుంబాల జీవిత దిశ, దశలను మార్చాయి. ప్రత్యేకించి వెనుకబడిన వర్గాల, అల్ప సంఖ్యాక వర్గాల, దళితుల ఆర్థికాభివృద్ధిలో గల్ఫ్ సంపాదన ఒక కీలక పాత్ర వహిస్తుంది. అది హైదరాబాద్‌కు చెందిన ఒక ముస్లిం కుటుంబం కావచ్చు లేదా కోనసీమలోని ఒక క్రైస్తవ కుటుంబం కావచ్చు లేదా రాయలసీమలోని ఒక బలిజ కుటుంబం కావచ్చు. స్త్రీలు ఇంటి పనిలో నిష్ణాతులు కాబట్టి ఈ దేశంలో శ్రామిక మహిళకు తక్కువ ధర పలుకుతుంది కాబట్టి గల్ఫ్ దేశాల్లో నాలుగు డబ్బులు సంపాదించుకోవడానికి అక్కడి ఇళ్లల్లో పని చేయడానికి కాంట్రాక్టు పద్ధతిలో వెళ్తారు. పని కోసం వెళ్లిన కొందరిపై లైంగిక వేధింపులు, అధిక పని గంటలు, హింస జరుగుతూనే ఉంది. వారు న్యాయాన్ని అర్థిస్తూనే ఉన్నా అందరికీ న్యాయం దొరకక అటు కుటుంబానికి, ఇటు దేశానికి చేరుకోలేక విలవిలలాడుతున్నారు. వీరికి కొన్ని ప్రభుత్వ నిర్దేశాలు ఉన్నా వాటిపై అవగాహన కల్పించడానికి ప్రభుత్వం విఫలమైంది.

గల్ఫ్ వలసలు వారి జీవితాలను మార్చివేశాయి. ఈ క్రమంలో అనేక మంది జీవితాలు విచ్ఛిన్నమయ్యాయన్నది విస్మరించలేని ఒక పచ్చి వాస్తవం. ఈ దేశాలకు వలస వెళ్లినవారి దురవస్థల గురించి వినికూడా ఇక్కడకు వచ్చేవారి సంఖ్య పెరుగుతుందే గానీ తగ్గడం లేదు. పరిస్థితులు అనుకూలిస్తే ఒక ఇల్లు కట్టుకోవచ్చు లేదా ఏదో ఒక చిన్న వ్యాపారం చేసుకోవడానికి కొంత పెట్టుబడిని అర్జించుకోవచ్చు. లేకుంటే బిడ్డ ఎదిగినప్పుడు అవసరమయ్యే బంగారాన్ని సమకూర్చుకోవచ్చు, పరిస్థితులు ప్రతికూలిస్తేనో, జైలు, స్వదేశానికి రావడానికి నానా కష్టాలు పడవలసి రావడం ఖాయం. అయినా మానసికంగా సిద్ధపడి వస్తున్న వారు ఇప్పుడు ఎంత మందో..!

గల్ఫ్ దేశాలకు వలస వెళ్లే ముందు తెలుసుకోవాల్సిన సమాచారం.

ఈ కింద పేర్కొనబడిన 17 దేశాలకు ఉద్యోగాలకు వెళ్లాలనుకునే భారతీయ కార్మికులు ప్రొటెక్టర్ ఆఫ్ ఏమిగ్రెంట్స్ (పిఒఇ – వలసదారుల సంరక్షకులు) వారి కార్యాలయం ద్వారా ఎమిగ్రేషన్ క్లియరెన్స్ (వలస వెళ్లడానికి అనుమతి) తీసుకోవాలి.

1) బహరెన్, 2) సౌదీ అరేబియా, 3) కువైట్, 4) ఖతార్, 5) ఓమర్, 6) యుఎఇ, 7) ఆఫ్ఘనిస్తాన్, 8) ఇరాక్, 9) జోర్డాన్, 10) లెబనాన్, 11) లిబియా, 12) మలేషియా, 13) సూడాన్, 14) సిరియా, 15) యెమెన్, 16) ఇండోనేషియా, 17) థాయ్‌లాండ్.

ప్రవాస కార్మికుని (మైగ్రెంట్ వర్కర్) హక్కులు

1. స్వదేశం నుండి విదేశానికి పోవడానికి, రావడానికి స్వేచ్ఛగా ప్రయాణించే హక్కు
2. బానిసత్వానికి, బలవంతపు చాకిరీకి వ్యతిరేకంగా రక్షణ పొందే హక్కు
3. ఆలోచన, మనసాక్షి, మత విషయంలో స్వేచ్ఛగా ఉండే హక్కు.
4. హింస, అవమానమైన అణచివేత లేదా శిక్షల నుండి స్వేచ్ఛగా ఉండే హక్కు.

గల్ఫ్ దేశాల్లో నితాఖత్ చట్టం

గల్ఫ్ దేశాల్లో స్థానికులకు ఉద్యోగాల్లో 10శాతం రిజర్వేషన్ అమలు చేసి, అక్కడి ప్రభుత్వం నితాఖత్ అనే చట్టాన్ని తెచ్చింది. దానిలో భాగంగా అక్కడ వివిధ కంపెనీల్లో పని చేస్తున్న విదేశీయులను పనుల్లోంచి తీసివేసి స్వదేశీయులనే పనుల్లో పెట్టుకోవాలని కంపెనీల యజమానులకు ఉత్తర్వులిచ్చింది. లేకుంటే కంపెనీ లైసెన్సులను రద్దు చేస్తామని సౌదీ ప్రభుత్వం నిబంధనలు విధించింది. నితాఖత్ చట్టం అమలుతో కార్మికులు ఏ కంపెనీ వీసాపై అయితే వెళ్లారో అదే కంపెనీలో పని చేయాలి.

ఇప్పుడు సౌదీ అరేబియాలోనే కాకుండా మిగతా అన్ని గల్ఫ్ దేశాలలో చట్టం వర్తిస్తుంది. గల్ఫ్ దేశాలలో ఉపాధికి వెళ్లేవారు గమనించు కోవాల్సింది ఏమంటే ఇప్పుడు 10 శాతం ఉద్యోగాలు తక్కువ కాబట్టి వెళ్లి సమస్యల్లో చిక్కుకోకుండా ముందు జాగ్రత్త వహించాలి.

ఆమ్నెస్టీ/ క్షమాభిక్ష ఒక్కొక్క దేశం ఒక్కొక్కసారి ఖల్లి వెళ్లిగా అంటే అక్రమంగా నివాసులుగా ఉంటున్న విదేశీయులను వెళ్లిపొమ్మని ఆజ్ఞ జారీ చేస్తుంది. ఆ సమయంలో అక్రమ నివాసులుగా ఉన్నవారు విదేశాల లోని భారత రాయబార కార్యాలయాలను సంప్రదించి సురక్షితంగా ఉచితంగా తిరిగి రావచ్చు. జాగరూకత ఉండి ఈ సదావకాశాన్ని వినియోగించుకోవడానికి సరైన జ్ఞానం, అవగాహనను కల్పించడానికి ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలి.

ఎన్నో భీమా పథకాలు ఉన్నప్పటికీ ఈ పథకాలు ప్రవాస కార్మికులకు అందటం లేదన్నది వాస్తవం. ప్రవాస భారతీయ భీమా యోజన (పిబిబివై) వివరాలు: రు. 275 (రెండేళ్లకు), రు. 375 (మూడేళ్లకు) ప్రీమియం చెల్లించినవారికి ఈ కింది లాభాలు వర్తిస్తాయి.

ప్రమాద బీమా – రు. 50,000, న్యాయ సలహాల ఖర్చులు – రు. 30,000, మహిళా కార్మికులకు ప్రసూతి సహాయం రు. 25,000, విదేశాలలో ఉన్నప్పుడు ప్రమాదవశాత్తూ చనిపోయినా, అంగ వికలురాలైనా స్వదేశానికి పంపడానికి అయ్యే విమాన ప్రయాణ ఖర్చులు. న్యాయ వ్యవస్థ ఆదేశాలను అమలు చేయవలసి వచ్చినప్పుడు ప్రభుత్వ వైఫల్యాలను గుర్తించి చట్టపరమైన చర్యలను తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఖైదీల హక్కులు

సునీల్ బత్ర జైలులో జరుగుతున్న దాడులు, అమానవీయ పరిస్థితులు సుప్రీంకోర్టుకు తెలియపరచగా (1980)వాటిని ఆధారంగా చేసుకొని అప్పటి సుప్రీంకోర్టు జడ్జి కృష్ణ అయ్యాంగార్ ప్రతిష్ఠాత్మకమైన తీర్పును ఇవ్వటం జరిగింది. దీని ప్రకారం ఎట్టి పరిస్థితులలోనూ ఖైదీ మానవ హక్కులకు భంగం కలగకూడదు.

ప్రతి ఖైదీ ఉండటానికి సదుపాయాలు, పౌష్టికాహారం, బట్టలు, పడుకోవడానికి వసతి, వైద్య సదుపాయాలు, పునరావాసానికి కావాల్సిన శిక్షణ మొదలగునవి కారాగార అధికారులు కల్పించాలి. అంతేకాకుండా చదువుకోవడానికి రాసుకోవడానికి వ్యాయామానికి, ఆహ్లాదానికి, ధ్యానానికి అవకాశాలు కల్పించాలి. లైంగిక వేధింపులకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇవే కాకుండా....

- పెద్ద వయస్సు ఖైదీల నుంచి విడిగా ఇతర బారక్‌లలో ఉండడానికి వయస్కులైన ఖైదీలకు హక్కు
- బెయిల్ పొందటానికి హక్కు
- త్వరితగతిన విచారణ హక్కు
- న్యాయవాదితో మాట్లాడడానికి హక్కు
- శిక్ష పడిన కాలం కంటే ఎక్కువగా జైలులో ఉండకుండే హక్కు
- లైంగిక దోపిడీని ఎదురించే హక్కు
- సంకెళ్లను అనుమతించిన సందర్భాల్లో తప్ప ఇతర సమయాలలో వేసినట్లైతే ప్రతిఘటించే హక్కు
- జైళ్లలో హింస, హీనమైన పరిస్థితుల నుంచి రక్షించుకునే హక్కు
- మానసికంగా హింసించాలనే ఉద్దేశంతో ఒంటరిగా బ్యారెక్‌లో ఉంచినట్లైతే నిరాకరించే హక్కు
- తమ హక్కులకు భంగం కలిగినట్లైతే నివరణ కొరకు సంప్రదించి దానికి ప్రతిగా కోర్టు ద్వారా పరిహారం పొందే హక్కు
- కుటుంబ సభ్యులను కలుసుకునే హక్కు. అలాగే ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుకోవడానికి, పత్రికలు, పుస్తకాలు పొందే హక్కు
- సమాన పనికి సమాన వేతనం పొందే హక్కు. కారాగారాలలో రూల్సును తెలుసుకునే హక్కు కలిగి ఉండాలి.

వీటితో పాటు ఖైదీలు దాంపత్య సుఖాన్ని పొందటం జీవించే హక్కులో భాగంగా 2010లో సుప్రీంకోర్టు గుర్తించడం జరిగింది. కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేనప్పటికీ ముందు ముందు ఉంటాయని ఆశిద్దాం.

పితృస్వామ్య భావజాలం పునాదితగా ఉన్న సమాజంలో స్త్రీలు ఖైదీలుగా మారటానికి నేటి అసమాన సమాజం ప్రధాన కారణం. ప్రపంచీకరణతో మరింత పదునెక్కిన పితృస్వామ్యం స్త్రీలను మరింత నేరస్థులుగా మారుస్తుంది. తాను చేసిన చట్టాలను సక్రమంగా అమలు చేయలేని వ్యవస్థ స్త్రీలనే దోషిగా నిలబెడుతుంది. స్వేచ్ఛగా బతుకుతూ కారాగారం లేని సమసమాజం కోసం పాటుపడటం నేటి ప్రతి ఒక్కరి బాధ్యత. కానీ నేడు సమాజంలో స్త్రీలను ఎలా తక్కువగా చూడబడు తున్నారో అలాగే జైళ్లలో అధికారులు వారి భావజాలంతో స్త్రీలను తక్కువగా చూడడమే కాకుండా వారిపై అనేక దాడులను లైంగిక పరంగా చేయడం జరుగుతుంది. అందుకు ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన సోనాసూరి

కేసు ప్రత్యక్ష సాక్ష్యం. అలాగే రాజకీయ ఖైదీలకు సంబంధించి వచ్చిన ఖైదీలపై కక్ష్యసాధింపు ధోరణితో నియమాలను అధిగమించి సదుపాయాలు కలుగజేయకుండా, కుటుంబ సభ్యులను కలవనీయకుండా చేయడం జరుగుతుంది. అందుకు న్యాయస్థానాలు తీసుకునే చర్యలను గమనిస్తే న్యాయవిరుద్ధంగానే జరుగుతున్నాయి. సుధా భరద్వాజ్, సోమాసేన్, సాయిబాబా లాంటి వారు తమ జీవించే హక్కుని కోల్పోతున్నారు.

ఇదంతా ఇంటి గొడవైతే స్త్రీలు బయటకు వెళ్లినా ఎక్కువ శాతం మంది అసంఘటితరంగంలో అతి తక్కువ ధరకు తమ శ్రమను అమ్ముకోవాల్సి వస్తుంది. సమానపనికి సమాన వేతనం చట్టం 1976లో వచ్చినా, 1987లో సవరణలు చేర్చింది. అయినప్పటికీ ఇంకా చట్టం అమలు 100 శాతం లేదు. మరికొన్ని అసంబద్ధమైన సెక్సిస్ట్ చట్ట కోణాలకు ఉదాహరణ ఏమంటే "ఎయిర్ ఇండియా వర్సెస్ నర్గీస్ మీర్జా" కేసులో ఎయిర్ హొస్టెస్ నియామకం తర్వాత ఆమెకు 35సం॥లు లేకపోతే 4 సంవత్సరాల లోపు పెళ్లి కావడం, మొదటి కాన్పు ఏదైనా సరే జరిగితే దాని ప్రకారం ఆమెను సర్వీసు నుండి తొలగించవచ్చు. దీనిపై సుప్రీంకోర్టు సంచలనాత్మక తీర్పు చెప్పింది. స్త్రీ అంటే యవ్వనంతో, ఆకర్షణతో ఉండటం అన్నది సర్వీసుకు అర్హమైనదిగా గుర్తించకూడదని తెలిపింది. ఇది సర్వీసు రూల్స్‌కు కొత్త అర్థాలు చెప్పినా ఇంకా విమాన సర్వీసులో ఆమె అందం ఆకరక్షణ నియామకంలో భాగమే.

1922లో డా. ముత్తిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పోరాట ఫలితంగా ఓటు హక్కు వచ్చినా కుటుంబ పెద్ద అయిన భర్త చెప్పిన వ్యక్తికే ఓటు వేయమనే బలవంతం ఇంకా స్త్రీల మీద ఉంది. 73, 74 రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థలైన గ్రామ పంచాయితీలలోనూ, పట్టణ, మున్సిపాలిటీలలోనూ రాజకీయ రిజర్వేషన్ వచ్చినా స్త్రీలను డమ్మీగా చేసి పురుషులే ఆధిపత్యం వహిస్తున్నారు. జనాభాలో 50 శాతం ఉన్న స్త్రీలకు 50 శాతం రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాలలో వాటా దొరకలేదు.

స్త్రీలు కోరుకుంటున్న ఉమ్మడి సివిల్‌కోడ్‌కు ఇంకా రూపం రాలేదు. స్త్రీలు భర్తే కేంద్రంగా తమ జీవితాలను మలుచుకునే పరిస్థితి బిజెపి వచ్చిన తర్వాత పెరుగుతుంది. మూఢనమ్మకాల జాడ్యం వారి జీవితాలలో అసమానతలను పెంచిపోషిస్తుంది. వీటికి మహిళలు ఎంతో మంది చేతబడులు చేస్తున్నారని గ్రామీణ ప్రాంతంలో బలవుతూ ఉన్నారు.

పితృస్వామ్య కుల, మత, వర్గ సమాజంలో మనమూ ఉన్నాం. న్యాయవ్యవస్థ శ్రేణులలో కూడా సమాజంలో ఉండే భావజాలం ఉంది. ఈ వ్యవస్థ ఇందుకు మినహాయింపు కాదు. స్త్రీలపై హింస అసలు సమస్యగా గుర్తించలేకపోవడం లేక అది పెద్ద సమస్యే కాదు అన్న ధోరణి (ఉపరితల సమస్యగా) ఇంకా ఉంది. ప్రగతిశీలురకు కొంతమందికి స్త్రీ స్వేఛను ఉత్పత్తి, పునరుత్పత్తికి మధ్య సంబంధం ఉంటుంది అన్న అవగాహన, జాగరూకత అవసరం. ప్రతీదీ సరుకుగా మారుతున్నప్పుడు స్త్రీలు కూడా ఇళ్లల్లో మగవాడి సరుకుగా, ఆట బొమ్మగా మార్చబడు తున్నారు. ఇప్పుడు ఇంకా ఈ కరోనా నేపథ్యంలో చవకగా, తీవ్ర శ్రమని అమ్ముకోవలసిన తరుణంలో స్త్రీ ఉంది. అయినప్పటికీ అవకాశాలు ఇంకా తగ్గుముఖం పట్టాయి. ఉద్యోగ అవకాశాలు మొదటి నుంచి పురుషులకు ఉండడం, ఉద్యోగం పురుష లక్షణం అనేది సమాజంలో బలంగా ఉండడం చేత మగ వారికే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. ఈ అసమాన, హింసతో కూడిన సంబంధాలు మానవ విలువల్నే ధ్వంసం చేస్తున్నాయి. చేస్తాయి కూడా. దీనికి తోడు స్త్రీ ఎంతో కాలంగా పోరాడి తెచ్చుకున్న హక్కులు స్త్రీ ఇంటికి పరిమితం అయితే రెండు తరాల వెనక్కి పోతుంది. వామపక్ష ఉద్యమాలు, బాబాసాహెబ్ చట్టరీత్యా చేసిన కృషి, ఉద్యమ ఫలితాలు స్త్రీని రెండడుగులు వెనక్కి నెట్టేస్తాయి.

కులానికైనా, మతానికైనా, వర్గానికైనా కుటుంబం కేంద్ర బిందువు. ఈ కుటుంబ వ్యవస్థను తన త్యాగాలతో, కన్నీటితో నిలబెడుతుంది స్త్రీ మూర్తే. ఇప్పుడిప్పుడే వస్తున్న కరోనా, ప్రభుత్వ స్టే ఎట్ హోమ్ స్త్రీని ఇదే సాకుగా ఇంటికి భావరీత్యా, సాంస్క ృతికపరంగా అంకితం చేస్తారన్నది నిర్వివాదాంశం. స్త్రీలపై హింస, కుల వ్యవస్థను మరింత వేళ్లూనుకునేలా చేయడానికి ఉపయోగపడుతుంది. కులాల అంతరాలను పెంచడంతో పాటు స్త్రీలు బయటకు వెళ్లకూడదనే ఆంక్షలు ఇంకా పెరుగుతాయి. మన పిల్లలను దీనికి పని ముట్లుగా సంస్కృతిలో భాగంగా తయారవుతున్నారు. కులం, మతం ఇప్పటికే స్త్రీల జీవితంపై విరుచుకు పడుతుంది. ఇక కరోనా ఆర్థికంగా దెబ్బతీస్తుంది.

ఎన్నో పోరాటాల్లో మనం సాధించుకున్న చట్టాలలో పరిమితులు, ఆంక్షలు ఉన్నాయి. అందుకే చట్టాలు ఒక ప్రాతిపదిక మాత్రమే అని కా. లెనిన్ అన్నారు. వాటి అమలులో అంత:స్సూత్రంగా పురుషాధిపత్య ధోరణులు పితృస్వామ్యం భావజాలం అపసవ్య ధోరణులు ఉన్నాయి. చట్టాల వాడుకలోని పదజాలం అంతా వ్యక్తిగత ఆస్తుల చుట్టూ జరుగుతుంది. చట్టాలు పిచ్చోడి చేతిలో రాయిలా తయారు అయ్యాయని సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి అన్నప్పుడు ఇక న్యాయవ్యవస్థ స్థితిని మనం అంచనా వేసుకోవచ్చు.

స్త్రీలకు ఉన్నట్లే బాలలకు, బాలికలకు కొన్ని హక్కులున్నాయి. ఇవి మన రాజ్యాంగంలో కూడా చేర్చబడ్డాయి. దీనిపై 1974లో భారత ప్రభుత్వం స్వాతంత్ర్యం వచ్చిన 3 దశాబ్దాలకు తమ జాతీయ విధానాన్ని రూపకల్పన చేసింది. అలాగే 1989లో ఐక్యరాజ్య సమితి బాలల హక్కులపై జరిపిన అంతర్జాతీయ ఒడంబడికపై కూడా సంతకాన్ని చేసింది. పిల్లలకు 14సంవత్సరాల లోపు వయస్సు ఉన్నట్లైతే వారు కార్మాగారాలలో, గనులలో గానీ, ఏ ఇతర అపాయకరమైన వృత్తులలో గానీ పని చేయించకూడదు. ఆరోగ్యకరమైన వాతావరణంలో స్వేచ్ఛగా, గౌరవంగా బ్రతికే అవకాశాలు కల్పించాలి. వీరికి నిర్బంధ విద్య కూడా ఇవ్వాలి.

కానీ నేటి సమాజంలో ఉన్న ధనిక, పేద నిచ్చెన మెట్ల కుల సమాజంలో వీరికి ఎటువంటి అవకాశాలు లేక మరింత దీనంగా బ్రతుకుతున్నారు. వీరి హక్కులపై జెండర్ సంబంధిత వ్యత్యాసాలు ఉన్నాయి. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌లు ఆడపిల్లలకు, పిజి టు కేజి మగ పిల్లలకు అమలవుతున్న తరుణంలో ఆస్తి హక్కు అమలు కాని సమాజంలో ఆడ పిల్లలు అత్యాచారాలకు, అసమానతలకు గురవుతూ సమాజంలో 2వ శ్రేణి పౌరురాలుగా జీవితాన్ని కొనసాగిస్తున్నారు.

(ఇంకా ఉంది)

(రచయిత న్యాయవాది) వీ

ఆన్‌లైన్ విద్య-అయోమయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

***ఆన్‌లైన్ విద్యకు తగిన ఆర్థిక, సాంకేతిక, భౌతిక పరిస్థితులు లేకపోవడంతో విద్యార్థులు, వారి తల్లితండ్రులు, ఉపాధ్యాయులు తీవ్ర అయోమయానికి గురవుతున్నారంటున్నారు* ఎం. రఘుశంకర్ రెడ్డి**

ప్రపంచ వ్యాప్తంగా కరోనా మహమ్మారి సృష్టించిన విలయం, విపత్కర పరిస్థితులు మానవ జీవన గమనాన్ని అతలాకుతలం చేసి కరోనా విజృంభన విభిన్న రంగాలను తీవ్ర ఒత్తిడులకు, ఒడిదొడుకులకు గురిచేసింది. అందులో విద్యా రంగం మినహాయింపు కాకపోవడం సహజం. ఫలితంగా విద్యా రంగంలో అనూహ్య మార్పులు జరిగాయి – ప్రపంచంలోని చాలా దేశాలలో గత సంవత్సరం నవంబర్, డిసెంబర్ నుండి కరోనా ఉధృతి పెరుగుతూ వచ్చింది. కాని భారతదేశంలో ఈ మార్చిలో ఉధృతి పెరగడం వలన మార్చి 24 నుండి కేంద్ర ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించింది. వ్యవస్థలన్నీ ఎక్కడికక్కడే స్థంభించాయి. ఫలితంగా దేశవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు అన్నీ మూతపడ్డాయి. పరీక్షలన్నీ వాయిదా పడ్డాయి. మన రాష్ట్రంలో ఎస్ఎస్‌సి పరీక్షలు మూడు పరీక్షల తర్వాత వాయిదా పడి తర్వాత రద్దుచేయబడి, ఇంటర్నల్ మార్కుల ఆధారంగా ఫలితాలు ప్రకటించారు.

లాక్‌డౌన్‌లో ప్రజలు చాలా ఇబ్బందులకు గురయ్యారు – వలస కార్మికులు, దినసరి కూలీలు, చిరుద్యోగులు అనేక బాధలు పడ్డారు. కరోనా మహమ్మారి బీభత్సం రోజు రోజుకు పెరుగుతూనే ఉంది. దేశంలో, రాష్ట్రంలో దాదాపు సామాజిక వ్యాప్తి దశకు చేరుకుంది. ఈ స్థితిలో జీవితం గడవని ప్రజల బాధలు, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న రాష్ట్రాల అభ్యర్థనలను దృష్టిలో పెట్టుకొని కేంద్రం కొన్ని రంగాలను మే, జూన్ మాసాలలో అన్‌లాక్ ద్వారా మినహాయింపు నిచ్చింది. కాని విద్యా రంగాన్ని, పాఠశాలల్ని ఆగస్టు 31 వరకు లాక్‌డౌన్‌లోనే ఉంచింది. ఈ కారణంగా పాఠశాలలు జూన్ 12న పునఃప్రారంభం కాలేదు. కాని కార్పొరేటు, ప్రైవేట్ విద్యా సంస్థలు ఒకవైపు ప్రభుత్వం అనుమతించడం లేదని ప్రకటించినా, కోర్టుల్లో కేసులు నమోదైనా అనధికారికంగా అడ్మిషన్ల కోసం, ఫీజుల వసూలు కోసం ఆన్‌లైన్–డిజిటల్ క్లాసులు ప్రారంభించారు. ఇదే సందర్భంలో ప్రభుత్వం జివొ నెం. 46 జారిచేసి, ఎవరు ఫీజులు పెంచరాదు, ఒత్తిడిలో తల్లిదండ్రుల నుండి ఫీజులు వసూలు చేయరాదని ఆదేశించినా, చాలా ప్రైవేట్ విద్యా సంస్థలు పెడచెవిన పెట్టాయి. ఆన్‌లైన్ విద్యా నిర్వహణపై ప్రభుత్వాలపై ఒత్తిడి పెరిగి, కేంద్రం జూలై నెలలో కొన్ని మార్గదర్శకాలను విడుదల చేసింది. దీంతో ప్రైవేట్ విద్యాసంస్థలకు మరింత స్వేచ్ఛ లభించింది. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రభుత్వ పాఠశాలలో ఆన్‌లైన్ – డిజిటల్ తరగతులు నిర్వహించాలని నిర్ణయించి, 2020 సెప్టెంబర్ 1 నుండి ప్రారంభించారు.

వాస్తవానికి ఉపాధ్యాయుడిని, తరగతి గదిని ఏ ప్రత్యామ్నాయం ద్వారా పూరించలేం. ఉపాధ్యాయుడు ఒక సజీవ, సృజనాత్మక మానవ సంబంధం. ఆ స్థానంలో ఒక కంప్యూటర్, ఒక టెలివిజన్ ఊహించడమంటే దూరదృష్టి లేకపోవడమే అవుతుంది. అయితే కరోనా ఒక కొత్త పరిస్థితిని సృష్టించింది. విద్య ఏదో ఒక పద్ధతిలో నిర్వహింపబడాలనే దానికి ఆన్‌లైన్, డిజిటల్ విద్య జవాబు కాదు. కాని, విద్యా సంవత్సర నిర్వహణపై అనేక చర్చలు జరుగుతున్న క్రమంలో తల్లిదండ్రుల ఆవేదన, నెలలుగా విద్యార్థులు ఇంట్లో నిస్తేజంగా ఉండిపోవడం, ప్రైవేట్ విద్యా సంస్థలలో ఇ – లర్నింగ్ పేరిట ఆన్‌లైన్ విద్య ప్రారంభం కావడం నేపథ్యంలో విద్యా సంవత్సరం నష్టపోగూడదన్న ఆలోచనలో ఆన్‌లైన్ విద్యా బోధన ప్రయత్నం జరిగినట్లు భావించవచ్చు. ప్రైవేట్ విద్యా సంస్థలవారు కొత్త అడ్మిషన్లు, ఫీజుల వసూలు ధ్యేయంగా ప్రారంభించారనేది వాస్తవం.

అయితే కరోనా వైరస్ తెగబడక ముందు, విశ్వవ్యాప్తంగా 44 శాతం విద్యార్థులకు ఆన్‌లైన్ చదువులన్నవే తెలియవని గుటెక్‌బర్గ్, ఎవల్డిజైన్ సంస్థల సంయుక్త విశ్లేషణ తెలిపింది. భారతదేశం లాంటి సామాజిక వెనుకబాటుతనం, ఆర్థిక అసమానతలు, నిరక్షరాస్యత కల్గిన దేశంలో ఆన్‌లైన్ ద్వారా విద్యాభ్యసనకు తగు సన్నద్ధత ఉందా అన్నది ప్రశ్న. జాతీయ గణాంక సంస్థ (ఎన్ఎస్ఒ) తాజా నివేదిక ప్రకారం హిమాచల్‌ప్రదేశ్ లాంటి పట్టణ ప్రాంతాలలో 70 శాతం పైగా విద్యార్థులకు అంతర్జాల వసతి అందుబాటులో ఉంటే, గ్రామీణ ఒడిశాలో 3 శాతం మాత్రమే ఉంది. సాఫ్ట్‌వేర్ హబ్స్‌గా పేరుపొందిన కర్నాటక, తమిళనాడు సహా 10 రాష్ట్రాలలో నెట్ సదుపాయం కలిగిన జనాభా 20 శాతం కన్నా తక్కువే. దేశవ్యాప్తంగా పట్టణ ప్రాంతాలలో 42 శాతానికి, గ్రామీణుల్లో కేవలం 15 శాతానికి అంతర్జాలం అందుబాటులో ఉన్నట్లు గణంకాలు చెబుతున్నాయి. దేశం మొత్తంలో డెస్క్‌టాప్‌లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబులలో ఏదో ఒక్కటైనా కలిగిన కుటుంబాలు 10 శాతమేనన్న అంచనాలు తెలిపే విషయమేమంటే, ఆన్‌లైన్ చదువులకు 'డిజిటల్ ఇండియా' ఇంకా సంసిద్ధం కాలేదు. చాలాచోట్ల నెట్‌వర్క్ ఇబ్బందులు, మౌలిక ఇక్కట్లను అధిగమించి, సజావుగా ఆన్‌లైన్ తరగతులకు హాజరై సంతృప్తి చెందుతున్నవారి సంఖ్య పరిమితంగా ఉన్నంత కాలం డిజిటల్ చదువులు అర్థవంతం కాలేవు.

దేశంలో విద్యా వ్యవస్థ చాలా విస్తారమైనది. 15 లక్షల పాఠశాలలు, 50 వేల ఉన్నత విద్యా సంస్థలలో, 32 కోట్ల మంది విద్యార్థులకు ఈ–లెర్నింగ్ ప్రక్రియను ఒక్క సారిగా ప్రవేశపెట్టడం సాధ్యం కాదు. అయితే ఈ డిజిటల్ విద్య ఉన్నత విద్యా సంస్థలలో 'స్వయం' పేరిట కొనసాగుతుంది. ఇది మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్స్ (ఎంఒసిఎస్)లో భాగంగా ఉంది. ఇది జాతీయ విద్యా విధానం – 2020లో భాగం కాబోతున్నది. ప్రస్తుతం ఈ–లెర్నింగ్ అత్యధిక విద్యార్థులకు అందుబాటులో లేదు. ఆర్థిక అంతరాలు, గ్రామీణ – పట్టణ బేధాలు, మారుమూల ప్రాంతాలలో నివాసాలు, తల్లిదండ్రుల నిరక్షరాస్యత, ఆంగ్ల భాషా నైపుణ్యంలో తేడాలు, లింగ బేధాలు, దివ్యాంగ బాలల అసమానతలను దృష్టిలో ఉంచుకొని ముందుకు వెళ్లాల్సిన అవసరం

ఉంది. అంతేగాని ప్రచారార్భాటపు ప్రకటనలతో ఫలితాలు రావని పాలకులు గుర్తించాలి.

మన తెలంగాణలో ముందస్తు ప్రచారాలతో, ప్రకటనలతో 2020 సెప్టెంబర్ 1 నుండి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించారు. మంత్రులు, అధికారులు ఎంతో హడావిడి చేశారు. సుమారు 40 వేల పాఠశాలల్లో 58 లక్షల మంది విద్యనభ్యసిస్తున్నారు. అందులో ప్రభుత్వంలోని విభిన్న యాజమాన్యాలలోని 29 వేల పాఠశాలలో 27 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఆన్‌లైన్ విద్యకవసరమైన స్మార్ట్ ఫోన్‌లు, ట్యాబులు, కంప్యూటర్‌లు, టివిలు, వైఫై నెట్‌వర్క్, డాటా ఉందా లేదా చూడకుండా ప్రారంభించడం వలన విద్యార్థులు, తల్లిదండ్రులు ఎంతో ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ, పట్టణ పేదలు, దినసరి కూలీలు ఎంతో ఒత్తిడికి గురవుతున్నారు. ఫోన్ కొనివ్వలేదని ఇటీవల జగిత్యాల జిల్లా బీర్‌పూర్ గ్రామంలో ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంకా అనేక జిల్లాలలో ఆత్మహత్య ప్రయత్నాలు, కుటుంబాలలో గొడవలు ఎన్నో జరిగాయి.

ప్రస్తుతం డిజిటల్ క్లాసులు, రికార్డు చేయాల్సిన పాఠాలు మాత్రమే బోధిస్తున్నారు. దూరదర్శన్ యాదగిరి, టి-శాట్ ఛానెళ్ల ద్వారా ప్రసారం చేయబడుతున్న తరగుతులు పాక్షికంగానే అందుబాటులోకి వచ్చాయి. యాదగిరి ఎక్కువ మందికి అందుబాటులో ఉన్నప్పటికీ, అందులో కొన్ని క్లాసులకు, కొన్ని సబ్జెక్టులు మాత్రమే ప్రసారం చేస్తున్నారు. టి-శాట్ ఛానెల్, స్మార్ట్ ఫోన్, కేబుల్, ఎయిర్‌టెల్, డిజిటల్ కనెక్షన్ ఉన్నవారు మాత్రమే చూడగలుగుతున్నారు. అయితే తెలుగు మీడియం పాఠాలు మాత్రమే ప్రసారమవుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఇంగ్లిష్ మీడియం, ఉర్దూ మీడియం విద్యార్థులకు డిజిటల్ క్లాసులు లేకపోవడం పెద్ద లోపం. తక్షణమే అందుబాటులోకి తీసుకురావలసి ఉంది.

ఎన్‌సిఇఆర్‌టి, యుఎన్‌ఇఎస్‌సిఒ, డబ్ల్యుఎచ్‌ఒ లాంటి సంస్థలు ఎల్.కె.జి. నుండి 2వ తరగతి వరకు ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించరాదని హెచ్చరించినా కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు కాసుల కక్కుర్తి కోసం నిర్వహిస్తున్నాయి. అలాగే చిన్న పిల్లలకు 30 నిమిషాల కంటే ఎక్కువ 'డిజిటల్ స్క్రీన్' చూడరాదని హెచ్చరించినా ఒకటి, ఒకటిన్నర గంటలు వరసగా క్లాసులు తీసుకుంటున్నారు. ఫీజుల పేరిట దోపిడీ చేస్తున్నారు. చెల్లించని వారికి ఫోన్లు, మెసేజ్‌లు, మెయిల్స్ చేసి ఒత్తిడి చేస్తున్నారు. లేదంటే పాస్‌వర్డ్, కనెక్షన్ నిలిపివేసి వేదనకు గురిచేస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలపై విద్యా శాఖ కనీస కంట్రోల్ లేకపోవడం విచారకరం.

ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక స్థాయిలో 3 నుండి 5వ తరగతి వరకు, హైస్కూల్ స్థాయిలో 6 నుండి 10వ తరగతి వరకు డిజిటల్ క్లాసులు నిర్వహిస్తున్నారు. అయినా సగానికంటే ఎక్కువగా విద్యార్థులకు స్మార్ట్ ఫోన్‌లు, కంప్యూటర్‌లు, టివిలు లేవనేది వాస్తవం. ఇవేవి అందుబాటులో లేకుంటే కమ్యూనిటీ సెంటర్‌లో, గ్రామ పంచాయితీల వద్ద టివిలు ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ సూచనలు అతి స్వల్పంగా అమలయ్యాయి తప్ప, చాలా చోట్ల నిర్వహింపబడలేదు. ఫలితంగా డిజిటల్ క్లాసుల నిర్వహణ గందరగోళంగా మారింది. చాలా ప్రాంతాలలో నెట్ ఉండకపోవడం, సిగ్నల్స్ సమస్యలేర్పడడం, వరుసగా కరెంట్ ఉండకపోవడం లాంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఇంట్లో ఒకే ఫోన్ ఉంటే తల్లిదండ్రులు పనికి తీసుకుపోవడం, ఇంట్లో అన్నో, అక్కో ఉంటే ఒకే ఫోన్ వారు వాడడం లాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మొత్తంగా చూస్తే డిజిటల్ క్లాసులు 40 నుండి 50 శాతం కంటే ఎక్కువ నిర్వహింపబడలేదనేది వాస్తవం. ఇందులో కూడా కంటెంట్, బోధన విషయానికి వస్తే ప్రాథమిక స్థాయిలో పిల్లలు నిరాసక్తతలో, అర్థం గాని రీతిలోనే స్తబ్దుగా ఉన్నారు. ఇక హైస్కూల్ స్థాయిలో కొంత మెరుగనిపించినా, ఇక్కడ కూడా విషయ వివరణ, బోధనా పద్ధతిలో లోపాలు కన్పించాయి. ఉదాహరణకు పదవ తరగతి గణితంలో వాస్తవ సంఖ్యలు, సమితులు పాఠాలు, రెగ్యులర్‌గా అయితే 8 నుండి 10 క్లాసులు చెప్పాల్సి ఉంటుంది. ఇక్కడ 15 నుండి 20 నిమిషాలలో పాఠం పూర్తి చేశారు. 9 తరగతిలోని ఇవే పాఠాల పరిశీలన చేయకపోవడం వల్ల విద్యార్థులు అర్థం కాలేదనే నిర్ణయంలో ఉన్నారు. అలాగే సైన్సులో, సోషల్‌లో కూడా అదే పరిస్థితి ఉంది. కొన్ని పాఠాలు డిడిలో, టి-శాట్‌లో డబుల్ వస్తున్నాయి. ఇంగ్లిష్ భాషను కనీసం తెలుగులో అర్థాలు చెప్పకుండా బోధించడం వల్ల విద్యార్థులు అర్థం కాలేదని అంటున్న పరిస్థితి గమనించవచ్చు. ఇందులో తల్లిదండ్రులు కూడా గందరగోళ పడుతున్నారు.

డిజిటల్ క్లాసుల 'వర్క్‌షీట్లు' ఒక ప్రహసనంగా మారింది. నిర్వహించబడిన క్లాసు, సబ్జెక్టుకు సంబంధించి ఈ వర్క్‌షీట్లు వాట్సప్‌లో పంపి, వారి నుండి అవగాహన, అధ్యయనాన్ని మదింపు చేయాలనేది ఉద్దేశం. కాని, చాలా మందికి ఫోన్స్, వాట్సప్ ఉండడం లేదు. కొద్ది మందికి ఉన్నా విద్యార్థులు నాన్ సీరియస్‌గా ఉంటున్నారు. మరో ప్రయత్నంగా సబ్జెక్టు టీచర్లు జిరాక్స్ తీసి పంపాలంటే ఎన్నో సమస్యలు. ఖర్చుల భారం ఏర్పడుతున్నది. అలాగే వర్క్‌షీట్ల కరెక్షన్ కూడా సరిగా జరిగే పరిస్థితి లేదు. కింద ఏం జరిగినా పైకి అధికారులకు మాత్రం రిపోర్టులు ప్రోఫార్మాలు నింపి పంపాలి. ఎచ్‌ఎం, ఎంఇఒల ఒత్తిడి, ఏదో ఒకటి పంపండి - అంతే పంపకుంటే ఒత్తిళ్ళు, మెమోలు ఇస్తున్నారు. ఇదీ జరుగుతున్న తతంగం. అంతా అసత్యాలు - అర్ధ సత్యాలే.

ఈ ఆన్‌లైన్ విద్య నేపథ్యంలో కుటుంబాలలో గొడవలు, అప్పులపాలు కావడం, ఆత్మహత్య ప్రయత్నాలు, ఆత్మహత్యలు లాంటి బాధాకరమైన సంఘటనలు కూడా చూస్తున్నాం. అలాగే కొందరు హైపర్ ఆక్టివ్ ఉన్న పిల్లలు ఆన్‌లైన్ విద్య అభ్యసిస్తున్నామనే పేరుతో, అమాయకులైన తల్లిదండ్రులను నమ్మించి ఆన్‌లైన్ గేమ్ ఆడి గేమింగ్ డిజార్డర్‌కు, ఆన్‌లైన్ సెక్సువల్ బిహేవియర్, సోషల్ మీడియా డిజార్డర్ లాంటి మానసిక రుగ్మతల బారిన పడుతున్నారనే విషయాలు తెలుస్తున్నాయి. కొందరు గడుగ్గాయిలు సైబర్ బుల్లీయింగ్ (అభ్యంతరకర మెసేజ్‌లు, కామెంట్లు) తో ఏడిపించడం జరుగుతున్నది. ఇందులో ప్రధానంగా బాలికలే బాధితులు కావడం జరుగుతున్నది. అలాగే సిఎన్ఎన్ అధ్యయనంలో టీనేజ్ విద్యార్థులు మొబైల్, ల్యాప్‌టాప్ వాడి, 'సోషల్ మీడియా ఫీడ్'ను రోజులో ఎక్కువ సార్లు చూస్తున్నారని, ఈ ధోరణి 'డిజిటల్ ఎడిక్షన్'కు దారితీసే ప్రమాదముందని తెలిపారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్, న్యూరో సొసైటీ, బెంగళూర్ వారు విద్యార్థులకు పరిమిత సమయమే ఆన్‌లైన్ విద్య అందించాలని, లేనిచో శారీరక, మానసిక సమస్యలు వస్తాయని తెలిపారు. అంతేకాదు, ఇవాళ దేశంలో కెజి టు పిజి ఆన్‌లైన్ విద్య ద్వారా 10 వేల కోట్ల వ్యాపారం నడుస్తున్నది. ఇందులో బైజు, గూగుల్ శాట్, మైక్రోసాఫ్ట్, ఎక్స్‌ట్రా వర్క్ వంటి సంస్థలు ఆన్‌లైన్ సాధనాలు అందించి దోచుకుంటున్నాయి. భవిష్యత్తులో ఆన్‌లైన్ - విద్య వ్యాపారం స్వదేశీ, విదేశీ ద్వారా లక్ష కోట్లకు చేరుతుందని అంచనా.

ఈ సందర్భంలో కోవిడ్ నివారణ అదుపు ఇపుడిపుడే జరిగేలా లేదు. కోవిడ్ తగ్గకుండా, వాక్సిన్ రాకుండా తల్లిదండ్రులు విద్యార్థులను పాఠశాలలకు పంపేలా లేరు. ఇవాళ మనం ఆలోచించాల్సింది తరగతి గదిని పునర్నిర్మించడం ఎలా? విద్యా సంస్థలలో భౌతిక వసతులు

రాజకీయ నాయకులతో ప్రజలకు మేలు జరుగుతుందా?

ప్రజాస్వామ్యం పేర ఐదు సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఎన్నికల ద్వారా ఎన్నుకోబడే రాజకీయ నాయకులు ప్రజలకు ఎంత మేరకు జవాబుదారీగా ఉంటున్నారని ప్రశ్నిస్తున్నారు **డా. రక్కిరెడ్డి ఆదిరెడ్డి**

ప్రపంచంలోని 200 దేశాలలో సగం పైగా ప్రజాస్వామ్య వ్యవస్థ కొనసాగుతుంది! ప్రజాస్వామ్యం అంటేనే ప్రజలచే ఎన్నుకోబడిన నాయకులు ప్రజలకు జవాబుదారీతనంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంటుంది. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యం భారతదేశాన్ని రెండు వందల సంవత్సరాలు నాలుగు మూలల పరిపాలించింది. ఇంతకు ముందు రాజకీయ వ్యవస్థ ముస్లింల పరిపాలన కొనసాగింది. ముస్లింల పరిపాలన కాలంలో రాజ్యాలన్నీ చిన్న చిన్నవిగా ఉండేవి బ్రిటిష్ వారి కాలంలో చిన్న చిన్న రాజ్యాల నన్నిటిని తమ సామంత పాలకులుగా తమ ఆధీనం లోనికి తెచ్చుకున్నారు. అయితే రాజకీయ వ్యవస్థ రెండు రకాలుగా విభజించబడింది. ఒకటి రాజరికపు పరిపాలన వ్యవస్థ రెండవది ప్రజాస్వామిక పరిపాలన వ్యవస్థ. ఈ రెండింటికీ మధ్య తేడా చాలా ఉంటుంది. రాజరికపు వ్యవస్థలో నిరంకుశ పరిపాలన రాజు పరిపాలన విధానం ప్రజలకు ఆమోదయోగ్యమైనా కాకపోయినా రాజు పరిపాలన విధానాన్ని అంగీకరించక తప్పదు. అయితే ఇక్కడ రాజరికపు వ్యవస్థలో రాజుతో పాటు ఐదు పది మంది మంత్రివర్గ వ్యవస్థ ఉంటుంది ఇంత చిన్న వ్యవస్థ కూడా రాజ్యాన్ని పరిపాలించే సత్తా రాజుకు ఉండేది. రాజు ప్రజా సంక్షేమం పట్ల శ్రద్ధ కనబరిచేవాడు అయితే రాజరిక వ్యవస్థ కూడా ప్రజా మన్ననలు పొందిన దాఖలాలు ఉన్నాయి! రాజరికపు వ్యవస్థలో రాజు సామర్థ్యాన్ని బట్టి ఎంత దూరమైనా తన సామ్రాజ్య కాంక్షను విస్తరింపజేసి పోవడానికి అవకాశం ఏర్పడేది. ప్రజాస్వామ్య వ్యవస్థలో కంటే రాచరిక వ్యవస్థ కూడా ప్రజల మన్ననలను పొందిన దాఖలాలు ఉన్నాయని చెప్పుకోవడానికి ముఖ్యంగా అశోకుని కాలం నాటిది రాజరిక వ్యవస్థ ఉదాహరణగా చెప్పుకోవచ్చు! ఎందుకంటే అశోకుని పరిపాలన రాజరికపు పరిపాలన అయినప్పటికీ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి ప్రజారంజకమైన పరిపాలన అందించిన ఘనత అశోకునికి దక్కుతుంది.

ఆ తర్వాత రామ రాజ్యం పరిపాలన వ్యవస్థ ను గొప్పగా చెప్పుకోవడం జరుగుతుంది రామరాజ్యాన్ని ముందు తరాలకు ఉదాహరణగా చెప్పడం జరుగుతుంది. ఇది రాజకీయ వ్యవస్థ గురించి కొన్ని ఉదాహరణలు మాత్రమే! రెండవది ప్రజాస్వామిక వ్యవస్థ ప్రజాస్వామిక వ్యవస్థలు ప్రజలకు ఎనలేని స్వేచ్ఛ ఉంటుందన్న నమ్మకం, విశ్వాసం మనకు తెలుసు. ప్రజాస్వామ్య వ్యవస్థ అంటే ప్రతి ఒక్కరికి స్వేచ్ఛగా తిరిగే హక్కు, మాట్లాడే హక్కు ఇవి ప్రధానంగా ప్రతి మనిషికి ఉండవలసిన హక్కులు! అయితే భారతదేశం ఉదాహరణగా తీసుకుంటే 1947 ఆగస్టు 15 భారతదేశానికి స్వాతంత్రం వచ్చింది. ఇంతకుముందు బ్రిటిష్ వారు రెండు వందల సంవత్సరాలు ఏకధాటిగా భారతదేశాన్ని ఏకఛత్రాధి పత్యంగా పరిపాలించినారు. బ్రిటిష్ పరిపాలన నుండి భారత దేశ ప్రజలు స్వేచ్ఛ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కజేయకుండా బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా కొట్లాడిన సంఘటనలు ఇందులో ఎంతో మంది తమ మాన ప్రాణాలను పోగొట్టుకున్న సంఘటనలు ఉన్నాయి. ఎంతో మంది మహా నాయకులు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా భారత దేశ ప్రజలకు స్వేచ్ఛావాయువులు అందించడానికి చేసిన ఉద్యమం ద్వారానే భారతీయ ప్రజలు స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నారు అన్న సంగతి తెలిసిందే. ఇలా సాధించుకున్న ప్రజాస్వామ్య స్వేచ్ఛను 1950 జనవరి 26 నుండి భారత రాజ్యాంగం చట్టం ప్రకారంగా భారతీయ ప్రజలకు ఉండాల్సిన హక్కులు నియమ నిబంధనలు రాజ్యాంగంలో పొందుపరచిన కొన్ని తమకు తాముగా ప్రజాస్వామ్య వ్యవస్థ అని చెప్పుకుంటూ పాలనను కొనసాగిస్తున్నాం. ఇప్పటికి 74 సంవత్సరాలు ప్రజాస్వామ్యం గానే పాలన కొనసాగుతుంది. అయితే ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రజలకు జవాబుదారీ తనంగా ఉంటేనే ప్రజాస్వామ్య వ్యవస్థ పేరుకు స్వార్థ ఉంటుంది.

స్వేచ్ఛ, సమానత్వం, ప్రాథమిక హక్కులు వీటిని ప్రధానంగా ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి మానవుడు అనుభవించాల్సిన అవసరం ఉంటుంది. ఇంత పెద్ద గొప్పగా చెప్పుకునే ప్రజాస్వామ్య వ్యవస్థలో, సమాజంలో నెలకొన్న అసమానతలను తొలగించడానికి ప్రజాస్వామ్య వ్యవస్థ కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రజాస్వామ్య వ్యవస్థకు లోబడి మనమందరం చట్టానికి లోబడి వ్యవస్థకు అనుగుణంగా పని చేయాల్సి ఉంటుంది. అయితే ప్రజాస్వామ్య వ్యవస్థ రాజకీయ వ్యవస్థ కంటే అధ్వానంగా తయారైతే ప్రజాస్వామ్య వ్యవస్థకు విలువ ఉండకుండా పోతుంది. ముఖ్యంగా మానవ హక్కులు ప్రజాస్వామ్య వ్యవస్థలో పరిరక్షించాల్సిన అవసరం

కల్పించడం ఎలా? హాస్టల్ వసతులు, ఇతర సౌకర్యాలు పెంపొందించడం గురించి ఆలోచించాలి. పాఠశాలల్లో శానిటైజేషన్, మాస్కుల పంపిణీ, అదనపు గదుల ఏర్పాటు జరిగేలా చూడాలి. ప్రతి పాఠశాలలో ఆరోగ్య కార్యకర్తలను నియమించాలి. విద్యార్థులు బస్సులలో దూర ప్రయాణాలు చేయకుండా తమ ఆవాస ప్రాంత పాఠశాలలలోనే చేర్పించాలని ప్రచారం జరపాలి. ఈ సందర్భంలో కామన్ స్కూల్ తప్ప వేరే మార్గం లేదు. ఇంటి దగ్గరనే బడి ఉంటే కరోనా బారినపడే అవకాశం తక్కువగా ఉంటుంది. అంతే తప్ప క్షేత్రస్థాయి వాస్తవాలు గమనించకుండా విద్యార్థులపై అనువుగాని ఆన్‌లైన్ విద్యను బలవంతంగా రుద్దాలని చూడడం, అసత్యాలు, అర్ధ సత్యాలతో అవి 90 శాతం విజయవంతంగా నిర్వహింపబడుతున్నదని మంత్రులు, అధికారులు నమ్మబలకడం ప్రజలను మోసం చేయడం, విద్యార్థులకు ద్రోహం చేయడమే అవుతుంది. ఆన్‌లైన్ విద్య అదనపు బోధనోపకరణయే తప్ప దానికదే విద్య కాదు, అందులో సమగ్రత లేదు, ముమ్మాటికీ అది ఉపాధ్యాయునికి ప్రత్యామ్నాయం కాజాలదు.

(రచయిత రాష్ట్ర అధ్యక్షులు, డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్) వీ

పాలకులపై ఉందన్న నమ్మకం ఇప్పటికి ప్రజలలో ఉంది. ప్రస్తుతం మనం 74 ఏళ్ల స్వతంత్ర భారతదేశ సామాజిక వ్యవస్థలో నివసిస్తున్నాం. అయితే 130 కోట్ల భారతదేశ ప్రజలను తన కన్నబిడ్డలవలె చూసుకోవలసిన రాజకీయ వ్యవస్థ నిర్మాణానికి ప్రజలే పునాదులు. ఇటువంటి వ్యవస్థకు ప్రజాస్వామ్యం పేరుతో ప్రజల ఓటు హక్కును వినియోగించుకొని అధికారంలోకి వస్తున్న రాజకీయ నాయకులు ప్రజా సంక్షేమాన్ని ఏమేరకు అమలు పరుస్తున్నారు అన్న విషయాన్ని మనం నెమరు వేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇంత గొప్ప ప్రజాస్వామ్య దేశంలో 29 రాష్ట్రాలు ప్రస్తుతం ఉన్నాయి. వీటిలో చాలా రకాలైన రాజకీయ పార్టీల పరిపాలన వ్యవస్థ కొనసాగుతుంది! ఒక్కొక్క రాష్ట్రంలో రాజకీయ ప్రజా ప్రతినిధుల సంఖ్యను బట్టి చూస్తే 40 మంది నుండి మొదలు కుంటే 400 మంది వరకు ఆయా రాష్ట్రాలకు రాజకీయ ప్రతినిధులుగా ప్రజాస్వామ్య వ్యవస్థ పునాదులుగా ఉంటూ పాలన కొనసాగిస్తున్నారు. ఇది కేవలం శాసన సభ పరిపాలకులుగా చెప్పుకోబడే నాయకుల సంఖ్య. వీటితో పాటుగా ఎంపీటీసీ జడ్పిటిసి సర్పంచ్ కార్పొరేటర్ తదితర పేర్లతో భారతదేశంలో ఆయా రాష్ట్రాలలో ఏర్పరుచుకున్న రాజకీయ వ్యవస్థ అని చెప్పవచ్చు. రాజ్యాంగపు నియమ నిబంధనలకు ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలకు సేవలు అందించే విధంగా ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలలో పోటీ చేసి ప్రజాస్వామ్య నాయకులుగా వెలుగొందుతుంది.

నాయకులు ప్రజలకు జవాబుదారీ తనంగా ఏ మేరకు పని చేస్తున్నారు ఒక్కసారి మనమందరం ప్రశ్న వేసుకొని జవాబు కొరకు సమాజాన్ని అధ్యయనం చేయాలి. పైన పేర్కొన్న ఈ విధంగా ఆయా రాష్ట్రాలలో 40 మంది శాసన సభ్యుల నుండి పెద్ద రాష్ట్రాలు అయితే 400 వరకు కూడా శాసనసభ్యులు ఉన్న రాష్ట్రాలు కూడా ఉన్నాయి ఈ విధంగా రాజకీయ వ్యవస్థ ప్రస్తుతం అందుబాటులో ఉందని చెప్పవచ్చు. ఇంతమంది ప్రజాస్వామ్య పాలకులు కేవలం ఐదు సంవత్సరాలకు ఒకసారి ఓటు అభ్యర్థన కోసం మాత్రమే ప్రజలకు దగ్గరవుతున్నారు. ఓటు హక్కు వినియోగించుకున్న తర్వాత ఓటు ద్వారా గెలిచిన రాజకీయ నాయకుడైన ప్రజలకు తమ పరిపాలన వ్యవస్థ ద్వారా ప్రజలకు ఏ మేరకు పాలన అందిస్తున్నాడు అన్న దాన్ని బట్టి చూస్తే ప్రజలకు ఎక్కడ రాజకీయ నాయకుడు అందుబాటులో ఉండటం లేదన్న సంగతి సమాజ అధ్యయనం ద్వారా తెలుస్తుంది! అంటే ఇంత మంది ప్రజాప్రతినిధులు ఈ సమాజానికి, ప్రజాసంక్షేమం కోసం ఏ మేరకు పాటు పడుతున్నారన్న విషయాన్ని మనమందరం గమనించాలి!

ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రజల ముంగిట లోనికి తీసుకుపోవాలని ఉద్దేశంతో పార్లమెంట్ స్థాయి నుండి గ్రామపంచాయతీ వరకు ప్రజాస్వామ్యబద్ధంగా పాలన ఉండాలనే ఉద్దేశంతో మూడంచెల విధానాన్ని ప్రవేశ పెట్టుకున్నాం, ఇక్కడి వరకు బాగానే ఉంది. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, పాలన వ్యవస్థ ఒకదానికి ఒకటి అనుబంధంగానే ఉంటున్నాయి ప్రజాస్వామ్య వ్యవస్థ అనగానేమి టక్కున గుర్తుకు వచ్చేది మానవ హక్కులు! మానవ హక్కుల గురించి మాట్లాడుకునే ముందు మనమందరం ఏర్పరుచుకున్న నిజాయితీ ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థ! ఇది అందరికీ కావలసిన పాలనా విధానం, దీనిని గౌరవించాల్సిన అవసరం మనందరిపైనా ఉంది. అయితే పాలన ప్రజల ముంగిట్లోకి తీసుకుపోవడానికి రాష్ట్రంలో జిల్లాలను మండలాలను గ్రామాలను యూనిట్‌గా చేసుకుని పాలన కొనసాగించే విధంగా వ్యవస్థను ఏర్పరిచారు.

ఈ వ్యవస్థలో లక్షలాది మంది ప్రజాప్రతినిధులుగా చెప్పుకొని చలామణి అవుతున్న రాజకీయ నాయకులు తమ నియోజక వర్గ పాలనా వ్యవస్థలో ఏ మేరకు సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నారు. ప్రజలకు ఏ మేరకు అందుబాటులో ఉంటున్నారు. తాము ఓటు వేసిన వ్యక్తికి ఎంతవరకు జవాబుదారితనంగా వ్యవహరిస్తున్నారు అన్న సంగతిని మనం ఒక్కసారి ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఇది ప్రజాస్వామ్య వ్యవస్థ కాబట్టి! ఓటు వేసిన ప్రతి వ్యక్తికి గెలుపొందిన రాజకీయ వ్యవస్థ నాయకుడు జవాబుదారితనం గానే వ్యవహరించాలి. కానీ ఇది మనం ప్రస్తుత సమాజంలో ప్రజలకు అందుబాటులో లేకుండా పోతుందన్న విషయాన్ని ప్రశ్న వేసుకొని జవాబును వెతుక్కోవాల్సిన పరిస్థితులు నేడు ఉన్నాయని చెప్పవచ్చు. అయితే ఎక్కువమంది ప్రజా ప్రతినిధులు ఉన్నంత మాత్రాన పరిపాలన వ్యవస్థ ప్రజలకు జవాబుదారితనంగా ఉంటూ మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉంటుందన్న సంగతి నేతిబీరకాయలో నెయ్యి ఉండదన్న సంగతి ఎంత నిజమో! ఇది కూడా అంతే! కాబట్టి ప్రజాస్వామ్య వ్యవస్థ పాలన ముఖ్యంగా ఒక రాష్ట్రంలో నా వ్యక్తిగత అభిప్రాయం ఇక్కడ చెప్పదలుచుకున్నాను! ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థ పాలన విధానంలో అమలుపరచడానికి ఒక రాష్ట్రాన్ని ఏలడానికి ఐదారుగురు మంత్రులు ఉంటే సరిపోతుందా అన్న విషయాన్ని మనం గమనించవచ్చు. ఇందులో ఒక ముఖ్యమంత్రి, ఒక వ్యవసాయ శాఖ మంత్రి, ఒక ఆర్థిక మంత్రి, ఒక విద్య మంత్రి, ఒక ఆరోగ్య శాఖ మంత్రి, ఒక పోలీసు మంత్రి పైన పేర్కొన్న మంత్రిమండలి ఉంటే సరిపోతుంది అన్న భావన కలుగుతుంది, ఈ ఐదుగురు మంత్రివర్గం తోనే ఈ రాష్ట్రాన్ని ఒక సమర్థవంతమైన పరిపాలన వ్యవస్థగా కొనసాగించవచ్చు. ఈ తరహ పరిపాలన వ్యవస్థ మనకు తెలియంది కాదు. ఇంత తక్కువ మంది రాజకీయ వ్యవస్థ తో కూడిన పాలన వ్యవస్థ అమలు చేస్తే. కోట్లాది రూపాయల ప్రజాధనం మిగులుతుందని చెప్పవచ్చు. దీన్నంతటినీ రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజాసంక్షేమం కోసం ఖర్చు పెట్టుకోవడానికి అవకాశం ఉంటుంది, సమర్థవంతమైన ప్రభుత్వ అధికారులతో ఈ తరహా పరిపాలనను కొనసాగించవచ్చు. ఎక్కడ ఎలాంటి లోటు ఉండకుండా ప్రజలకు నిత్యం జవాబుదారితనంగా ఉంటూ ఎక్కడ లోటు ఉంటే అక్కడ ప్రజలకు మంచి పరిపాలన వ్యవస్థ అందించడానికి ఒక సమర్థవంతమైన ప్రభుత్వ పాలనా యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకుని పాలన కొనసాగిస్తే ఈ దేశంలో లక్షల కోట్ల ప్రజాధనం వృధా కాకుండా ఉంటుందన్న విషయాన్ని చెప్పదలుచుకున్నాను.

కింది స్థాయి నాయకులుగా చెప్పబడుతున్న ఎంపీటీసీ జెడ్పీటీసీలు వీరందరి ప్రజా పాలన ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతుంది. వీరి ద్వారా ప్రజలకు మేలు కలుగుతుందని నమ్మకం ప్రజల్లో సన్నగిల్లింది అని చెప్పకనే చెప్పవచ్చు! ఇది కేవలం ఒక రాష్ట్ర పరిపాలన పరిమితం కాకుండా జాతీయస్థాయిలో పాలనా వ్యవస్థను కూడా ఇంత పెద్ద మొత్తంలో ఏర్పాటు చేసుకొని పాలించాల్సిన అవసరం ఉందా అన్న ప్రశ్న తలెత్తక తప్పదు! ఎందుకంటే ప్రస్తుతం మనం చెప్పబడుతున్న ఎంపీలు, రాజ్యసభ సభ్యులు మీరందరూ కూడా ప్రజలకు ఏ మేరకు అందుబాటులో ఉంటున్నారు ప్రజలకు ఏ మేరకు ప్రజారంజకమైన పరిపాలన అందిస్తున్నారు, అభివృద్ధికరమైన సంక్షేమ కార్యక్రమాలను వీరు ఏ మేరకు అమలు పరుస్తున్నారు అన్న విషయాన్ని మనం గుర్తుంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే ప్రజాస్వామ్య దేశంగా ప్రపంచంలోనే గొప్ప పేరు ప్రతిష్టలు గల దేశం కాబట్టి దీనిని మనం ఎంతవరకు ప్రజలకు సమాజానికి మేలు చేసే విధంగా పాలన అందిస్తున్న విషయాన్ని ప్రజాస్వామ్య వ్యక్తులుగా ప్రశ్నించాల్సిన అవసరం ఎంతైనా ఉంది!

(రచయిత జర్నలిజం విభాగం అధిపతి, కాకతీయ విశ్వవిద్యాలయం) వీ

రాజకీయార్థ శాస్త్రవేత్తగా ఫ్రెడరిక్ ఎంగెల్స్

మార్క్సిస్టు మహోపాధ్యాయుడు ఫ్రెడరిక్ ఎంగెల్స్ ద్వి శతజయంతి సందర్భంగా రాజకీయార్థ శాస్త్రంలో ఆయన కృషిని వివరిస్తున్నారు **ఎన్. వేణుగోపాల్**

ఇది కార్ల్ మార్క్స్ సహచరుడు ఫ్రెడరిక్ (జర్మన్ ఉచ్చారణలో ఫ్రీడ్రిచ్ అంటారు, కాని ఇంగ్లిష్ ఉచ్చారణ ప్రకారం ఫ్రెడరిక్ అనే మాటే మనకు అలవాటయింది) ఎంగెల్స్ ద్విశతజయంతి సంవత్సరం. మార్క్స్ కన్న రెండున్నర సంవత్సరాలు చిన్నవాడైన ఎంగెల్స్ 1844లో మార్క్స్ ను మొదటిసారి కలుసుకున్నాడు. అప్పటి నుంచి 1883లో మార్క్స్ చనిపోయే వరకూ నాలుగు దశాబ్దాల పాటు వారిద్దరి మైత్రి అపూర్వంగా కొనసాగింది. ఆ తర్వాత పన్నెండు సంవత్సరాలు జీవించిన ఎంగెల్స్ ఆ కాలాన్నంతా మార్క్స్ రచనలనూ, చిత్తుప్రతులనూ, అసంపూర్ణ రచనలనూ పరిష్కరించడానికీ, సంపాదకత్వం వహించడానికీ, ప్రచురించడానికీ, తామిద్దరూ కలిసి ప్రారంభించిన శ్రామికవర్గ అంతర్జాతీయ కార్యాచరణను కొనసాగించడానికీ ఉపయోగించాడు.

బహుశా ఆ ఇద్దరి అసాధారణ స్నేహం, సహ కార్యాచరణ వల్ల, ఎంగెల్స్‌ను ఎప్పుడూ మార్క్స్ నీడలో, మార్క్స్ తో పాటుగానే తప్ప విడిగా పరిశీలించడం పెద్దగా జరగలేదు. వారి జీవితకాలంలోనే ఒక రచయిత ఇద్దరి పేర్లూ రాసి క్రియాపదం ఏకవచనంలో రాశాడని, అంటే తమ ఇద్దరి వ్యక్తిత్వాలు అంతగా ఏకమైపోయాయని మార్క్స్, ఎంగెల్స్ లు కూడ వ్యాఖ్యానించారు. అలాగే మరొక కొసన మార్క్స్ ఆలోచనలను ఎంగెల్స్ వక్రీకరించాడని, మార్క్స్ లో తొలిరోజుల్లో ఉండిన "మానవతా వాదాన్ని" తొలగించడానికి ఎంగెల్సే కారకుడని, మార్క్సిజాన్ని ఒక పిడివాద సిద్ధాంతంగా, "నియంతృత్వ" సిద్ధాంతంగా మార్చాడని కూడ అభిప్రాయాలున్నాయి.

అలా ఎంగెల్స్ గురించి ఇప్పటికి ఉన్న అభిప్రాయాలను నాలుగు ప్రధాన ధోరణులుగా గుర్తించవచ్చు. ఒకటి, మార్క్స్, ఎంగెల్స్ ల మధ్య ఎటువంటి తేడా లేదని, దాదాపు ఇద్దరూ ఒకటేనని భావించే 'అభేద ధోరణి'. చాల మంది మార్క్సిస్టులలో ఈ ధోరణి కనబడుతుంది. రెండు, మార్క్స్ ఆలోచనలకూ ఎంగెల్స్ ఆలోచనలకూ చాల తేడా ఉందని, వాస్తవంగా మార్క్స్‌ను ఎంగెల్స్ వక్రీకరించాడని, మార్క్స్ ఆలోచనలకు ఎంగెల్స్ గ్రహణం పట్టించాడని భావించే 'పరస్పర వ్యతిరేక ధోరణి'. తెలుగులో నవ్య మానవవాది ఎన్ ఇన్నయ్య నాలుగు దశాబ్దాల వెనుకనే ఈ ధోరణిలో 'మార్క్స్‌కు ఎంగెల్స్ పట్టించిన గ్రహణం' అని ఒక పుస్తకం రాశారు. మూడు, ఎంగెల్స్ స్వతంత్ర కృషిని, మార్క్స్ ఎంగెల్స్‌ల సమష్టి కృషిని గౌరవిస్తూనే మార్క్స్ ఆలోచనా వైశాల్యాన్నీ లోతునూ ఎంగెల్స్ అర్థం చేసుకోలేకపోయాడని భావించే ఎంగెల్స్ 'పరిమితుల ధోరణి'. ఈ వైఖరి కొందరు యూరపియన్, అమెరికన్ మార్క్సిస్టు పరిశోధకులలో కనబడుతుంది. నాలుగు, మార్క్స్ ఎంగెల్స్‌ల అపారమైన కృషిని విమర్శనాత్మకంగా గౌరవిస్తూ, వారి స్థల కాల పరిమితులను గుర్తిస్తూ, మార్క్స్ కూ, మార్క్సిజానికీ, అంతర్జాతీయ శ్రామికవర్గ ఉద్యమానికీ ఎంగెల్స్ చేసిన దోహదాన్ని గుర్తించే 'సమగ్ర ధోరణి'. కొందరు యూరపియన్, అమెరికన్ మార్క్సిస్టు పరిశోధకులు ఈ వైఖరి తీసుకున్నారు.

ఈ నాలుగో వైఖరి నుంచి ఎంగెల్స్ ను పరిశీలించడం, ఆయన ద్విశతజయంతి సందర్భంగా మార్క్స్ తో కలిసీ, విడిగానూ ఆయన రాజకీయార్థిక శాస్త్రంలో చేసిన కృషిని అంచనా కట్టడం ఈ వ్యాస లక్ష్యం.

ఎంగెల్స్ సాధారణ పరిచయం

స్వయంగా ఎంగెల్స్ తత్వవేత్త, చరిత్రకారుడు, రాజకీయార్థ శాస్త్రవేత్త, రాజకీయ వ్యూహ నిపుణుడు, నిర్మాణదక్షుడు, సామాజిక విప్లవ కార్యకర్త. కవిత్వ రచన నుంచి బాంబుల తయారీ, ఆయుధ శాస్త్రం దాకా ఎన్నెన్నో శాస్త్రాలలో విస్తృతమైన పరిజ్ఞానం ఉన్నవాడు. మాతృభాష జర్మన్ కాక కనీసం ఎనిమిది యూరపియన్ భాషలలో ప్రావీణ్యం ఉన్నవాడు. ఇరవై రెండో ఏటి (1842) నుంచి మరణించేదాకా (1895) యాభై మూడు సంవత్సరాలు ఎడతెగని రచన, సంపాదకత్వం, కార్యాచరణ సాగిస్తూనే ఉన్నాడు.

జర్మనీలో బార్మెన్ నగరంలో (ప్రస్తుతం అది ఉప్పర్తాల్ అనే మరొక పెద్ద నగరంలో భాగంగా ఉంది) 1820 నవంబర్ 30న ఫ్రెడరిక్ ఎంగెల్స్ ఒక ధనిక పారిశ్రామిక వేత్తల కుటుంబంలో జన్మించాడు. ఆయన తండ్రి ఫ్రెడరిక్ ఎంగెల్స్ సీనియర్ కు బార్మెన్ లోనూ, ఇంగ్లండ్ లోని మాంచెస్టర్ ప్రాంతంలో సాల్ఫోర్డ్ లోనూ జౌళి మిల్లులు ఉండేవి. కొడుకు తనతో పాటు తన వ్యాపారంలోకి రావాలని తండ్రి కోరుకున్నాడు. పదిహేడో ఏటనే చదువు మాన్పించి తన వ్యాపారంలో సహాయకుడిగా పెట్టుకున్నాడు. ఒక సంవత్సరం తన దగ్గర వ్యాపారం గురించి నేర్చుకున్న తర్వాత వ్యాపార పని మీదనే బ్రెమెన్ నగరానికి పంపించాడు. రెండు దేశాలలో విస్తరించిన తన వస్త్ర పరిశ్రమ సామ్రాజ్యాన్ని కొడుకు నిర్వహించాలని తండ్రి ఆశించాడు. కాని పుట్టిన బార్మెన్ నగరం జర్మనీలో పారిశ్రామిక విప్లవానికీ, సోషలిస్టు ఆలోచనలకూ ప్రధాన కేంద్రాల్లో ఒకటి కావడం వల్ల కొంత, యవ్వనంలో బ్రెమెన్ నగరం చేరి అక్కడ మేధో వర్గాలలో ప్రధాన ప్రభావంగా ఉండిన హెగెల్ ను చదవడం వల్ల కొంత ఎంగెల్స్ తండ్రి కోరికకు భిన్నంగా విప్లవకారుడిగా రూపు దిద్దుకోవడం మొదలైంది.

ఎంగెల్స్ పద్దెనిమిదో ఏటి నుంచే కవిత్వం, పారిశ్రామికీకరణ దుష్ఫలితాల గురించి వార్తాపత్రికలకు వ్యాసాలు రాయడం

ప్రారంభించాడు. ఇరవై ఒకటో ఏట ప్రతి యువకుడూ సైన్యంలో పని చేయాలనే నిబంధన ప్రకారం ప్రష్యన్ సైన్యంలో చేరి పదాతిదళంలో సైనికుడిగా ఏడాది ఉన్నాడు. ఆ సమయంలో బెర్లిన్ విశ్వవిద్యాలయంలో అధ్యాపకుల ఉపన్యాసాలు వింటూ, క్రమంగా యువ హెగెలియన్ల బృందంలో చేరాడు. నాస్తికుడిగా మారి తల్లిదండ్రుల ఆగ్రహానికి గురయ్యాడు. సైనిక బాధ్యతలు అయిపోయాక, కొడుకు విప్లవ భావాలు తగ్గించడానికి ఉపయోగపడుతుందనే ఆశతో తండ్రి ఎంగెల్స్ ను మాంచెస్టర్ మిల్లు చూసుకోవడానికి పంపించాడు. అప్పటికి మార్క్స్ కొలోన్ నగరంలో రీనిష్ జీటుంగ్ పత్రిక సంపాదకుడిగా ఉన్నాడు. ఆ పత్రికలో ఎంగెల్స్ మారుపేరుతో రాసిన వ్యాసాలు అచ్చయి ఉన్నాయి. ఎంగెల్స్ మాంచెస్టర్ వెళ్లే మార్గంలో 1842 నవంబర్‌లో కొలోన్ వెళ్లి మార్క్స్ ను మొదటిసారి కలిశాడు. ఈ మొదటి కలయికలో ఇద్దరూ ఒకరికొకరు అంత సన్నిహితం కాలేదు. అప్పటికి నాలుగైదు నెలల కిందనే తాను రాసిన ముప్పై పేజీలకు మించిన దీర్ఘ కవిత 'ది ఇన్సొలెంట్లీ త్రెటెన్డ్ యెట్ మిరక్యులస్లీ రెస్క్యూడ్ బైబిల్' లో ఎంగెల్స్, అప్పటికి ప్రసిద్ధులైన లుడ్విగ్ ఫ్యూర్ బా, మాక్స్ స్టిర్నర్, ఆర్నాల్డ్ రూజ్, సి ఎఫ్ కొప్పెన్ లతో పాటు కార్ల్ మార్క్స్ ప్రస్తావన కూడ చేశాడు.

మాంచెస్టర్ నుంచే ఎంగెల్స్ 1843 నవంబర్ – డిసెంబర్‌లలో 'ఔట్ లైన్స్ ఆఫ్ ఎ క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ' అనే పెద్ద వ్యాసం రాసి అప్పటికి పారిస్ చేరి, డాయిష్ ఫ్రాన్జోసిష్ జార్బుషర్ అని మార్క్స్ నడుపుతున్న పత్రికకు పంపాడు. మాంచెస్టర్ లో ఉన్న కాలాన్ని ఎంగెల్స్ కార్మికుల జీవితాలను సన్నిహితంగా తెలుసుకోవడానికే వెచ్చించాడు. అక్కడ స్నేహితురాలై, ఆమె మరణించేదాకా 20 సంవత్సరాల పాటు సహచరిగా ఉండిన శ్రామిక మహిళ మేరీ బర్న్స్ సహకారంలో శ్రామికవాడల, మురికివాడల వాస్తవ స్థితిగతులను అధ్యయం చేసి, 'ది కండిషన్ ఆఫ్ ది వర్కింగ్ క్లాస్ ఇన్ ఇంగ్లండ్' పుస్తకం రాశాడు.

మాంచెస్టర్ నుంచి జర్మనీకి తిరిగివెళ్తూ మార్గమధ్యంలో మళ్లీ మార్క్స్ ను కలవడానికి పారిస్ కు వెళ్లాడు. అప్పటికే ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా ఇద్దరి మధ్య కుదిరిన స్నేహం 1844 ఆగస్ట్ 28న ఈ కలయికతో మరింత బలపడింది. పది రోజుల పాటు ఇద్దరూ కలిసి గడిపి, తమ ఆలోచనల మధ్య ఏకీభావం ఉందని గుర్తించారు. కలిసి రచనలు చేయాలనుకున్నారు. యూరప్ లో అనేక దేశాలలో 1848లో జరిగిన విప్లవాల పరంపరను మార్క్స్ ఎంగెల్స్ ఇద్దరూ సమర్థించారు. ఎంగెల్స్ అయితే 1849లో హంగరీలో, దక్షిణ జర్మనీలో జరిగిన సాయుధపోరాటాల్లో స్వయంగా పాల్గొన్నాడు. దక్షిణ జర్మనీలో ఎల్బర్ ఫెల్డ్ పట్టణానికి మందుగుండు సరఫరా చేశాడు. ఆ విప్లవం ఓడిపోయి, ప్రష్యన్ ప్రభుత్వం అరెస్టు వారంట్ జారీ చేసి, నిఘా పెంచిన తర్వాత అనేక ఇబ్బందులు పడి, దేశదేశాలు తిరిగి 1849లో ఇంగ్లండ్ లోని మాంచెస్టర్ చేరాడు. అప్పటికే ప్రష్యా నుంచి దేశ బహిష్కారానికి గురైన మార్క్స్ కూడ లండన్ చేరుకున్నాడు. అప్పటి నుంచి 1870లో తాను కూడ లండన్ చేరి మార్క్స్ తో సహవాసం ప్రారంభించేవరకూ దాదాపు ప్రతిరోజూ ఇద్దరి మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచాయి. ఇక 1870 నుంచి మార్క్స్ మరణించిన 1883 వరకూ ప్రతి రచనా, ప్రతి పనీ ఇద్దరూ కలిసే చేశారు. మార్క్స్ మరణించాక ఎంగెల్స్ జీవించిన పన్నెండు సంవత్సరాలూ తన సర్వశక్తులూ మార్క్స్ రచనలను పునర్ముద్రించడం, అనువాదాలు చేయించడం, సరిచూడడం, అసంపూర్ణ రచనలను పరిష్కరించడం, మరెవరూ అర్థం చేసుకోలేని మార్క్స్ చేతిరాతను అర్థం చేసుకుని అచ్చు వేయించడం, అన్నిటికన్న ముఖ్యంగా మార్క్స్ చేతి రాతలో, అసంపూర్ణంగా వదిలిపోయిన కాపిటల్ సంపుటాలను అచ్చుకు సిద్ధం చేయడం తన పనులుగా పెట్టుకున్నాడు. 1895 ఆగస్ట్ 5న మరణించాడు.

మార్క్స్ రచనలను ప్రచారం చేయడం కోసం తన రచనను తగ్గించుకున్నప్పటికీ, ఎంగెల్స్ స్వతంత్ర రచనలు కూడ చాలనే ఉన్నాయి. ఎన్నో కవితలు, వేరు వేరు అంశాల మీద వ్యాసాలతో పాటు, మార్క్స్ తో కలిసి రాసిన ది హోలీ ఫామిలీ (1844), ది జర్మన్ ఐడియాలజీ (రచన 1846, మొదటి ముద్రణ 1932), ది మానిఫెస్టో ఆఫ్ ది కమ్యూనిస్ట్ పార్టీ (1848), స్వతంత్రంగా రాసిన ది కండిషన్ ఆఫ్ వర్కింగ్ క్లాస్ ఇన్ ఇంగ్లండ్ (1845), ప్రిన్సిపుల్స్ ఆఫ్ కమ్యూనిజం (1848), ది పెజంట్ వార్ ఇన్ జర్మనీ (1850), ఆంటీ డూరింగ్ (1878), సోషలిజం – యుటోపియన్ అండ్ సైంటిఫిక్ (1880), డయలెక్టిక్స్ ఆఫ్ నేచర్ (1883), ఆరిజిన్ ఆఫ్ ఫామిలీ, ప్రైవేట్ ప్రాపర్టీ అండ్ స్టేట్ (1884) ఎంగెల్స్ ఆలోచనాధారను చూపుతాయి.

ఎంగెల్స్ రాజకీయార్థశాస్త్ర రచనలు

ఎంగెల్స్ ఎన్నో రాజకీయార్థశాస్త్ర రచనలు చేసినప్పటికీ, ఆశ్చర్యకరమైన విషయమేమంటే రాజకీయార్థశాస్త్రవేత్తగా ఎంగెల్స్ అనే అంశం మీద ఇప్పటికి చాల తక్కువ కృషి జరిగింది. అసలు ఎంగెల్స్ రాసిన రాజకీయార్థ శాస్త్ర రచనలన్నిటినీ ఒక్క చోట సంకలనం చేసే పని కూడ ఇంతవరకూ జరిగినట్టు లేదు. సోవియట్ యూనియన్ లో ప్రోగ్రెస్ పబ్లిషర్స్ ఉండిన రోజులలో మార్క్స్ ఎంగెల్స్ లు వేరు వేరు రంగాలలో చేసిన రచనల సంకలనాలు చేసే పని జరిగింది గాని అప్పుడు కూడ ఎంగెల్స్ రాజకీయార్థశాస్త్ర రచనలన్నిటినీ ఒక సంపుటంగా తేవాలని ఆలోచించినట్టు లేరు. మార్క్స్ కాపిటల్ మీద ఎంగెల్స్ చేసిన సమీక్షల, వ్యాసాలతో కూడిన 120 పేజీల చిన్న పుస్తకం ఒకటి ప్రోగ్రెస్ ప్రచురణగా వెలువడింది గాని అది కూడ సమగ్రమైనది కాదు. కేవలం మార్క్స్ కాపిటల్ మీదనే ఎంగెల్స్ రచనలు, ముందుమాటలు, అనుబంధాలు, వివరణలు కనీసం మరొక వంద పేజీలు ఉంటాయి.

అమెరికన్ యూరపియన్ మార్క్సిస్టు మేధావులలో, పరిశోధకులలో కొందరు ఎంగెల్స్ – రాజకీయార్థ శాస్త్రం, ఎంగెల్స్ – మార్క్స్ కాపిటల్ వంటి అంశాల మీద వ్యాసాలు రాశారు గాని, అక్కడ కూడ వాళ్లు ఎంగెల్స్ ను విమర్శించడానికో, ఎంగెల్స్ మీద వచ్చిన విమర్శలకు జవాబులు చెప్పడానికో, ఎంగెల్స్ ను సమర్థించడానికో పరిమితమయ్యారు గాని ఎంగెల్స్ రాజకీయార్థ శాస్త్ర రచనల మీద విడిగా, వివరంగా, విశ్లేషణాత్మకంగా రాయలేదు.

నిజానికి మార్క్స్ కన్న ముందు నుంచే ఎంగెల్స్ రాజకీయార్థ శాస్త్ర అధ్యయనంలో, రచనలో ఉన్నాడు. మార్క్స్ రాసిన తొలి రాజకీయార్థశాస్త్ర రచన 1844 కాగా, దానికన్న ఏడాదిన్నర ముందే 1842లో ఎంగెల్స్ రాజకీయార్థశాస్త్ర రచన, అది కూడ మార్క్స్ సంపాదకుడుగా ఉండిన పత్రికలోనే అచ్చయింది. అప్పటి నుంచి కాపిటల్ మూడో సంపుటాన్ని ప్రచురణకు సిద్ధం చేస్తూ 1895లో చనిపోయే రోజు దాకా ఆయనకు

రాజకీయార్థిక శాస్త్ర రచనలతో గాఢమైన సంబంధం ఉంది. రాజకీయార్థ శాస్త్రంలో ఎంగెల్స్ చేసిన మొత్తం కృషిని మూడు దశలుగా చూడవచ్చు. వీటిలో మొదటి, చివరి దశల్లో ఎంగెల్స్ సొంతంగా రాసిన రాజకీయార్థశాస్త్ర రచనలు ఉండగా, రెండో దశలో మార్క్స్ రాజకీయార్థశాస్త్ర రచనలకు ఎంగెల్స్ అందించిన సహకారం కనబడుతుంది. మార్క్స్ మరణించిన 1883 నుంచి 1895లో తను మరణించే దాకా మళ్లీ ఎంగెల్స్ రాజకీయార్థిక రచనలు, సంపాదకత్వం సాగాయి. అంటే 1842 నుంచి 1859 దాకా మొదటి దశ, 1859 నుంచి 1883 దాకా రెండో దశ, 1883 నుంచి 1895 దాకా మూడో దశ అని చెప్పవచ్చు. ఈ మొత్తం కాలంలో పూర్తిగా రాజకీయార్థ శాస్త్ర అంశాలపై కనీసం ఇరవై వ్యాసాలు, కాపిటల్ కు సంబంధించి పది రచనలు, స్వతంత్రంగా రాసిన ఏడు పుస్తకాలలో ప్రస్తావించిన అంశాలు అన్నీ కలిపి మొత్తంగా ఎంగెల్స్ రాజకీయార్థశాస్త్ర రచనలు ఐదు వందల పేజీల పైనే ఉంటాయి.

కోలోన్ నుంచి ప్రారంభించిన రైనిష్ జీటుంగ్ మాసపత్రికకు 1842 అక్టోబర్ లో మార్క్స్ సంపాదకుడిగా బాధ్యతలు చేపట్టాడు. ఆ పత్రికలో మార్క్స్ సంపాదకత్వంలో వెలువడిన మూడో సంచికలో, 1842 డిసెంబర్ సంచికలో ఎంగెల్స్ ఐదు వ్యాసాలు అచ్చయ్యాయి. ఆ ఐదు వ్యాసాలలో నాలుగు నేరుగా రాజకీయార్థ శాస్త్ర వ్యాసాలు కాగా, ఐదవది రాజకీయార్థిక పరిణామాల వల్ల తలెత్తిన రాజకీయ ధోరణులకు సంబంధించినది. ఆ తర్వాతి సంచిక (1843 జనవరి) నాటికి ఈ పత్రిక ప్రష్యన్ ప్రభుత్వ ఆంక్షలకు గురైంది. అప్పటికే ఉండిన రెండు సెన్సార్ నిబంధనలకు తోడుగా మూడో సెన్సార్ నిబంధనలు విధించారు. ఆ ఆంక్షలను నిరసిస్తూ మార్క్స్ మార్చ్ లో సంపాదకత్వానికి రాజీనామా చేశాడు. ఏప్రిల్ లో ఆ పత్రికే ఆగిపోయింది.

తర్వాత మార్క్స్ బహిష్కరణకు గురై పారిస్ వెళ్లి అక్కడ డాయిష్ – ఫ్రాంజోసిష్ జార్బుషర్ అనే మాసపత్రిక ప్రారంభించాడు. దాని మొదటి సంచిక (1844 ఫిబ్రవరి) లోనే ఎంగెల్స్ రాసిన 'ఔట్ లైన్స్ ఆఫ్ ఎ క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ' అనే వ్యాసం అచ్చయింది. ఆ వ్యాసపు రాతప్రతిని సంపాదకుడిగా మార్క్స్ 1843 నవంబర్ – డిసెంబర్ లోనే చదివాడు. అప్పుడే మార్క్స్ తన కోసం ఈ వ్యాస సారాంశం కూడ రాసి పెట్టుకున్నాడు. ఈ వ్యాస శీర్షికే మార్క్స్ 1859లో రాసిన పుస్తకానికి శీర్షిక (యాన్ ఇంట్రడక్షన్ టు ది క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ) కావడం, తన ఉద్గ్రంథం కాపిటల్ కు ఉపశీర్షిక (ఎ క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ) కావడం యాదృచ్ఛికం కాదు. ఈ వ్యాసం గురించి మార్క్స్ తన రచనలలో ఎన్నోసార్లు ప్రస్తావించాడు. "ఆర్థిక ప్రత్యయాల మీద విమర్శలో అద్భుతమైన వ్యాసం" అని 1859లో రాశాడు. కాపిటల్ మొదటి సంపుటంలో కనీసం ఐదు చోట్ల దాన్ని ఉటంకించాడు. అయితే స్వయంగా ఎంగెల్స్ తన ఈ వ్యాసం గురించి పెద్దగా పట్టించుకోలేదు. మిత్రుడు, ఉద్యమ సహచరుడు కార్ల్ లీబ్నెక్ట్ కు 1871లో రాసిన ఉత్తరంలో "అది ఒక కాలం చెల్లిన వ్యాసం. హెగెలియన్ పదాడంబరంలో రాసిన వ్యాసం. ఇప్పుడు దానికి చారిత్రక ప్రాధాన్యత తప్ప మరేమీ లేదు" అని రాశాడు.

కాని మార్క్స్ రచనల మీద ఈ వ్యాసం ప్రభావం గురించి ఎందరో పరిశోధకులు విశ్లేషించారు. ఈ వ్యాసంలో ఎంగెల్స్ ప్రతిపాదించిన మూడు మౌలిక భావనలనే మార్క్స్ ఆ తర్వాతి కాలంలో అభివృద్ధి చేశాడని పరిశోధకులు సోదాహరణంగా చూపారు. ఆ మూడు భావనలు: 1. మతానికీ ఆర్థికవ్యవస్థకూ మధ్య అవిభాజ్య సంబంధం ఉంది. 2. సరుకు ఉపయోగ విలువకూ మారకపు విలువకూ మధ్య, విలువకూ ధరకూ మధ్య వైరుధ్యం ఉంది. 3. శ్రమ, కౌలు అంశాల మీద మాల్తూస్ భావనలు అర్థరహితమైనవి.

నూట ఎనభై సంవత్సరాల తర్వాత ఇవాళ్టికి కూడ ఆ వ్యాసం ఎన్నో మిరుమిట్లు గొలిపే విశ్లేషణలను ప్రకటిస్తుంది. కాకపోతే, హెగెల్ ప్రభావంలోని భాష, అభివ్యక్తి, గందరగోళం, కొన్ని చోట్ల అస్పష్టమైన వాదనలు కనబడతాయి గాని ఇరవై రెండు సంవత్సరాల యువకుడు ఆడమ్ స్మిత్, డేవిడ్ రికార్డోల అభిప్రాయాలను ఢీకొంటూ, పెట్టుబడిదారీ విధానాన్నీ, దాని సమర్థనగా వచ్చిన శాస్త్రాన్నీ నిశితమైన విమర్శకు గురిచేయడం అబ్బురంగా అనిపిస్తుంది.

మార్క్స్‌ను కలవడానికి 1844 ఆగస్ట్‌లో ఎంగెల్స్ పారిస్‌కు వచ్చాడు. ఇద్దరూ కలిసి పది రోజులు గడిపారు. తమ ఆలోచనల మధ్య ఐక్యత ఉందని, తాము కలిసి పనిచేయవచ్చునని తెలుసుకున్నారు. అప్పుడే ఇద్దరూ కలిసి ది హోలీ ఫామిలీ అనే పుస్తకం రాయాలని తలపెట్టారు. ఆ తర్వాత మూడు నెలల్లో మార్క్స్ సంపాదకత్వంలోని డాయిష్ ఫ్రాంజోసిష్ జార్బుషర్ పత్రికలో ఎంగెల్స్ 'ది పొజిషన్ ఆఫ్ ఇంగ్లండ్' అని మూడు వ్యాసాలు రాశాడు. ఆ మూడు వ్యాసాలు కూడ రాజకీయార్థిక శాస్త్ర రచనలే.

ఆ తర్వాత 1845 ఫిబ్రవరిలో ఎంగెల్స్ ఎల్బర్ ఫెల్డ్ పట్టణంలో వరుసగా ఉపన్యాసాలు ఇచ్చాడు. ఎల్బర్ ఫెల్డ్ ఉపన్యాసాలుగా సుప్రసిద్ధమైన ఆ రచనలు కూడ రాజకీయార్థశాస్త్ర విశ్లేషణలే. ఆ మార్చ్ లోనే ఎంగెల్స్ స్వతంత్రంగా రాసిన తొలి పుస్తకం ది కండిషన్ ఆఫ్ ది వర్కింగ్ క్లాస్ ఇన్ ఇంగ్లండ్ పూర్తయింది. ఆ ఏప్రిల్ లో మార్క్స్ ను కలుసుకోవడానికి ఎంగెల్స్ బ్రస్సెల్స్ కు వెళ్లాడు. అప్పుడే ఇద్దరూ కలిసి థీసిస్ ఆన్ ఫ్యూర్ బా రాశారు. చరిత్ర పట్ల భౌతికవాద దృక్పథం అనే కొత్త సైద్ధాంతిక దృష్టిని సంతరించుకుని, దాన్ని మొదటిసారి ఆ థీసిస్ లలోనే ప్రతిపాదించారు.

ఆ జూలై ఆగస్టులలో ఇద్దరూ కలిసి మాంచెస్టర్ వెళ్లారు. అక్కడి చేతమ్స్ లైబ్రరీలో ఆ కాలంలో ఎంగెల్స్ చదివిన పుస్తకాల జాబితా చూస్తే రాజకీయార్థ శాస్త్ర అధ్యయనంలో, విమర్శలో ఆయన సాగించిన కృషి అర్థమవుతుంది. అక్కడ ఆయన చదివిన పుస్తకాలలో జార్జి పోర్టర్ రాసిన ది ప్రోగ్రెస్ ఆఫ్ ది నేషన్స్, థామస్ టూకి రాసిన ఎ హిస్టరీ ఆఫ్ ప్రైసెస్, ఫ్రెడరిక్ ఎడెన్ రాసిన ఎ హిస్టరీ ఆఫ్ లేబరింగ్ క్లాసెస్ ఇన్ ఇంగ్లండ్, విలియమ్ గోడ్విన్ రాసిన హిస్టరీ ఆఫ్ కామన్ వెల్త్, జేమ్స్ గిల్బర్ట్ రాసిన హిస్టరీ అండ్ ప్రిన్సిపుల్స్ ఆఫ్ బ్యాంకింగ్ వంటి పుస్తకాలున్నాయి.

ఆ సెప్టెంబర్ నవంబర్‌లలో ఇద్దరూ కలిసి ది జర్మన్ ఐడియాలజీ పేరుతో అప్పటికి ఉన్న జర్మన్ రాజకీయార్థిక, సామాజిక, తత్వవేత్తల అభిప్రాయాల మీద విమర్శనాత్మక విశ్లేషణ ప్రారంభించారు. అందులో ముఖ్యంగా ట్రూ సోషలిస్ట్స్ అనే అధ్యాయం ఎంగెల్స్ రాశాడు. కాకపోతే ఈ రచన వారి జీవితకాలంలో అచ్చుకాలేదు. కొన్ని దశాబ్దాల తర్వాత ఈ రచన గురించి మాట్లాడుతూ, అది మమ్మల్ని మేం తెలుసుకోవడానికి చేసిన రచన అని వారే అన్నారు.

తర్వాతి సంవత్సరం జూన్‌లో లీగ్ ఆఫ్ ది జస్ట్ అనే అంతర్జాతీయ శ్రామిక సంస్థ మొదటి మహాసభకు ఆ సంస్థ కార్యక్రమంగా ఎంగెల్స్ రాసిన 'ఎ కన్ఫెషన్ ఆఫ్ ఫేత్' కూడ రాజకీయార్థశాస్త్ర అవగాహనను ఇస్తుంది. ఆ సంవత్సరమే ఎంగెల్స్ రాసిన 'ప్రొటెక్షనిజం ఆర్ ఫ్రీ ట్రేడ్ సిస్టం' అనే రాజకీయార్థ శాస్త్ర వ్యాసం డాయిష్ బ్రాంజోసిష్ జార్బుషర్ లో అచ్చయింది. అప్పుడే సెప్టెంబర్ లో జరిగిన అంతర్జాతీయ స్వేచ్ఛా వాణిజ్య సదస్సులో మార్క్స్ ప్రసంగించడానికి అనుమతించకపోగా, ఎంగెల్స్ రాసిన రెండు వ్యాసాలు డాయిష్ బ్రాంజోసిష్ జార్బుషర్ లో అచ్చయ్యాయి. ఆ అక్టోబర్ లో మరొక రెండు రాజకీర్థశాస్త్ర వ్యాసాలు ఆ పత్రికలోనే అచ్చయ్యాయి. కమ్యూనిస్టు ప్రణాళికకు సన్నాహకంగా ఎంగెల్స్ ప్రశ్న జవాబుల రూపంలో రాసిన ప్రిన్సిపుల్స్ ఆఫ్ కమ్యూనిజం లో కొన్ని ప్రశ్నలు నేరుగా రాజకీయార్థికశాస్త్ర ప్రశ్న జవాబులే.

ఆ తర్వాత కొద్ది సంవత్సరాలు విప్లవాలు, రాజకీయ ఘర్షణలు, తాత్విక వివాదాలు గడిచి, 18959లో మార్క్స్ రచన ఇంట్రడక్షన్ టు ది క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ వెలువడినప్పుడు ఎంగెల్స్ దాని సమీక్షగా రాసిన వ్యాసం రాజకీయార్థ శాస్త్ర చర్చలో కీలకమైనది. ఎంగెల్స్ తీసుకున్న కొన్ని వైఖరులు మార్క్స్ కన్న భిన్నమైనవనే అరోపణకూ, వాదనలకూ మూలాలు ఈ సమీక్షలోనే ఉన్నాయి.

తర్వాత దాదాపు ఇరవై ఐదు సంవత్సరాల పాటు మార్క్స్ కు కాపిటల్ రచనలో సహకరిస్తూ, మార్క్స్ కూ ఇతరులకూ రాసిన ఉత్తరాల్లో రాజకీయార్థ శాస్త్ర భావనలను చర్చిస్తూ వచ్చిన ఎంగెల్స్ ప్రధానమైన రాజకీయార్థశాస్త్ర రచన ఏదీ చేసినట్టు లేదు. కాపిటల్ మొదటి సంపుటం వెలువడగానే ఎంగెల్స్ దాని మీద తొమ్మిది సమీక్షలు రాశాడు. అలాగే కాపిటల్ మొదటి సంపుటం సారాంశం రాశాడు.

మార్క్స్ మరణించిన తర్వాత కాపిటల్ మొదటి సంపుటం మూడో జర్మన్ కూర్పు (1883 నవంబర్), నాలుగో జర్మన్ కూర్పు (1890 జూన్), రెండో సంపుటం (1885 మే), మూడో సంపుటం (అక్టోబర్ 1894) ముందుమాటలు, మూడో సంపుటంలో రెండు వివరణలు, ఒక చేర్పు కూడ రాశాడు.

ఇలా విస్తారంగా సాగిన ఎంగెల్స్ రాజకీయార్థ శాస్త్ర కృషి మీద లోతైన పరిశోధన ఇంకా జరగవలసే ఉంది.

ఎంగెల్స్ కృషి – సానుకూల, ప్రతికూల వ్యాఖ్యలు

ఎంగెల్స్ కృషి మీద మొత్తంగానూ, ప్రత్యేకించి మార్క్స్ రాజకీయార్థిక దృక్పథానికి ఆయన చేసిన దోహదాల మీద ప్రత్యేకంగానూ పాశ్చాత్య మార్క్సిస్టు ఆలోచనాధారలో చాల చర్చే జరిగింది. ఆ చర్చకంతా ఇది సమయం కాదు గాని, నాలుగైదు ప్రధాన వాదనలను పరిచయం చేసుకోవడం అవసరం.

మార్క్స్ ఎన్నడూ తన ఆలోచనలకు ఒక సిద్ధాంత రూపం ఇవ్వాలనో, చట్రంగా తయారు చేయాలనో అనుకోలేదని, ఎంగెల్స్ డయలెక్టికల్ మెటీరియలిజం, హిస్టారికల్ మెటీరియలిజం అనే మాటలు వాడడం ద్వారా వాటిని నిరంకుశ సిద్ధాంతాలుగా మార్చాడని ఒక విమర్శ. మార్క్స్ మీద వ్యాఖ్యానంగా, వివరణగా ఎంగెల్స్ చెప్పిన అభిప్రాయాలను సంపూర్ణంగా తిరస్కరించాలని ఒక వాదన. మార్క్స్ తన మీద ఉంచిన నమ్మకాన్ని ఉద్దేశపూర్వకంగానో, అనుద్దేశపూర్వకంగానో ఎంగెల్స్ వమ్ము చేశాడని ఒక విమర్శ. విశాలమైన అవకాశాలున్న మార్క్స్ ఆలోచనలను తార్కిక–చారిత్రక సంవిధానంగా ఎంగెల్స్ కుదించాడని మరొక విమర్శ. సరళ సరుకు ఉత్పత్తి అనే భావన విషయంలో ఎంగెల్స్ ఇచ్చిన వివరణ మార్క్స్ భావనకు విరుద్ధమైనదని ఒక విమర్శ.

ఇటువంటి విమర్శలు ఒక స్థాయి దాటిన తర్వాత అర్థరహితమైనవనీ, విమర్శ కోసం విమర్శ వంటివనీ, కేవల పండిత చర్చ అనీ అనిపిస్తుంది. ఎందువల్లనంటే ఇటువంటి విమర్శకుల్లో, 1996 రచనలో ఎంగెల్స్ పై తీవ్రమైన ఆరోపణలు చేసినవారే, 1997లో తన పాత వ్యాసం పొరపాటని, తన అవగాహన మార్చుకుంటున్నానని రాసినవారున్నారు. పొంతన లేని వాదనలు చేసినవారున్నారు.

రాజకీయార్థశాస్త్రవేత్తగా ఎంగెల్స్ – అంచనా

ఒక రాజకీయార్థశాస్త్ర విద్యార్థిగా అన్ని వాద వివాదాలనూ అధ్యయనం చేయవలసిందే. ఎక్కడ సరైన, సోపపత్తికమైన వాదన ఉన్నా సమర్థించవలసిందే గాని, మొత్తంగా ద్విశత జయంతి సందర్భంగా నిలబడి ఎంగెల్స్ ను మార్క్స్ సహచరుడిగా, రాజకీయార్థశాస్త్రవేత్తగా ఎలా అంచనా వేయాలి?

- సాంకేతిక అంశాలలో, భాషా శైలిలో, పదచర్చలలో, నొక్కు లో నిశితంగా పరిశీలిస్తే ఇద్దరి మధ్య ఇవాళ తేడాలు కనబడవచ్చు గాని, స్ఫూర్తిలో, అవగాహనలో, కొనసాగింపులో ఎంగెల్స్ నిస్సందేహంగా మొట్టమొదటి మార్క్సిస్టు.
- విమర్శలూ వివాదాలూ రంధ్రాన్వేషణలూ ఎన్ని ఉన్నప్పటికీ మార్క్స్ కు అవిభాజ్య సహచరుడు, మార్క్సిజాన్ని స్థిరపరిచినవాడు, కొనసాగించినవాడు ఎంగెల్స్.
- రాజకీయార్థిక శాస్త్రంలో మార్క్స్ కన్న ముందే ప్రవేశించినప్పటికీ, మార్క్స్ తో సమానమైన కృషి చేసినప్పటికీ, మార్క్స్ ప్రతిభను గుర్తించి, తనను సహాయక పాత్రలో చూసుకున్న వినయశీలి ఎంగెల్స్.
- ఎంగెల్స్ లేకపోయినా మార్క్స్ ఉండేవాడు. ఆ మాటకొస్తే కాలం కన్నబిడ్డ మార్క్స్. ఆయన లేకపోతే మరొకరు వచ్చేవారు. కాని ఎంగెల్స్ లేకపోతే మార్క్స్ ఇంత ప్రభావశీలంగా మారగలిగేవాడా తెలియదు.
- 1843 నుంచి 1895 దాకా 52 సంవత్సరాల పాటు ఎంగెల్స్ రాజకీయార్థిక శాస్త్ర రంగంలో మార్క్స్ తో కలిసీ, విడిగానూ చేసిన కృషిని ప్రత్యేకంగా గుర్తించి, విశ్లేషించవలసి ఉంది.
- ఇవాళ శ్రామిక వర్గం ఉన్న స్థితిలో, ఇవాళ పరిరక్షణ వాదానికీ స్వేచ్ఛా వాణిజ్యానికీ మధ్య జరుగుతున్న చర్చలో, ప్రపంచీకరణ, హిందుత్వ పెచ్చరిల్లుతున్న స్థితిలో, సిద్ధాంత, ఆచరణ రంగాలలోని జయాపజయాల నేపథ్యంలో ఎంగెల్స్ ప్రాసంగికత మరింతగా కనబడుతున్నది. సైద్ధాంతిక చట్రం, ప్రాపంచిక దృక్పథం, ప్రత్యర్థులతో వాదవివాదాలు, శ్రామికవర్గ అంతర్జాతీయత వంటి అనేక రంగాలలో ఎంగెల్స్ ప్రాధాన్యత మరింత పెరుగుతున్నది.

(ఈ వ్యాసానికి తొలిరూపమైన ప్రసంగం విశాఖపట్నంలో డిసెంబర్ 15-16, 2019లో కా. వై విజయకుమార్ మార్క్సిస్టు అధ్యయన కేంద్రం జరిపిన ఫ్రెడరిక్ ఎంగెల్స్ ద్విశతజయంతి ఉత్సవాల ప్రారంభ సదస్సులో చేసినది. నిర్వాహకులకు కృతజ్ఞతలు)

(రచయిత వీక్షణం సంపాదకులు) వీ

లెనిన్ ఐక్య సంఘటన ఎత్తుగడలు - సమకాలీన విప్లవోద్యమాలు

నేడు అనేక దేశాలలో ఫాసిజం ప్రత్యేక లక్షణాలతో మరింతగా విజృంభిస్తోందనీ, ఈ ప్రమాదాన్ని అధిగమించేందుకు లెనిన్ సూచించిన ఐక్య సంఘటనల ఎత్తుగడల దిశగా అడుగులు వేయడం ఒక్కటే మార్గమనీ అంటున్నారు **కొండూరి వీరయ్య**

ఏప్రిల్ 22 లెనిన్ 150వ జయంతి. ఈ సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు ఉద్యమానికి లెనిన్ అందించిన కృషి, మార్క్సిజాన్ని మరింత మెరుగుపర్చడంలో ఆయన పాత్ర గురించి చర్చలు జరుగుతున్నాయి. లెనిన్ గుణగణాలు, త్యాగనిరతి, నిర్మాణ దక్షత, సైద్ధాంతిక కృషి, పెట్టుబడిదారీ వ్యవస్థ సామ్రాజ్యవాద దశకు చేరిన దశలో మార్క్సిస్టు మౌలిక సూత్రాలను తాజా దశకు అన్వయించటం, సంపన్న దేశాల్లో విప్లవం రాకముందే ఓ వెనకబడిన దేశంలో విప్లవం సాధించటం, ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ సామ్రాజ్యవాద దశకు చేరుకున్న సమయంలో ఒక దేశంలో సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ నిర్మాణం వంటి అనేక అంశాల గురించి ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం, వామపక్ష శక్తులు మరోసారి మననం చేసుకోనున్నాయి. నిర్దిష్ట పరిస్థితుల నిర్దిష్ట అధ్యయనం అన్నది లెనినిజానికి పునాది. ఈ సూత్రాన్ని అటు భౌతిక రాజకీయ పరిస్థితులను అధ్యయనం చేయటానికి, అంచనా వేయటానికి వర్తింపచేయటం గురించి ఎన్నో ఉదాహరణలు మనం చదివాం. విన్నాం. తెలుసుకున్నాం. ఈ నిర్దిష్ట పరిస్థితుల నిర్దిష్ట అధ్యయనాన్ని పార్టీ నిర్మాణం, ఎత్తుగడల విషయంలో లెనిన్ ఎలా అమలు చేశాడన్న విషయాన్ని ఈ సందర్భంగా పునఃశ్చరణ చేసుకోవటం సమకాలీన విప్లవోద్యమాలకు ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నాను.

ఐక్య సంఘటన నిర్మాణం, దానికి కావల్సిన ఎత్తుగడలు లెనినిజంలో ఓ కీలక భాగం. ఈ ఎత్తుగడలు పార్టీలో భిన్నాభిప్రాయాలు కలిగిన ఫైఖనోవ్, ట్రాట్స్కీ ఆక్సెల్రాడ్, మార్టోవ్, కౌట్స్కీ రోజా లగ్జెంబర్గ్ వంటి నేతలతో ఉన్న భిన్నాభిప్రాయాలను అధిగమించటం మొదలు మొదలై వర్ధమాన దేశాలు, సోషలిస్టు శిబిరం మధ్య ఉండాల్సిన ఐక్య సంఘటన వరకు విస్తరించాయి. లెనిన్ అనుసరించిన ఐక్య సంఘటనలు ముక్కుసూటిగా ఎప్పుడూ లేవు అన్న చారిత్రక వాస్తవాన్ని మనం ఎన్నడూ మర్చిపోరాదు. ఆయా దశల్లో విప్లవోద్యమంలో తలెత్తిన నిర్దిష్ట అవసరాల నేపథ్యంలో వివిధ మోతాదుల్లో, వివిధ స్థాయిల్లో ఈ ఐక్యసంఘటన నిర్మాణాలు జరిగాయి. సామ్రాజ్యవాద స్వభావాన్ని గుత్తకు తీసుకున్న ద్రవ్య పెట్టుబడిదారీ (ప్రపంచీకరణ) దశలో వివిధ దేశాల్లో ప్రత్యేకించి భారతదేశపు విప్లవోద్యమం పెట్టుబడిదారీ వ్యతిరేక శక్తుల ఐక్య సంఘటన నిర్మాణం దిశగా అడుగులు వేయాల్సిన తరుణం ఇది. అందువల్లనే లెనిన్ నాయకత్వంలో రష్యన్ సోషల్ డెమొక్రటిక్ లేబర్ పార్టీ (బోల్షివిక్) వివిధ సందర్భాల్లో అనుసరించిన ఐక్యసంఘటన ఎత్తుగడలను సంక్షిప్తంగా చర్చించుకుందాం. నేటికీ పెట్టుబడిదారీ విధానం విశ్వవ్యాప్త విధానంగా ఎదిగినా కొన్ని దేశాలు ప్రజాతంత్ర విప్లవ దశ సాధన దశలోనే ఉండిపోయాయి. ఐక్య సంఘటన ఎత్తుగడల గురించిన గందరగోళం కార్మికవర్గ విప్లవ దశలో ఉన్న దేశాల్లో కంటే ప్రజాతంత్ర విప్లవ దశలో ఉన్న దేశాల్లో ఎక్కువగా ఉంటుంది.

లెనిన్ రచనలను ఏకరువు పెట్టగల సామర్థ్యం ఉన్న నాయకత్వానికి భారత విప్లవోద్యమ ప్రస్థానంలో కొరత ఏమీ లేదు. ఏ రచనను అయినా ఆయా చారిత్రక రాజకీయ నేపథ్యం నుంచి చూసినప్పుడు మాత్రమే సదరు రచయిత చెప్పదల్చుకున్న సారం పాఠకులకు అందుతుంది. మనం అధ్యయనం చేసేటప్పుడు ఈ మౌలిక సూత్రాన్ని తరచూ విస్మరిస్తూ ఉంటాం. అందుకే ఒకే పుస్తకంలోకి ఒకే వాక్యం ఒక్కొక్కరికి ఒక్కోరంగా కనిపిస్తుంది. అర్థమవుతుంది. ప్రత్యేకించి మార్క్సిజాన్ని అధ్యయనం చేసేటపుడు 19,20 శతాబ్దాల నాటి మేధో చర్చలను విస్మరిస్తే మార్క్సిజం కూడా మనకు మరోలా కనపడుతుంది. అందుకే తొలితరం కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలు ఆధునిక యూరోపియన్ చరిత్ర, తత్వశాస్త్ర పరిణామం, అర్థశాస్త్ర పరిణామక్రమం చదువుతూ మార్క్సిజాన్ని చదివారు కాబట్టి సారాన్ని వడపోసి ఉద్యమాలు నిర్మించగలిగారు.

పెట్టుబడిదారీ వ్యవస్థ సామ్రాజ్యవాద దశలో ప్రవేశించినప్పుడు ప్రపంచ విముక్తి ఉద్యమం సాధించిన పెద్ద విజయమే బోల్షివిక్ విప్లవం. నాటి జారిస్టు రష్యా నిర్దిష్ట పరిస్థితులకు మార్క్సిజాన్ని అన్వయించే ప్రయత్నంలో ఆయన సాగించిన నిర్దిష్ట అధ్యయన ఫలితమే సామ్రాజ్యవాదం : పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ అన్న రచన. ఈ రచనను పూర్తి చేసే సందర్భంలో వచ్చిందే ప్రపంచ సామ్రాజ్యవాదపు గొలుసులో జారిస్టు రష్యా బలహీనమైన లింక్ గా ఉందన్న సూత్రీకరణ కూడా. ఈ బలహీనమైన లింకును తెగొట్టడమే అక్టోబర్ విప్లవానికి నాంది. ఈ కర్తవ్యాన్ని నిర్వహించేందుకు బోల్షివిక్ పార్టీని సన్నద్ధం చేసే క్రమంలో లెనిన్ దఫదఫాలుగా వ్యూహం, ఎత్తుగడలు, నినాదాలు మార్చుకుంటూ వచ్చాడు. కొన్ని సందర్భాల్లో గతంలో తాను పూర్తిగా వ్యతిరేకించిన నినాదాలను సైతం విప్లవోద్యమ పురోగమనం ఆవశ్యకత దృష్ట్యా అంగీకరించాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ సామ్రాజ్యవాద దశకు చేరుకున్న సమయంలో ఒక దేశ విప్లవోద్యమం, కార్మికోద్యమంతో పాటు ప్రపంచ కార్మికోద్యమం సమస్యలు కూడా కీలక ప్రాధాన్యత సంతరించుకున్నాయి. లెనిన్ నాయకత్వంలో అటు అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలోనూ, దేశీయంగా రష్యాలోనూ అమలు జరిగిన వ్యూహం, ఎత్తుగడలు, పోరాట రూపాలు, మిత్రులు, శతృవులు, విప్లవ వ్యూహం వంటి వాటన్నింటినీ ఎప్పటికప్పుడు తాజా పర్చుకోవటంలో లెనిన్ పాటించిన సూత్రమే నిర్దిష్ట పరిస్థితుల నిర్దిష్ట అధ్యయనం.

ప్రధానంగా 1905 నుండి 1917 వరకు లెనిన్ అనుసరించిన ఐక్యసంఘటన ఎత్తుగడలు, రష్యా విప్లవంపైనా అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం పైనా, వలస దేశాల విముక్తి ఉద్యమాలపై వాటి ప్రభావం, కొన్ని చారిత్రక అనుభవాలు పరిశీలిద్దాం.

ప్రజాతంత్ర విప్లవ దశలో ఐక్యసంఘటన ఎత్తుగడలు

సామ్రాజ్యవాదం అంటేనే పీడితులపై సాగే దోపిడీ నూతన దశకు చేరటం. నూతన రూపాలు సంతరించుకోవటం. పెట్టుబడి ఆధిపత్యాన్ని బలయ్యే పీడితుల సంఖ్య కూడా విస్తరించటం. అంటే పెట్టుబడికి వ్యతిరేకంగా ఉండాల్సిన శక్తుల సంఖ్య, ప్రభావం, సమాజంలో వారి శాతం పెరగటం. కొన్ని కొన్ని సందర్భాల్లో (ప్రత్యేకంగా పెట్టుబడిదారీ సంక్షోభాల సమయంలో) చిన్న చిన్న పెట్టుబడిదారులు, మధ్యతరగతి, వ్యాపారస్తులు, ధనిక రైతాంగం కూడా సామ్రాజ్యవాద దశకు చేరుకున్న గుత్త పెట్టుబడి ప్రభావానికి దివాళా తీస్తారు.

ఈ పరిణామం (పెట్టుబడి కారణంగా నష్టపోయిన ప్రజల సంఖ్య పెరగటం) ప్రజాతంత్ర కూటమి ఏర్పాటుకు మార్గం సిద్ధం చేస్తుంది. ఈ వాస్తవాన్ని తరచు కమ్యూనిస్టు ఉద్యమం విస్మరిస్తోంది. వీరంతా పెట్టుబడి కారణంగా దివాళా తీస్తున్నారు, నష్టపోతున్నారు కాబట్టి అనివార్యంగా పీడితుల్లోనే పీడితులైన కార్మికవర్గ స్వభావాన్ని సంతరించుకుంటారనీ, అందువల్ల కార్మికవర్గ పోరాటాలే ఏకైక లక్ష్యమని నిర్ధారణకు వస్తారు. కానీ ఈ విధంగా నష్టపోతున్న వర్గాలు తమ మౌలిక వర్గ స్వభావాన్ని అంత తేలిగ్గా వదులుకోరనీ, సాధ్యమైనంత వరకు దోపిడీ వ్యవస్థ నిర్మాణంలోనే తమ స్థానానికి అంటిపెట్టుకుని ఉండేందుకు గల అవకాశాలు వెతుక్కుంటారన్న వాస్తవాన్ని అర్థం చేసుకోవాలి. పెట్టుబడి ఆధిపత్యానికి బలై కొత్తగా పీడితుల కోవలో చేరే భిన్న సామాజిక తరగతుల నిర్దిష్ట పరిస్థితిని గమనించటంలో ఉండే ఈ ఏమరుపాటు పోరాటాలు, విప్లవ నినాదాల రూపకల్పనలో, తదనుగుణమైన ఎత్తుగడలు రూపొందించటంలో ఒంటెత్తు పోడకలకు దారితీస్తుంది.

ఈ ఏమరుపాటుకు గురికాకుండా ఉండాలంటే ప్రజాతంత్ర విప్లవ సమయంలోనే (1905 నాటి విప్లవం) లెనిన్‌ను, మెన్షివిక్కులకు, సోషలిస్టు రివల్యూషనరీలకు మధ్య జరిగిన మేధో సంవాదాన్ని పరిశీలించాలి. భారత కమ్యూనిస్టు ఉద్యమంలో రివిజనిజం గురించిన చర్చ పెద్దగా లేకపోయినప్పటికీ రివిజనిస్టులు అన్న పదాన్ని తేలిగ్గా వాడిన సందర్భాలు అనేకం మనకు కనిపిస్తాయి. ఒకే ఉద్యమ నిర్మాణంలో ఉంటూ కూడా ఒకరికొకరు ఈ ముద్రలు వేసుకున్న సందర్భాలూ చూశాము. అందువల్ల ఎవరు, ఎవరికి ఈ బిరుదు ఇస్తున్నారు, దానికి ముందు ఇరుపక్షాల మధ్య ఉన్న సైద్ధాంతిక విభేదాలేమిటి అన్న విషయాలు లోతుగా తెలుసుకోకుండా ఒక నాయకుడు మీద ఉన్న గురుత్వ ధోరణితో ఆ నాయకుడు ఫలానా నాయకుడిని రివిజనిస్టు అనో లిక్విడేషనిస్టు అనో ముద్ర వేసినప్పుడు కార్యకర్తలు, పాఠకులు దాన్ని యథాతథంగా స్వీకరిస్తే అంతకంటే విప్లవోద్యమానికి జరిగే నష్టం మరోటి ఉండదు. అందుకే కార్యకర్తలు, నాయకుల మధ్య గురుత్వ ధోరణి స్థానంలో గతితార్కిక సంబంధాలు ఉండేలా పార్టీ నిర్మాణం ఉండాలి. ఎందుకంటే రివిజనిస్టు అన్న ముద్ర నుండి, సామ్రాజ్యవాదుల ఏజెంట్ అన్న ముద్ర లెనిన్ లాంటి వాడికి కూడా తప్పలేదు.

1905 నాటి బూర్జువా ప్రజాతంత్ర విప్లవం సాధన కోసం ఐక్యసంఘటన ప్రతిపాదించినప్పుడు మెన్షివిక్కులు లెనిన్ను రివిజనిస్టుగా ముద్ర వేశారు. బూర్జువా ప్రజాతంత్ర విప్లవంలో కార్మిక వర్గానికి ఎటువంటి పాత్ర ఉండదన్నది వారి అవగాహన. బూర్జువా వర్గమే ఆ కర్తవ్యాన్ని జయప్రదంగా నిర్వహించుకుంటే తదనంతరం ఏర్పడే సమాజంలో ప్రశాంతంగా కార్మికవర్గ రాజకీయాలు నిర్వహించవచ్చని మెన్షివిక్కులు వాదిస్తారు. వీరికంటే కాస్త భిన్నమైనది ట్రాట్స్కీ అవగాహన. శాశ్వత విప్లవ సాధన క్రమంలో బూర్జువా ప్రజాతంత్ర విప్లవం ఓ తాత్కాలిక మజిలీ కాబట్టి దాని గురించి మనం పట్టించుకోనవసరం లేదనీ, శాశ్వత విప్లవం కోసమే కృషి చేయాలన్నది ఆయన ప్రతిపాదన. ఈ రెండు ప్రతిపాదనలకంటే భిన్నమైనది లెనిన్ అవగాహన. బూర్జువా ప్రజాతంత్ర విప్లవంలో కార్మికవర్గం భాగస్వామి కావటం ద్వారా దీర్ఘకాలంలో బూర్జువా విప్లవంపై కార్మికవర్గం ఆధిపత్యం సంపాదంచటానికి అవకాశం ఉంటుందని లెనిన్ భావించాడు.

ఈ విమర్శలకు సమాధానంగా రెండు ఎత్తుగడలు అన్న లేఖలో సామ్రాజ్యవాద దశలో ఏ ఒక్కరమూ ప్రజాత్రంత్ర ఉద్యమాల నుండి ఒంటరి కాకూడదని హెచ్చరిస్తాడు. బూర్జువాతో సహా సమాజంలోని అన్ని వర్గాలు తరగతులతో ఈ దశలో కార్మికవర్గం సహకరించాలని ప్రతిపాదిస్తాడు. "ఇక్కడ మనకు మిగిలిన వాళ్లకు ఉన్న తేడా ఒక్కటే. ఈ విప్లవోద్యమంలో మనం ఇతర విప్లవకారులతో పూర్తిగా విలీనమై మన ఉనికిని కోల్పోకుండా సమాంతరంగా నడుస్తాం. మెన్షివిక్కులు, సోషలిస్టు రివల్యూషనరీలు ఈ పోరాటంలో బూర్జువాలు, ఉదారవాదులతో కలిసి నడుస్తారు. ఇదే తేడా" అని గుర్తు చేస్తాడు. విశేషమేమంటే ఎత్తుగడలకు సంబంధించిన ఈ చర్చంతా కార్మికవర్గ పత్రికల్లోనే జరిగింది. తద్వారా నేరుగా కార్మికవర్గం ఈ చర్చలో భాగస్వామి అయింది. తన అవగాహనను మరింత పటిష్టరుస్తూ లెనిన్ కార్మికులు, రైతాంగం మధ్య ఐక్య సంఘటన ఎత్తుగడను ప్రతిపాదిస్తాడు. ఈ ఐక్యసంఘటనకు 1905 నాటి విప్లవంలో బీజాలు పడితే 1917 నాటి విప్లవం నాటికి ఈ ఐక్యసంఘటన పరిపక్వతను సాధించింది. ఫ్రాన్స్‌లో వర్గపోరాటం, పారిస్ కమ్యూన్లను విశ్లేషించేటప్పుడు సూక్ష్మస్థాయిలో మార్క్స్, ఏంగెల్స్ లు ఈ ఐక్యసంఘటనను ప్రతిపాదిస్తే లెనిన్ బోల్షివిక్ విప్లవంలో ఈ ఎత్తుగడకు పరిపూర్ణతను సంతరించి పెట్టాడు.

సామ్రాజ్యవాద వ్యతిరేక వలసవాద వ్యతిరేక ఐక్యసంఘటన

బోల్షివిక్ విప్లవం నూతన ప్రపంచాన్ని ఆవిష్కరించింది. సామ్రాజ్యవాద శక్తుల ఐక్యసంఘటనలో కొన్ని లింకులు తెగొట్టగలిగింది. రష్యాలో కార్మిక కర్షక రాజ్యం ఆవిర్భావంతో పాటు నాటి వలస దేశాల్లో జరుగుతున్న విముక్తి ఉద్యమాలు సామ్రాజ్యవాద శక్తుల ఐక్యసంఘటనను బలహీనపర్చటంలో సఫలమయ్యాయి. దాంతో విముక్తి ఉద్యమాలు ప్రపంచవ్యాపిత స్వభావాన్ని సంతరించుకున్నాయి. సామ్రాజ్యవాదం ప్రపంచ వ్యాప్తంగా శ్రామిక వర్గాన్నే కాక నేటి వర్ధమాన దేశాల్లో పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధినీ ఆటంకపర్చింది. అందువల్లనే వలసవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న బూర్జువా జాతంత్ర విప్లవంలో ఆయా దేశాల బూర్జువావర్గం కూడా క్రియాశీల పాత్ర పోషించింది. ఈ

దిశగా ఐక్యసంఘటన ఎత్తుగడలను అంతర్జాతీయం చేసే ప్రయత్నంలోనే మూడో కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ లో లెనిన్ వలస దేశాల్లో విముక్తి ఉద్యమాల పట్ల తీసుకోవాల్సిన వైఖరి గురించిన సిద్ధాంత చర్చకు తెరతీశాడు. ఈ ఎత్తుగడలే భారత స్వాతంత్ర్యోద్యమంలో కమ్యూనిస్టుల పాత్రను విస్తరించటానికి దోహదం చేశాయి.

వలస దేశాల్లో సాగుతున్న విముక్తి ఉద్యమాలు బోల్షివిక్ విప్లవం నుండి స్ఫూర్తి పొందుతాయి. ఆయా దేశాల్లోని విముక్తి ఉ ద్యమాల ప్రతినిధులు, నాయకులు, ప్రజలు బోల్షివిక్ విప్లవానికి సంఘీభావం ప్రకటిస్తారు. అనేక దేశాల నేతలు విప్లవ రష్యాలో పర్యటిస్తారు. ఈ పరిణామాలన్నింటినీ పరిశీలించిన లెనిన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అంతార్జాతీయ ఐక్య కూటమి ఏర్పడే అవకాశం ఉందని భావించాడు. మూడో ఇంటర్నేషనల్ రెండో మహాసభలో వలసవాదం గురించిన సిద్ధాంత పత్రాన్ని చర్చకు పెట్టాడు. ఈ చర్చలో వలస దేశాల్లోని శ్రామికవర్గ ప్రతినిధులు బూర్జువావర్గ ప్రతినిధులతో కలిసి విముక్తి ఉద్యమాల్లో పాల్గొనాలా లేదా అన్నదే ఈ చర్చలో ప్రధానాంశం. లెనిన్ ప్రతిపాదనలతో విభేదిస్తూ ఎం ఎస్ రాయ్ ఓ ప్రత్యామ్నాయ పత్రాన్ని ఈ సమావేశాల్లోనే ప్రతిపాదిస్తాడు.

కొన్ని వలస దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలు తమ శక్తిని ఎక్కువగా ఊహించుకుని ప్రజాతంత్ర విప్లవంతో పని లేకుండా నేరుగా కార్మికవర్గ విప్లవం సాధించగలమన్న అవగాహనతో ఉండేవి. ఈ అంచనాలతో ఉన్న కమ్యూనిస్టు పార్టీలు చిన్న మధ్యతరగతి బూర్జువా వర్గాన్ని కూడా శతృశిబిరంలోకి నెడతాయి. ఆయా దేశాల్లోని కమ్యూనిస్టు ఉద్యమం, ప్రజా చైతన్యం ఉన్న నిర్దిష్ట దశతో పాటు దోపిడీ సమాజ నిర్మాణంలో ఆయా వర్గాల స్థానం ఏమిటి, తక్షణం వారికున్న స్థానం ఏమిటన్నది అధ్యయనం చేయకుండా ఫలానా వర్గం మన విప్లవ వ్యూహంలో ఫలానా స్థానంలో ఉంది కాబట్టి లేదా వారికి ఊగిసలాట ఎక్కువ కాబట్టి వారి తక్షణ స్థితిలో ఎదురయ్యే నిర్దిష్ట డిమాండ్లకు మన విప్లవోద్యమంలో స్థానం లేదని వాదించాయి. ఈ క్రమం అనేక వలస దేశాల్లో కమ్యూనిస్టు ఉద్యమాలు జాతీయ ప్రధాన ఉద్యమ స్రవంతి నుండి వేరుపడి ఒంటరిగా మిగిలిపోయే పరిస్థితిని తెచ్చిపెట్టాయి.

ఏ దేశంలో ఏ స్థాయిలో బూర్జువా ప్రజాతంత్ర విప్లవాలు చోటు చేసుకున్నా కమ్యూనిస్టులు, కార్మికవర్గం ఈ ఉద్యమాల్లో పాల్గొనాలన్నది లెనిన్ అవగాహన. తద్వారానే ఆయా దేశాలు భవిష్యత్తులో కార్మికవర్గ విప్లవ దశకు చేరుకున్నపుడు ప్రజాతంత్ర విప్లవ దశలో అనుసరించిన ఐక్యసంఘటన ఎత్తుగడల్లో నేర్చుకున్న పాఠాలే పెట్టుబడిగా మారతాయన్నది లెనిన్ ఆశాభావం. అందువల్లనే 1922లో మూడో ఇంటర్నేషనల్ నాల్గో మహాసభ సందర్భంగా వలస దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలు స్వతంత్ర వర్గపోరాటాల నిర్మాణం పేరుతో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజాతంత్ర శక్తుల నాయకత్వంలో జరుగుతున్న పోరాటాల్లో పాలుపంచుకోక పోవటం దారుణమైన అవకాశవాదమని విమర్శిస్తాడు.

ఐక్యసంఘటన వ్యూహం – ఎత్తుగడలు

ఏపేరుతో పిలవబడుతున్నా (వలసవాదం, సామ్రాజ్యవాదం, ప్రపంచీకరణ, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, ద్రవ్యపెట్టుబడి ప్రపంచీకరణ దశ వంటి పేర్లు) సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కొనేందుకు కమ్యూనిస్టులు విశాల ప్రాతిపదికన ఐక్యసంఘటన ఎత్తుగడలు అనుసరించాల్సిన పరిస్థితిని కల్పిస్తుంది. ఈ విశాల శక్తులను సమీకరించలేకపోతే సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కోవటంలో కమ్యూనిస్టుల కృషి విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకెళ్లే దిశగా సాగదు. సామ్రాజ్యవాదానికి అనుంగు మిత్రులు అన్ని దేశాల్లోనూ పాలకవర్గ కూటముల్లో ఉంటారు. ఆయా దేశాల్లో పాలకవర్గ కూటమికి వ్యతిరేకంగా పోరాడేందుకు కూడా కమ్యూనిస్టులకు ఐక్య సంఘటన ఎత్తుగడలు అవసరం. బోల్షివిక్ విప్లవం నేపథ్యంలో ప్రపంచంలోని అన్ని దేశాల్లోనే విప్లవోద్యమాలు పురివిప్పే అవకాశం ఉందన్న అంచనాల్లోని పొరపాట్లను గుర్తు చేస్తూ రాసిందే వామపక్ష కమ్యూనిజం : ఓ బాలారిష్టం అన్న లెనిన్ రచన. ఎత్తుగడలు, వ్యూహానికి సంబంధించిన విషయాల్లో ఈ గ్రంథం ప్రామాణికమైంది. ఈ రచనలో ఐక్యసంఘటన ఎత్తుగడలు, రాజకీయ వ్యూహాలు, కార్మికవర్గ ప్రతినిధులు పార్లమెంట్లో ప్రవేశించాల్సిన అవసరం, ప్రవేశించాక చట్టసభల్లో అనుసరించాల్సిన ఎత్తుగడలు గురించిన చర్చ ఈ రచనలో కనిపిస్తుంది. వర్ధమాన దేశాల్లో అప్పుడే పురుడు పోసుకుంటున్న కమ్యూనిస్టు ఉద్యమం, శక్తులు బోల్షివిక్ విప్లవం స్ఫూర్తితో వలస దేశాల్లో కూడా కార్మిక వర్గ విప్లవానికి సన్నద్ధమవ్వాలన్న తప్పుడు అభిప్రాయాలకు గురికావటాన్నే లెనిన్ బాలారిష్టం అని విశ్లేషిస్తాడు.

కమ్యూనిస్టు పార్టీలు వర్గపోరాటాల మీద కేంద్రీకరించే క్రమలో సాధారణంగా కొన్ని తప్పుడు అవగాహనలతో పొరపాట్లు చేస్తుంటాయని హెచ్చరిస్తారు. ఈ పొరపాట్లలో ఎన్నికల్లో పాల్గొనరాదని నిర్ణయించటం, బూర్జువా పార్లమెంట్ వేదికల్లో పాలుపంచుకునే ప్రతిపాదనలు తిరస్కరించటం, ఇతర పార్టీలతో ఏ విధమైన ఐక్య సంఘటనలకు సిద్ధం కాకపోవటం, ప్రత్యేకించి బూర్జువా పార్టీలతో ఐక్య సంఘటనలకు సుతరామూ తిరస్కరించటం, పార్టీ స్వతంత్రత కాపాడుకోవడమన్న లక్ష్యాన్ని ముందుకు తెచ్చి భావసారూప్యత కలిగిన మిత్రులను సమీకరించుకోవటం పట్ల విముఖత ప్రదర్శించటం, అసలు రాజీ అంటేనే పార్టీని లిక్విడేషనిజం వైపు నడిపించటంగా ప్రచారం చేయటం వంటి పొరపాట్లు తరచు జరుగుతుంటాయని లెనిన్ క్రోడీకరించాడు. ఈ పొరపాట్లకు మూలం ఆయా దేశాల్లోని విప్లవోద్యమంలో మోహరించిన శక్తులు, వర్గాల బలాబలాలు, సంకీర్ణ నిర్మాణాల తీరుతెన్నులు, నిర్దిష్ట సమయంలో నిర్దిష్ట వర్గాల నిర్దిష్ట డిమాండ్లు వంటి కీలక విషయాల పట్ల శాస్త్రీయ అవగాహన లేకపోవటమే. బోల్షివి తరహా విప్లవం సాధించాలన్న తపనలో అత్యుత్సాహం ప్రదర్శించే పార్టీలు ఒంటెద్దుపోకడలకు పాల్పడతాయని, ఎన్నికల రంగంలో సానుకూల పరిస్థితులు ఏర్పడేందుకు అవకాశం ఉన్నా అందులో భాగస్వాములై ఆ పరిస్థితులను కార్మికోద్యమ విప్లవ పంథాను ముందుకు తీసుకెళ్లటానికి ప్రయత్నం చేయరన్నది లెనిన్ విమర్శ.

జర్మనీలో రాజ్యాంగ సంస్కరణల గురించి వ్యాఖ్యానిస్తూ ఏంగెల్స్ జర్మనీ కమ్యూనిస్టులను విమర్శిస్తూ "జర్మన్ కమ్యూనిస్టులు చారిత్రక పరిణామ క్రమంలో అందుబాటులోకి వచ్చే మధ్యంతర విప్లవ దశల్లో భాగస్వాములు కావటానికి అంగీకరించరనీ, ఏకాఏకిన అంతిమ లక్ష్యమైన కార్మికవర్గ విప్లవం కోసం మాత్రమే పని చేస్తార"న్న వాక్యాలను

వలస దేశాల్లోని కమ్యూనిస్టు పార్టీలకు వర్తింపచేస్తాడు లెనిన్. కార్మికవర్గ విప్లవమే అంతిమ లక్ష్యం కదా అని కూర్చుంటే సదరు లక్ష్యసాధన దిశగా అడుగులు ముందుకేయటానికి బదులు మరింత దూరమవుతారని హెచ్చరించాడు.

బూర్జువా పార్టీలతో రాజీపోరాటం కమ్యూనిస్టు పార్టీలు అనుసరించాల్సిన ఎత్తుగడల గతితర్కమేనని వాదిస్తాడు. లెనిన్. విప్లవ సాధన లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో బోల్షివిక్ పార్టీ రాజీపడ్డ సందర్భాలను కూడా ఆయన వివరిస్తాడు. ఇందులో భాగంగా 1905 విప్లవయత్నం విఫలమయ్యాక 1906 ఏప్రిల్ లో జరిగిన రష్యన్ సోషల్ డెమొక్రటిక్ పార్టీ నాల్గో మహాసభలో మెన్షివిక్కు, బోల్షివిక్కు విభాగాలను విలీనం చేయటం ఓ ఉదాహరణగా మనకు కనిపిస్తుంది. ఈ విలీనాన్ని లెనిన్ వ్యక్తిగతంగా వ్యతిరేకించినా మహాసభ విలీనానికే మొగ్గు చూపుతుంది. ఈ మహాసభ గురించి జినోవీవ్ మరో సందర్భంలో మాట్లాడుతూ "దిగువనున్న ప్రజా శ్రేణుల నుండి వచ్చిన ఒత్తిడికి తలొగ్గి ఇరు పక్షాలు విలీనానికి అంగీకరించాయ"ని చెప్తాడు. తర్వాత జరిగిన డ్యూమా ఎన్నికల్లో పాల్గొనరాదన్న నిర్ణయాన్ని లెనిన్ వ్యతిరేకించినప్పటికీ మెజారిటీ కేంద్ర కమిటీ ఎన్నికల బహిష్కరణకే సుముఖంగా ఉంటారు. చివరకు తొలి డ్యూమాలో కానిస్టిట్యూషనల్ డెమొక్రటిక్ పార్టీ ప్రధాన శక్తిగా అవతరించటంతో కేంద్ర కమిటీలోని మెన్షివిక్ బృందం తన పొరపాటును గుర్తిస్తుంది. ఈ విధంగా ప్రతి రాజీ సందర్భం విప్లవ శక్తులకు పాఠం నేర్చుకునే సందర్భమేనని లెనిన్ ఆచరణలో రుజువు చేశాడు. కొన్ని సందర్భాల్లో ఇటువంటి రాజీల కారణంగా ఆరెస్డీఎల్పీ నష్టపోయినా మెజారిటీ సందర్భాల్లో పురోగమించిందని, వర్గ శత్రువును బలహీనం చేయగలిగిందని లెనిన్ అంచనాకు వచ్చాడు. జర్మనీలో సోషల్ డెమొక్రాట్లు ఇతర ప్రజాతంత్ర శక్తులతో కలిసి పని చేయటానికి నిరాకరించిన సందర్భంలోనూ, ఇంగ్లాండ్ లేబర్ పార్టీతో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేయటానికి తిరస్కరించిన సందర్భంలోనూ లెనిన్ ఆ పార్టీలను ఘాటుగా విమర్శిస్తాడు. రష్యాలో బోల్షివిక్కులు తీవ్రమైన ఊగిసలాటతో ఉన్న వారితో కూడా కలిసి పని చేశారని గుర్తు చేస్తాడు. జార్ నియంతృత్వానికి వ్యతిరేకంగా శైశవ దశలో ఉన్న రష్యా బూర్జువా వర్గంతో రాజీ పడటానికి బోల్షివిక్ పార్టీ ఏనాడూ తిరస్కరించలేదన్న విషయాన్ని కూడా లెనిన్ ప్రస్తావిస్తాడు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఐక్య సంఘటన

ఈ ఐక్య సంఘటన ఎత్తుగడలే ఫాసిజంపై పోరాటంలో ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమానికి ప్రధాన సాధనంగా మారాయి. సరైన పంథాలో ఐక్య సంఘటన ఎత్తుగడలు అమలు చేసిన అన్ని సందర్భాల్లోనూ, అన్ని దేశాల్లోనూ కమ్యూనిస్టు ఉద్యమం పురోగమించిందని చరిత్ర చెప్తోంది. 1920 దశకం నాటికి మొదలై 30 దశకం నాటికి తీవ్రరూపం దాల్చిన సామ్రాజ్యవాద సంక్షోభం ఫాసిజానికి పునాదులు వేసింది. ఫాసిజం ప్రమాదాన్ని ఎదుర్కోవటానికి అనుసరించాల్సిన ఎత్తుగడల విషయంలో కొమిన్టర్న్ సమావేశాల్లో వివిధ దేశాల పార్టీల మధ్య తీవ్ర భిన్నాభిప్రాయాలు తలెత్తాయి. ఈ పరిస్థితుల్లో లెనిన్ స్ఫూర్తితో క్లారా జెట్కిన్, టొగ్లియాట్టి, రజనీపామే దత్, డిమిట్రోవ్‌లు ఐక్యసంఘటన వ్యూహం, ఎత్తుగడల ప్రతిపాదనలు ముందుకు తెచ్చారు. క్లారా జెట్కిన్ మొదలు డిమిట్రోవ్ వరకు కొమిటర్న్ మహాసభలు ఫాసిస్టు వ్యతిరేక ఎత్తుగడల విషయంలో పెట్టిన ప్రతిపాదనలు అధ్యయనం చేయటమే ఓ ప్రత్యేక విశ్లేషణ అవుతుంది. కొమిటర్న్ ఆరో మహాసభల్లో జర్మన్ కమ్యూనిస్టు పార్టీ, జర్మన్ సోషల్ డెమొక్రటిక్ పార్టీల మధ్య ఐక్యసంఘటనకు అంగీకారం కుదిరి ఉంటే రాజ్యాంగపరమైన సంక్షోభం తలెత్తేది కాదు, హిట్లర్ జర్మనీలో అధికారానికి వచ్చేవాడు కాదు అన్నది వాస్తవం. హిట్లర్ అధికారానికి రావటానికి ముందు ఈ రెండు పార్టీలకు వచ్చిన ఓట్లు సీట్లు కలిపి చూసుకుంటే నాజీ పార్టీకంటే ఎక్కువ ఉన్నాయి. జర్మన్ అనుభవాల తర్వాత మిగిలిన యూరోపియన్ దేశాలు, ప్రధానంగా ఇటలీ, ఫ్రాన్స్, స్పెయిన్లు ఐక్య సంఘటన ఎత్తుగడలను అమలు చేస్తాయి. ఫాసిజం రాజ్యాంగబద్ధంగా అధికారానికి వచ్చే అవకాశాలను కట్టడి చేశాయి.

చైనా, వియత్నాం విముక్తి పోరాటాలు ఐక్య సంఘటన ఎత్తుగడల ప్రాధాన్యత గురించి మరిన్ని విలువైన పాఠాలు నేర్పుతున్నాయి. వివిధ దేశాల ప్రత్యేకతలు, ఆయా దేశాల్లో కమ్యూనిస్టు, సోషలిస్టు పార్టీల ఆవిర్భావంలో ఉన్న ముందు వెనకలు, వివిధ దేశాలపై వలసాధిపత్యంలో ఉన్న వ్యత్యాసాలు పరిగణనలోకి తీసుకోకుండా సరళరేఖ వంటి ఎత్తుగడలు సాధ్యమని చెప్పటం ఇక్కడ నా ఉద్దేశ్యం కాదు. భారతదేశంలో కూడా స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా ఉనికిలోకి వచ్చిన కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నాయకులందరూ తర్వాతి కాలంలో భారత కమ్యూనిస్టు పార్టీ నాయలకులయ్యారన్న విషయాన్ని మనం మర్చిపోకూడదు.

నేడున్న ప్రపంచం మక్కికి మక్కి లెనిన్ కాలం నాటిది కాదు. సామ్రాజ్యవాదం కూడా లెనిన్ నాటి కాలంలో ఉన్నంత నగ్నంగా లేదు. అదే విధంగా మితవాద ఫాసిస్టు శక్తులు కూడా 1920 దశకంలో ఉన్నంత స్థాయిలో నగ్నంగా నిరంకుశ విధానాలకు పాల్పడలేని రీతిలో రాజ్యాంగ వ్యవస్థలు, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థల నడుమ నేటి ప్రపంచం ఉంది. పెట్టుబడిదారీ వ్యవస్థ ఎంత నాజూకుగా, పారదర్శకంగా కనిపిస్తుందో అంత గాఢమైన దొంతరల నడుమ తన దోపిడీ స్వభావాన్ని దాచి ఉంచింది. లెనిన్ నాటికి ప్రపంచ దేశాలపై భౌతికాధిపత్యం కోసం బరితెగించిన ద్రవ్య పెట్టుబడి నేడు ప్రపంచీకరణ దశలో ప్రవేశించి ప్రపంచ దేశాలన్నింటిలోనూ తరతమ స్థాయిల్లో ఉత్పత్తి సంబంధాలను, ఉత్పత్తి శక్తుల అభివృద్ధినీ నియంత్రిస్తోంది. మరోవైపున సమాంతరంగా మితవాద నయా ఫాసిస్టు శక్తుల రూపంలో పాలకవర్గాలు దేశాల సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక జీవితంపై తమ గుత్తాధిపత్యాన్ని మరింత సంఘటితం చేసుకుంటున్నాయి. భారతదేశంలో జరుగుతున్న పరిణామాలు ఈ కోవకు చెందినవే. ఫాసిజం లక్షణాలు వ్యక్తీకరణలు వేర్వేరు దేశాల్లో వేర్వేరు రూపాల్లో కనిపిస్తాయి. ఆయా దేశాల సాంస్కృతిక వారసత్వం కూడా ఫాసిజానికి ప్రత్యేక లక్షణాలు అద్దడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ పరిస్థితుల్లో ప్రపంచం ముందు, భారతదేశంలోనూ ముందుకొస్తున్న ఫాసిజం ప్రమాదాన్ని అధిగమించేందుకు ఐక్యసంఘటన ఎత్తుగడల దిశగా అడుగులు వేయటమే లెనిన్ 150వ జయంతి సందర్భంగా మనం అర్పించే నివాళి.

(రచయిత పాత్రికేయులు) వీ

అజర్‌బైజాన్ - అర్మేనియా సాయుధ వివాదం

***అజర్ బైజాన్-ఆర్మేనియా మధ్య నెలకొన్న యుద్ధ మేఘాలకు ప్రధాన కారణం ప్రపంచానికి ముడి చమురు సరఫరా అయ్యే అజర్‌బైజాన్, నగోర్నో, కరబఖ్‌ల ప్రధాన రహదారి కావడమే అంటున్నారు* రాజేంద్రబాబు అర్విణి**

అది ఒక చిన్న ప్రాంతం. కేవలం 1700 చదరపు మైళ్ల విస్తీర్ణం గల ప్రదేశం. 1 లక్షా 50 వేల జనాభా. పశ్చిమ ఆసియా, తూర్పు యూరప్ ఖండాల మధ్య ఉన్న పర్వత ప్రాంతం. దాని పేరు నగోర్నో - కరబఖ్. ఆ ప్రాంతం ఆసాంతం కాకసస్ పర్వతశ్రేణి పరచుకొని ఉంటుంది. సముద్ర మట్టానికి 5,642 మైళ్ల ఎత్తున ఉన్న పర్వతశ్రేణి అది. యూరప్ ఖండంలోనే అతి ఎత్తైన పర్వత శిఖరాగ్రం ఎల్‌బ్రాస్ ఆ పర్వతాల మధ్యనే ఉంటుంది. అందులో రెండు అగ్ని పర్వతాలు దాగి ఉన్నవని కూడా ప్రతీతి. దీనిని ప్రపంచ దేశాలు అజర్‌బైజాన్‌కు చెందిన ప్రాంతంగా గుర్తించాయి కానీ, జనాభాలో ఎక్కువ శాతం అర్మేనియన్లే. అక్కడ క్రిష్టియన్లు, ముస్లింలు ఇరు మతాల వారూ ఉన్నారు. అర్మేనియన్ క్రిష్టియన్లు టర్కీ ముస్లింలు.

నగోర్నో కరబఖ్ చుట్టూ యుద్ధ మేఘాలు పరుచుకొని ఉన్నాయి. 2020 సెప్టెంబర్ 28 నుండి ఫిరంగులు మోగుతున్నాయి, బాంబుల వర్షం కురుస్తున్నది. వందలాదిగా సామాన్య పౌరులు, సైనికులు మృత్యువాత పడ్డారు. ముస్లిం దేశమైన టర్కీ సోదర ముస్లిం రాజ్యమైన అజార్‌బైజాన్ పక్షం వైపు దృఢంగా నిలబడ్డది. మతంతో పాటు మరొక ముఖ్య అంశం కూడా టర్కీ, అజర్‌బైజాన్‌ల స్నేహానికి తోడయ్యింది. అది టర్కీ నుండి ప్రపంచానికి ముడి చమురు సరఫరా జరగడానికి అజర్‌బైజాన్, నగోర్నో కరబఖ్‌లు సవ్యమైన రహదారి కావడమే! అందుచేతనే తన మిత్రుడైన అజర్‌బైజాన్ చేతిలోనే నగోర్నో కరబఖ్ పగ్గాలు ఉండాలని టర్కీ బలంగా కోరుకుంటున్నది. మరోవైపు అర్మేనియాలో శాశ్వత సైనిక స్థావరం కలిగిన రష్యా తనకు నమ్మకస్థుడైన మిత్రుడు అర్మేనియా పక్షమే నిలబడతానంటున్నది.

అజర్‌బైజాన్ తన నియంత్రణలో లేని నగోర్నో - కరబఖ్‌పై పట్టు సాధించాలని కృత నిశ్చయంతో ఉంది. అర్మేనియన్ పౌరులను, అర్మేనియన్ జాతి ప్రజలు ఏ దేశంలో ఉన్నా వారిని అజర్‌బైజాన్ రిపబ్లిక్‌లోకి ప్రవేశించడాన్ని నిషేధించింది. అలాగే సిరియా, లిబియాల నుండి కిరాయి సిపాయిలను, ఉగ్రవాద ముఠాలను అజర్‌బైజాన్ పక్షాన నిలబడి పోరాడడానికి యుద్ధానికి తరలించింది టర్కీ. ఇటు తమ మాతృభూమి పక్షాన నిలబడి పోరాడడానికి యూరప్ దేశాల నుండి, ఇతర దేశాల నుండి అర్మేనియన్ జాతి ప్రజలు 'తమ మాతృ భూమి కోసం...' అంటూ అర్మేనియా రావడానికి సిద్ధపడుతున్నారు.

ఈ యుద్ధ నేపథ్యాన్ని లోతుగా పరిశీలిస్తే ఒకవైపు టర్కీ, మరోవైపు రష్యా తమ స్వంత ప్రయోజనాల కోసం ప్రచ్ఛన్న యుద్ధాన్ని కొనసాగిస్తున్నట్లుగా అవగతమవుతున్నది. అందుకోసం జాతీయవాదాన్ని, మత వాదాన్ని ప్రజలలో రేకెత్తించి తమ పబ్బం గడుపుకోవాలని ఇరు దేశాల పాలక పక్షాలు ప్రయత్నిస్తు న్నట్లుగా అనిపిస్తున్నది.

అజర్‌బైజాన్, అర్మేనియా ఇరుగు పొరుగు దేశాలు. నగోర్నో - కరబఖ్ కారణంగానే దాదాపు వంద ఏళ్ల నుండి ఈ రెండు దేశాల మధ్య ఎప్పుడూ ఘర్షణ వాతావరణం నివురు గప్పిన నిప్పులా కొనసాగుతున్నది. ఈ రెండు దేశాలు ఒకప్పుడు జార్ చక్రవర్తుల ఆధ్వర్యంలోని రష్యా సామ్రాజ్యంలో భాగంగా ఉండేవి. సోవియట్ విప్లవం విజయవంతమై జార్ చక్రవర్తి పతనం తర్వాత ఈ రెండు దేశాలు స్వాతంత్ర్యం ప్రకటించుకొని 'రిపబ్లిక్ ఆఫ్ అర్మేనియా', 'డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ అజర్‌బైజాన్'గా ఏర్పడ్డాయి. రష్యా జార్ సామ్రాజ్యపు విష కౌగిలి నుండి బయటపడి స్వతంత్రత ప్రకటించుకొన్న వెను వెంటనే యుద్ధానికి దిగాయి. ఈ రెండు దేశాల మధ్య 1918 - 21 మధ్య కాలంలో భీకర పోరాటమే జరిగింది. రష్యన్ విప్లవం విజయవంతమై సోవియట్ యూనియన్ రూపొందుతున్న తరుణంలో యుద్ధానికి స్వస్తి పలికి ఈ రెండు దేశాలు సోవియట్ యూనియన్‌లో అంతర్భాగం అయ్యాయి.

1922 నుండి సోవియట్ యూనియన్‌లోని సభ్య దేశాలుగా రెండింటి మధ్య పెద్దగా పొరపొచ్చాలేమీ లేకుండానే కాలం గడిచిపోయింది. 1948లో ఒకసారి, 1964లో మరొకసారి అర్మేనియాలో చెలరేగిన అల్లర్లు, ప్రతిఘటనా పోరాటాల మధ్య అజర్‌బైజాన్‌కు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున దేశం విడిచి వెళ్లిపోవడం అయితే జరిగింది. అయితే, అప్పటి సోవియట్ యూనియన్‌లో అమలులో ఉన్న సెన్సార్ నిబంధనల వల్ల ఈ విషయం బయటి ప్రపంచం దృష్టికి రాలేదు. తిరిగి మళ్లీ సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమవుతున్న వేళ 1988 నుండి ఈ రెండు దేశాల మధ్య హింసాత్మక ఘటనలు చాలా జరుగుతూ వచ్చాయి. అర్మేనియా చాలా దూకుడుగా వ్యవహరించి అజర్‌బైజాన్‌లోని కొన్ని ప్రాంతాలను ఆక్రమించే వరకు వెళ్లింది. చివరికి 1990లో నగోర్నో కరబఖ్ అజర్‌బైజాన్ నుండి విడిపోయి స్వతంత్రతను ప్రకటించుకుంది కూడా. అప్పటి నుంచి అది అర్మేనియా జాతీయవాదుల చేతుల్లో ఉంది. కాని అంతర్జాతీయంగా అజర్‌బైజాన్‌లో అంతర్భాగం అన్న గుర్తింపుతో చలామణి అవుతున్నది.

యూరప్ దేశాల భద్రత, వాటి మధ్య సహకారం కోసం కృషి చేసే ఉద్దేశం ప్రధానంగా ఓఎస్‌సిఇ (ఆర్గనైజేషన్ ఫర్ సెక్యూరిటీ అండ్ కో-ఆపరేషన్ ఇన్ యూరోప్) అన్న సంస్థ చొరవ ఫలితంగా సుదీర్ఘ కాలంగా పోరాటంలో ఉన్న ఈ రెండు దేశాల మధ్య రాజీ కుదిరి

1994లో కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చింది. కాల్పుల విరమణ ఒప్పందానికి రెండు దేశాలూ అంగీకరించాయి కానీ, దానిని అమలు చేయడంలో రెండు దేశాలకు చిత్తశుద్ధి కొరవడింది. దాదాపు 7,000 లకు పైగా కాల్పుల ఉల్లంఘనలు జరిగాయని రెండు దేశాల ఫిర్యాదులను బట్టి తెలుస్తున్నది. కేవలం 2015 లోనే 100 మార్లు ఒప్పందాన్ని ఉల్లంఘించి యుద్ధాలు జరుపుకున్నారని, ఆ యుద్ధాల్లో 12 మంది అజర్‌బైజాన్ సైనికులు మరణించారని రికార్డయింది. సైనిక శక్తిని ఉపయోగించకూడదని, సరిహద్దుల సమగ్రత కాపాడాలని, సమాన హక్కులు, ప్రజల స్వయం నిర్ణయాధికారం – ఈ సూత్రాల ఆధారంగా 1975లో వెలువడ్డ హెల్సెంకీ తుది చట్టం ప్రాతిపదికన నగోర్నో – కరబఖ్ కాల్పుల విరమణ చట్టం రూపొందించబడ్డది.

ఆ ఒప్పందంలోని ముఖ్యాంశాలు: 1) నగోర్నో–కరబఖ్ సరిహద్దులపై నియంత్రణాధికారాన్ని తిరిగి అజర్‌బైజాన్‌కు అప్పగించడం, 2) భద్రతా, స్వయం పరిపాలన విషయాలలో నగోర్నో – కరబఖ్ ప్రాంతానికి తాత్కాలిక హోదా ఇవ్వడంతో పాటు భరోసా కల్పించడం, 3) అర్మేనియా, నగోర్నో – కరబఖ్ మధ్య రెండింటిని కలుపుతూ ఒక వసారా నిర్మించడం, 4) చట్ట ప్రకారం నగోర్నో కరబఖ్ హోదా భవిష్యత్తులో ఎలా ఉండాలో నిర్ణయించడం కోసం న్యాయబద్ధంగా వీలునామాను పోలిన ప్రకటనను విడుదల చేయడం, 5) రెండు దేశాల మధ్య వివాదం వల్ల నిరాశ్రయులైన ప్రజలు, కాందిశీకులుగా మారిన వారందరికి వారి వారి స్వస్థలాలకు తిరిగి వచ్చే హక్కును కల్పించడం, 6) రెండు దేశాల మధ్య శాంతిని పరిరక్షించడం కోసం అంతర్జాతీయ భద్రతా ఏర్పాట్లకు అవకాశం కల్పించడం.

పై అంశాల ఆధారంగా అర్మేనియా, అజర్‌బైజాన్ దేశాలు తమ మధ్య ఉన్న విభేధాలు పరిష్కరించుకునేందుకు సమగ్రమైన రాజీ సూత్రాలను రూపొందించుకోవాలని రష్యా, ఫ్రాన్స్, అమెరికా, తదితర దేశాలు ఒత్తిడి చేశాయి. అది మాత్రమే కాకుండా, 1991 – 94 మధ్య జరిగిన యుద్ధంలో అజర్‌బైజాన్‌కు చెందిన కొన్ని ప్రాంతాలను అర్మేనియా ఆక్రమించుకొందని, ఆ ప్రదేశాల నుండి బేషరతుగా అర్మేనియా తన సైన్యాలను ఉపసంహరించుకోవాలని 1993 లోనే ఐక్యరాజ్య సమితి ఒక తీర్మానం ద్వారా అర్మేనియాకు సూచించింది.

శాంతి చర్చల సందర్భంలో కాకసస్ పర్వత శ్రేణుల మధ్య నెలవై ఉన్న ఈ రెండు దేశాలు నగోర్నో కరబఖ్ తమ స్థితిగతులపై తామే నిర్ణయం తీసుకునేందుకు వీలుగా ప్లెబిసైట్ (ప్రజా అభిప్రాయ సేకరణ) నిర్వహించాలని, అంతకు ముందు ఆ ప్రజలపై ఎవరి అధికారం లేకుండా స్వయం పరిపాలనకు అవకాశం ఇవ్వాలని కూడా నిర్ణయించాయి. నగోర్నో కరబఖ్ తన స్వంత న్యాయ వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటుందని, పాల్గొనడానికి దేశం హోదా అవసరం లేని అంతర్జాతీయ సంస్థలలో తానే స్వయంగా తన స్వంత ప్రతిపత్తితో పాల్గొంటుందని కూడా రెండు దేశాలు తీర్మానించుకున్నాయి. అంటే, పేరుకు ఒక ప్రాంతంగా ఉంటుంది కాని, అన్ని విధాలా స్వతంత్ర దేశానికి ఉండే ప్రతిపత్తి ఉంటుందన్న మాట.

కాని ఆచరణలో ఇవన్నీ శుష్క వాగ్దానాలేనని రుజువయ్యింది. అడపా దడపా యుద్ధాలు చేసుకుంటూ రెండు రాజ్యాలు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించాయని సరస్పర ఆరోపణలు చేసుకుంటూనే ఉన్నాయి. ఇప్పటికే అజర్‌బైజాన్ రక్షణ వ్యయం అర్మేనియా దేశం మొత్తం బడ్జెట్ కంటే ఎక్కువ. దాని వెనక టర్కీ ఉంది. చమురు వ్యాపారం తెస్తున్న లాభాలు ఉన్నాయి. అర్మేనియాకు రష్యా మద్దతు ఉంది. రష్యాకు అర్మేనియాకు మధ్య రక్షణ ఒప్పందం కూడా ఉంది. అర్మేనియా పైకి ఏదైనా శత్రు దేశం దండెత్తితే, అర్మేనియా పక్షం వహించి రష్యా ఆ యుద్ధంలో పాల్గొనే వీలుంటుంది.

యూరప్ ఖండానికి చమురు, గ్యాస్ సరఫరా చేసే బ్యారెళ్లు ఉండిన మార్గంలో ఉన్నాయి ఈ రెండు దేశాలు, తగాదాలో ఉన్న ప్రాంతం కూడా. దానివల్ల ప్రాధాన్యత సంతరించుకున్న ఈ రెండు దేశాలు తమ తమ ప్రజలలో జాతీయ వాదాన్ని రేకెత్తించి సమస్యను పరిష్కారం వైపు కాకుండా, కొనసాగింపు వైపు మొగ్గు చూపుతూ జటిలం చేస్తున్నాయి. రాజకీయ నిశ్చయం. ఇరు పక్షాలలోను లోపించడమే వివాదం కొనసాగడానికి అసలు కారణం. బయటి శక్తులు తమ స్వప్రయోజనం కోసం అజర్‌బైజాన్, అర్మేనియా ఆంతరంగిక వ్యవహారాలలో తలదూర్చడం కూడా సమస్య పరిష్కారం కాకపోవడానికి మరొక కారణం. టర్కీ నాటో (ఎన్ఎటిఒ) వ్యవస్థలో సభ్యదేశం.

ఎన్ఎటిఒతో రష్యాకు సత్సంబంధాలున్నాయి. అర్మేనియాకు రష్యాతో ఆర్థిక సంబంధాలతో పాటు, రక్షణ ఒప్పందం కూడా ఉంది. ఈ కారణం చేత అర్మేనియాపై దండుడుకు చర్యకు ఉపక్రమించడానికి టర్కీ వెనకాడుతున్నది. ఎన్ఎటిఒతో సంబంధాలు బెడిసిపోకూడదు, అర్మేనియాతో స్నేహం వదులుకోకూడదు. కాబట్టి రష్యా పెద్దన్న పాత్ర వహించి ఇరు దేశాల మధ్య రాజీ ప్రయత్నాలు ప్రారంభించింది. గత నెల (2020 అక్టోబర్ 8) రష్యా, ఫ్రాన్స్ ప్రోద్బలంతో మాస్కోలో అర్మేనియా, అజర్‌బైజాన్ దేశాల మధ్య ఉన్నతస్థాయి చర్చలు జరిగాయి. ఆ చర్చల్లో అజర్‌బైజాన్ అధ్యక్షుడు, అర్మేనియా ప్రధాన మంత్రి పాల్గొన్నారు.

సంధి అయితే కుదిరింది. కాల్పుల విరమణకు రెండు దేశాలు అంగీకరించాయి. రెండు వారాలుగా జరుగుతున్న యుద్ధానికి తెరదించాలని ఒప్పందం చేసుకున్నాయి. ఈ ఘర్షణలో 400 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. కాల్పుల విరమణతో పాటు, యుద్ధ ఖైదీల మార్పిడికి కూడా అంగీకారం కుదిరిందని, చనిపోయిన వారిని గుర్తించి శవాలను వారి కుటుంబాలకు అందజేస్తామని ఇరు దేశాల విదేశాంగ మంత్రులు ప్రకటించారు. కాని, కాల్పుల విరమణ ఒప్పందంపై వారు చేసిన సంతకాలలోని సిరా ఆరిపోకుండానే, కొన్ని గంటలు గడవకుండానే ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. శాంతి ఒప్పంద ఉల్లంఘనకు మీరంటే మీరే బాధ్యులని ఇరు దేశాలు ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించారు. కాల్పులు, చొరబాట్లు యథావిధిగా సాగుతూనే ఉన్నాయి.

శాంతి ఒప్పందాన్ని కచ్చితంగా అమలు పరుస్తూ, 1994లో ఇరు దేశాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంలోని అంశాలను తుచ తప్పకుండా ఆచరణలో పెట్టడమే నగోర్నో – కరబఖ్ సమస్యకు సరైన పరిష్కారంగా గోచరిస్తున్నది.

(రచయిత జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్) వీ

ప్రొ. సేపూరి శేషయ్య



పౌరహక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్–తెలంగాణ రాష్ట్రాల సమన్వయ కమిటీ కన్వీనర్, కోఆర్డినేషన్ ఆఫ్ డెమాక్రటిక్ రైట్స్ ఆర్గనైజేషన్ (సిడిఆర్ఒ) బాధ్యులు ప్రొ. సేపూరి శేషయ్య (66) అక్టోబర్ 10న హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతిచెందారు. 1954లో కర్నూలు జిల్లా నందికొట్కూరులో జన్మించిన శేషయ్య తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎల్ఎల్‌బి, ఎల్ఎల్ఎం చదివారు. ఆయన రాడికల్ విద్యార్థి సంఘ రాష్ట్ర స్థాయి నాయకుడిగా పనిచేశారు. న్యాయశాస్త్ర అధ్యాపకుడిగా ఏలూరులో కొద్ది కాలం పనిచేసి అనంతపురం శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ లా విభాగంలో లెక్చరర్‌గా చేరి ప్రొఫెసర్‌గా, హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్‌గా పనిచేశారు. ఆయన పౌరహక్కుల ఉద్యమంలో 1986 నుండి చివరి దాకా కొనసాగారు. పౌరహక్కుల అవగాహన, పౌర హక్కుల ఉద్యమానికి, ఇతర ప్రజా ఉద్యమాలకు సంబంధం విషయాలలో అంతర్గత చర్చలో కీలక పాత్ర వహించారు. బాలగోపాల్ నాయకత్వంలో కొందరు కార్యకర్తలు పౌరహక్కుల సంఘం నుంచి విడిపోయి మానవ హక్కుల వేదిక ఏర్పాటు చేసుకొన్న సందర్భంలో ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘానికి దృఢమైన, క్రియాశీల, సైద్ధాంతిక నాయకత్వం అందించారు. పౌరహక్కుల సంఘం నాయకత్వ బాధ్యతల్లోకి వచ్చాక అనేక బెదిరింపులను, దాడులను ఎదుర్కొన్నారు. 2000 నవంబర్ 23న హైదరాబాద్ నడిబొడ్డున పట్టపగలు జరిగిన పురుషోత్తం హత్య, వెనువెంటనే జనవరిలో పురుషోత్తం సంస్మరణ సందర్భంగా అదే పద్ధతిలో ఆజాం అలీ హత్య జరిగిపోయాయి. రాష్ట్ర వ్యాప్తంగా పౌరహక్కుల కార్యకర్తలను, ప్రజాసంఘాల నాయకులను చంపుతామని బెదిరింపులు వచ్చాయి. 2005లో సరిగ్గా పురుషోత్తం హత్య జరిగిన నవంబర్ 23న శేషయ్య ఇంటిపై రాయలసీమ టైగర్స్ పేరుతో దాడి జరిగింది. పెట్రోల్ క్యాన్లతో జొరబడిన దుండగులు ఆయన కారును కాల్చి, ఇంటి మీద కూడా పెట్రోల్ పోసి బీభత్సం చేశారు. ఎన్ని అవరోధాలు ఎదురైనా జంకకుండా అధ్యయనశీలిగా, లోతైన రచయితగా, ఆకర్షణీయమైన వక్తగా, స్నేహశీలిగా వేలాది మంది అభిమానాన్ని చూరగొన్నారు.

గుండా మల్లేశ్



సిపిఐ సీనియర్ నాయకులు, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మాజీ ఎంఎల్ఎ గుండా మల్లేష్ (73) తీవ్ర అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ అక్టోబర్ 13న మృతిచెందారు. మల్లేష్ ఆదిలాబాద్ జిల్లా తాండూర్ మండలం రేచిని గ్రామంలో 1947, జూలై 14న జన్మించారు. ఎచ్ఎస్‌సి వరకు చదువుకున్న ఆయన మొదట్లో లారీ క్లీనర్, డ్రైవర్‌గా పనిచేస్తూ వారి సమస్యలపై పోరాడారు. ఆ తర్వాత సింగరేణి కార్మికుడిగా చేరి సిపిఐలో సభ్యత్వం తీసుకున్నారు. 1970లో ఉద్యోగానికి రాజీనామా చేసి పూర్తిస్థాయి రాజకీయాలవైపు మారారు. నాలుగు సార్లు ఎంఎల్ఏగా గెలిచారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సిపిఐ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేశారు. బెల్లంపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు కృషిచేశారు. శాసనసభ్యుడిగా ఎన్నో రాష్ట్రవ్యాప్త ప్రజా సమస్యలపై సిపిఐ పక్షానా, ఇతర పార్టీలతో, ప్రజా సంస్థలతో ఐక్య సంఘటనలలోనూ కృషి చేశారు.

డా. శోభానాయుడు



కూచిపూడి నాట్య చరిత్రను ప్రపంచం నలుదిశలా పరిచయం చేసిన నాట్యకారిణి, పద్మశ్రీ డా. శోభానాయుడు(64) అక్టోబర్ 14న హైదరాబాద్‌లో మృతిచెందారు. శోభానాయుడు విశాఖపట్నం జిల్లా అనకాపల్లిలో 1956లో జన్మించారు. ఆమె తన ఐదవ ఏటనే నాట్య ప్రస్థానాన్ని ప్రారంభించి, ఆరవ ఏట తొలి నృత్య ప్రదర్శన ఇచ్చారు. 12 సంవత్సరాలు పట్టుదలతో కూచిపూడి నృత్యాన్ని అభ్యసించి, కఠోరశ్రమతో విశ్వవిఖ్యాత కూచిపూడి కళాకారిణిగా ఎదిగారు. ప్రధానంగా సత్యభామ, చండాలిక, పద్మావతి, మోహిని కృష్ణ, సాయిబాబా, వివేకానంద తదితర పాత్రలను పోషించి వాటికి జీవం పోశారు. భారతప్రభుత్వం కూచిపూడి నృత్య ప్రచార అంబాసిడర్‌గా గుర్తించింది. ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో దేశాల్లో నృత్య ప్రదర్శనలిచ్చారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. హైదరాబాద్‌లో శ్రీనివాస కూచిపూడి అకాడమీని స్థాపించి మూడు దశాబ్దాలుగా వేలాది మందికి శిక్షణ ఇచ్చారు. వందకు పైగా సోలో కొరియోగ్రఫీ సృష్టికర్త, ఇరవై ఐదుకు పైగా కూచిపూడి నృత్యరూపకాల సృజనశీలి.

పెద్ది క్రిష్ణ



విప్లవ రచయితల సంఘం సీనియర్ సభ్యుడు, ప్రజా కవి పెద్దిక్రిష్ణ (58) విజయవాడ కృష్ణలంకలోని తన స్వగృహంలో అక్టోబర్ 23న మృతిచెందారు. ఆయన కాలేయ సమస్యతో బాధపడుతున్నారు. విరసంతో కృష్ణ అనుబంధం రెండు దశాబ్దాలకు పైగా కొనసాగుతోంది. గతంలో ఆయన కృష్ణా జిల్లా కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. విజయవాడ ఆటోనగర్ కార్మికవాడలో పనిచేస్తున్న సమయంలో ట్రేడ్ యూనియన్‌లకు సంబంధం ఏర్పడి ఆటోనగర్ వర్కర్స్ యూనియన్‌లో చేరారు. క్రమంగా రాడికల్ యూత్‌లీగ్ కార్యకర్తగా మారారు. 1986లో కృష్ణా జిల్లా గన్నవరం సమీపంలో బస్సు దహనం కేసులో ఆయనను అరెస్టు చేసి టాడా కేసులో నిర్బంధించారు. ఆ తర్వాత నగర పేదల భూ పోరాటాలలో, కృష్ణా ముంపు బస్తీల ఆందోళనల్లో, రిక్షా కార్మికుల ఉద్యమాల్లో పాల్గొంటూ రచనలు చేస్తూ విరసంలో చేరారు.

డిసెంబ్రిస్ట్ సైనిక తిరుగుబాటు పరిణామాలు - 9

***జారిజం మీద 1825 డిసెంబర్‌లో జరిగిన తిరుగుబాటు రెండు వందల సంవత్సరాల తర్వాత కూడా ప్రభావం చూపుతున్నదంటున్నారు* ఎన్.వి.యస్. నాగభూషణ్**

(సవరణ – అక్టోబర్ 2020 సంచికలో ఈ వ్యాసం అయిపోయిందని పొరపాటున ప్రచురించాం. మన్నించగలరు. – సం.)
(గత సంచిక తరువాయి)

నికొలాస్1 పాలన ప్రారంభంలోనే డిసెంబ్రిస్టుల తిరుగుబాటు జరగడం ఒక్కటే కొత్త చక్రవర్తి దృష్టి కఠినంగా ఉండడానికీ, విప్లవంపై దృఢ సంకల్పంతో పోరాడుతూ, దాని అంతు కనుక్కోవడానికీ కారణమైందని చెప్పవచ్చు. అది అతడికి ప్రభువర్గేతర భూస్వాముల యెడ కూడా అనుమాన దృక్కులు జరపడానికీ, అదే క్రమంగా బలబడి, ప్రభువర్గం పైన కూడా సందేహించడానికి కూడా కారణమైంది. ఫలితంగా నీకొలాస్1 భూస్వాముల్ని అధికార చట్రం నుండి దూరంగా ఉంచి, కేవలం సైనిక వర్గం వారినే వ్యక్తిగతంగా ప్రభువర్గంలోకి ఎదిగేందుకు అవకాశమివ్వసాగాడు. (జార్‌ల కాలంలో సైన్యంలో విశేషసేవ చేసిన వారికి, పదవీ విరమణానంతరం వందలాది ఎకరాల ఎస్టేట్లను కట్టబెడుతూ, ఆయా ప్రాంతాల గవర్నర్లుగా నియమిస్తుండడమే గాక, దాంతో పాటు వారికి ప్రభువర్గ హోదా కూడా కట్టబెడుతుండేవారు – రచ.) నీకొలాస్1 కాలంలో ప్రధానమైన అధికార కేంద్రాలుగా సైనికతత్వం, ఉద్యోగస్వామ్యం తయారైంది. జార్ చక్రవర్తి చుట్టూ సైనిక వ్యక్తులే చేరి ఉండేవారు. అంతేగాక అతడి పాలనా కాలం తరువాతి భాగంలో అతడి సహాయకులుగా ఎలాంటి పౌర సంబంధ అధికారులూ ఉండకుండా, కేవలం సైనిక సంబంధ అధికారులే కనిపించసాగారు.

నీకొలాస్ తన ఆలోచనలనూ, లక్ష్యాలనూ, 1826 జూలైలో ఒక ప్రకటన రూపంలో విడుదల చేశాడు. అందులో అతడు డిసెంబ్రిస్టులను మానవత్వంలేని క్రూరులుగా అభివర్ణించాడు. వారంతా విదేశీయుల చేత ప్రభావితులైన వారనీ, వారి ప్రణాళికల్ని రష్యన్ ప్రజలు తిరస్కరించారనీ, వారెంతో దిగజారిపోయి రాజరికాన్ని అడ్డుకోవాలని చూశారనీ, ఆగ్రహం వ్యక్తం చేశాడు. అతడు తన ప్రకటనలో, రష్యన్ ప్రజలు అధికార తత్వాన్ని ప్రేమిస్తారనీ, అందువల్ల అలాంటి స్వభావం గల నిరంకుశతత్వం గల రాజరికాన్ని యథాయథంగా కొనసాగించాలనీ చెప్పాడు. తన పాలనా కాలం యావత్తూ నీకొలాస్1 డిసెంబ్రిస్టు సంఘటనలవల్ల తీవ్ర ఉద్రిక్తత పొంది అలాగే కొనసాగాడు. ఇది అతడి మీద చోదక శక్తిగా పనిచేసి, ఎలాంటి రాజకీయపరమైన ఉదార చర్యనైనా తిరస్కరించడానికి కారణమైంది. నీకొలాస్ బృందాలపట్లే గాదు, వ్యక్తుల పట్ల కూడా అత్యంత కఠినంగా, క్రూరంగా ఉండడానికే ప్రాధాన్యత నిచ్చాడు. వారంతా ప్రశ్నించ వీలులేని తన అధికారానికి అడ్డంకులుగా మారతారని అనుమానించేవాడు.

నీకొలాస్1 ఒక వెల్లువగా అణచివేత రూపాలను వేర్వేరు వాటిని ప్రయోగిస్తూ, ఉదారవాద భావాలు వ్యాపించకుండా అడ్డుకుంటూ, యథాతథ పరిస్థితి కొనసాగేందుకు కృషిచేశాడు. అతడు పుస్తక ప్రచురణల మీద కూడా తీవ్రమైన సెన్సార్‌షిప్పును ప్రయోగిస్తూ, అధికారుల మీదా, సైన్యం మీదా దృఢమైన పట్టును చూపించాడు. ఉదారవాదం యెడ తనకుగల శత్రువైఖరి అత్యంత దుర్మార్గపూరితంగా, కొట్టొచ్చినట్లు కనిపించిన రంగాలు సాంస్కృతిక, విద్యా రంగాలే! అతడు పేద ప్రజలకు విద్యనందించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు. కారణం, కింది తరగతి జనం సాధారణ ఆలోచనా ధోరణిలోనే ఉండేట్టు చూస్తూ, తద్వారా ప్రమాదకరమైన ఉదారవాద భావాలు వారి దరికి చేరకుండా అడ్డుకోవాలని అతడి ఆలోచన. అయితే నీకొలాస్1 డిసెంబ్రిస్టు విప్లవం వల్ల అసలే గుణపాఠాలూ గ్రహించలేదనడం సరికాదు. బానిస రైతాంగం తీవ్రంగా ఖండించదగిన దుస్థితిలో ఉండడం పట్ల అతడు కొన్ని జాగ్రత్తలు తీసుకున్నాడు. వారి జీవన పరిస్థితులు మెరుగుపరిచేలా కొన్ని సంస్కరణలు అవసరమనీ, తద్వారా వారిని తిరుగుబాటు వైపు వెళ్లకుండా నిలువరించవచ్చుననీ అనుకున్నాడు. అయితే ఈ సంస్కరణలు పైనుంచీ జరగాలని భావించి, అందుకనుగుణంగా 1833 నుంచీ కొన్ని ఆజ్ఞలు జారీ చేశాడు. ఈ ఆజ్ఞల లక్ష్యం రాజ్య బానిసల పరిస్థితి ఇసుమంత మెరుగుకావడం! దీనివల్ల వారి వర్గ స్థితిగతుల్లో ఎలాంటి మార్పులూ జరగవు. తద్వారా నీకొలాస్1 సంప్రదాయిక పద్ధతుల సంస్కరణల పంథాను పై చర్యల ద్వారా పటిష్టపరుస్తూ, తన అణచివేతకు ఆధునిక నైపుణ్యాలను జోడించాడు.

నీకొలాస్1, అన్ని ఉదారవాద భావాల మీద నిర్దయగా తను ప్రయోగించే అణచివేత మరింత బలంగా ఉండేందుకు, పోలీసు శాఖలో ఒక ప్రత్యేక డిపార్టుమెంటును కొత్తగా నెలకొల్పేందుకు చర్య తీసుకున్నాడు. దానిపేరు 'ఛాన్సలర్ ఆఫీసు మూడో సెక్షన్'. ఈ ప్రత్యేక డిపార్టుమెంటును మొత్తం రాజ్యాన్ని జిల్లాల వారీగా విభజించి, మొత్తం రాజ్యమంతా పనిచేసేలా ఏర్పరచాడు. ఈ డిపార్టుమెంటు ఉన్నత పోలీసు అధికారులు గల సంస్థ. దీనిని డిసెంబ్రిస్టు తరహా తిరుగుబాటు తరహా కార్యక్రమాలకు ఏమాత్రం ఆస్కారం ఇవ్వకుండా నిరోధించేలా రూపొందించాడు. ఈ కొత్త డిపార్టుమెంటు అన్ని రకాల రహస్య సొసైటీలనూ తుడిచిపెట్టేస్తుంది. అంతేగాక, అందుకు అదనంగా రహస్య ఏజెంట్ల వలను దేశమంతా అల్లుకునేలా ఏర్పాట్లు చేసి, దేశంలో జరిగే అన్ని రకాల రాజకీయ, మత సంబంధ ప్రత్యర్థులనూ, అలాగే రష్యాలో నివశించే విదేశీయుల్నీ, ఇతర అనుమానితుల్నీ నిశితంగా పరిశీలిస్తుంది.

నీకొలాస్1 ఏ విధంగా తన అణచివేత విధానాలను అతి నిర్దయగా ప్రయోగిస్తున్నాడో, అలాగే అతడి మంత్రులు కూడా అంతకన్నా నిర్దయగా తమతమ శాఖలలో అమలు చేస్తూ అతడికి తగిన మంత్రులుగా పేరు పొందారు. విద్యా మంత్రిగా పనిచేసిన కౌంట్ 'సెర్గీ ఉవరోవ్' ఈ విషయంలో రెండాకులు ఎక్కువే చదివాడు. రష్యాలోకి నూత్న భావాల వెల్లువను పారనీయకుండా అడ్డుకోవడం కోసం ఎలాంటి ముందు జాగ్రత్తలు తీసుకోవాలో అన్నీ తీసుకుంటూ ఇతడు విశ్వవిద్యాలయాలలో కఠిన పాలనను ప్రవేశపెట్టాడు. ఇతను అధికారంలో ఉండగానే ప్రొఫెసర్ల నియామకాలూ, విద్యార్థుల మీద పట్టు కలిగి ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవడం, అలాగే పాఠ్యాంశాల నిర్ణయం – వీటన్నింటి మీద పర్యవేక్షణ

అంతా విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోకి వచ్చింది. ప్రభుత్వానికి విద్యావంతులైన సేవకుల అవసరం కొద్దిగానే ఉన్నందున, పరిమిత సంఖ్యగల విద్యార్థులనే విశ్వవిద్యాలయలలోకి అనుమతించసాగారు.

(2) అధికారిక దేశభక్తి సిద్ధాంతం

మామూలు పరిస్థితుల్లోనైతే నీకొలాస్ లాంటి చక్రవర్తులు, రాజకీయంగా అత్యున్నతాధికారాన్ని పొందినవాళ్లు, జాతీయవాద దేశభక్తి సిద్ధాంతాల పట్ల ఆకర్షితులు కారు. నీకొలాస్ రష్యా లాంటి 200కు పైగా నానా జాతులతో నిండి ఉన్న రాజ్యానికి చక్రవర్తి. మరి ఇలాంటి అధికార స్థానంలో ఉన్నవాడు ఇలాంటి సిద్ధాంతాలను చేపడితే తీవ్రమైన వ్యతిరేక ఫలితాలుంటాయి. అయినప్పటికీ ఈ దేశభక్తి తత్వం యూరప్‌లో ఎక్కువ మంది ప్రజల అభిమానానికి పాత్రమైంది. అంచేత దీన్ని పూర్తిగా పక్కనబెట్టే పరిస్థితి నీకొలాస్1కి లేదు. నిజానికి అతడు డిసెంబ్రిస్టు తిరుగుబాటు జరిగిన తర్వాత చేసిన ప్రకటన లోతుగా చూస్తే, దేశభక్తికీ, దీనికీ సంబంధం లేనట్లు అర్థమవుతుంది. అయినప్పటికీ ఈ ప్రకటన, రష్యన్ ప్రజల మీద ప్రభావాన్ని నెరపడంలో ఉపయోగపడి, జార్‌కి విధేయంగా ఉండేలా చేయడంలో తోడ్పడింది. నిజానికి నీకొలాస్1 ఈ దేశభక్తి సిద్ధాంతానికి వేరే రంగులు వేసి, వేరే రూపంలో తయారు చేసి, పాత పేరే దేశభక్తి పేరు పెట్టడం జరిగింది. ఇది రష్యన్ తరహా దేశభక్తి సిద్ధాంతంగా చెప్పవచ్చు. దీన్ని మరో విధంగా చెప్పాలంటే, రష్యా గురించిన ప్రతి దానికీ జారే ప్రాతినిధ్యం వహిస్తాడని (చెప్పడమే) భావించడమే రష్యన్ దేశభక్తికి గుర్తింపు అనుకునేట్లుగా. అందుకు విరుద్ధంగా యూరప్‌లో, దేశభక్తి అంటే తమ దేశాన్ని బలపరుస్తూ, పరదేశాల్ని వ్యతిరేకించడం! కానీ ఇది రష్యాలో తమ రాజుతో ముడిపడి ఉంది. నీకొలాస్ పాలనా కాలంలో రష్యన్ దేశభక్తి విషయంలో దాని నిర్ణేత నీకొలస్సే!

దీని ప్రకారం తన పాలనకు ఏమాత్రం ఎదురు లేకుండా చేసుకోవడానికి, దేశభక్తి అనే పనిముట్టుని నీకొలాస్ ఉపయోగించు కున్నాడని చెప్పాలి. ఈ విధంగా రష్యన్ ప్రభుత్వం 1833లో మొదటి సారి, ఒకే ఒక్క సారి బోల్షివిక్‌లు అధికారాన్ని వశపరుచుకునేదాకా, ఒక అధికారిక సిద్ధాంతాన్ని రూపొందించింది. ఈ సిద్ధాంతమే ఆ తర్వాత అధికారిక దేశభక్తిగా ముద్రవేసుకోబడగా, దానిమూలం 1832 మార్చ్‌లో కౌంట్ సెర్గీ ఉవరోవ్ రూపొందించిన సిద్ధాంతం. అతడు దీన్ని రూపొందించి నీకొలాస్‌కి అందించాడు.

రష్యన్ దేశభక్తి సిద్ధాంతం మూడు రకాల ఆలోచనల ఆధారంగా రూపొందించబడింది. అవి 1) సంప్రదాయికత, 2) ఏకవ్యక్తి నిరంకుశత్వం, 3) దేశభక్తి. వీటిలో సాంప్రదాయికత అంటే, 'రష్యన్ సాంప్రదాయిక (ప్రాచీన) చర్చి' పట్ల భక్తి (సెయింట్ పీటర్ ఊహించినట్లుగా రష్యాను రూపొందించే మార్గానికి తీసుకెళ్లడం); ఇక రెండో విషయానికి వస్తే, ప్రాచీణ మాస్కోవైట్ కాలపు రాజరికానికి, రష్యన్ సామ్రాజ్యపు ప్రాచీన రాజ్య స్వరూపానికి తీసుకెళ్లడం; ఇక చిట్ట చివరి అంశమైన దేశభక్తి అంటే, ఉవరోవ్ ఆలోచన ప్రకారం, ప్రాచీన రష్యన్ సంప్రదాయాల పట్ల భక్తిభావం కలిగి ఉండేలా ప్రజల్ని సంసిద్ధం చేయడం. అంటే, పశ్చిమ యూరప్ వారి ఆలోచనల్ని తిరస్కరిస్తూ, ప్రతిదాన్నీ రష్యన్ విధానంలో తీర్చిదిద్దడం!

పై విధంగా రూపొందించబడిన రష్యన్ అధికారిక దేశభక్తి సిద్ధాంత భావన 1917 ఫిబ్రవరి విప్లవం దాకా అమలు జరిగింది. అయితే నీకొలాస్1 తర్వాత అధికారంలోకి వచ్చిన అలెగ్జాండర్2 ఒక్కడు మాత్రమే ఈ సిద్ధాంతాన్ని గట్టిగా అనుసరించలేదు గానీ, తర్వాతి ఇద్దరు జార్‌లూ – అలెగ్జాండర్3, నీకొలాస్2లు ఇద్దరూ ఈ సిద్ధాంతాన్ని అత్యంత పకడ్బందీగా అనుసరించి పాలించారు.

(3) పాశ్చాత్య వాదులకూ, ప్రాచీన వాదులకూ మధ్య శతృత్వం

డిసెంబ్రిస్టు తిరుగుబాటు అనంతరం, విప్లవోత్సాహం ప్రభువర్గం నుండీ, అధికారుల నుండీ కూడా ఒక కొత్త తరానికి చెందిన మేధావులకు పాకింది. 1830 ప్రాంతంలో రష్యన్ మేధావులకు ఒక అంతుచిక్కని సమస్య బాధించింది – అదేమిటంటే, తమ దేశ సంస్కృతి స్వభావాన్ని ఎలా నిర్వహించాలా అన్నది, అలాగే ఆ సంస్కృతి పాత్ర ఏమిటి అని!ల ఎందుకంటే, ఆ సంస్కృతి భౌగోళికంగా యూరప్, ఆసియా ఖండాల మధ్య నెలకొన్నది. చరిత్ర పరంగా చూస్తే, ఆ సంస్కృతి యూరప్ నుంచి వేరు చేస్తున్నది. కానీ సాంకేతికంగా, సంస్కృతీ పరంగా కూడా క్రమంగా యూరప్‌తో అనుబంధం కోసం నెట్టబడుతోంది, 18వ శతాబ్దపు పాశ్చాత్యీకరణవైపుగా! ఇదే రష్యాని రెండు రాజధానుల వైపుగా, అందులో ఒకటి దేశీయంగా ఉండే బైజాంటియన్ మాస్కో, రెండోది పాశ్చాత్యీకరణ చెందిన సెయింట్ పీటర్ బర్గ్ వైపుగా నెట్టుతోంది! ఇది రష్యన్ సమాజాన్ని కూడా రెండుగా చీల్చింది, ఒకటి పాశ్చాత్యీకరణ చెందిన విద్యావంతుల వర్గంగా, రెండోది సామాన్య జనుల వర్గంగా. తద్వారా పూర్వకాలపు ఆచారాలు పలచబడిపోతున్నాయి. ఇలాంటి ప్రాథమిక స్థితివల్ల, పరస్పర విరుద్ధ భావాలు గలవిగా రష్యన్ల ఆలోచనా విధానాలు రెండు రకాల శిబిరాలను ఏర్పరచాయి – అవి 1) పాశ్చాత్యావాదుల శిబిరం, 2) సంప్రదాయ వాదుల శిబిరం.

పై రెండు గ్రూపులలోనూ పాశ్చాత్యావాదులైన రష్యన్ మేధావులు భూస్వామ్యాన్ని వ్యతిరేకిస్తున్నారు. వీరిలో ప్రముఖులు – అలెగ్జాండర్ హెర్జెన్, తిమోఫెయ్ గ్రనోవ్‌స్కీ, నికొలాయ్ ఒకర్యోవ్, వాసిలీబోత్కిన్, నికొలాయ్ కెచ్చెర్, యెవ్‌గెనీ కోర్ష్, కొన్‌స్తాన్తిన్ కవేలిన్, మరికొందరూ ఉన్నారు. వీరు మాస్కోలో పాశ్చాత్యావాదుల బృందాన్ని ఏర్పాటు చేశారు. ప్రముఖ సాహిత్య విమర్శకుడూ, విప్లవకర ప్రజాస్వామికవాదీ అయిన విస్సారియో బెలిన్‌స్కీ సెయింట్ పీటర్స్ బర్గ్‌లో నివసిస్తూనే, ఈ బృందంతో దగ్గర సంబంధాలు కొనసాగించాడు. ఈ పాశ్చాత్యావాదులు బానిసత్వాన్ని తీవ్రంగా ఖండించడమే గాక, పాశ్చాత్యా ధోరణులు గల సాంఘిక, ఆర్థిక సంస్కరణలు కావాలని వాదించేవారు. వారి లక్ష్యం రష్యా ఎలా ఉండాలనేది, అది ఆచరణలో ఎలా ఉంటుందో వారు సవివరంగా సోదాహరణపూర్వకంగా తెలిపేవారు. ఈ పాశ్చాత్యావాదులు – రష్యా తన సాంఘిక, ఆర్థిక వెనుకబాటు తనాన్ని అభ్యుదయ యూరపియన్ అనుభవాలతో ఎలా అధిగమించవచ్చునో చెబుతుండేవారు. అలాగే ఒంటిపాటుగా ఉండే జాతీయ సంస్కృతిని బలపరుస్తుండేవారి వెంట నడిస్తే ఉపయోగం లేదని కూడా బలంగా చెప్పేవారు.

పాశ్చాత్య అనుకూల వాదులు ప్రధానంగా దృష్టి కేంద్రీకరించింది – విశ్వ మానవ దృష్టికీ, దేశభక్త దృష్టికీ మధ్య స్నేహ సంబంధాలుండాలన్న విషయం మీద. యూరప్ రాజకీయ ఆర్థిక స్వరూపాలు – రష్యన్ స్వరూపం కన్నా ఎలా ఉన్నత స్థానం గలవో వారు వివరించేవారు. అవి అలాంటివి కాబట్టే, చరిత్ర కూడా తనంతట తానే వాటిని ప్రతిబింబిస్తుందనీ, డిసెంబ్రిస్టు తిరుగుబాటుకి ముందే అటువంటి రూపం కోసం ప్రభుత్వానికి ఒక ప్రణాళికను ప్రభుత్వం నియమించిన కమిటీలే సూచించినప్పటికీ ప్రభుత్వం వాటిని పాటించలేదనీ, డిసెంబ్రిస్టు తిరుగుబాటు జరిగింది అలాంటి లక్ష్యం కోసమేననీ వారు వాదించారు. అందువల్ల చరిత్ర దర్శకత్వంలో పాశ్చాత్యీకరణ క్రమం అనివార్యంగా ముందుకు నెట్టబడుతుందని వారు గట్టిగా విశ్వసించారు. నిజంగా ఆ తర్వాత అనతికాలంలోనే జరిగింది వీరి విశ్వాసాలకు అనుగుణంగానే నన్నది చరిత్ర నిరూపించడాన్ని మనం చూడగలం.

1840 మధ్యలో ఈ ఉద్యమం ఉదారవాద విప్లవాత్మక ప్రజాస్వామిక ఉద్యమాల పేరిట రెండుగా చీలిపోవడం గమనార్హం! ఉదారవాద శాఖలో

అన్నెన్కోవ్, గ్రినోవ్స్కీ కవేలిన్, మరికొందరూ ఉండగా; విప్లవకర ప్రజాస్వామిక శాఖలో హెర్జెన్, ఒగర్యోవ్, బెలిన్స్కీలు ఉన్నారు. ఈ రెండు బృందాలకూ రష్యా సంస్కరణ పద్ధతులపైన, సంస్కరణానంతరం జరగాల్సిన అభివృద్ధి పైన భిన్నాభిప్రాయాలున్నాయి. వీరిలో ప్రజాస్వామిక వాదులు విప్లవ పోరాటాన్నీ, సోషలిజం నిర్మాణాన్నీ వాదించడం విశేషం!

ఇక సాంప్రదాయిక వాదమైన రష్యన్ వాదాన్ని 'స్లావోఫిలిజం' అంటారు. ఈ పదబంధం 'సిద్ధాంతపరమైన భావాలు కలిగిన, దేశభక్తి భావాలుగల వారి సిద్ధాంతం' అనే భావాన్ని తెలియజేస్తుంది. ఈ బృందం పాశ్చాత్యవాద బృందానికి వ్యతిరేకంగా ఏర్పడింది. కవి అయిన 'కొన్స్తాన్తిన్ బత్యుష్కోవ్' మొట్ట మొదటి సారిగా ఈ 'స్లావో ఫిల్' అనే పదబంధాన్ని ఉపయోగించాడు. ఈ పదబంధంలో 'స్లావో' అనేది రష్యన్ ప్రధాన జాతి అయిన 'స్లావో' జాతిపేరు అనేది అందరికీ తెలిసిందే. పీటర్ చాదాయేవ్ ప్రసిద్ధ మొదటి తాత్విక లేఖలో (1836లో ప్రచురింతం) ప్రచురితమైన విషయానికి ప్రతిస్పందనగా ఈ కవి స్లావో ఫైల్ అనే పదబంధాన్ని వాడాడు. రష్యన్ సంప్రదాయ వాదులైన స్లావో ఫైల్స్ (స్లావో ఫైల్ వాదులు) కూడా, పై పాశ్చాత్యవాదులు ప్రసిద్ధి చెందిన వ్యాక్తులుగా ఉన్నట్టే, వీరూ ప్రతిభావంతులైన, ప్రభువంశ కుటుంబాలకు చెందినవారే. వీరిలో కొందరు – ఇవాన్ కిరీవ్స్కీ అలెక్సీ ఖోమ్యానొవ్, కొన్స్తాన్తిన్ అక్సాకోవ్, యూరీసమారిన్ మొదలైనవారు. వీరి మేధో గృహం కూడా మాస్కోయే. ఎక్కడైతే వీరు విద్యావంతులయ్యారో అక్కడ రష్యన్ జీవితానికి సంబంధించిన అవినీతి చిరునామాగా వారు సెయింట్ పీటర్స్‌బర్గ్ నగరాన్ని గుర్తించారు. అది వారికి అనిష్టమైన 'పాశ్చాత్య' నగరం!

ఈ రష్యన్ స్లావో ప్రజల సంప్రదాయిక విశ్వాసులు – 'తూర్పు ప్రాంత ప్రాచీన చర్చి' మత విశ్వాసాన్ని అందిపుచ్చుకోవాలని ముందుగానే నిర్ణయించుకున్న 'రూస్' ప్రజలు ('రష్యా' అనే పదం ఈ 'రూస్' అనే పదం నుండే వచ్చింది), దీన్ని (తూర్పు ప్రాంత ప్రాచీన చర్చిని) జాతి ప్రత్యేక స్థానిక చర్చి మతంగా స్వీకరించారని బలంగా నమ్మారు. ఈ తూర్పు ప్రాంత ప్రాచీన చర్చిమతం (ఈస్టర్న్ ఆర్థడాక్సి) లో గుర్తించదగిన అంశం 'సొబొర్నోస్త్'. ఈ సొబొర్నోస్త్ అనే పదం సూచించే అంశాలు: ఐక్యత, కలయిక, మరింత ముఖ్యమైన అంశం రష్యన్ సామాజిక జీవితం! ఈ 'రష్యన్' అనే పదం ఆత్మలో అంతర్గతంగా ఉండే పునాదిని నిర్మించింది ప్రాచీనత, సాంప్రదాయిక రైతాంగ సామూహిక జీవనం! ఇంకా ఈ రష్యన్ సంప్రదాయిక వాదాలు మరింత ఉన్నతంగా ఊహించిందేమంటే, రష్యన్ జాతి దేశభక్తి స్వభావాన్నీ, సంప్రదాయిక వాదంలోని ముఖ్య సూత్రాలనూ, అలాగే సంప్రదాయిక వాదంలోని ఔన్నత్య స్ఫూర్తినీ కూడా. అదే సమయంలో వీరు మేధావులకు ఈ కింది విధంగా పిలుపునిచ్చారు – ప్రజలలో మమేకం కమ్మనీ, వారి జీవన విదానాన్ని అధ్యయనం చేయమనీ, అలాగే వారి భాషను కూడా అధ్యయనం చేయమనీ! భాష ఎందుకంటే, రష్యన్ ప్రభువర్గం వారు ఇప్పటి దాకా దేశీ భాష అయిన రష్యన్ భాషను బానిసల భాష అంటూ ఈసడించుకుని, తమ పిల్లలకు రష్యనేతర భాషలైన, సరిహద్దు ప్రాంతాలైన ఫ్రాన్స్, జర్మనీ దేశాల ఫ్రెంచి, జర్మన్ భాషల్ని, ఇంకా ఇంగ్లిష్, లాటిన్ భాషలను నేర్చుకునేందుకే, ముఖ్యంగా మొదటి రెండు భాషలను నేర్చుకునేందుకే ప్రాముఖ్యత నిచ్చేవారు. ఒకవేళ తమ పిల్లలు రష్యన్ భాషను నేర్చుకుంటున్నట్లు గానీ, ఆ భాషలో మాట్లాడడాన్ని గానీ చూస్తే తీవ్రంగా మందలించడం కూడా జరిగేదంటే అతిశయోక్తి కాదు.

రష్యన్ సంప్రదాయిక వాదుల ఆలోచనల్లో గల కీలకాంశం, పాశ్చాత్య దేశాలతో రష్యాకు గల సంబంధాలు, వీరి ఆలోచనలననుసరించి, రోమన్ వారసత్వానికి బయట ఉండిపోవడమే యూరప్ నుంచి రష్యాను వేరుచేస్తూ, రష్యాను ప్రత్యేకంగా నిలబెట్టింది. మరణ సదృశ్యమైన ఆ వారసత్వం నుండి రక్షించబడిన రష్యా, తద్వారా స్వచ్ఛమైన క్రిష్టియన్ సూత్రాలను అనుసరిస్తూ, తదనుగుణంగా గుర్తించబడిన, స్లావో రైతాంగ సామూహిక జీవన విధానంతో ఒక చక్కని సమన్వయాన్ని సాధించింది. ఇక పాశ్చాత్య దేశాలతై పసలేని హేతువాదమనే విషంతో కలుషితమై, వర్గ శతృత్వంతో తీవ్రంగా బాధింపబడుతోంది. కానీ రష్యా, తన బైజాంటియన్ వారసత్వం ద్వారా, అలాగే స్లావ్ సంబంధమైన స్ఫూర్తి ద్వారా, అలాంటి వాటి నుండి రక్షించబడింది.

ఈ 'రష్యన్ సనాతనవాదం' (స్లావ్ ఫిల్ ఐడియాలజీ) జాతి గుర్తింపులోనూ, దేశభక్తి వాదాన్ని మార్చడంలోనూ ముఖ్య భూమిక వహించింది. అంతేగాక ఈ సనాతనవాదం – రష్యన్ జాతి పరంగానూ, వ్యక్తిగత చైతన్యంలోనూ, వ్యక్తిగత అభివృద్ధి పొందడంలోనూ కూడా ఎంతో తోడ్పడిందనడం నిర్వివాదం. ఈ రష్యన్ సనాతన దృష్టి – వ్లదీమిర్ సోలోవియేవ్, నికొలాయ్ బెర్ద్యాయెవ్, సెర్గీబుల్గాకోవ్‌లు వెలువరించిన వారి సిద్ధాంతాలలోని తాత్విక దృష్టి కోణంలో కూడా ప్రతిఫలించింది (19వ శతాబ్దపు అంత్యకాలం, 20వ శతాబ్దపు ప్రారంభంలో). నిజానికి ఈ స్లావ్ జాతి సంబంధమైన సనాతనవాద సిద్ధాంతం (స్లావో ఫిల్ డాక్టరిన్) ప్రభావం ప్రస్తుత రష్యాలో కూడా సజీవంగా నిలిచే ఉంది. అదే చర్చ – రష్యా యూరప్‌కు చెందినదా, లేక తూర్పు దేశాలకు చెందినదా అనే ప్రశ్నలో.

పై వాదాలు ఎలా ఉన్నప్పటికీ, డిసెంబ్రిస్టు తిరుగుబాటు భవిష్యత్తు మేధో వర్గానికి ఒక నమూనాగా నిలవడమేగాక, వారినెంతో ప్రభావితం చేసిందని గట్టిగా చెప్పక తప్పదు. అంతేగాక, అన్ని రకాల భవిష్యత్తు తిరుగుబాటు దారులకూ – జారిస్టు పాలనకూ వ్యతిరేకంగా నిలవడంలో డిసెంబ్రిస్టు తిరుగుబాటు ఒక చారిత్రక వీరగాథగా నిలిచి, గొప్ప స్ఫూర్తి ప్రదాయకమైంది కూడా!

(4) 1848 నాటి యూరపియన్ విప్లవాలూ, నీకొలాస్1 ప్రతిస్పందన

1848లో యూరప్ విప్లవాలతో భగ్గున మండింది. పలు యూరప్ దేశాల రాజధానీ నగరాల్లో సంప్రదాయిక భావాలకు వ్యతిరేకంగా ఉదారవాదులు తమ నిరసన స్వరాన్ని పెంచారు. ఫ్రాన్సులో విప్లవ జ్వాల రగులుకోవడం మొదలైంది. 1846లోని తీవ్రమైన ఉహార కొరతతో పాటుగా, ఆహార ధాన్యాలకూ, ఇతర వినియోగ వస్తువులకూ ధరలు ఆకాశాన్నంటసాగాయి. కానీ పెరిగే ధరలకు అనుగుణంగా వేతనాలలో మాత్రం పెరుగుదల లేకుండా స్తంభించిపోయాయి. దాంతో నిప్పురాజుకుంది. డబ్బు లేకపోవడంతో వినియోగదారుల కొనుగోలు శక్తి సన్నగిల్లిపోవడంతో సరుకులకు డిమాండ్ లేక, తస్తూత్పత్తిలో కోత విధించడం వల్ల పారిశ్రామిక కార్మికులు వేలాది మంది ఉద్యోగాలు కోల్పోయి వీధిన పడ్డారు. నిరుద్యోగిత తీవ్ర స్థాయికి చేరుకోవడంతో పాటు, అధిక ధరలు జతగూడి ఉదారవాద విప్లవజ్వాల ఎగిసిపడింది. నేషనల్ గార్డు, సైనిక గారిసన్‌లు–పారిస్ స్థావరంగా గలవి కలిసి విప్లవకర నిరసనకారులతో గాఢంగా చేతులు కలిపాయి. అయితే ఈ జ్వాలను ఆపేందుకు రాజు లూయిస్ ఫిలిప్పే ప్రయత్నించి, కొన్ని సంస్కరణల్ని ప్రకటించినప్పటికీ, సమయం మించిపోవడంతో, విప్లవ శక్తిని అది ఆపలేకపోయింది. లూయిస్ ఫిలిప్పే తన అధికారాన్ని వదులుకోవడానికి సిద్ధపడి పారిపోయినా గానీ, విప్లవకారులు శాంతించక, 1848 ఫిబ్రవరి 24న రెండో రిపబ్లిక్‌ని ప్రకటించేశారు.

(ఇంకా ఉంది)

(రచయిత రష్యన్ విప్లవాల, లెనిన్ జీవిత చరిత్ర పరిశోధకుడు, సాహిత్యకారుడు, విమర్శకుడు)

వీ

ములుగు జిల్లాలో ఎన్‌కౌంటర్

ములుగు జిల్లా మంగపేట మండలం నర్సింహసాగర్ పరిధిలోని ముసలమ్మగుట్ట అటవీ ప్రాంతంలో అక్టోబర్ 18న పోలీసులు, మావోయిస్టు లకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయని, ఈ కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారని జిల్లా ఎస్‌పి సంగ్రామ్‌సింగ్ జి పాటిల్ తెలిపారు. గడిచిన 45 రోజుల్లో తెలంగాణలో 10 మంది మావోయిస్టులు మృతిచెందారు. ములుగు జిల్లా బోదాపురానికి చెందిన టిఆర్ఎస్ పార్టీ స్థానిక నాయకుడు మదూరి భీమేశ్వర్‌రావు అధికార పార్టీ అండతో ఎరువుల వ్యాపారం చేస్తూ ఆదివాసీలను దోపిడీ చేస్తున్నాడంటూ అక్టోబర్ 11న మావోయిస్టులు చంపారు.

నయీం కేసులో పోలీసులకు క్లీన్ చిట్

నయీంతో సంబంధాలు నెరిపారనే అభియోగాలను ఎదుర్కొన్న 25 మంది పోలీసులకు ఐజి నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం క్లీన్‌చిట్ ఇచ్చింది. ఆగస్టు 8న నయీం ఎన్‌కౌంటర్ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అతడి గ్యాంగ్ సభ్యులపై నమోదు చేసిన 240 కేసులకు గాను 173 కేసుల్లో న్యాయస్థానాల్లో చార్జిషీట్లు దాఖలు చేసిన పోలీసులు 8 కేసులను ఉపసంహరించుకున్నారు. నయీం గ్యాంగ్‌కు సంబంధించిన 139 కేసుల్లో 8 మంది రాజకీయ నాయకులకు ప్రమేయం ఉన్నట్లు సిట్ గుర్తించింది. దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన అంశాల ఆధారంగా అడిషనల్ ఎస్‌పి స్థాయి అధికారి నుంచి కానిస్టేబుళ్ల వరకు 25 మందిపై శాఖాపరమైన విచారణకు అప్పటి డిజిపి ఆదేశాలు జారీ చేశారు. ఆధారాలు లభించలేదంటూ సిటి వీరికి క్లీన్‌చిట్ ఇచ్చింది. సిట్ సరైన విచారణ జరపలేదని, కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నందున కేంద్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యదర్శి ఎం. పద్మనాభ రెడ్డి గవర్నర్ తమిళిసైకి అక్టోబర్ 3న లేఖ రాశారు.

యుపి ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని డిమాండ్

ఉత్తరప్రదేశ్‌లో అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయని, వీటిని అరికట్టడంలో పూర్తిగా వైఫల్యం చెందిన సిఎం యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. అత్యాచార హత్యకు గురయిన యువతి కుటుంబాన్ని బెదిరింపులకు గురిచేస్తున్న అధికారులు, పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. యువతి మృతికి బాధ్యత వహిస్తూ యుపి సిఎం రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై గల బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద అక్టోబర్ 2న ప్రగతిశీల మహిళా సంఘం, పిడిఎస్‌యు సంయుక్త ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశాయి. దేశంలో, రాష్ట్రంలో అత్యాచారాలు, హత్యలను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని హైదరాబాద్ సెంట్రల్ సిటీ ప్రజా సంఘాల నేతలు ఆరోపించారు. ఉత్తరప్రదేశ్, తెలంగాణలోని మోయినాబాద్‌లో యువతిపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.

చలో మదనపల్లె

వైసిపి ప్రభుత్వంలో దళితులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ దళిత సంఘాలు, వామపక్షాలు, టిడిపి పిలుపు మేరకు అక్టోబర్ 2న జరగాల్సిన 'చలో మదనపల్లె' కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు. చిత్తూరు జిల్లా వ్యాప్తంగా టిడిపి, వామపక్షాలు, దళిత సంఘాల నేతలను అడ్డుకున్నారు. నేతలను అరెస్ట్ చేయడంతోపాటు గృహ నిర్బంధం చేశారు. మదనపల్లెలో సిపిఐ, బిఎస్‌పి, మాల మహానాడులకు చెందిన ఆందోళనకారులు 30 మందిని అరెస్టు చేశారు. దళితులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వానికి, పోలీసులకు గుర్తింపజేయడం కోసమే తాము చలో మదనపల్లె కార్యక్రమాన్ని చేపట్టామని జడ్జి రామకృష్ణ అన్నారు. పోలీసులు చట్టాన్ని, న్యాయాన్ని తుంగలో తొక్కి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

ధర్నాచౌక్‌లో స్వచ్ఛ ఆటో కార్మికుల ధర్నా

స్వచ్ఛ ఆటో కార్మికుల పొట్టకొట్టి, జిహెచ్ఎంసి చెత్త సేకరణను ప్రైవేట్ సంస్థ రాంకీకి అప్పజెప్పడాన్ని విరమించుకోవాలని సిఐటియు, స్వచ్ఛ ఆటో టిప్పర్ కార్మిక సంఘాల జెఏసి నాయకులు డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డులను ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పడానికి నిరసనగా సెప్టెంబర్ 2న ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్‌లో 30 సర్కిళ్లలో మెయిన్ రోడ్లు, ఫాపుల్లో చెత్త సేకరణను అక్టోబర్ 1 నుంచి ప్రైవేట్ సంస్థకు అప్పజెప్పడానికి నిర్వహించే టెండర్లను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

తెలంగాణను ముంచెత్తిన వాన

తెలంగాణలో అక్టోబర్ రెండు మూడు వారాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా చెరువులు, కుంటలు తెగి తీవ్ర పంట నష్టం జరిగింది. రోడ్లు కొట్టుకుపోయి రవాణ స్థంబించింది. ముఖ్యంగా హైదరాబాద్‌లోని లోతట్టు ప్రాంతాల బస్తీలు, కాలనీలు నీట మునిగి వేలాది ప్రజలు నిర్వాసితుల య్యారు. ఇండ్లు నీట మునిగి కూలిపోయాయి. గడిచిన వందేళ్లలో లేని విధంగా హైదరాబాద్‌లో భారీ వర్షం కురిసి వరదలు రావడంతో 33 మంది మరణించారు. ఇతర జిల్లాల్లో వర్షాల కారణంగా 37 మంది మృతిచెందారు. ఈ వర్షాల కారణంగా ప్రభుత్వం చెబుతున్న ప్రాథమిక అంచనాల ప్రకారం జరిగిన నష్టం 724 కోట్లు. ఇది మరింత పెరిగే అవకాశం ఉందని ప్రభుత్వమే చెబుతోంది.

మద్దతు ధర కోరుతూ రైతుల ధర్నా

మక్క జొన్నలకు మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో అక్టోబర్ 22న కామారెడ్డి జిల్లా రైతాంగం ఆందోళనకు దిగింది. రెండు వేల మంది రైతులు కామారెడ్డి శివారులోని టేక్రియాల్ వద్ద 44వ జాతీయ రహదారిని దిగ్బంధం చేశారు. మక్కజొన్నలు రోడ్డుపై పోసి నిరసన వ్యక్తం చేశారు. వీ

బాబ్రీ మసీదు కూల్చివేతలో కుట్రలేదు: సిబిఐ ప్రత్యేక కోర్టు

బాబ్రీ మసీదు విధ్వంసం ముందస్తు పథకం ప్రకారం జరిగింది కాదని సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇందులో కుట్ర లేదని... బాబ్రీ మసీదు కూల్చివేత అప్పటికప్పుడు, అనుకోకుండా, అకస్మికంగా జరిగిందని వెల్లడించింది. బిజెపి నేతలు ఎల్.కె. అద్వాణీ, మురళీ మనోహర్‌జోషి, ఉమాభారతి, కళ్యాణ్‌సింగ్‌తో సహా 32 మందిపై కేసు కొట్టివేస్తూ సెప్టెంబర్ 30న తీర్పు వెల్లడించింది. 28 సంవత్సరాల సుదీర్ఘ విచారణ తరువాత అఖ్‌నవూలోని ప్రత్యేక కోర్టు జడ్జి ఎస్‌కె యాదవ్ ఈ తీర్పు వెల్లడించారు. ఈ కేసులో సిబిఐ 351 మంది సాక్షులను ప్రవేశపెట్టి, 600 డాక్యుమెంట్లను సమర్పించినా, సిబిఐ స్పష్టమైన ఆధారాలను సమర్పించలేకపోయిందని ఈ కేసులోని ప్రధాన నిందితులైన 32 మందిని జడ్జి నిర్దోషులుగా ప్రకటించింది.

బాబ్రీ మసీదు కూల్చివేత ఓ కుట్ర - జస్టిస్ లిబర్హాన్

బాబ్రీ మసీదు కూల్చివేత నిందితులందరిని విచారించాను. సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేశాను. అన్ని ఆధారాలతోనే కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చాను. నేను సేకరించిన ఆధారాల ప్రకారం మసీదు కూల్చివేత ఓ కుట్ర, నిందితులంతా అందులో భాగస్వాములు అని జస్టిస్ మన్మోహన్‌సింగ్ లిబర్హాన్ అక్టోబర్ 1న న్యూఢిల్లీలో విలేకరులకు తెలిపారు. సిబిఐ ప్రత్యేక కోర్టు నిర్దోషులుగా ప్రకటించిన 32 మందినీ లిబర్హాన్ కమిషన్ నిందితులుగాపేర్కొంది. ఈ తీర్పుపై లిబర్హాన్ మీడియాతో మాట్లాడుతూ నా ముందుకు వచ్చిన ఆధారాల మేరకు అది కుట్ర అని నేను చెప్పాను. నేను ఉమాభారతిని విచారించినప్పుడు తానే బాధ్యత వహించానన్నారు. ఇప్పుడు కోర్టు కాదంటే నేనేం చేయగలను? అని వ్యాఖ్యానించారు.

జర్నలిస్టులపై దేశద్రోహం కేసు

కరోనా మరణాలు, ఉగ్రవాద దాడులపై ప్రధాని మోడీ ఓటు బ్యాంకు రాజకీయం చేస్తున్నారని సీనియర్ జర్నలిస్టు వినోద్ దువా యూ ట్యూబ్ వీడియోలో వ్యాఖ్యానించారు. దీనిపై హిమాచల్‌ప్రదేశ్ బిజెపి నేత అజయ్‌శామ్ మే 6న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వినోద్‌పై పబ్లిక్ న్యూసెన్స్, దేశద్రోహం, ఉన్నత పదవుల్లో ఉన్నవారిపై వ్యతిరేక వ్యాఖ్యలు చేయడం వంటి క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఉత్తరప్రదేశ్ పోలీసులు కేరళ పాత్రికేయుడు సిద్ధికి కప్పన్‌పై 'ఉపా' ప్రయోగించారు. కప్పన్ వృత్తిలో భాగంగా ఉత్తరప్రదేశ్ హత్రాస్ బాధిత కుటుంబాన్ని కలవడానికి వెలుతున్నాడు.

వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తూ రైతుల పోరాటం

ప్రధాని మోడీ, కార్పొరేట్ల అపవిత్ర కలయికను వ్యతిరేకిస్తూ పంజాబ్ రైతులు పోరాటాన్ని ఉధృతం చేశారు. అందులో భాగంగా అక్టోబర్ 25న మోడీతో పాటు కార్పొరేట్లైన ముఖేష్ అంబానీ, గౌతమ్ అదానీ దిష్టిబొమ్మలను దహనం చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తూ వివిధ రాష్ట్రాల్లోని 100 పైగా ప్రాంతాల్లో దిష్టిబొమ్మల దహనం కార్యక్రమం చేశారు. అప్రజాస్వామికంగా తెచ్చిన వ్యవసాయ చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా వేలాది మంది రైతులు పాల్గొన్నారు. ఈ మహా ఉద్యమం రైతాంగం చేస్తున్న ఐక్య పోరాటాలకు రాజకీయ దిశానిర్దేశం చేసిందన్నారు.

హత్రస్ ఘటనపై ఢిల్లీలో నిరసనలు

ఉత్తరప్రదేశ్‌లోని హత్రస్‌లో 19 ఏళ్ల దళిత బాలికపై సామూహిక అత్యాచార హత్య ఘటనపై అక్టోబర్ 2న ఢిల్లీలోని జంతర్‌మంతర్ రోజంతా ప్రజా ఆందోళనలతో దద్దరిల్లింది. హత్రస్ ఘటనపై ప్రధాని మౌనం వీడాలని డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా మోడీ, యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ల బాధ్యతారాహిత్యాన్ని ఆందోళనకారులు ఎండగట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్, సిపిఐ(ఎం) నుంచి సీతారాం ఏచూరి, బృందాకరత్, సిపిఐ రాజా, భీం ఆర్మీ నేత చంద్రశేఖర్ ఆజాద్, న్యాయవాది ప్రశాంత్ భూషణ్, ఎంఎల్ఏ జిగ్నేష్ మెవానీ తదితరులు పాల్గొన్నారు. లైంగికరహిత భారత్ కావాలని, యుపి ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అత్యాచార హత్యకు గురైన యువతి కుటుంబాన్ని పరామార్శించేందుకు వెళ్లిన పార్టీల నేతలను, మీడియాను, హక్కుల కార్యకర్తలను పోలీసులు అడ్డుకుని ఆ గ్రామం మొత్తాన్ని పోలీసుల పహారాలో ఉంచారు.

భీమా కోరేగాం కేసులో స్టాన్ స్వామి అరెస్ట్

భీమా కోరేగాం కేసులో మానవ హక్కుల నేత పాదర్ స్టాన్ స్వామి 82ని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అక్టోబర్ 9న అరెస్ట్ చేసింది. ఆయనతో పాటు మరో ఏడుగురిపై అనుబంధ చార్జిషీట్ దాఖలు చేసింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వారు కుట్రపన్నినట్లు ఆరోపించింది. ఇందులో మావోయిస్టులతో పాటు పాకిస్తాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ పాత్ర ఉందని పేర్కొంది. ఫాదర్ స్టాన్ స్వామిని రాంచీలో అరెస్ట్ చేసి ముంబైకి తీసుకువెళ్లి అక్టోబర్ 9న కోర్టులో హాజరుపర్చగా కోర్టు ఈ నెల వరకు జ్యుడిషియల్ కస్టడీ విధించింది. ఈ కేసులో ఇప్పటివరకు 16 మందిని అరెస్ట్ చేశారు.

గడ్చిరోలి ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు నక్సల్స్ మృతి

మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలోని కోస్మి-కిస్నేలీ అడవుల్లో అక్టోబర్ 18న మావోయిస్టుల కోసం కూంబింగ్‌కు వెళ్లిన పోలీసులకు మధ్య కాల్పులు జరిగాయని, ఈ ఘటనలో ఐదుగురు నక్సల్స్ మృతి చెందినట్లుగా అధికారులు తెలిపారు.

ప్రజాస్వామిక స్వేచ్ఛను కాలరాస్తున్న మోడీ ప్రభుత్వం

కేంద్రంలోని మోడీ ప్రభుత్వ నియంతృత్వ పోకడల పట్ల వివిధ రాజకీయ పార్టీలు, మానవ హక్కుల కార్యకర్తలు, ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టాన్ స్వామి, ఆనంద్ తెల్‌తుంబ్డే, గౌతమ్ నవ్‌లఖా, సుదా భరద్వాజ్ వంటి హక్కుల కార్యకర్తలను ఎన్ఐఏ అరెస్టు చేయడాన్ని వారు ఖండించారు. లౌకికవాదం, ప్రజాస్వామ్యం కోసం ఉద్యమిస్తున్న వారి గొంతు నొక్కేందుకు యుఏపిఏ లాంటి దుర్మార్గమైన చట్టాలను ప్రయోగించడాన్ని వారు ముక్త కంఠంతో వ్యతిరేకించారు. భీమా కోరెగాం కేసులో 16 మందిని ఇప్పటివరకు అరెస్ట్ చేసి, దీర్ఘకాలం జైళ్లలో పెట్టడాన్ని విమర్శించారు. పీపుల్ యూనియన్ ఆఫ్ సివిల్ లిబర్టీస్ (పియుసిఎల్) ఆధ్వర్యంలో అక్టోబర్ 22న ఢిల్లీలో ఏర్పాటు చేసిన వర్చువల్ విలేకరుల సమావేశంలో సిపిఐ(ఎం) పక్షాన సీతారాం ఏచూరి, సిపిఐ నాయకుడు రాజా, కాంగ్రెస్ నుంచి శశిధరూర్, డిఎంకె నేత కనిమొళి, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్, ఆర్థిక వేత్త జీఎస్ డెరెజ్ తదితరులు మాట్లాడారు.

షోపియన్ ఎన్‌కౌంటర్‌లో బలగాల చట్ట అతిక్రమణ

కశ్మీర్‌లోని షోపియన్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్ విషయంలో బలగాలు సైనిక చట్టాల్ని అతిక్రమించినట్లు ప్రాథమికంగా తేలిందని అధికారులు తెలిపారు. ఈ విషయమై క్రమశిక్షణ చర్యలను ప్రారంభించినట్లు అధికారులు సెప్టెంబర్ 18న తెలిపారు. అమ్షీపురా గ్రామంలోని ముగ్గురు యాపిల్ పండ్ల తోటల్లో కూలిపనులు చేసుకునేవారని తేలింది. ఈ ఏడాది జూలైలో ఈ ముగ్గురిని ఎన్‌కౌంటర్‌లో కాల్చిచంపినట్లు బలగాలు ప్రకటించాయి. ఆర్మీ విచారణ ప్రకారం సుప్రీంకోర్టు ఆమోదించిన నియమ నిబంధనలను షోపియన్ ఎన్‌కౌంటర్‌లో బలగాలు ఉల్లంఘించినట్లు తేలింది. ఈ ఘటనకు ఎంత మంది బాధ్యులనేది స్పష్టతనివ్వలేదు. వీ

అర్మేనియా-అజర్‌బైజాన్‌లో కొనసాగుతున్న రగడ

ఇరుగు పొరుగు దేశాలైన అర్మేనియా, అజర్‌బైజాన్ దేశాల మధ్య వివాదాస్పద నగొర్నో – కరబక్ ప్రాంతంలో గత నెల రోజులుగా యుద్ధం కొనసాగుతూనే ఉంది. శతాబ్దాలుగా ఈ ప్రాంతంపై పట్టు కోసం ఇరు దేశాలు మధ్య పోరు నడుస్తోంది. ఇరు దేశాల మధ్య సంధి కోసం రష్యా మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణను ప్రకటించి యుద్ధఖైదీల మార్పిడి, చనిపోయిన వారి శరీరాల గుర్తింపు అంశాలను పరిశీలించారు. అయితే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి ఇరు దేశాల మధ్య మళ్లీ దాడులు ప్రారంభమయ్యాయి. ఇరు దేశాల మధ్య జరుగుతున్న యుద్ధంలో దాదాపు నాలుగు వందలకు పైగా మరణించారు.

నోబెల్ పురస్కారం - 2020

వైద్య రంగంలో ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ పురస్కారం లభించింది. హెపటైటిస్ – సి వైరస్‌ను గుర్తించినందుకు గాను అమెరికన్ శాస్త్రవేత్తలు హార్వీ జె. ఆల్టర్, ఛార్లెస్ ఎం. రైస్, బ్రిటిష్ శాస్త్రవేత్త మైకేల్ హౌటన్‌కు ఈ అవార్డు దక్కింది. వీరి పరిశోధనల ఫలితంగా రక్తం ద్వారా వ్యాపించే హెపటైటిస్ గురించి ప్రపంచానికి తెలిసిందని, ఇది హెపటైటిస్ – ఎ, బిల ద్వారా తెలియలేదని శాస్త్రవేత్తలు అన్నారు. భౌతిక శాస్త్రంలో ముగ్గురు శాస్త్రవేత్తలు నోబెల్ గెలుచుకున్నారు. బ్రిటిష్ శాస్త్రవేత్త రోజర్ పెన్‌రోజ్, జర్మనీ శాస్త్రవేత్త రైన్‌హార్డ్ గెంజెల్, అమెరికన్ శాస్త్రవేత్త ఆండ్రియా గేజ్‌లకు కాంతిని కూడా తనలో లయం చేసుకోగల అపార శక్తి కేంద్రం కృష్ణబిలంపై మరింత అవగాహన పెంచేందుకు కృషి చేశారు. జన్యువులను మనకు అవసరమైన రీతిలో కచ్చితంగా కత్తిరించేందుకు జెనెటిక్ సీజర్స్ పద్ధతిని ఆవిష్కరించిన ఫ్రాన్స్ శాస్త్రవేత్త ఎమ్మాన్యుయల్ షార్పెంటైర్, అమెరికన్ శాస్త్రవేత్త జెన్నిఫర్ ఎ డౌడ్నాలకు రసాయన శాస్త్ర నోబెల్ దక్కింది. జన్యు సంబంధిత వ్యాధుల చికిత్సతో పాటు అనేక ఇతర ప్రయోజనాలు కలిగిన ఈ పద్ధతిని క్రిస్పర్ క్యాస్-9 అని పిలుస్తారు. అమెరికా కవయిత్రి లూయిసీ గ్లుక్ సాహిత్యంలో నోబెల్ బహుమతిని గెలుచుకున్నారు. 2006లో గ్లుక్ రచించిన 'అవెర్నో' కవితా సంకలనం అత్యుత్తమమైంది. ఆమె హృద్యమైన, స్పష్టమైన కవితా స్వరం వ్యక్తి ఉనికిని విశ్వవ్యాప్తం చేస్తుందని నోబెల్ అవార్డు సభ్యులు అభిప్రాయ పడ్డారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాల కారణంగా కోట్లాది మంది ఆకలి బాధలను ఎదుర్కొంటున్నారు. వారి ఆకలి తీర్చేందుకు ఐక్యరాజ్య సమితి నిర్వహిస్తున్న ప్రపంచ ఆరోగ్య కార్యక్రమానికి ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి దక్కింది. ఈ కార్యక్రమం ద్వారా గత ఏడాది ఐక్యరాజ్య సమితి 88 దేశాల్లో దాదాపు పది కోట్ల మందికి ఆసరా కల్పించింది. శాంతి స్థాపనకు కీలకమైన ఆహార భద్రత కల్పించేందుకు ప్రపంచ ఆహార కార్యక్రమం కీలకమైన పాత్రపోషిస్తోంది. ఆర్థిక నోబెల్‌ను అమెరికన్ ఆర్థికవేత్తలు పాల్ ఆర్ మిల్‌గ్రూమ్, రాబర్ట్ బి విల్సన్‌లు గెలుచుకున్నారు. ఈ ఇద్దరు ఆర్థిక శాస్త్రవేత్తలు వేలం పాట నిర్వహణకు కొత్త, మెరుగైన పద్ధతులను సృష్టించడంతో పాటు వేలం పాటల సిద్ధాంతాన్ని మరింత మెరుగుపరిచేందుకు కృషి చేశారు.

న్యూజిలాండ్‌లో లేబర్ పార్టీ విజయం

న్యూజిలాండ్ పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికల్లో అధికార లిబరల్ లేబర్ పార్టీ విజయం సాధించింది. ప్రస్తుత ప్రధాని జెసిండా అర్డెర్న్ నాయకత్వంలోని లేబర్ పార్టీకి దాదాపు 49 శాతం ఓట్లు వచ్చాయి. ప్రధాన ప్రతిపక్షమైన నేషనల్ పార్టీకి 27 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. ఈ సందర్భంగా జెసిండా మాట్లాడుతూ కరోనా మహమ్మారిని సమర్థంగా ఎదుర్కోవడం, దేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దడంలో ప్రజలు ప్రభుత్వ కృషిని గుర్తించారని, అందుకే ఈ విజయాన్ని కట్టబెట్టారని అన్నారు.

కోవిడ్ విజృంభణ

ప్రపంచ వ్యాప్తంగా కోవిడ్ మహమ్మారి విజృంభణ మళ్లీ మొదలైంది. పది నెలల కాలంలో 230 పైగా దేశాల్లో మహమ్మారి వల్ల దాదాపు నాలుగు కోట్ల మందికి పైగా కోవిడ్ బారిన పడ్డారు. పదకొండు లక్షల మందికి పైగా మరణించారు. అమెరికాలో అత్యధికంగా దాదాపు 90 లక్షలు, భారతదేశంలో 80 లక్షలు, బ్రెజిల్‌లో 54 లక్షల కేసులు... ఇలా కరోనా ప్రపంచ దేశాలపై తన పంజా విసురుతోంది. యూరప్ దేశాల్లో కరోనా తగ్గినట్టే తగ్గి మళ్లీ విజృంభిస్తోంది. అక్కడ రెండవ దశ ప్రారంభమైంది. యుకె, రష్యా, నెదర్లాండ్స్, స్పెయిన్, జర్మనీ, ఇటలీ పోర్చుగల్, ఫ్రాన్స్, బెల్జియం తదితర దేశాల్లో కొత్తగా భారీ సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి.

ఇండోనేషియాలో యువత ఆందోళన

ఇండోనేషియాలో కార్పొరేట్లకు అనుకూలంగా పాలకులు నిర్ణయాలు అమలు చేస్తున్నారంటూ యువత భారీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. అక్టోబర్ 8న రాజధాని జకార్తాలో బడా వ్యాపారులు, కార్పొరేట్లకు అనుకూలంగా రూపొందించిన 'జాబ్ క్రియేషన్ బిల్లు'కు వ్యతిరేకంగా యువత, యూనివర్సిటీ విద్యార్థులు భారీ నిరసన ప్రదర్శనలు చేశారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఇయోనేషియా అంతటా ఆందోళనలు జరిగాయి. ప్రజా వ్యతిరేక ఈ బిల్లును ఇండోనేషియా పార్లమెంట్ అక్టోబర్ 5న ఆమోదించింది. ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టం కార్మిక వ్యతిరేక అంశాలతో నిండి ఉందనీ, కార్మికుల హక్కులు కాలరాస్తున్నారని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు.

బ్యాంకాక్‌లో నిరసనలు

థాయ్‌లాండ్‌లో ప్రజాస్వామ్య పాలన కావాలంటూ భారీ నిరసన ప్రదర్శనలు జరిగాయి. ప్రధానమంత్రి గద్దె దిగాలని, దేశంలో రాజ కుటుంబం పెత్తనం తొలగి, ప్రజాస్వామ్య సంస్కరణలతో పాలన సాగించాలంటూ అక్టోబర్ 14న విద్యార్థులు రాజధాని బ్యాంక్‌కాలోని రాజ ప్రాసాదానికి సమీపంలో ఆందోళన చేశారు. అటుగా వెళ్తున్న రాజ కుటుంబం వాహనాలకు అడ్డుగా నిలిచారు. దీంతో ప్రభుత్వం బ్యాంకాక్‌లో ఎమర్జెన్సీ ప్రకటించింది. బహిరంగ ప్రదర్శనలపై నిషేధం ప్రకటించారు. అయినప్పటికీ బ్యాంకాక్ వీథుల్లో, ప్రధాని ప్రయుత్ చన్ ఓచా నివాసం ఎదుట విద్యార్థులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

అమెరికాలో మొదలైన ఎన్నికల హడావుడి

నవంబర్ 3న అమెరికాలో అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగనున్నాయి. అమెరికా అధ్యక్ష పదవికి ఎన్నికల ప్రసహనం మొదలైంది. అధ్యక్ష పోటీలో నిలబడ్డ ఇద్దరు అభ్యర్థులు రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, ప్రస్తుత అధ్యక్షుడు డోనాల్డ్, డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి జో బిడెన్‌ల మధ్య ఎన్నికలకు ముందు జరిగే ప్రెసిడెన్షియల్ డిబేట్ హోరాహోరీగా జరిగింది. ముఖ్యంగా అమెరికాలో విజృంభిస్తున్న కరోనా వైరస్‌ను కట్టడి చేయడంలో డోనాల్డ్ ట్రంప్ పూర్తిగా విఫలమయ్యారు. ట్రంప్ నిర్లక్ష్యపు వైఖరులతో వైరస్ దేశవ్యాప్తంగా వేగంగా ప్రబలింది. ఈ డిబేట్‌లో కరోనాతో పాటు పర్యావరణం, జాత్యహంకారం, అవినీతి, వలస విధానంపై ఇద్దరు అభ్యర్థులు తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. అమెరికాలో సుమారు 24 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

లండన్‌లో మోదీకి వ్యతిరేకంగా నిరసనలు

భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీరు నియంత పాలనను తలపిస్తోందనీ బ్రిటన్ ఎంపిలు తమ నిరసనను తెలిపారు. పాలకులకు వ్యతిరేకంగా ఎవరైనా గళమెత్తితే అదొక పెద్ద నేరమన్నట్లు ప్రవర్తిస్తున్నారనీ, నియంత పోకడలతో మోదీ సర్కార్ పాలన సాగుతోందనీ వారు తీవ్రంగా ఖండించారు. వీ

వీక్షణం ఆగిపోకుండా నిలబడడానికి మీరేం చేయవచ్చు?

ఆగిపోకుండా నడవవలసిన రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా
సామాజిక కార్యకర్తలకూ, బుద్ధిజీవులకూ అత్యవసరమైన మేధో వనరుగా
తెలుగు సమాజంలో ఇవాళ వినబడుతున్న అతి తక్కువ ప్రజానుకూల గళాలలో ఒకటిగా
వీక్షణంను మీరు గుర్తిస్తే,
వీక్షణంను నిలబెట్టడానికి మీ వ్యక్తిగత బాధ్యతను మీరు అంగీకరిస్తే

మీలో ప్రతిఒక్కరూ

- తమ బాధ్యతగా చందాదారుగా చేరవచ్చు.
- కనీసం మరొక చందా చేర్పించవచ్చు.
- మీకు పరిచయం ఉన్న విద్యాసంస్థలకు, గ్రంథాలయాలకు చందాలు చేర్పించవచ్చు.
- మీ గ్రామంలో, పట్టణంలో పత్రికలు అమ్మే దుకాణంలో వీక్షణం కూడ అమ్మేలా చూసే, వారి నుంచి క్రమబద్ధంగా వీక్షణంకు అమ్మకాల డబ్బు అందే ఏర్పాట్లు చేయవచ్చు.
- ఒక్కొక్కరు కనీసం వెయ్యి రూపాయల విరాళం ఇవ్వడానికి, ఇప్పించడానికి ప్రయత్నించవచ్చు.
- పెద్ద స్థాయిలో విరాళాలు గాని, వ్యాపార ప్రకటనలు గాని ఇవ్వగల దాతల కోసం అన్వేషించి. వారి గురించి వీక్షణం నిర్వాహకులకు తెలపవచ్చు.
- మీ అంతట మీరే చొరవ తీసుకుని వారి దగ్గర విరాళం సంపాదించి పంపవచ్చు.

సామాజికులను ఒంటరులుగా మారుస్తున్న కొవిడ్ చీకటిలో
ఆలోచనల, ఆశయాల దృఢదీక్షకు పునరంకితం చేసే
చిరు మేధో దీపం **వీక్షణం**
రెండు చేతులూ అడ్డుపెట్టి ఈ దీపం ఆరిపోకుండా కాపాడుకుందాం.
భవిష్యత్తు కోసం ఈ చూపు వెలుగును విస్తరించుకుందాం.

చందాలు, విరాళాలకు

VEEKSHANAM

అకౌంట్ నెంబర్ – **013911011002175**

ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్

ఐఎఫ్ఎస్‌సి నం **ANDB 0000139**

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 229 - November 2020 ● ISSN 2231-6892
● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 27/10/2020 ● Postal Regn. No. HD/1100/2020-22

Date of Posting : 29th, 30th

If undelivered please return to:
VEEKSHANAM
Mytri Residency, 3-6-394, St. No. 3,
Himayatnagar, Hyderabad - 500 029.
Phone: 040 66843495

To:
Mr./Mrs.____________________

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao